
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 33

గురువారం 25-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

శ్రీకాకుళం జిల్లా అక్కవరం వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



జగన్ మార్కుతో సమాజం 'సిద్ధం'

ఇది 58 నెలలుగా విప్లవాత్మక మార్పులు తెస్తూ చేస్తున్న యుద్ధం

శ్రీకాకుళం జిల్లా అక్కవరం సభలో సీఎం వైఎస్ జగన్

- మీ ఇంటికి మంచి జరిగితే మీ బిడ్డకు సైనికులుగా తోడుండాలని కోరే ధైర్యమే "సిద్ధం"
- వ్యత్యాసాలను తుడిచేస్తూ సమ సమాజాన్ని నిర్మిస్తున్నాం.. మనం తెచ్చిన మార్పులపై బాబు, ఆయన బృందం ఏనాడైనా ఆత్మవిమర్శ చేసుకుందా?
- చంద్రబాబు మాదిరిగా మీ బిడ్డ ఎన్నడూ రోల్డ్ గోల్డ్ దుకాణం తెరవడు
- మోసాన్ని నిజాయితీతో జయిస్తాం
- జగన్ చేయలేని ఏ స్కీమ్‌నూ బాబు కాదు.. ఆయన జేజమ్మైనా చేయలేడు.. నిజ జీవితం, రాజకీయాల్లో హీరో ఎవరు? విలన్ ఎవరో ఆలోచన చేయండి
- రోజా నన్ను తిట్టడం గొప్ప రాజకీయమా?
- అదో ఘనకార్యంలా ఎల్లో మీడియాలో చాటింపు
- ఆ మోసాల కూటమి చెంప చెళ్లుమనిపించండి
- జగన్‌కు ఓటు వేస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయి.. లేదంటే ముగింపే, మళ్లీ మోసపోవటమే

10 లో

"సమాజంలో ప్రతి రంగాన్ని మీ బిడ్డ ప్రభుత్వం అధికారం దక్కిన మొదటి రోజు నుంచే ఎలా సిద్ధం చేసిందో మీరే గమనించాలని కోరుతున్నా. రాష్ట్రంలో ఎప్పుడూ చూడని మార్పులతో గ్రామస్థాయిలో వ్యవసాయ రంగం సిద్ధం! విప్లవాత్మక మార్పులతో మన గవర్నమెంట్ బడి సిద్ధం! గ్రామస్థాయి నుంచి వైద్య ఆరోగ్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులతో గవర్నమెంట్ ఆస్పత్రి సిద్ధం! పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటికీ సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థ సిద్ధం! ఏకంగా 1.35 లక్షల మంది శాశ్వత ఉద్యోగాలతో మన చెల్లెమ్మలు, తమ్ముళ్లు దాదాపు 600 రకాల సేవలందిస్తూ మన గ్రామాల్లో సచివాలయాల్లో సిద్ధం! 58 నెలల్లో గ్రామ స్వరాజ్యం సిద్ధం! పట్టణాల్లో సైతం ఇంటింటికీ పౌరసేవలు సిద్ధం! దేశ చరిత్రలో తొలిసారిగా లంచాలు, వివక్ష లేకుండా రూ.2.70 లక్షల కోట్లు ఇంటింటికీ డోర్ డెలివరీ చేసిన వ్యవస్థ సిద్ధం! ఒకటో తేదీనే ఇంటికే వచ్చి రూ.3,000 పెన్షన్ ఇచ్చే వలంటీర్ల వ్యవస్థ సిద్ధం! ఇదీ మీ బిడ్డ ప్రభుత్వం సమాజాన్ని సిద్ధం చేసిన తీరు." - సీఎం జగన్

సిక్కోలులో జన సంద్రం

- సీఎం జగన్‌పై ఉత్తరాంధ్ర వాత్సల్యం.. ఉదయం 6 నుంచే జనంతో కిక్కిరిసిన అక్కివలస బస శిబిరం
- వైఎస్సార్‌సీపీలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల చేరికలు

11 లో

వార్ వన్ సైడే

- జన ప్రభంజనం మధ్య జైత్ర యాత్రలా సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- 22 రోజుల్లో 23 జిల్లాలు.. 86 నియోజకవర్గాల్లో 2,188 కి.మీల దూరం సాగిన యాత్ర

I లో



కుమార్ విశ్వజిత్ పీహెచ్‌డీ రామకృష్ణ

ఏపీ ఇంటెలిజెన్స్ డీజీగా కుమార్ విశ్వజిత్

విజయవాడ సీపీగా పీహెచ్‌డీ రామకృష్ణ

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ

2 లో

అ'సామాన్యులు'

వైఎస్సార్‌సీపీ తరఫు అభ్యర్థుల్లో నిరుపేదలు..

- సొంత ఇల్లూ, ఎలాంటి నగలూలేని మడకశిర అభ్యర్థి ఈరలక్కప్ప.. శింగనమల అభ్యర్థి వీరాంజనేయులు పరిస్థితి కూడా ఇంతే
- రంపచోడవరం అభ్యర్థి ధనలక్ష్మి ఆస్తులు రూ.53 లక్షలే
- మైలవరం అభ్యర్థి తిరుపతిరావు ఆస్తి రూ.4.27 లక్షలే..
- పాడేరు అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు రూ.50.98 లక్షలు

టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు కళ్లుచెదిరే ఆస్తిపరులు 12 లో



టిప్పర్ నడుపుతూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు



సాక్షి నెట్‌వర్క్: అటుపక్క.. ఒక్కో అభ్యర్థి ఎన్నికల అఫిడవిట్ చూస్తే కళ్లు చెదిరే స్థిరాస్తులు.. మతిపోయే చరాస్తులు. వేలకోట్ల ధనికస్వాములూ ఉన్నారు. దేశంలోనే అపర కుబేర అభ్యర్థుల్లోని వారూ ఆ బ్యాచ్‌లో కొలువుదీరారు. ఇలా పెత్తందారులంతా ఒక్కటై టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి తరఫున రాష్ట్ర ఎన్నికల కదనరంగంలో మోహరించారు. వీరికి దన్నుగా కోటానుకోట్ల సంపద ఉన్న ఐశ్వర్యవంతులు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడెక్కడి నుంచో వారి తరఫున రాష్ట్రంలో వాలిపోయారు. వైఎస్సార్‌సీపీ అభిమానులను 'వెధవలు' అంటూ సంబోధిస్తూ కుటుంబానికి రూ.3–4 లక్షలు వెదజల్లయినా

మిగతా 12వ పేజీలో ▶



నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

2 లో

రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగియనుంది. బుధవారం వరకు అసెంబ్లీకి 3,644, లోక్‌సభకు 654 నామినేషన్లు దాఖలయ్యాయి.

ముగిసిన రెండో దశ ప్రచారం

89 స్థానాలకు రేపే పోలింగ్

దేశంలో రెండో దశ ఎన్నికలకు ప్రచార గడువు ముగిసింది. 13 రాష్ట్రాల్లోని 89 స్థానాలకు ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈసారి రెండోదశలో కేరళలో ఉన్న మొత్తం 20 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు.



6లో



ఏపీలో బీజేపీకీ బాబే లీడర్

దేశమంతా మోదీ కా పరివారే.. ఏపీలో మాత్రం చంద్రబాబుకు అప్పగించిన పురందేశ్వరి

- సొంత పార్టీ నేతలను కాదని బాబు అద్దె నాయకులకు పార్టీలో సీట్లు
- కూటమి కట్టినా బీజేపీ సీట్లూ టీడీపీ నేతలకే
- బద్వేలు నుంచి అనపర్తి దాకా ఇదే పరిస్థితి
- టీడీపీ నుంచి బీజేపీలో చేరిన వారి కోసమే ఈ పొత్తులా అంటున్న కమలం నాయకులు



సాక్షి, అమరావతి

ఓ పారిశ్రామికవేత్త: టీడీపీ అభ్యర్థి చంద్రబాబు ఆశీస్సులతో బీజేపీలో చేరి టికెట్ పొందారు

చంద్రబాబు అభిమాని: మేమంతా ఒకే ఫ్యామిలీ అండి. ఎన్‌డీఏ ఫ్యామిలీ

పారిశ్రామికవేత్త: అంటే 'మోదీ కా పరివార్' అంటారు

చంద్రబాబు అభిమాని: బాబు గారి కుటుంబం అండి. కుటుంబ పెద్ద ఎలా చెబితే అలా..

మరో చంద్రబాబు అభిమాని: అంతే మేడమ్.. 'బాబు కా పరివార్' మేడమ్.. నాట్ 'బురిడీ కా పరివార్'.

..అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా నిన్నటివరకు టీడీపీలో ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పురందేశ్వరి

మిగతా 2వ పేజీలో ▶

చిత్తూరులో టీడీపీ ర్యాలీకి వచ్చినవారికి డబ్బులు పంపిణీ చేస్తున్న దృశ్యం



పచ్చ పార్టీ ప్రలోభాలు

3 లో

- ఓటమి భయంతో అడ్డదారులు తొక్కుతున్న టీడీపీ అభ్యర్థులు
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ భారీ తాయిలాలతో ఓటర్లకు గాలం
- ఓవైపు మద్యం.. ఇంకోవైపు మనీ.. మరోవైపు గిఫ్ట్ బాక్సులు పంపిణీ
- పచ్చనేతల కనుసన్నల్లో భారీగా కర్ణాటక మద్యం డంప్‌లు

పవన్ ఆస్తులు మాయ.. పెళ్లాల లెక్కలూ మాయే..



- పవన్ ఎన్నికల అఫిడవిట్‌లో అడుగుకో అబద్ధం
- సినిమాల్లోకంటే జనసేన పెట్టాకే పవన్ ఆస్తులు ఎలా పెరిగాయి?
- పవన్ అఫిడవిట్‌లో వివరాలపై విచారణ చేయించాలి
- కరోనా సమయంలోనూ రూ.30 కోట్ల ఆస్తులెలా కొన్నారు?
- అన్న చిరంజీవిని, తల్లిని అవమానించింది పవనే
- వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేశ్

3 లో

క్లుప్తంగా...

నేడు పులివెందులలో సీఎం జగన్ నామినేషన్

అంతకుముందు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్న ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగసభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం పులివెందుల అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకోసం గురువారం ఉదయం 7.45 గంటలకు సీఎం జగన్ తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి వైఎస్సార్ జిల్లా పులివెందులకు చేరుకుంటారు. స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేస్తారు. ఆ తర్వాత భాకరాపురంలోని తన నివాసానికి వెళ్తారు. కొద్దిసేపటి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

ఏపీ ఇంటెలిజెన్స్ డీజీగా కుమార్ విశ్వజిత్

- విజయవాడ సీపీగా పీహెచ్‌డీ రామకృష్ణ
- ఆదేశాలు జారీచేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డీజీగా కుమార్ విశ్వజిత్‌ను, విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం రాత్రి ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్యానెల్‌ను పరిశీలించిన ఈసీ తుది నిర్ణయం తీసుకుని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఏపీ సీఈవోకి సమాచారం ఇచ్చింది. కొత్తగా నియమితులైన ఈ ఇద్దరు అధికారులు తక్షణమే బాధ్యతలు చేపట్టాలని, ఈ అంశంలో పూర్తి నివేదికను గురువారం ఉదయం 11 గంటలలోగా తమకు సమర్పించాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

ఏపీ సీఎం మళ్లీ జగనే..

- శ్రీవారి పాదాల చెంత చెబుతున్నా.. ఆయనే సీఎం
- ప్రముఖ సినీనటుడు, పురచ్చి దళపతి విశాల్



తిరుపతి సిటీ: జూన్ 4వ తేదీన విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో ఏపీ ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చూస్తారని పురచ్చి దళపతి, సినీ హీరో విశాల్ చెప్పారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో బుధవారం రాత్రి జరిగిన రత్నం సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. శ్రీవారి పాదాల చెంత తన సినిమా ప్రమోషన్‌లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. యువత తాము ఎంచుకున్న రంగంలో చమటోడ్చి రాణించాలని పిలుపునిచ్చారు. ఆధునిక సమాజంలో డ్రగ్స్ వంటి హానికర పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల యువతీ యువకులతో మాటామంతీ కార్యక్రమాన్ని చేపట్టారు. తాను శ్రమించి తీసిన రత్నం సినిమాను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని ఆంధ్రాలో రానున్న ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. దేశం మొత్తానికి ఈ విషయం ఇప్పటికే తెలుసని.. శ్రీవారి పాదాల చెంత చెబుతున్నా వైఎస్ జగన్మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం అవుతారని చెప్పారు. మళ్లీ జగన్ తప్పక సీఎం అవుతారు అని విశాల్ చెప్పిన వెంటనే విద్యార్థులంతా సీఎం జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఆయన సంతోషంగా నవ్వుతూ అభివాదం చేశారు.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.2	28.7
కడప	43.6	25.8
తిరుపతి	43.0	23.0
విజయవాడ	42.0	27.0
మార్కాపురం	42.0	26.0
రాజమహేంద్రవరం	42.0	25.0
విజయనగరం	41.0	36.0
గుంటూరు	41.0	27.0
ఏలూరు	41.0	27.0
నెల్లూరు	40.1	26.3
విశాఖపట్నం	38.8	26.8

ఏపీలో బీజేపీకి బాబే లీడర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించడంపై ఓ పారిశ్రామిక వేత్త, టీడీపీ ట్విట్టర్ విభాగంలో పనిచేసే ఇద్దరు ఆ పార్టీ అభిమానుల మధ్య సోషల్ మీడియా 'ఎక్స్' (ట్విటర్)లో జరిగిన చిన్న చర్చ ఇది.

టీడీపీ నాయకులకే బీజేపీ ముసుగు..

దేశంలోని బీజేపీ నాయకులంతా 'మోదీ కా పరివార్'గా ప్రచారం చేసుకుంటుంటే.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాత్రం 'చంద్రబాబు పరివారం' అంటూ రాష్ట్రంలోని బీజేపీ నాయకులందరినీ టీడీపీ అధినేత చంద్రబాబు గుప్పిట్లో పెట్టేశారు. గత ఏడాది జులైలో బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతల చేపట్టిన నాటి నుంచే ఆమె కమలం పువ్వుకు పసుపు రంగులు అద్దడం మొదలు పెట్టారని ఆ పార్టీ నేతలే అంటున్నారు. రెండు నెలల క్రితం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన నాయకుడినే నామినేషన్ల ముగింపునకు రెండు రోజుల ముందు బీజేపీలో చేర్చుకొని, అదే స్థానంలో బీజేపీ అభ్యర్థిగా బీ ఫారం ఇచ్చారంటే.. ఇవి పొత్తులు కావని, లాలూచీలు అంటేనే బాగుంటుంది కదా అంటూ కమలం నేతలే ఎత్తిపొడుస్తున్నారు. రాష్ట్రంలో 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తున్నప్పటికీ, రెండు మూడు దశాబ్దాలకు పైగా పార్టీనే నమ్ముకున్న బీజేపీ నాయకులకు ఒకరిద్దరికి మించి టికెట్లే దక్కలేదు. మిగతా వారంతా టీడీపీ నాయకులే బీజేపీ టికెట్లు పొందారు. ఈ పొత్తులు, అభ్యర్థుల ఎంపిక మొత్తం ఒక పథకం ప్రకారం నడిపించారని ఆ పార్టీ నేతలు అంటున్నారు.



బద్వేలు నుంచి ఈరోజు బీ ఫారం ఇచ్చిన అనపర్తి వరకు ఇదే తంతు అని మండిపడుతున్నారు.

రాష్ట్రంలో 10 అసెంబ్లీ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను పరిశీలిస్తే..

బద్వేలు అభ్యర్థి రోశన్న అభ్యర్థుల ఎంపికకు ఒక్క రోజు ముందు టీడీపీ నుంచి బీజేపీలో చేరారు. అప్పటివరకు ఆయన టీడీపీ నియోజకవర్గ ప్రధాన నాయకుడు. ఉప ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ నాయకుడు పనతల సురేష్‌కు టికెట్ ఇవ్వడానికి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మనసు రాలేదు.

- అనపర్తి నియోజకవర్గ పరిస్థితి మరీ ఘోరం. బీజేపీతో పొత్తుకు ముందు చంద్రబాబు తొలి జాబితాలోనే ఫిబ్రవరి 24న ఈ నియోజకవర్గం అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించారు. ఆ తర్వాత ఈ స్థానాన్ని బీజేపీకి ఇవ్వడంతో నల్లమిల్లి సీటు కోల్పోయారు. పురందేశ్వరి ఆయన్నే మంగళవారం బీజేపీలో చేర్చుకొని, అభ్యర్థిగా ప్రకటించారు. బీజేపీ జాతీయ నాయకత్వం అనపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా శివకృష్ణంరాజును గత నెల 27నే ప్రకటించింది. అయితే, పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆయన్ని అడ్డుకొంది. స్థానిక టీడీపీ నాయకులు కూడా ఆయన ప్రచారం కూడ మొదలుపెట్టకుండా అడ్డుకున్నారు. చివరకు ఇక్కడ చంద్రబాబు చెప్పినట్లుగా టీడీపీ నేతకే బీజేపీ టికెట్ దక్కింది.
- 2019 ఎన్నికలు వరకు టీడీపీలో ఉండి, ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే తాత్కాలిక పునరావాసం కోసం బీజేపీలో చేరిన సీఎం రమేష్, సుజనా చౌదరి, ఆదినారాయణరెడ్డి, ఎన్. ఈశ్వర్ రావు వంటి వారికి బీజేపీలో సీట్లు దక్కాయి. సీమ ప్రాంతానికి చెందిన సీఎం రమేష్‌కు ఉత్తరాంధ్ర అనకాపల్లి పార్లమెంట్ స్థానం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సుజనాచౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం, ఆదినారాయణరెడ్డి జమ్ములమడుగు అసెంబ్లీ సీట్లను, ఎన్. ఈశ్వర్ రావుకు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. వీరంతా చంద్రబాబు బలమైన కోటరీ అన్న విషయం అందరికీ తెలిసిందే.
- బీజేపీకి కేటాయించిన కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించిన కామినేని శ్రీనివాస్ (పార్టీకన్నా చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరు) సైతం 2014 ఎన్నికల్లో బీజేపీ - టీడీపీ పొత్తు ఖాయమని తెలిశాక కమలం పార్టీలో చేరిపోయి, ఆ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి ఉమ్మడి ప్రభుత్వంలో మంత్రి పదవి అనుభవించారు. 2019లో రెండు పార్టీల మధ్య పొత్తు లేకపోవడంతో ఆయన తిరిగి బీజేపీ తరుపున పోటీకి విముఖత వ్యక్తం చేసిన వ్యక్తి. పొత్తులు లేనప్పుడు పోటీకి దూరంగా ఉండి, పొత్తు కుదరడంతో బరిలోకి దిగారు. ఈయన కోసమే బీజేపీ రాష్ట్ర నాయకత్వం కైకలూరు అసెంబ్లీ స్థానం కోరి మరీ తీసుకుంది.
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు, అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో చేరిన దగ్గుబాటి పురందేశ్వరి.. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. సరిగ్గా 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఆమె ఇప్పుడు రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.
- అభ్యర్థుల ప్రకటనకు ఒక్క రోజు ముందు వరకు పార్టీ సభ్యత్వం కూడా లేని వరప్రసాద్ తిరుపతి లోక్‌సభ స్థానంలో బీజేపీ టికెట్ కొట్టేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అయిన ఆయనకు ఈసారి ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో కొంతకాలంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ చుట్టూ తిరిగారు. చివరకు తిరుపతి బీజేపీ ఖాతాలోకి వెళ్లడంతో చంద్రబాబు సూచన మేరకు ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. ఆయనకే చంద్రబాబు బీజేపీ టికెట్ ఇప్పించారు.
- ఏడాది క్రితం కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట లోక్‌సభ టికెట్ దక్కింది. 2011–14 మధ్య ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆయనకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు మద్దతు ఇవ్వకుండా ఆయన ప్రభుత్వాన్ని కాపాడారని రాజకీయ నిపుణులు అంటుంటారు.

బాబును సీఎం చేయడమే పవన్ లక్ష్యం

- చిరంజీవిని తాను విమర్శించకపోయినా విమర్శించినట్లు చిత్రీకరిస్తున్నారు
- సీఎం జగన్‌ను ఎదుర్కొనేందుకు తమ శక్తి సరిపోవడం లేదన్నది వారిద్దరికీ అర్థమైంది
- చిరంజీవి అభిమానులు, సామాజికవర్గం మద్దతు కూడగట్టుకోవాలన్న తపన, ఆత్రం వారిలో కన్పిస్తోంది
- జనసేన, బీజేపీ ఆత్మాభిమానం వదిలేసి టీడీపీ ముందు సాగిలపడ్డాయి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ఎలాగైనా ముఖ్యమంత్రిని చేయాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తాపత్రయపడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలపై ఆయన స్పందించారు. 'చిరంజీవిని ఉద్దేశించి నేనేమీ అనలేదు. చిరంజీవి కూటమికి మద్దతిచ్చారు.. దీనిపై మీ అభిప్రాయం చెప్పాలని మీడియా ప్రతినిధులు అడిగితే, చిరంజీవి కూటమికి మద్దతివ్వడం మంచిదే కానీ.. కూటమితో చిరంజీవే కాదు ఇంకా ఎవ్వరూ కలిసి వచ్చినా ఇబ్బందిలేదని మాత్రమే చెప్పా'.. అని ఆయన గుర్తుచేశారు. చిరంజీవిని తాను విమర్శించకపోయినా విమర్శించినట్లు చిత్రీకరించడం వెనుక ఏముందా అని ఆలోచిస్తే.. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఎదుర్కోవడానికి చంద్రబాబు, పవన్ తమ శక్తి సరిపోదని భావించి, చిరంజీవి అభిమానులు, ఆ సామాజికవర్గం వారి ఓట్లను గంపగుత్తగా తీసుకెళ్లి టీడీపీకి ఎలా వేయించాలా అనే తపన, తాపత్రయం అందులో కన్పిస్తున్నాయని మండిపడ్డారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

టీడీపీ ముందు సాగిలబడ్డ జనసేన, బీజేపీ..

- బీజేపీ, జనసేనలు 2014 ఎన్నికల్లో టీడీపీతో జట్టుకట్టి అధికారంలోకి వచ్చాక.. ప్రజలను రాచి రంపాన పెట్టాయి. జనసేన, బీజేపీ ఆత్మాభిమానం వదిలేసి బాండెడ్ లేబర్ కంటే అన్యాయంగా ఇప్పుడు మళ్లీ టీడీపీ ముందు సాగిలపడ్డాయి. ఘోరంగా ఓడిపోతున్నామని తెలిసే బాబు, పవన్ నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారు.



- డ్వాక్రా మహిళల గురించి చంద్రబాబు మాట్లాడుతున్న మాటలు చూస్తుంటే నవ్వొస్తోంది. వారిని మోసం చేసిన చరిత్ర ఆయనది. 2014లో రుణ మాఫీ చేస్తానని చెప్పి వారిని మోసంచేశారు.
- అసలు చంద్రబాబుకు కుటుంబ విలువలు తెలుసా? ఆయన తమ్ముడు రామ్మూర్తినాయుడు ఎక్కడున్నాడు? చంద్రబాబు చెల్లెళ్లు ఎక్కడున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా?
- 2014లో చంద్రబాబు అలవికాని హామీలిచ్చి మోసంచేశారు. మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసంచేసింది ఎవరు? కూటమి డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాబోతోందనే ఆందోళన చంద్రబాబు, పవన్‌లో కన్పిస్తోంది.

ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థ..

- చంద్రబాబుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటీసుకు స్పందించకపోగా బెదిరింపులకు దిగుతున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడిన మాటలు చదివి వినిపించాలని అనుకున్నా. కానీ, సిగ్గేస్తోంది.
- మేం చంద్రబాబు కుటుంబాల గురించి మాట్లాడితే చంద్రబాబు తలెత్తుకుని తిరగలేరు. ఎన్నికలంటే ఇచ్చిన హామీలు చేసిన పనుల గురించి మాట్లాడాలి. ఎన్నికలంటే ప్రజలకు సేవ ఎలా చేయాలి.. వారితో ఎలా మమేకం అవ్వాలి.. రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి.. పేదల కోసం సంక్షేమం ఎలా అందించాలి అనే అంశాలపై దృష్టిసారించాలి. కుటుంబాల గురించి కాదన్నది చంద్రబాబు గుర్తిస్తే మంచిది.
- ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థ. వాళ్ల పని వాళ్లు చేస్తారు. కక్ష సాధింపు చర్యలకు ఎన్నికల కమిషన్ పాల్పడుతుందని మేం భావించడం లేదు. అధికారుల బదిలీల గురించి మేం ఏమి మాట్లాడం.
- ఎన్నికల నోటిఫికేషన్, కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ ప్రజల మధ్యే ఉంటూ గత ఐదేళ్లుగా చేసిన అభివృద్ధిని వివరిస్తూ మద్దతిమ్మని అడుగుతున్నారు. కానీ, వ్యవస్థలను అడ్డంపెట్టుకుని ఎన్నికల్లో గెలుపొందాలని టీడీపీ చూస్తోంది.
- 2019లో ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి మరీ బెదిరించిన వ్యక్తి చంద్రబాబు. టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు, పదేపదే తప్పుడు ఫిర్యాదులు చేసి ఎన్నికల కమిషన్ అధికారుల్ని బెదిరిస్తున్నారు.
- ఇక పెన్షన్లు పంపిణీ జరగకుండా అడ్డుకుంది టీడీపీనే అని రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసు. మళ్లీ ఇప్పుడు ఆలస్యం కాకుండా ఒకటినే పెన్షన్లు పంపిణీ చేయాలని గొడవ చేస్తున్నారు.
- ఇక వలంటీర్లపై ఎల్వీ సుబ్రమణ్యం, నిమ్మగడ్డ రమేష్‌లతో బాబు ఫిర్యాదులు ఇప్పించారు. వలంటీర్లను దూషించిన చంద్రబాబు నేడు తాను అధికారంలోకి వస్తే వారికి రూ.10వేలిస్తానంటూ ప్రగల్బాలు పలుకుతున్నారు.

నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

ఇప్పటివరకు అసెంబ్లీకి 3,644, లోక్‌సభకు 654

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. ఎన్నికల్లో పోటీకి యువత ఎక్కువగా మొగ్గుచూపుతుండటంతో ఈ సారి నామినేషన్లు భారీగా దాఖలవుతున్నాయి. ఒకరోజు గడువు ఉండగానే బుధవారం వరకు అసెంబ్లీకి 3,644, లోక్‌సభకు 654 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం ఒక్కరోజే అసెంబ్లీకి 1,294, లోక్‌సభకు 237 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. లోక్‌సభకు బుధవారం నామినేషన్లు వేసినవారిలో బీజేపీ తరపున పురందేశ్వరి, జనసేన తరపున వల్లభనేని బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

జస్టిస్ రామలింగేశ్వర్‌రావుకు ఫుల్‌కోర్టు నివాళి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దివంగత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు ఫుల్ కోర్టు బుధవారం ఘనంగా నివాళులర్పించింది. ఆయన సేవలను స్మరించుకుంది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలో సాయంత్రం ఫుల్ కోర్టు భేటీ అయి 2 నిమిషాలు మౌనం పాటించింది. వృత్తిపై నిబద్ధత, అంకితభావంతో పాటు న్యాయ సూత్రాలను పాటిస్తూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఆయన సేవలందించారని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, 'ప్రజాప్రయోజనం, సామాజిక న్యాయానికి సంబంధించిన కేసుల వాదనలో ఆయన దిట్ట. రామలింగేశ్వర్‌రావు వాదించిన సమతా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గిరిజనుల జీవితాలను కాపాడటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడింది. ఐక్యరాజ్య సమితి నిర్వహించిన పర్యావరణ కార్యక్రమాల్లోనూ సమతా కేసు ప్రస్తావన రావడం దాని గొప్పతనాన్ని చెబుతోంది. జస్టిస్ రామలింగేశ్వర్‌రావు ఇచ్చిన 13,000కు పైగా తీర్పుల్లో 100 కంటే ఎక్కువ న్యాయ పత్రికలలో ప్రచురితమయ్యాయి' అని వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, ఏఎస్‌జీ నరసింహశర్మ, డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్, పీపీ నాగేశ్వర్‌రావు, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డితో పాటు ఇతర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు కూతురిని చూసేందుకు జర్మనీ వెళ్లి గుండెపోటుతో అక్కడే ఈ నెల 5న మృతి చెందిన విషయం తెలిసిందే.

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో
నిందితుడు పోలీసు కస్టడీకి

- నేటి నుంచి మూడు రోజులు పోలీసు కస్టడీకి
- న్యాయవాది సమక్షంలో విచారణ
- న్యాయమూర్తి ఆదేశాలు
- ఘటన పాత్రధారులు, సూత్రధారులను తేల్చేందుకు పోలీసులు సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసిన కేసులో ప్రధాన నిందితుడు (ఎ1) వేముల సతీష్ కుమార్‌ను గురువారం నుంచి మూడు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో సతీష్‌ను అతని తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్న సతీష్‌ను గురువారం ఉదయం 10 గంటలకు కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సతీష్‌ను ప్రతి రోజూ ఉదయం 10 ఉంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకొని, విచారించనున్నారు. విచారణ అనంతరం రోజూ సాయంత్రం ఐదు గంటలకు తిరిగి సబ్ జైలులో అప్పగించాల్సి ఉంటుంది.

సీఎం జగన్‌ను హతమార్చేందుకే దాడి

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 13వ తేదీన విజయవాడ సింగ్‌నగర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై పదునైన కాంక్రీట్ రాయితో దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సీఎం జగన్‌కు ఎడమ కంటి పైభాగంలో బలమైన గాయమైంది. పక్కనే ఉన్న విజయవాడ సెంట్రల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా బలమైన గాయమైంది. వెలంపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదే ప్రాంతానికి చెందిన వేముల సతీష్‌కుమార్ ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో అతన్ని అరెస్ట్ చేసి ఈ నెల 18న న్యాయస్థానంలో హాజరుపర్చారు. సతీష్‌కు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఉద్దేశపూర్వకంగానే సీఎం జగన్‌ను హతమార్చేందుకే సతీష్ రాయితో దాడి చేశాడని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.

పాత్రధారులు, సూత్రధారుల గుర్తింపునకే..

కొందరు టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే సీఎం జగన్‌పై తాను ముందస్తుగా సేకరించిన కాంక్రీట్ రాయితో దాడి చేశానని పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు సతీష్ అంగీకరించినట్లు సమాచారం. దీని ఆధారంగానే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఘటన వెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారులెవరో సరిగా తేలకపోవడంతో ఈ కేసు అసంపూర్తిగానే ఉంది. కేసును మరింత సమగ్రంగా, లోతుగా దర్యాప్తు చేసి, వాస్తవాలను వెలికి తీయాల్సి ఉంది. మరికొన్ని సాంకేతిక ఆధారాలను సేకరించాల్సి ఉంది. ఇవే విషయాలను పేర్కొంటూ నిందితుడిని ఏడు రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు ఈ నెల 22న కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలను విన్న అనంతరం నిందితుడిని మూడు రోజులు పోలీస్ కస్టడికి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ఉష్ణతాపం ఉగ్రరూపం

- వచ్చే ఐదు రోజులు ఉధృతం కానున్న వడగాడ్పులు
- పలు జిల్లాల్లో మరింత పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉష్ణతాపం మరింత ఉగ్రరూపం దాల్చనుంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో ఎండ కాక పుట్టిస్తోంది. తీవ్ర వడగాడ్పులు దడ పుట్టిస్తున్నాయి. జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. రానున్న ఐదు రోజులు వడగాడ్పులు మరింత ఉధృతం కానున్నాయి. కొన్ని జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశాలున్నాయి. బుధవారం అత్యధికంగా విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. బలపనూరు (వైఎస్సార్)లో 44.9, దొనకొండ (ప్రకాశం)లో 44.3, మహానంది (నంద్యాల)లో 44.2, రావికమతం (అనకాపల్లి)లో 44.1, కంభంపాడు (ఎన్టీఆర్), రావిపాడు (పల్నాడు)లలో 44 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 69 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 105 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. గురువారం 54 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 154 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వీటిలో తీవ్ర వడగాడ్పులు వీచే మండలాలు శ్రీకాకుళం జిల్లాలో 13, విజయనగరం జిల్లాలో 23, పార్వతీపురం మన్యంలో 12, ఏఎస్సార్ జిల్లాలో 2, అనకాపల్లిలో 3, విశాఖలో 1 (పద్మనాభం) మండలాలు ఉన్నాయని పేర్కొంది. శ్రీకాకుళం జిల్లాలో 15 మండలాలు, విజయనగరం జిల్లాలో 4, పార్వతీపురం మన్యంలో 3, ఏఎస్సార్ జిల్లాలో 12, విశాఖపట్నంలో 3, అనకాపల్లిలో 15, కాకినాడలో 17, కోనసీమలో 9, తూర్పు గోదావరి జిల్లాలో 19, పశ్చిమ గోదావరి జిల్లాలో 4, ఏలూరులో 14, కృష్ణాలో 9, ఎన్టీఆర్‌లో 5, గుంటూరులో 14, పల్నాడులో 5, బాపట్లలో 1, నెల్లూరులో 1, ప్రకాశంలో 1, తిరుపతి జిల్లాల్లో 3 మండలాల్లో వడగాడ్పులు వీయవచ్చని వివరించింది. శుక్రవారం 36 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 157 మండలాల్లో వడగాడ్పులు వీచే ఆస్కారం ఉందని తెలిపింది.

కొనసాగుతున్న ఆవర్తనం, ద్రోణి

మరోవైపు తెలంగాణ, కోస్తాంధ్ర పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఈ ఉపరితల ఆవర్తనం నుంచి ద్రోణి దక్షిణ తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తు వరకు కొనసాగుతోంది. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో గురువారం ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉక్కపోత, తేమతో కూడి అసౌకర్య వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

చంద్రబాబు ప్రజాజీవితానికి పనికిరారు

- రాష్ట్రంలో ప్రతి ఇంటా సంక్షేమం
- వైఎస్సార్‌తో ఎనలేని అనుబంధం
- ప్రజల పక్షాన పోరాటాలు చేసి ఆయన సీఎం అయ్యారు
- తండ్రిని మించిన తనయుడు జగన్
- సాక్షితో మాజీ ఎంపీ మేకపాటి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అతి సామాన్య కుటుంబంలో జన్మించి, రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతో సాగించిన మాజీ సీఎం చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ప్రజల కోసం గుర్తుంచుకోదగ్గ ఒక్క పనిచేయలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి చెప్పారు. దీన్నిబట్టి చంద్రబాబు ప్రజాజీవితానికి పనికిరారనే అంశం స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో బుధవారం ఆయన సాక్షి ప్రతినిధితో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్పారు. ప్రజల పక్షాన మూడు దశాబ్దాలకుపైగా పోరాటాలు చేసి ఆయన సీఎం అయిన అంశాన్ని ప్రస్తావించారు. వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో తిరుగులేని ప్రజానేతగా వైఎస్సార్ అవతరించారన్నారు. వైఎస్సార్‌తో కలిసి కాంగ్రెస్‌లో పనిచేశానని, ఆయన మరణంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులతోపాటు కోట్లాది అభిమానుల మనోభావాల్లో అనూహ్యమైన మార్పొచ్చిందని తెలిపారు.

జగన్‌ను అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం

అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పుయాత్ర చేయాలని భావిస్తే, కొందరి మాటలను విని పార్టీ అధిష్టానం అడ్డుకుందని చెప్పారు. ఈ క్రమంలో తాము ఆయనకు అండగా నిలిచామన్నారు. జగన్‌తో తన కుమారుడు గౌతమ్‌రెడ్డి మాట్లాడిన అనంతరం తాను ఎంపీ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సుబ్బిరామిరెడ్డి బరిలో దిగారని, ఆయనకు మద్దతుగా అప్పటి రాష్ట్ర, కేంద్ర మంత్రులు రంగంలోకి దిగి తనను ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డిన అంశాన్ని గుర్తుచేశారు. అయినా తాను 2.92 లక్షలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందానని తెలిపారు.

ప్రజల గుండెల్లో జగన్‌కు సుస్థిర స్థానం

వివిధ సంక్షేమ పథకాలు, నూతన ఒరవడితో ప్రజల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరస్థానం సంపాదించుకున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లోనే ఆయన్ని సీఎం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని, అయితే పచ్చమీడియా, టీడీపీ దుష్ప్రచారంతో ఆ అవకాశాన్ని త్రుటిలో కోల్పోయారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 అసెంబ్లీ, 22 పార్లమెంట్ స్థానాలను గెల్చుకుని అఖండ విజయాన్ని నమోదు చేసుకుందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజాభిమానం మరింత ఎక్కువైందని, వై నాట్ 175 అనే పిలుపు అక్షరసత్యం కానుందని పేర్కొన్నారు. సిద్ధం, మేమంతా సిద్ధం సభలకు అశేష ప్రజాదరణ లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించనుందనే అంశం దీని ద్వారా స్పష్టమవుతోందని చెప్పారు.

చరిత్రహీనులుగా మిగలడం ఖాయం

ప్రజాబలం లేని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వంటి వారు సీఎంపై దాడులకు ఉసిగొల్పి చరిత్రహీనులుగా నిలిచిపోనున్నారని ధ్వజమెత్తారు. సీఎంపై ఇటీవల రాయితో దాడిచేశారని, ప్రజాశీస్సులు మెండుగా ఉన్న కారణంగా ఆయనకు పెనుప్రమాదం తప్పిందన్నారు. ఈ హత్యాయత్నం వెనుక అసలు దోషి చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. సంక్షేమసారథి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరు నుంచి తన కుమారుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నుంచి తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధించనున్నారని చెప్పారు. నెల్లూరు లోక్‌సభతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

చంద్రబాబు తట్టా, బుట్టా సర్దుకోవాల్సిందే..

భరత్ నామినేషన్ ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కుప్పం (చిత్తూరు జిల్లా): కుప్పం ప్రజలను మోసం చేస్తూ 35 ఏళ్లగా పబ్బం గడుపుతున్న చంద్రబాబును కుప్పం ప్రజలు ఈమారు సాగనంపడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి భరత్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 60 శాతం బీసీలు ఉన్న నియోజకవర్గాన్ని ఆక్రమించుకున్న బాబు.. స్థానికంగా వారి రాజకీయ మనుగడను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత జనం మేలుకున్నారని, మంచి చేసే నాయకుడిని మరోమారు ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తాము ఒంటరిగా ఎన్నికలకు వెళ్తున్నామని, చంద్రబాబు గుంపులతో వచ్చినా జగన్‌ని ఎదుర్కోవడం తరం కాదన్నారు. జూన్ 4న చంద్రబాబు కుప్పంలో తట్టా, బుట్టా సర్దుకోవడం ఖాయమని స్పష్టం చేశారు.

చంద్రబాబూ.. చేసిన మేలేంటో చెప్పండి

మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లాకు చంద్రబాబు ఏం మేలు చేశారో చెప్పగలరా అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. ఆయన బుధవారం శ్రీకాకుళంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అరసవల్లి కూడలి నుంచి 80 అడుగుల రోడ్డుమీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, ఉత్తరాంధ్ర అభివృద్ధి అంటే చంద్రబాబుకి గిట్టదని, విశాఖలో రాజధాని అంటే వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద, మధ్య తరగతి, బడుగు,బలహీన వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని మంత్రి వివరించారు. మూలపేట పోర్టు పూర్తిచేసి ప్రపంచంతో కనెక్ట్ చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, విశాఖలోనే సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎంవీ పద్మావతి, శిమ్మ రాజశేఖర్, ఎంవీ స్వరూప్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు చింతమనేనికి బీ-ఫారం అందజేత

అనపర్తి చిక్కుముడి వీడడంతో ఆయనకు లైన్ క్లియర్

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నాయకుడు చింతమనేని ప్రభాకర్‌కు ఎట్టకేలకు చంద్రబాబు బీ-ఫారం అందజేశారు. శ్రీకాకుళంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చంద్రబాబు అక్కడికి చింతమనేని ప్రభాకర్‌ను పిలిపించుకుని బీ-ఫారం ఇవ్వడంతో దెందులూరు సీటుపై ఏర్పడిన ప్రతిష్టంభన తొలగింది. గతంలోనే చింతమనేనికి సీటు ఖరారు చేసినా అందరితో పాటు బీ-ఫారం ఇవ్వలేదు. బీజేపీకి కేటాయించిన అనపర్తి అసెంబ్లీ సీటును టీడీపీ తీసుకుంటే దానికి బదులుగా దెందులూరు సీటును ఆ పార్టీకి ఇవ్వాల్సివస్తుందనే ఉద్దేశంతో చింతమనేని ప్రభాకర్‌ను చంద్రబాబు గాల్లో పెట్టారు. ఇప్పుడు అనపర్తిలో టీడీపీ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కండువా మార్చుకుని బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడం ఖాయమైంది. దీంతో చింతమనేనికి బీ-ఫారం ఇచ్చారు.

పార్టీకి సేవ చేసిన వారిని పవన్ గుర్తించరు

- ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి
- పిఠాపురంలో నామినేషన్ దాఖలు



నామినేషన్ వేస్తున్న తమన్నా సింహాద్రి

పిఠాపురం: సేవ చేసిన వారిని పవన్ కళ్యాణ్ గుర్తించరని, తాను జనసేన పార్టీకి ఎంతో సేవ చేశానని, తనను ఆయన పట్టించుకోలేదని ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా బుధవారం పిఠాపురంలో నామినేషన్ దాఖలు చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి తన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వచ్చిన ఆమె ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ ఎస్.రాంసుందర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2018 నుంచి రాష్ట్రంలో తొలి ట్రాన్స్‌జెండర్ మహిళగా రాజకీయాల్లోకి వచ్చి జనసేన తరఫున ప్రచారం చేశానని గుర్తు చేశారు. కానీ పవన్‌కళ్యాణ్ మాత్రం కష్టపడిన వారిని గుర్తించడం లేదన్నారు. తనను గుర్తించి భారత చైతన్య యువజన పార్టీ నాయకులు తనను అభ్యర్థిగా నిలబెట్టారని చెప్పారు. పిఠాపురంలో తనకు మంచి మద్దతు లభించిందని, ప్రతీ ఒక్కరు తనకు మద్దతు ప్రకటించి ఆశీర్వదిస్తున్నారని చెప్పారు.

పచ్చపార్టీ ప్రలోభాలు

ఓటమి భయంతో అడ్డదారులు తొక్కుతున్న టీడీపీ అభ్యర్థులు

సాక్షి, చిత్తూరు/చిత్తూరు అర్బన్/చిత్తూరు కార్పొరేషన్/గిద్దలూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ అభ్యర్థులకు ఓటమి భయం వెంటాడుతోంది. దీంతో ఓటర్లకు ప్రలోభాల వల విసురుతున్నారు. ఓవైపు మనీ.. ఇంకోవైపు మద్యం పంపిణీ చేస్తూ యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ముందుగానే ఓటమి ఖాయం కావడంతో కాస్తయినా పరువు నిలుపుకోవాలనే ఉద్దేశంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం, నగదు, గిఫ్ట్ బాక్సులు పంపిణీ చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎక్కువ నియోజకవర్గాలు కర్ణాటకతో సరిహద్దును కలిగి ఉన్నాయి. దీంతో టీడీపీ అభ్యర్థులు చాలా సులువుగా అక్కడి మద్యాన్ని సరిహద్దులు దాటిస్తూ డంప్ చేస్తున్నారు. బుధవారం చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గురజాల జగన్మోహన్, ప్రసాదరావు నామినేషన్లు దాఖలు చేశారు.

ఈ సందర్భంగా ర్యాలీకు వచ్చినవాళ్లకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున నగదు, పెద్ద ఎత్తున మద్యం అందజేశారు. పలమనేరు నీటిపారుదల శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కుమారస్వామి అనే వ్యక్తి 'పచ్చ' జెండాలు మోస్తూ ఇప్పటికే సస్పెండ్ అయ్యాడు. అయితే మళ్లీ తాజాగా చిత్తూరు రూరల్ మండలంలో జనసమీకరణ చేసి టీడీపీ ర్యాలీలో పాల్గొనడం గమనార్హం.

ఓటర్లను ప్రభావితం చేసే నేతలకు ద్విచక్ర వాహనాలు

ప్రధాన నియోజకవర్గాల్లో ఓటర్లను ప్రభావితం చేసే నేతలకు రూ.లక్షలు విలువ చేసే బుల్లెట్లు, ఎలక్ట్రిక్ వాహనాల పంపిణీకి టీడీపీ అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో పాల వ్యాపారం చేసే వారికి ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలు ఉచితంగా ఇచ్చారు. వాటికి టీడీపీ స్టిక్కర్లు అంటించి ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఖర్చులు కూడా అభ్యర్థులే భరిస్తున్నట్టు తెలుస్తోంది.



ర్యాలీలో మాస్క్ పెట్టుకుని, కార్యకర్తలను తీసుకెళుతున్న ప్రభుత్వ ఉద్యోగి కుమారస్వామి

ఇవిగో ప్రలోభాలు..

- చిత్తూరులో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ లక్ష్మీపురం, ముత్తుకూరుల్లో ప్రచారం సందర్భంగా టీడీపీ నేతలు కర్ణాటక మద్యాన్ని పంపిణీ చేశారు. ఈ రెండు చోట్ల దాదాపు రూ.80 వేలు విలువ చేసే మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.
- ఇటీవల చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా చిత్తూరు రూరల్ మండలంలో పిల్లలకు పెద్ద ఎత్తున పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.
- పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండల కేంద్రంలో షాదీమహల్ వద్ద రంజాన్ పర్వదినం ముందు రోజు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ తరఫున ముస్లింలకు టీడీపీ గుర్తులతో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- గంగాధర నెల్లూరులో టీడీపీ అభ్యర్థి థామస్ తాయిలాల పంపిణీలో స్పీడ్ పెంచారు. రెండు రోజుల ముందు శ్రీరంగరాజపురం మండలం కటికపల్లిలో నిత్యావసర వస్తువులతోపాటు చీర, జాకెట్, ప్యాంటు, చొక్కా, మద్యం బాటిల్, రూ.500 నగదు కిట్‌గా పంపిణీ చేశారు.
- నగరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ క్వారీల రాజకీయానికి తెరతీశారు. తమ పార్టీలోకి వస్తే క్వారీలు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. మరికొందరికి డీకేటీ భూములు కూడా ఇస్తామని అలవికాని హామీలు ఇస్తున్నారు. ఇక పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ప్రలోభాలు తారాస్థాయికి చేరాయి.
- టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ తాయిలాలు ఊపందుకున్నాయి. ఇటీవల చంద్రబాబు తరఫున ఆయన భార్య భువనేశ్వరి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా కుప్పంలోని 243 పోలింగ్‌బూత్‌ల్లో ఒక్కో చోట రూ.30 వేల చొప్పున పంపిణీ చేశారు. అలాగే జనసమీకరణ కోసం ఒక్కొక్కరికి రూ.300 నగదు, మద్యం సీసా, బిర్యానీ అందజేశారు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి నామినేషన్ పర్వంలో ఓటులేని వారి చేతికి టీడీపీ జెండా ఇచ్చి మరీ ప్రచారం చేయించారు. ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చి నామినేషన్‌కు నియోజకవర్గంలోని గ్రామాల్లో నుంచి జనాన్ని తరలించారు. నామినేషన్ సందర్భంగా మద్యం ఏరులై పారింది.

పవన్ ఆస్తులు మాయ.. పెళ్లాల లెక్కలూ మాయే..

పవన్ ఎన్నికల అఫిడవిట్‌లో అడుగుకో అబద్ధం
పవన్ అఫిడవిట్‌లో వివరాలపై విచారణ చేయించాలి
వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేశ్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత ఆస్తులు మాయ అని, ఆయన పెళ్లాల లెక్కలూ మాయే అని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన మహేశ్ ధ్వజమెత్తారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆదాయం, ఆస్తులపై మాయ చేస్తున్నట్లు పెళ్లాలు, గొళ్లేల విషయంలోనూ మాయచేస్తున్నావే అని దెప్పిపొడిచారు. పవన్ ఏ భార్యతో ఎంతకాలం ఉన్నారు, ఒక భార్యతో సంసారం చేస్తూ మరొకరితో పిల్లలను కన్న విషయం, ఇప్పుడు ఎవరితో ఉంటున్నారు, వీటన్నింటిపై స్పష్టత ఇస్తే బాగుంటుందని అన్నారు. మహేశ్ బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ ఎన్నికల అఫిడవిట్‌లో అడుగుకో అబద్ధం చెప్పాడని, అందులో వివరాలపై విచారణ చేయించాలని అన్నారు. 'ఐదేళ్ల ఆయన సంపాదన రూ.114.76 కోట్లు అని చెప్పారు. అందులో రూ.73 కోట్లు పన్నులు, పార్టీ డొనేషన్ రూ.20 కోట్లు అని చెప్పారు. ఇవన్నీ పోను ఇంకా రూ.90 కోట్ల ఆస్తులు ఎలా కొన్నాడు' అని నిలదీశారు. 'పవన్ ప్రకటించిన ఆస్తులన్నీ జనసేన పార్టీ పెట్టిన తర్వాత కొన్నవే. రూ.90 కోట్ల ఆస్తులు 2018 – 2024 మధ్యలో కొన్నారు. ఇది రిజిస్టర్ విలువే. వాటి మార్కెట్ విలువ రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లు ఉంటుంది. ఇదే సమయంలో ఆయన చేసిన సినిమాలు నాలుగే. వాటిలో యావరేజ్‌గా ఆడినవి రెండు. మిగతావి డిజాస్టర్ అయ్యాయి. అయినా రూ.90 కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? సినిమా రంగం నుంచి వచ్చాయా లేక జనసేన పార్టీని చంద్రబాబుకు తాకట్టు పెడితే వచ్చాయా? కరోనా సమయంలో 2021లో ప్రపంచమంతా అతలాకుతలం అవుతుంటే.. అప్పుడు కూడా ఆయన రూ.33 కోట్ల ఆస్తులు కొన్నారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఆయనకు పసుపు కరోనా ఏమైనా కాటేసిందా' అని ధ్వజమెత్తారు. ఈ మధ్య ముగ్గురు నలుగురు పెళ్లాలు అంటేనే పవన్ గింజుకుంటున్నారని, మరి వలంటీర్లను ఆయన హ్యూమన్ ట్రాఫికర్స్ అంటే వారికి కోపం రాదా అని ప్రశ్నించారు. 'అన్న చిరంజీవిని పదే పదే అవమానిస్తున్నది పవనే. కానిస్టేబుల్ కొడుకునంటారు గానీ, చిరంజీవి సినిమా భిక్ష పెట్టడం వల్లే పవర్ స్టార్ అయ్యానని ఎక్కడా చెప్పరు. తల్లిని అవమానించిన లోకేశ్, చంద్రబాబుతో జట్టు కట్టిన పవన్ ఈరోజు తల్లిని కూడా అవమానించారు' అని అన్నారు.

ఓటమి భయంతో ఇష్టానుసారం పేలుతున్న పవన్

ఓటమి భయంతోనే పవన్ సీఎం జగన్‌పై ఇష్టానుసారం పేలుతున్నారన్నారు. కాపుల్ని, కార్యకర్తలను కూడా కించపరుస్తున్నారని చెప్పారు. పోటీ చేసిన రెండుచోట్లా ప్రజలు కాళ్ళు, కీళ్ళు విరగ్గొట్టినా పవన్‌కు బుద్ధి రాలేదన్నారు. తనని ఒక్కడినైనా గెలిపించాలని, ప్లీజ్ అంటూ అడుక్కునే పవన్ ఒక పార్టీకి అధ్యక్షుడేనా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల్ని నమ్ముకున్నారని, ప్రజలు కూడా సీఎం జగన్‌ని నమ్మారని తెలిపారు. అందుకే సీఎం జగన్ ఒంటరిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్నందునే సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం జగన్ గెలిచి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

కూటమి కాదది.. కుమ్మక్కు రాజకీయం

టీడీపీ, జనసేన, బీజేపీలది కూటమి కాదని, కుమ్మక్కు రాజకీయమని మహేశ్ ధ్వజమెత్తారు. పోటీ చేసేదంతా చంద్రబాబు మనుషులేనని, పార్టీలే మారతాయని చెప్పారు. జనసేన, బీజేపీ అభ్యర్థులు చంద్రబాబు గుంపులో నుంచి వచ్చిన వారేనన్నారు. ఈ గుంపును హైనాలు, గుంటనక్కలు, తోడేళ్లు అనక ఇంకేమనాలని ప్రశ్నించారు. వాళ్లు ప్రజల కోసం కూటమి కట్టలేదని, ప్రజల ఆస్తులను దోచుకునేందుకు, పేదల నోట్లో మట్టికొట్టేందుకు, భూములు కొట్టేసి రూ.లక్షల కోట్లు సంపాదించేందుకేనని అన్నారు. జనసేన అధ్యక్షుడు పవనే సీఎం అభ్యర్థి అని చాలా కాలం సోషల్ మీడియాలో రాగం తీశారని, తీరా చూస్తే 24 సీట్లల్లో పోటీ చేస్తున్నానని చెప్పారని, ఆ తర్వాత 21 సీట్లతో సరిపెట్టారని, వీటిలోనూ నిజమైన జనసేన కార్యకర్తలకు దక్కింది 11 సీట్లేనని చెప్పారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలు ఇలాగే ఉంటాయని అన్నారు.

చంద్రబాబూ జాగ్రత్తగా మాట్లాడు

- నువ్వేంటో, నీ బతుకేంటో వేలం పెట్టి చూసుకో?
- ఓటమి తప్పదని తెలిసి అసహనంతో నోటికొచ్చింది మాట్లాడకు
- విశాఖను రాజధానిగా సమర్థించని నువ్వు ఉత్తరాంధ్రపై మాట్లాడతావా?
- భావితరాల భవిష్యత్తుకు జగన్ సీఎం కావాలి
- మీడియాతో మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖ సిటీ: 'చంద్రబాబూ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు. ఓడిపోతావని తెలుసుకుని అసహనంతో సీఎం జగన్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడకు. ప్రజలు హర్షించరు. జగన్ ముఖ్యమంత్రి కావడం ఆయనకో.. లేక మంత్రులకో.. ఎమ్మెల్యేలకో.. ముఖ్యంకాదు. భావితరాల భవిష్యత్తుకు.. పిల్లలకు ఉన్నతమైన విద్య.. పేద, మధ్యతరగతి వారికి మెరుగైన వైద్యసేవలు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం అత్యవసరం'.. అని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. లాసెన్స్ బే కాలనీలోని కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగంలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలివ్వాలంటే జగన్ అవసరముందని స్పష్టంచేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు ప్రమాదంలో పడిపోతాయని చెప్పారు. ఉత్తమమైన విద్య, వైద్యానికి ప్రజలు దూరమవుతారని వివరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఓటమి తెలిసే చంద్రబాబులో అసహనం..

చంద్రబాబు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడు. ఆయన భాష, మాట్లాడే తీరును చూస్తే ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ముఖ్యమంత్రిని పట్టుకుని.. నెత్తిమీద అర్ధరూపాయి పెడితే దమ్మిడీకి కొనరంటున్నాడు. ప్రజలు ఛీకొట్టే విధంగా మాట్లాడటానికి చంద్రబాబు సిగ్గుపడాలి. ఆయనకంటే నీచుడు ప్రపంచంలో ఎవరూ ఉండరు.



ఓటుకు కోట్లు కేసులో పారిపోయి వచ్చింది అందుకేగా..

రాజకీయ నేతల తలల మీద ఎంత పెట్టాలో.. ఏ రకంగా వాళ్లను కొనాలో.. బేరాలకు లొంగే నేతల గురించి కొలమానం నీకు తెలుసు. నీకు అంత సామర్థ్యం ఉండబట్టే కదా ఓటుకు రూ.కోట్లు కేసులో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చావు. అంతెందుకు.. అసలు, నీ తల మీద ఉన్న విలువెంతో నీకు తెలుసా? నువ్వొక చెల్లని కాసు కదా.. నిన్ను 2019లో ప్రజలు ఓడించి మూలన కూర్చోబెట్టారు. అలాంటి నువ్వు సీఎం జగన్‌ను పట్టుకుని వేలం వేస్తానంటావా?

విశాఖ రాజధానిగా ఉత్తరాంధ్ర అభివృద్ధే ధ్యేయం..

ఎస్.కోటను విశాఖలో కలపకుండా విజయనగరంలోనే ఎందుకు ఉంచారన్నావు. నీమాటకే వస్తే.. ఎస్.కోటను విశాఖలో కలపడంవల్ల ఏంటి లాభం? మా ఉద్దేశంలో విశాఖ పరిపాలన రాజధానిగా చేసుకుని ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని సమగ్రాభివృద్ధిలోకి తేవడం మా అభిమతం. అసలు విశాఖ అభివృద్ధి చెందకూడదని నువ్వు అడ్డుపడుతున్నావు. విశాఖ రాజధానిగా నువ్వు సమర్థించనప్పుడు ఎస్.కోట గురించి ఎందుకు మాట్లాడుతున్నావు? ఉత్తరాంధ్ర ప్రజలు నువ్వు చెప్పే నంగనాచి మాటల్ని నమ్మేంత అమాయకులేమీ కాదు.

జగన్ సంస్కరణలను మేధావులు అభినందిస్తున్నారు..

విద్య, వైద్య రంగంలో జగన్ తీసుకువచ్చిన సంస్కరణలను అనేకమంది ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అభినందిస్తున్నారు. మన పిల్లలకు మూడో తరగతి నుంచి టోఫెల్ నేర్పిస్తూ.. బేసిక్, జూనియర్, సీనియర్ అంటూ టెస్టులు పెట్టి ప్రభుత్వమే వాళ్లకు ఫీజులు కడుతూ ఇంగ్లిష్ మీడియంను వృద్ధిలోకి తెస్తున్నాం. గతంలో సీబీఎస్ఈ సిలబస్‌తో నడిచే హైస్కూళ్లు రాష్ట్రంలో అన్ని కలిపితే 100 ఉండేవి కాదు. అలాంటిది, ఈరోజు వెయ్యికి పైగా హైస్కూళ్లను సెంట్రల్ సిలబస్‌తో అప్‌గ్రేడ్ చేశాం. ఐబీ విద్యను రాష్ట్ర విద్యా విధానంలోకి తెస్తున్నాం.

జగన్ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు

కాకినాడలో పవన్‌కళ్యాణ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ/పిఠాపురం: రాష్ట్ర ప్రజలు జగన్‌కు అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినా ఆయన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. జనసేన కాకినాడ ఎంపీ అభ్యర్థిగా బుధవారం తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కాకినాడలో నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న పవన్.. జనసేన, టీడీపీ అభ్యర్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికలు కీలకమైనవని, ఒక తరం కోసం జరిగేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఏ ఒక్కటీ ప్రజలకు అందలేదన్నారు. దళితులకు సంబంధించి 27 పథకాలు తీసేశారని చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల్లో అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24కు కుదించారన్నారు. సింహం సింగిల్‌గా వస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారనే విషయాన్ని ప్రస్తావించగా తాము ముగ్గురం కలిసి వస్తున్నామని చెప్పారు. ఐదుకోట్ల మంది ప్రజల భవిష్యత్ కోసం 2014లో మాదిరిగా మూడు పార్టీలు కలిసి వస్తున్నట్లు తెలిపారు. పిఠాపురంలో ఈ రోజు రెండోసెట్ నామినేషన్ వేసినట్లు చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లో తమ కూటమి స్వీప్ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. కాకినాడ నుంచి పోటీచేస్తున్న చలమలశెట్టి సునీల్ తనకు శత్రువు కాదని, తామంతా ఏదో ఒక సందర్భంలో కలుస్తూనే ఉంటామని చెప్పారు.

పవన్‌తో చెట్టాపట్టాలు.. ఉదయ్‌తో తెగతెంపులు

పిఠాపురంలో జనసేన టీడీపీ వర్గ విభేదాలు మళ్లీ రచ్చకెక్కాయి. పిఠాపురం జనసేన ఇన్‌చార్జి, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను వ్యతిరేకిస్తున్న స్థానిక టీడీపీ నేత ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో చెట్టాపట్టాలు కట్టి తిరుగుతున్నారు. జనసేన కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ బుధవారం కాకినాడలో నామినేషన్‌కు టీడీపీ నేతలు డుమ్మా కొట్టారు. దీంతో టీడీపీ, జనసేన విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు పిఠాపురం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు తప్ప టీడీపీకి చెందిన ఒక్కరు వెళ్లకుండా వర్మ అడ్డుకున్నారని జనసేన వారు మండిపడుతున్నారు. పొత్తు ధర్మం పాటిస్తున్నానంటున్న వర్మ మద్దతు ఇవ్వకపోవడం ఆయన కుటిల రాజకీయానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

పైసాకు కూడా పనికిరాని పవన్

- విజయనగరం సభలో నోరుజారి పరువు తీసేసిన చంద్రబాబు
- కరెంటు కోతలున్నాయా అంటే లేవన్న ప్రజలు
- బిత్తరపోయిన బాబు
- రెండు పార్టీల ఉమ్మడి సభలు అట్టర్ ఫ్లాప్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'కనీసం రూపాయి నెత్తిన పెట్టి వేలం వేస్తే ఒక పైసాకు కూడా కొనని వ్యక్తి పవన్ కళ్యాణ్'.. అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు సంయుక్తంగా విజయనగరం నడిబొడ్డున బుధవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో పక్కనున్న పవన్ కళ్యాణ్‌ను వేలెత్తి చూపిస్తూనే చంద్రబాబు తన మనసులో ఉన్న అసలు విషయం బయట పెట్టేశారు. ఎప్పటిలాగే అబద్ధాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శిస్తూ చంద్రబాబు ప్రసంగం



బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాగింది. ఇప్పుడు కరెంట్ కోతలు ఉన్నాయా తమ్ముళ్లా అంటే సభికులు లేవులేవు అంటూ చేతులు ఊపడంతో చంద్రబాబు కంగుతిన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత మళ్లీ తాను తీసుకుంటానని.. విజయనగరంలో హైటెక్ టవర్స్ పెడతానని తెలిపారు. వైఎస్ జగన్‌కు అహంకారం పెరిగిపోయిందని, మామూలు అహంకారం కాదని, ఒళ్లంతా కొవ్వెక్కిందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అందుకే తనను, పవన్ కళ్యాణ్‌ను విమర్శించే పరిస్థితికి వచ్చారని మండిపడ్డారు. పవన్ కాలి గోటికి కూడా సరిపోని వ్యక్తి జగన్ అంటూ దుర్భాషలాడారు. తన ఇంట్లో ఆడవాళ్లను, పవన్ కళ్యాణ్ ఇంట్లో ఆడవాళ్లను బజారుకు ఈడ్చే బజారు రౌడీలు వైఎస్సార్‌సీపీలో ఉన్నారన్నారు. బొత్స సత్యనారాయణ కుటుంబం జిల్లాను దోచేసిందని ఆరోపించారు. బొత్స దోచేయగా మిగిలింది ఊడ్చేయడానికి ఎమ్మెల్యే వీరభద్రస్వామి వచ్చాడన్నారు. ఉత్తరాంధ్రపై విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి పెత్తనమేమిటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో రూ.40 వేల కోట్లు దోచేసిన దొంగలు అని ఆరోపించారు. అంతకుముందు నెల్లిమర్ల నియోజకవర్గంలోని సింగవరం వద్ద సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. 2021లో రామతీర్థంలో రాముడి విగ్రహం తల నరికేశారని, ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు తుగ్లక్ పరిపాలన సాగిందని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడానికే జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తర్వాత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విశాఖ రుషికొండను జగన్ బోడిగా చేశారని, ఎక్కడినుంచో వచ్చిన నేతలు విశాఖను దోపిడీ చేశారని ఆరోపించారు. కాగా చంద్రబాబు, పవన్ సభలు విఫలమయ్యాయి. జనాలు కరువయ్యారు. వచ్చిన కొద్దిమంది జనం కూడా చంద్రబాబు మాట్లాడుతుండగానే వెనుదిరిగారు.

అనపర్తి డ్రామాకు తెర!

- బీజేపీ గూటికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి
- కమలం గుర్తుపై పోటీకి సిద్ధం
- ఫలించిన బాబు, పురందేశ్వరి వ్యూహం

సాక్షి, రాజమహేంద్రవరం: అనపర్తి అసెంబ్లీ స్థానంపై కొన్ని రోజులుగా నడుస్తున్న డ్రామాకు ఎట్టకేలకు తెరపడింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ గూటికి చేరడంతో ఉత్కంఠ వీడింది. విజయవాడలో మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకుని కాషాయ పార్టీలో చేరారు. ఆయన పార్టీలో చేరడంతో అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కమలం గుర్తుపై పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు బీజేపీ బీఫారం సైతం అందుకున్నారు. అనపర్తి సీటు బీజేపీకి కేటాయించిన సందర్భంగా ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. 40 ఏళ్లకు పైగా తమ కుటుంబం టీడీపీలో కొనసాగుతోందని, అంతటి అభిమానం పార్టీపై ఉందని ప్రకటించారు. బాబు సీటు ఇవ్వని పక్షంలో రెబల్ అభ్యర్థిగా సైతం బరిలోకి దిగేందుకు వెనకాడలేదు. నల్లమిల్లి ఇంటింటా ప్రచారంతో బాబు ఆదేశాలను సైతం ధిక్కరించిన సందర్భాలున్నాయి. అనంతరం తనకు టీడీపీ అంటే గౌరవమని, పార్టీ నిర్ణయం మేరకు నడుచుకుంటానని ప్లేటు ఫిరాయించారు. టీడీపీపై అంత గౌరవమున్న వ్యక్తి బీజేపీ కండువా కప్పుకోవడమేంటన్న ప్రశ్న అనపర్తి ప్రజల్లో వెల్లువెత్తుతోంది. తన రాజకీయ లబ్ధికోసం పార్టీ మారడంపై దుమ్మెత్తిపోస్తున్నారు. బాబు, పురందేశ్వరితో నయా డ్రామాకు తెర తీసి మరీ పార్టీ మారడాన్ని బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇందుకు సొంత పార్టీ అభ్యర్థికి సైతం అన్యాయం చేయడంపై పురందేశ్వరిని తప్పుబడుతున్నారు. తన మరిది స్వప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే ఆమె తత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కమలం గుర్తుపై పోటీ చేస్తున్న నల్లమిల్లికి విజయావకాశాలు ఆశించిన మేరకు లేవన్న వాదన రాజకీయ విశ్లేషకుల్లో వెల్లడవుతోంది. ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తామని ప్రకటనలు చేస్తున్న బీజేపీ శ్రేణులు లోలోపల మాత్రం ఓడించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు సమాచారం.

బహుజన పరిరక్షణ సమితితో మాదిగానికి సంబంధం లేదు

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు

సాక్షి, అమరావతి: బహుజన పరిరక్షణ సమితితో మాదిగాని గురునాథానికి సంబంధం లేదని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ, మూడు రాజధానుల ఏర్పాటు కోసం బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్వచ్ఛందంగా ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. బుధవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కావాలని, పేదలకు ఇళ్ల పట్టాల కోసం నాలుగున్నరేళ్లపాటు బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం చేసింది. సీఎం జగన్ స్పందించి ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారు. దీంతో చంద్రబాబు అండ్ కో బహుజనులపై విషం కక్కుతూ కోర్టులో పిటిషన్ వేయించి అడ్డుకుంది. ప్రజాదరణ పొందిన సీఎం జగన్‌ను చూసి ఓర్వలేక.. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలను బాబు టార్గెట్ చేశారు. బాబు ప్యాకేజీకి సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం అమ్ముడుపోయాడు. అందుకే పవన్‌కళ్యాణ్, చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను ఎల్లో మీడియాలో కూర్చొని వల్లె వేస్తున్నాడు. మాదిగాని గురునాథం మానసిక రోగి. త్వరలో టీడీపీ నేతలకు కూడా ఆ విషయం అర్థమవుతుంది. వైఎస్సార్‌సీపీ వద్దనుకున్న వారందరినీ బాబు టీడీపీలో చేర్చుకొని ఎల్లో మీడియా వద్దకు పంపుతున్నాడు. వారితో మాట్లాడిస్తూ బాబు శునకానందం పొందుతున్నాడు' అని పెరికె వరప్రసాదరావు మండిపడ్డారు.

పేరు, ప్రతిష్ఠలను త్యాగం చేయడమే
అన్నింటికీ మించిన త్యాగం.
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 25 ఏప్రిల్ 2024

మానవతకు 200 రోజుల మచ్చ

ఒకటీ, రెండూ కాదు... ఆరు నెలలు దాటింది. మంగళవారంతో ఏకంగా రెండు వందల రోజులు గడిచిపోయాయి. అయినా, పాలెస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆగడం లేదు. సంక్షోభానికి పరిష్కారమూ కనిపించడం లేదు. సామూహిక సమాధులు, కూలిన ఆస్పత్రులు, శిథిలాల కుప్పగా మారిన భవనాలు, ప్రాణాలు పోయిన వేలాది జనం, ప్రాథమిక వసతులు పూర్తి విధ్వంసంతో పాలెస్తీనా బావురుమంటోంది. తీవ్రవాద హమాస్ బృందం తమపై ఆకస్మికంగా దాడి చేసి, 250 మందిని బందీలుగా చేసుకొని, 1200 మంది ప్రాణాలు తీసినందుకు బదులుగా గత అక్టోబర్ 7న సైనిక చర్యకు దిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజాలోని 23 లక్షల జనాభాలో దాదాపు 85 శాతం మంది ఇళ్ళు వదిలి పారిపోయారు. హమాస్ ఏరివేతకని చెబుతూ మొదలుపెట్టిన ఈ పాశవిక, ప్రతీకార దాడిలో ఇప్పటికి 14 వేల పైచిలుకు పసిపిల్లలతో సహా 34 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని లెక్క. నిజానికి, ఆ సంఖ్య ఇంకా ఎక్కువేనని సహాయక సంస్థల అంచనా.

గాజా భూఖండపు ఉత్తర ప్రాంతంపై ఇటీవల ఎన్నడూ లేనంతగా శతఘ్నుల వర్షం కురిపిస్తూ, అక్కడ నుంచి జనాల్ని ఖాళీ చేయమంటున్న ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంత ప్రధాన నగరమైన రాఫాపై దాడికి సర్వసన్నద్ధమవుతుండడం తాజా విషాద పరిణామం. పశ్చిమాసియాలోని ఈ సంక్షోభం అంతకంతకూ పెద్దదవుతూ వచ్చింది. ఇరాన్ సైతం ఇటీవల ఇజ్రాయెల్‌తో ఢీ అనడం పర్యవసానాలపై ప్రపంచం భయపడాల్సిన పరిస్థితి తెచ్చింది. పాలెస్తీనా శరణార్థులకు ఉద్దేశించిన ఐరాస సహాయ సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) ఉన్నా దానికిప్పుడు నిధులు లేని దుఃస్థితి. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి ఆ సంస్థ సిబ్బంది కొందరు సహకరించారని ఇజ్రాయెల్ ఆరోపించింది. దాంతో ఆ సంస్థకు సహాయం అందిస్తున్న 16 దాతృత్వ దేశాలు నిధులు నిలిపివేశాయి. పర్యవసానంగా 45 కోట్ల డాలర్ల మేర నిధుల లోటు ఏర్పడి, వేలాది పాలెస్తీనియన్లు ఈ యుద్ధకాలంలో ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. అయితే ఇజ్రాయెల్‌వి నిరాధార ఆరోపణలని స్వతంత్ర పరిశీలనలో ఈ వారమే తేలింది. అమెరికా సహా ఇతర దేశాలు మానవతా అవసరంగా గుర్తించి, నైతిక బాధ్యతతో యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు ఆర్థిక సాయం పునరుద్ధరించాలని అరబ్ లీగ్ తాజాగా డిమాండ్ చేస్తున్నది అందుకే.


ఇజ్రాయెల్ భీకర దాడుల అనంతరం గాజాలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద 300కు పైగా మృతదేహాలతో బయటపడ్డ సామూహిక భారీ సమాధుల దృశ్యాలు సహజంగానే అంతర్జాతీయ ప్రపంచాన్ని కుదిపివేస్తున్నాయి. ఇజ్రాయెలీ సైనికుల దాడుల్లో అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగిందడానికి సమాధుల్లో కట్టేసిన చేతులతో, వివస్త్రంగా కనిపిస్తున్న శవాలే ప్రత్యక్ష సాక్ష్యం. అనుమానాలకు తావిస్తున్న ఈ సమాధులపై పారదర్శకంగా, స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఐరాస ఇప్పటికే డిమాండ్ చేసింది. యూరోపియన్ యూనియన్ సైతం బుధవారం అదే అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. ఆగని ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో బాధిత పక్షం వైపు అంతర్జాతీయంగానూ క్రమంగా మొగ్గు కనబడుతోంది. పాలెస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించడమే ప్రస్తుత సమస్యకు సత్వర పరిష్కారమని భావిస్తున్నవారి సంఖ్యా పెరుగుతోంది. గాజా సమస్య అంతకంతకూ మానవతా సంక్షోభంగా పరిణమిస్తుండడంతో తాజాగా జమైకా ప్రభుత్వం పాలెస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించడం విశేషం. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనమనే ఐరాస నియమావళి పట్ల నిబద్ధతే ఈ నిర్ణయానికి ప్రేరణ అని జమైకా పేర్కొంది.

ప్రతి 10 నిమిషాలకూ ఓ పసివాడు చనిపోవడమో, గాయపడడమో జరుగుతున్న పాలెస్తీనాలో, ఇప్పటికి కనీసం 75 వేల టన్నుల పేలుడు పదార్థాల తాకిడికి గురై 62 శాతం ఇళ్ళు ధ్వంసమైన భూభాగంలో, ఆహార కరవుతో 11 లక్షల మంది అన్నమో రామచంద్రా అని అలమటిస్తూ రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్న ప్రాంతంలో... సత్వరమే సంక్షోభాన్ని పరిష్కరించి, శాంతి స్థాపన జరపకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. ఒకప్పటి కీలకపాత్రధారి ఐరాస ప్రస్తుతం మాటలే తప్ప చేతలు లేక చేష్టలుడిగి చూస్తోంది. కాల్పుల విరమణకై ఈ ఆరునెలల్లో ఐరాస 4సార్లు తీర్మానాలు చేసినా, అవన్నీ అగ్రరాజ్యాలు మోకాలడ్డడంతో వీగిపోవడం దురదృష్టం. ఐరాసలో అండగా నిలవడమే కాక, ఇజ్రాయెల్‌కు ఆయుధాలిస్తున్న అమెరికా ఆ దేశానికి ఇటీవలే 2600 కోట్ల డాలర్ల సాయం మంజూరు చేసి, శరణార్థులకేమో మొండిచేయి చూపడం పెద్దన్న ద్వంద్వనీతికి దర్పణం. గాజా పోరులో అమెరికా అధ్యక్షుడి విధానాలపై స్వదేశంలోనే నిరసనలు పెరిగాయి. పాలెస్తీనాకు అనుకూలంగా అమెరికాలోని అనేక విశ్వవిద్యాలయాల్లో వేలాది విద్యార్థులు వీధికెక్కడం విశేషం.

పశ్చిమాసియాలో సమస్య పరిష్కారానికి అమెరికా, దాని భాగస్వాములు పాత కథ వదిలి, మళ్ళీ మథనం చేయాలి. భద్రత పరంగా ఇజ్రాయెల్‌కు ఉన్న ఆందోళనల్ని పోగొడుతూనే, పాలెస్తీనా ప్రజల ప్రత్యేక రాజ్య ఆకాంక్షను నెరవేర్చాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నాలు సఫలమయ్యేలా అటు ఇరాన్‌నూ భాగస్వామిని చేసి, శాశ్వత పరిష్కారానికై పాశ్చాత్య ప్రపంచం కృషి చేయాలి. ఇరాన్ సైతం పశ్చిమాసియాలో తన ప్రభావాన్ని విస్తరించుకోవడం కోసం లెబనాన్, గాజా, సిరియా, యెమన్‌లలో పరోక్ష శక్తులకు ఆయుధాలు సమకూర్చి, అండగా నిలిచే పని మానుకోవాలి. ఇలా పాముల్ని పాలుపోసి పెంచడం ఉద్రిక్తతల్ని పెంచే పాపమని గుర్తించాలి. ఈ ప్రాంతంలో 90 లక్షల మంది మన ప్రవాసులున్నందు భారత్ సైతం ఇజ్రాయెల్, అరబ్ దేశాలతో సత్సంబంధాల రీత్యా కీలక భాగస్వాముల్ని ఒక దగ్గరకు చేర్చి, పరిష్కారానికి యత్నించాలి. వాణిజ్యంలో, ఇంధన సరఫరాలో కీలకమైన పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే... ప్రపంచం సుభిక్షంగా ఉంటుంది.

ఏపీ ఉద్యోగులతో ఒక మాట!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

దేశంలోనే అన్ని రంగాల్ని మొట్టమొదటగా ప్రైవేటీకరించడం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. అన్నిటికంటే ప్రమాదకరమైంది – స్కూళ్ళు, జూనియర్ కాలేజీల విద్యా ప్రైవేటీకరణ. దీంతో పేదలకు చదువు దూరమైంది. ఆంగ్లం అందకుండా పోయింది. దీనికి విరుగుడుగా జగన్ నేతృత్వంలో విద్యా, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ వ్యతిరేక మోడల్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. దేశంలోని మొత్తం స్కూలు విద్యను ఎల్‌కేజీ నుండి 12వ తరగతి వరకు ప్రైవేట్ రంగం నుండి ప్రభుత్వ రంగంలోకి మార్చకుండా విద్యా సమానత్వాన్ని తేవడం సాధ్యమా? అందుకే గ్రామాలలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు అట్టడుగు గ్రామీణ శ్రమజీవుల జీవితాలను మార్చడానికి ప్రభుత్వం ఏమి చేస్తున్నదో అర్థం చేసుకోవడం ముఖ్యం.

రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగులు ఎక్కువ ఎటు ఓటు వేశారనేది ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించినప్పుడు తెలుస్తుంది. ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో ఉన్న టీచర్లు – స్కూలు, కాలేజీ, యూనివర్సిటీలలో పనిచేసేవారు ఎటువైపు ఉన్నారు? ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, నర్సులు, సహాయక సిబ్బంది ఎటు ఓటు వేస్తారనేది కూడా ముఖ్యం. వీరితోపాటు గణనీయ సంఖ్యలో ప్రభుత్వ పోలీసు రంగం ఉద్యోగులు కూడా ఎటు ఓటు వేస్తారనేది చాలా ముఖ్యం. ఇక రెవెన్యూ, మున్సిపాలిటీ, సఫాయి శాఖతో పాటు ప్రభుత్వ రంగంలో ఉన్న పర్మనెంటు ఉద్యోగులు ఎటు ఓటు వేస్తారు, ఎవరు గెలవాలనుకుంటారు అనేది చాలా ముఖ్యమైంది. ఇంతకీ ఈ ఉద్యోగుల ఓటు గురించి ఎన్నడూలేని విధంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు చర్చించాలి? దానికొక ముఖ్య కారణమున్నది.

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చంద్రబాబులాగే ఒక రీజినల్ పార్టీ నడిపే ప్రభుత్వం. దేశంలోనే అన్ని రంగాల్ని మొట్టమొదటగా ప్రైవేటీకరించడం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు. అన్నిటికంటే ప్రమాదకరమైంది–స్కూళ్ళు, జూనియర్ కాలేజీల విద్యా ప్రైవేటీకరణ. దాన్ని ఆయన విపరీతంగా ప్రైవేటీకరించి అక్కడినుండి పార్టీ ఫండ్‌ను జమ చేశాడు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున అన్ని రంగాల్లో ఎంట్రెన్సులు, కోచింగ్ సెంటర్లు ప్రారంభమయ్యాయి. ఈ దశలోనే పుట్టగొడుగుల్లా స్కూళ్ళు, జూనియర్ కాలేజీలు, గైడ్ రైటింగ్ కంపెనీలు, అడ్వర్టైజ్ ర్యాంకులు మొదలయ్యాయి. వైద్య రంగంలో కూడా ప్రభుత్వ రంగాన్ని మండలాల వరకు అభివృద్ధి చెయ్యకుండా ప్రైవేట్ హాస్పిటల్స్, ఒక్కొక్క డాక్టరు తన సొంత హాస్పిటల్ కట్టి నడపడం మొదలయ్యాయి. గత ఐదేళ్ళ జగన్ పాలనలో ప్రభుత్వ విద్యా రంగంలో ఇంగ్లిష్ మీడియం పెట్టి, స్కూళ్ళ అభివృద్ధి ప్రారంభించాక స్కూలు విద్యలో ప్రైవేట్ రంగం విద్య బాగా పడిపోయింది. స్కూలు టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రైవేట్ విద్యా వ్యవస్థ వ్యతిరేక అభివృద్ధిని ఎలా చూడాలి? రాష్ట్రంలో మండలం, గ్రామ స్థాయిలో చిన్న, చిన్న ప్రభుత్వ హాస్పిటల్స్ పెరిగి, వాటిని టెలీ మెడిసిన్‌తో ముడేసిన వైద్యం... వైద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకమైందా, కాదా? గ్రామ సెక్రటేరియట్‌ల నిర్మాణం, చిన్న జీతాలతోనైనా 2,50,000 మంది వలంటీర్లను ప్రభుత్వ రంగంలో నియమిస్తే ప్రభుత్వ రంగం విస్తరించినట్టా, ప్రైవేట్ రంగం విస్తరించినట్టా?

నిజంగానే బడ్జెట్ డబ్బులో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంత బీద, దిగువ మధ్యతరగతి రైతాంగానికి, కూలీలకు బదిలీ చేయబడ్డది కనుక ఉద్యోగుల జీతభత్యాల పెరుగుదల ఆగిందనుకుందాం. అయినా ప్రభుత్వ రంగ ఎదుగుదల, ప్రైవేట్ రంగ ఎదుగుదల కోణం నుండి చూసినప్పుడు ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో అమరావతి కట్టడం కోసం కాంట్రాక్టర్లకు ఆ డబ్బు ఇస్తే ఏ రంగం పెరిగేది? అందుకు బదులు



గ్రామీణ అభివృద్ధి ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల అభివృద్ధి జాతీయ వాదంలో కీలకమైంది. ఈ స్థితిలో ప్రభుత్వ రంగ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు ఏ ముఖ్యమంత్రిని కోరుకోవాలి? ప్రభుత్వ రంగాన్ని గణనీయంగా పెంచిన జగన్‌నా, ప్రైవేట్ రంగ అనుకూల బాబునా? మరీ ముఖ్యంగా మోదీల కూటమినా? పవన్ కల్యాణ్‌కి సినిమా రంగం తప్ప ఏ రంగం గురించి తెలియదు. ఆయన మోదీ, బాబు ఏది చెబితే అది చేస్తాడు.

ఉద్యోగస్తులు నిరంతరం ప్రజా జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా తమ జీతాల పెంపు, అనుకూల ట్రాన్స్‌ఫర్, రిటైర్మెంట్ ఏజ్ పెంపు గురించి ఆలోచిస్తే క్రమంగా ప్రభుత్వ రంగాన్ని మూసేసి ప్రైవేట్ రంగ ఎదుగుదలకు ఓటెయ్యడమే. భవిష్యత్ తరాల బతుకుదెరువు గురించి, రాష్ట్ర, దేశ భవిష్యత్ గురించి మాకెందుకు అనుకుంటే ప్రైవేటీకరణను ప్రభుత్వ రంగ ఉద్యోగులే కోరుకోవడం కాదా? ఉద్యోగుల్లో, ముఖ్యంగా టీచర్లు కమ్యూనిస్టు పార్టీలతో ఉండి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తుంటారు. అదే టీచర్లు ఇప్పుడు ఏపీలో ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రభుత్వ రంగంలోకి మారిస్తే, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే, నాడు–నేడు పథకం ద్వారా స్కూళ్ల రూపురేఖలను మారిస్తే ఈ ప్రక్రియకు మద్దతు ఇవ్వాలి కదా! కమ్యూనిస్టు పార్టీలు ఈ నూతన ప్రభుత్వ రంగ అభివృద్ధిని వ్యతిరేకిస్తూ జగన్‌ను ఓడించాలని చూస్తున్నాయి. ఇది విద్యా, వైద్య రంగంలో పెరుగుతున్న ప్రభుత్వ ఆస్తులను వ్యతిరేకించడం కాదా?

కమ్యూనిస్టులు ఏపీలో ఒకవేళ అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ మీడియంను తీసేసి, ఆ బడులను మూసేసి, విద్యా దోపిడీదారులకు అప్పజెబుతారా? భారతదేశంలో అతి పెద్ద ప్రైవేట్ సెక్టార్, విద్యా రంగం. ప్రైవేట్ రంగంలో ఇంగ్లిష్ విద్య పేరుతో చంద్రబాబు మిత్రబృందం వేల కోట్లు దోచుకుంటుంటే జగన్ ప్రభుత్వం ఆ దోపిడీకి అడ్డుకట్ట వేసే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది.

కమ్యూనిస్టులు సైతం ప్రభుత్వ రంగ అభివృద్ధిని వ్యతిరేకిస్తూ, మాతృభాష ప్రాంతీయ వాదానికి తలొగ్గి మళ్ళీ ప్రైవేట్ విద్యా వైద్యానికి ఊడిగం చేస్తే ప్రజలు వీరినెలా నమ్ముతారు? విద్యా, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ వ్యతిరేక మోడల్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. దాన్ని చంపెయ్యడానికి కమ్యూనిస్టులు నడుం కడితే ప్రజలు ఏమైపోవాలి?

ఆరెస్సెస్/బీజేపీ నేతృత్వంలో నడిచే కేంద్ర ప్రభుత్వం కేంద్ర స్థాయి పరీక్షలు, సెంట్రల్ యూనివర్సిటీల ఎంట్రన్స్ ఎగ్జామినేషన్లను హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే రాయనిస్తున్నది. అంటే క్రమంగా హిందీని దేశపు ఉత్పత్తి కులాల పిల్లల మీద రుద్ది, ధనవంతులకు మాత్రమే ప్రైవేట్ ఇంగ్లిష్ అంతర్జాతీయ జ్ఞాన సంపదను అందుబాటులో ఉంచ చూస్తున్నది. ఈ విద్యా విధానాన్ని ఎలా ఎదుర్కోవాలి? దేశంలోని మొత్తం స్కూలు విద్యను ఎల్‌కేజీ నుండి 12వ తరగతి వరకు ప్రైవేట్ రంగం నుండి ప్రభుత్వ రంగంలోకి మార్చకుండా విద్యా సమానత్వాన్ని సాధించగలమా? దేశంలో విద్యా వ్యవస్థని, కనీసం స్కూలు విద్యా వ్యవస్థనైనా ప్రభుత్వ రంగంలోకి మార్చడానికి ప్రభుత్వ టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, మానవ సమానత్వం కోసం పనిచేసేవాళ్ళు సపోర్టు చెయ్యకపోతే ఎలా?

అంతేకాక ప్రభుత్వ ఉద్యోగులు బీద ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్ డబ్బును ఖర్చు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తమ కుటుంబాల గురించే ఆలోచిస్తే ప్రభుత్వ రంగం కూలిపోక ఏమౌతుంది? ఈ సమస్య చాలా కీలకంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ముందు ఉన్నది. దేశంలోనే అన్ని రంగాల్ని పెద్ద ఎత్తున ప్రైవేట్ రంగంలోకి నెట్టిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు ప్రభుత్వ రంగ వ్యతిరేకికే ఓటు వేస్తే జరిగేదేంటి?

గ్రామాలలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు అట్టడుగు గ్రామీణ శ్రమ జీవుల జీవితాలను మార్చడానికి ప్రభుత్వం ఏమి చేస్తుందో చూసి ఆ ప్రభుత్వాన్ని కొనసాగించాలా వద్దా అని నిర్ణయించుకోవాలి. ఉత్పత్తి రంగంలో పనిచేసే ప్రజల జీవితాలను మెరుగుపర్చే ప్రభుత్వం ఉన్నప్పుడు తమ జీతభత్యాల పెంపుదలతో కొంత రాజీపడాల్సి వస్తే కూడా పడాలి. అది ఒక ఉద్యోగి రాష్ట్రానికి, దేశానికి చేసే మేలు. రాజకీయ నాయకులు దోచుకుంటున్నప్పుడు వారిపై పోరాటం తప్పు కాదు. ఉద్యోగులు హక్కులను, ఆత్మగౌరవాన్ని ఎప్పుడు కూడా తాకట్టు పెట్టకూడదు. అయితే, తమ హక్కుల పోరాటం, ఉత్పత్తి రంగంలో పనిచేసే మానవాళిని ఆకలితో మాడ్చటానికో, బీద పిల్లలు ధనవంతుల పిల్లలతో పోటీపడి ఎదిగే జీవితాన్ని అడ్డుకోవడానికో చెయ్యడం మహానేరం. ఈ మాట 38 సంవత్సరాలు ప్రభుత్వ రంగంలో పనిచేసిన వ్యక్తిగా చెబుతున్నాను. ప్రతి ఉద్యోగి, ఓటరు, పౌరుడు దిక్కు లేని వారికి దిక్కుగా నిలబడాలి. అందుకే 2024 ఎన్నికల్లో వాళ్ళ ఓటు వాళ్ళ జీవిత లక్ష్యాన్ని సూచిస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సంపాదించుకోవద్దా?



లెఫ్ట్ పార్టీల కంటే లెఫ్ట్ పార్టీలా ధ్వనిస్తోంది కాంగ్రెస్. వారసత్వ పన్ను అనేది దారుణమైన ఆలోచన. పైగా సంపాదించే మనుషులు చెడ్డవాళ్లన్న భావన కలిగిస్తున్నారు. కష్టపడి సంపాదించడంలో ఏ చెడూ లేదు. ఇది ఎలాంటి సందేశం ఇస్తున్నదో కాంగ్రెస్ సరిచూసుకోవాలి.

– నిధి రాజ్‌దాన్, కాలమిస్ట్

మంచి ఆలోచనే!



ఎనభై కోట్ల మంది జనాలు రేషన్ మీద బతకాల్సిన పరిస్థితి ఉన్న దేశంలో వారసత్వ పన్ను అనేది చెడ్డ ఆలోచనేమీ కాదు. ఒకవేళ వాళ్ల డబ్బులు దొంగిలిస్తారని ధనికులకు జీజేపీ చెబుతుంటే, ఇండియా కూటమి పేదల దగ్గరికి వెళ్లి దానికి వ్యతిరేకంగా చెప్పాలి.

– అలీశాన్ జాఫ్రీ, జర్నలిస్ట్

మీ వైఖరేమిటి?



వారసత్వ పన్ను లాంటిదేదీ తెచ్చే ఆలోచన కాంగ్రెస్‌కు లేదు. నిజానికి, రాజీవ్ గాంధీ ఎస్టేట్ డ్యూటీని రద్దుచేశారు. చెప్పాలంటే, ఫైనాన్స్ మీద పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా ఉన్న బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా అమెరికా మాదిరి 55 శాతం వారసత్వ పన్ను కోసం గట్టిగా వాదించారు. దీనిమీద ప్రధాని వైఖరేమిటో చెప్పాలి.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ


సురక్షితమా?



క్యాన్సర్ కలిగించే క్రిమిసంహారిణి ఎథిలీన్ ఆక్సైడ్ కారణంగా, ఎండీహెచ్, ఎవరెస్ట్ మసాలా వారి నాలుగు ఉత్పత్తులను సింగపూర్, హాంగ్‌కాంగ్ నిషేధించాయి. గత కొన్ని వారాల్లోనే మనకు బోర్న్‌వీటా వివాదం, నెస్లే సెరెలాక్ వివాదం, పతంజలి వివాదం, ప్రొటీన్ పౌడర్ స్కామ్ జరిగాయి. మనం ఆహార సంక్షోభంలో ఉన్నామనేది స్పష్టం.

– రేవంత్ హిమత్‌సింగ్కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఉండకూడని విషం



గర్వం అనేది శక్తిమంతమైన విషం: మంచితనంతో నిండిన పూర్తి జీవితాన్ని కూడా ఒక్క చుక్క పాడు చేయగలదు. ఒక మనిషి పర్వతమంతటి మంచి పనులు చేసివుండొచ్చు, కానీ వాటిని మనం ప్రశంసల కోసమే చేసివుంటే, మనల్ని మనం ధర్మశీలురమని చెప్పుకోలేం.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

ఇన్ బాక్స్

ఎన్‌కౌంటర్ల పేరిట ఊచకోత?

2024 ఎన్నికలను మావోయిస్టు రహిత భారత్‌లో జరుపుతామని ప్రకటించి విఫలమైన కేంద్రంలోని భాజపా పాలకులు ఎన్నికలలో ఓట్ల సాధనే ధ్యేయంగా నక్సల్స్ అణచివేత క్యాంపెయిన్ పేరుతో ఆదివాసీలను హత్య చేస్తున్నారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ జనవరి నుండి ఏప్రిల్ 14వ తేదీ వరకు మన దేశ భద్రతా బలగాలు జరిపిన దాడులలో 79 మంది మావోయిస్టులు చనిపోయారనీ మళ్ళీ భాజపాకు అధికారం ఇస్తే రానున్న రెండేళ్లలో నక్సలైట్లను దేశంలో పూర్తిగా నిర్మూలిస్తామనీ తెలిపారు. దండకారణ్య ప్రాంతంలో భద్రత బలగాల చేతిలో చనిపోతున్న మావోయిస్టులలో నూటికి తొంబై మంది ఆదివాసీలే వుంటున్నారు. అంతే కాదు, చనిపోయిన మావోయిస్టులంతా ఈ దేశ వాసులు. వీరంతా తమ అస్తిత్వ సమస్యల పరిష్కారానికి నక్సలిజంను మార్గంగా ఎంచుకున్నవారే. దేశంలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం వంటివి దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇండియాలో నాణ్యమైన ఆహారం దొరకక ఏడాదికి 17 లక్షల మంది చనిపోతున్నారని అధ్యయనాల్లో తేలింది.

దేశంలో సమస్యలు ఏవీ లేనట్లు నక్సలిజమే పెద్ద సమస్య అన్నట్లుగా మానవ హక్కుల ఉల్లంఘనకు కేంద్ర పాలకులు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ–మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–జార్ఖండ్ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్, సూర్య శక్తి, అంతిమ దశ పేరుతో షెడ్యూల్ ఐదు ఏజెన్సీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్ల పేరిట ఆదివాసీల ఊచకోతకు పాల్పడుతున్నారు. ఆదివాసీల నివాస ప్రదేశాలలో, పని ప్రదేశాలలో ఎయిర్ బాంబింగ్ వైమానిక దాడులు చేస్తున్నారు. ఈ ఐదు రాష్ట్రాల ఆదివాసీ ప్రజలు ఏనాడు కూడ మాకు మావోయిస్టులతో ఇబ్బందిగా వుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేయలేదు. వారు తమ గ్రామాలలో బహుళజాతి సామ్రాజ్యవాద కంపెనీలు చేస్తున్న అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. వారికి చెందాల్సిన రాజ్యాంగ హక్కులు అమలు చేయాలని మాత్రమే అడిగారు. మరి కేంద్ర రాష్ట్ర పాలకులు అనాదిగా ఆదివాసీలు లేవనెత్తుతున్న సమస్యలు పరిష్కరించకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో వారినే చంపడం, అడవి తల్లి ఒడిని రక్తసిక్తం చేయడం ఎవరి మెప్పుకోసం?

నేడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసీల బ్రతుకులు ఛిద్రం అవుతున్న సందర్భంలో పొట్ట చేత పట్టుకొని సొంత నేలను విడిచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దేశ వ్యాప్త సార్వత్రిక ఎన్నికల వేల ప్రజల దృష్టిని మరల్చడం కోసం 'ఆపరేషన్ కగార్' దాడులు పాలకులు జరిపించారనడం అతిశయోక్తి కాబోదు. నక్సలైట్ల ఆచరణతో మాకు ఏకీభావం లేనప్పటికీ వారు లేవనెత్తుతున్న ప్రజల సమస్యలను మాత్రం చర్చించ దగినవని భావిస్తున్నాం. విద్యార్థులుగా మేము పాలకుల ముందు ప్రతిపాదిస్తున్న అంశాలు: మధ్య భారతంలో యుద్ధం నిలిపివేసి శాంతి నెలకొల్పాలి. ఐదవ షెడ్యూల్ అటవీ ప్రాంతాలలో పోలీసు క్యాంపులు ఎత్తివేసి సైన్యాన్ని వెనక్కి పిలవాలి. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి. ఆదివాసీల హక్కులను రక్షించి వారి సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఇవ్వాలి.

– ప్రశాంత్ పగిళ్ళ, స్టూడెంట్స్ ఫర్ పీస్ అండ్ లిబర్టీ కన్వీనర్, ఓయూ

యువనేత జైత్రయాత్ర!

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

పట్టుదల, దీక్షా దక్షతలు కలిగిన యువనేత జగన్ ఆంధ్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నారు. 'మేమంతా సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత నెల 27న ఇడుపులపాయలో ప్రారంభించిన బస్సు యాత్ర 23 జిల్లాల గుండా సాగి ఏప్రిల్ 24న శ్రీకాకుళం జిల్లాలో దిగ్విజయంగా ముగిసింది. ఈ యాత్రకు ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింది. ఈ రోడ్‌షోలు కూటమి నేతల వెన్నులో వణుకు పుట్టించాయి. యువ నేతకు ప్రజల నుండి వస్తున్న అపూర్వ ఆదరణ చూసి ఓర్వలేక ఆయనపై హత్యాయత్నానికి తెగబడ్డప్పటికీ వెరవ లేదు. నుదిటిపై తీవ్ర గాయమైనా చెదరని సంకల్పంతో సీఎం జగన్ తనయాత్ర కొనసాగించారు.

తన తండ్రి చనిపోయిన సందర్భంలో ఢిల్లీ పీఠాన్ని ఎదిరించి ఓదార్పు యాత్ర చేసినా, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వేలాది కిలోమీటర్ల మేర కాలినడకన ప్రజా సంకల్ప యాత్ర చేసినా, ముఖ్యమంత్రి పీఠమెక్కి రాష్ట్రాన్ని జనరంజకంగా పాలించినా, ఎన్నికల ప్రచారం కోసం 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేసినా... వీటన్నింటిలోనూ ఒక ఆర్ద్రత, ఒక ఆప్యాయత, ఒక ఆత్మీయ మేళవింపు, కుటుంబ సభ్యుడితో మాట్లాడిన అనుభూతి కనిపిస్తున్నాయి. ఫలితంగా మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ఏకపక్షంగా మారిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

ఈ యాత్ర సమయంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీల నుండి 221 మంది రాష్ట్ర స్థాయి నేతలు సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒకవైపు బస్సు యాత్రకు ప్రజల నుండి వస్తున్న ఆదరణ, మరో పక్క తమ పార్టీలోని ముఖ్య నేతలు వైఎస్సార్ సీపీలో చేరడం వంటివి ప్రతిపక్ష పార్టీలకు మింగుడుపడడం లేదు. దీంతో బస్సు యాత్ర ఆపేందుకు కుటిల యత్నాలు చేశారు. ముఖ్యమంత్రిపై దాడిచేస్తే బస్సు యాత్రకు బ్రేక్ వేయవచ్చన్న దుర్బుద్ధితో వారు చేసిన ప్రయత్నాలకు జగన్ వెరవలేదు. ఈ క్రమంలోనే దత్తపుత్రుడి చరిష్మా తగ్గిందని భావించిన పసుపు నేత చిరంజీవి అనే ముఖాన్ని మళ్లీ ప్రజల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసి బొక్క బోర్లా పడ్డారు.



అన్నింటికంటే మిన్నగా బస్సుయాత్ర మొదలైనప్పటి నుండి వలంటీర్ల వ్యవస్థ మీద విషం చిమ్మడం ద్వారా జగన్ ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారం చేసే ప్రయత్నానికి తెర తీశారు. అయితే అదికాస్తా తిరిగి వారి మెడలకే చుట్టుకోవడంతో పాలుబోని పరిస్థితి నెలకొంది. దురదృష్టవశాత్తూ వలంటీర్‌గా పనిచేస్తున్న గీతాంజలి అనే ఒక ఆడబిడ్డ ప్రాణాలు తీసుకునేలా పచ్చ బ్యాచ్ బరితెగించింది. వలంటీర్ల వ్యవస్థ మీద చేయకూడని ఆరోపణలు చేసిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే తాము కూడా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పారు. మరో అడుగు ముందుకేసి వారి గౌరవ వేతనం రూ. 5 వేల నుండి రూ. 10 వేలకు పెంచుతామంటూ ఉత్తుత్తి హామీలు ఇచ్చారు.

అన్నింటికంటే ముఖ్యమైన విషయాన్ని ప్రజలు ఇప్పుడు సర్వత్రా చర్చించుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ జగన్ ఉచితాలు ఇచ్చి ప్రజలను సోమరిపోతులు చేశారన్న చంద్రబాబు... తీరా ఎన్నికలు వచ్చేటప్పటికి ఇప్పుడున్న సంక్షేమానికి మించి తాము సంక్షేమాన్ని అందిస్తామంటున్నారు. ముస్లిమ్‌ల రిజర్వేషన్‌పై మిత్రపక్షమైన బీజేపీ చేస్తున్న ప్రకటనలను కనీసం ఖండించలేని దుఃస్థితిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేస్తామని ఒక్క మాట కూడా ఈ కూటమి నాయకులు ఎవరూ అనక పోవడమూ గమనార్హం. ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి జిమ్మిక్కులూ, అబద్ధాలూ, కుయుక్తులూ, విషప్రచారాలూ చాలానే ఉన్నాయి.

ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో అవకాశవాద రాజకీయాలు ఒకవైపు, చిత్తశుద్ధి – అంకిత భావంతో కూడిన రాజకీయాలు ఇంకోవైపు ఉన్నాయని సామాన్య ప్రజలు అర్థం చేసుకున్నారు. పేదలు – పెత్తందార్ల మధ్య ఇప్పుడు యుద్ధం జరుగుతోందని ప్రతిపక్ష కూటమి చర్యలు మరోసారి రుజువు చేశాయి. ముఖ్యమంత్రి జగన్ తాను ఇప్పటివరకూ ప్రజలకోసం చేసిన పనులూ, మళ్లీ తిరిగి అధికారంలోకి వస్తే చేయనున్న పనుల గురించి తప్ప మరో మాట మాట్లాడటం లేదు. అలా ఆయన ప్రజల మనసులు గెలుచుకోగలిగారు. ఇదే వైసీపీ విజయం సాధించడానికి మూలమంత్రంగా మారనుందనడంలో ఎటువంటి సందేహం లేదు.


వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు । 98481 05455

పూజ–ఆచార వ్యవహారాలు

ఆచార పద్ధతులు, ధ్యానము, 'నేను ఎవరిని?' అని తెలుసుకొనుటకు ప్రయత్నించటం, దివ్యనామ సంకీర్తనం, ఏ విధంగా ఆత్మాన్వేషణకు తోడ్పడతాయో... అదే విధంగా ఆచార వ్యవహారాలు, పూజ కూడా తోడ్పడతాయి. మానవులకు సుఖశాంతులను అనుగ్రహించుటలో పూజలు, హోమాలు, ఉపవాసాలు, అన్నదానం వంటివి చాలా ముఖ్యమైనవి.

నిరాకారుడైన దేవుని ఒక విగ్రహంగా లేక సాలిగ్రామంగా లేక శివలింగంగా పూజించడం సంప్రదాయం. నిరాకారాన్ని పూజించడం చాలా కఠినం. అది మందబుద్ధిగలవారికి ఉపద్రవం తెచ్చిపెడుతుంది. కనుక భగవంతుని నిరాకారునిగా కాకుండా, సాకారునిగా పూజించడం సులభం. ఈ విధానంలో భక్తుడు తన మనస్సును దేవునిపై లగ్నము చేసుకోవచ్చు. ఆధ్యాత్మిక విషయాలన్నీ చిత్తాన్ని పరమాత్మునిలో ఐక్యం చేయాలని తెలుపుతున్నాయి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

జీవితంలో సుఖ, సంతోషాలు పొందటానికి తనకు తానుగా నియమ నిబంధనలను విధించుకోవడం ప్రతి వ్యక్తికీ ఎంతైనా అవసరం. నియమ నిబంధనలు ఉన్నప్పుడే ఏ విషయానికైనా సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. మానవ శరీరం ఒక దేవాలయం. మనస్సు సహజంగానే చంచలమైంది. శరీరం, మనస్సులను ఉన్నతమైన జీవిత సూత్రాలకు లోబడి ఉండేట్లు చేయాలి. ఆ విధంగా చేసినప్పుడు అవి క్రమంగా, నెమ్మదిగా నిర్మలమవుతాయి.

నిర్మలత్వాన్ని పొందటానికి ఆధ్యాత్మిక పరమైన ఆచరణలు ఉన్నాయి. అటువంటివాటిలో నామసంకీర్తన, పూజ, హోమం, శాస్త్ర పఠనం, ప్రాణాయామం, యోగాసనాలు వంటివి కొన్ని. ఏ వ్యక్తి స్వభావానికి ఏది సరిపోతుందో, దానిని అనుసరించి హృదయపూర్వకంగా సాధనచేయడం ప్రారంభించాలి. ఇటువంటి సాధనను పట్టుదలతో కొనసాగిస్తే మనస్సు, శరీరం క్రమంగా శుద్ధమవుతాయి. అందువల్ల ఆత్మానుభవాన్ని పొందడానికి మార్గం ఏర్పడుతుంది.

ఆధ్యాత్మిక జీవనంలో 'సత్సంగం' కూడా ముఖ్యమైనదే. దివ్యనామ సంకీర్తన, దేవుని అనంత మహిమలను కీర్తించుట, ఆధ్యాత్మిక సంబంధమైన విషయాలను గూర్చి సుదీర్ఘ సంభాషణలు వంటివి సత్సంగంలోని కొన్ని ముఖ్య లక్షణాలు. ఇటు, అటు తిరుగాడెడి మనస్సును భగవంతునివైపు మళ్ళించడానికి సత్సంగం దోహదపడుతుంది. చాలా మంది శాస్త్రాలు చదివి అర్థం చేసుకొనే శక్తిలేనివారు ఉన్నారు. లేదా వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక విషయాలందు ఆసక్తి చూపించలేకపోతున్నారు. అటువంటివారు తమ మనస్సును భగవంతునిపై లగ్నం చేసుకోవడానికి సత్సంగం ఒక ప్రభావశాలియైన మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.5.39 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** విశాఖ రా.1.24 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.5.53 నుండి 7.33 వరకు, తదుపరి తె.5.35 నుండి 7.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.52 నుండి 10.40 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ప.3.55 నుండి 5.36 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటూ..

- మోకాళ్లపై 150 మెట్లు ఎక్కిన అభిమాని



కోట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ తిరుపతి జిల్లాలోని కోట మండలం కొత్తపాళెంకు చెందిన మద్దూరి స్వరూప్ వినూత్నంగా తన ఆకాంక్షను చాటిచెప్పాడు. ఈ క్రమంలో చెన్నైలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సెయింట్ థామస్‌మౌంట్ చర్చికి ఉన్న 150 మెట్లను మండుటెండలో మోకాళ్లపై ఎక్కి మంగళవారం దేవునికి ప్రార్థించారు.

గన్నవరంలో వంశీ పేరుతో సరిపోలిన వ్యక్తి నామినేషన్

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ పేరుతో సరిపోలిన మరో నామినేషన్ దాఖలైంది. వల్లభనేని మోహన్‌వంశీకృష్ణ అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చే కుట్రలో భాగంగానే వంశీమోహన్ పేరుతో సరిపోలిన వ్యక్తితో ప్రతిపక్షాలు ఈ నామినేషన్‌ను దాఖలు చేయించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాదిగల ద్రోహి చంద్రబాబుకు బుద్ధిచెప్పాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



కడప రూరల్: మాదిగలను నిలువునా మోసగించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో చంద్రబాబు చెప్పు కుట్టి..డప్పు కొట్టారు.. అధికారంలోకి వచ్చాక మాదిగలను నిలువునా ముంచి చరిత్ర హీనుడిగా మిగలారన్నారు. కాగా మాదిగ జాతిని మోసగించిన చంద్రబాబుకు మందకృష్ణ మాదిగ మద్దతు తెలపడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. కాగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఉద్యమాలను చేసిన వారిపై కేసులు బనాయించిన ఘనత చంద్రబాబుకు మాత్రమే దక్కిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక మాదిగల సంక్షేమంలో చలనం వచ్చిందన్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేకంగా మాదిగలకు ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించారని తెలిపారు.

అంతర్జాతీయ మోసగాళ్లు బాబు, మంద కృష్ణ

- నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు

కడప రూరల్: అంతర్జాతీయ మోసగాడిగా ప్రసిద్ధుడైన టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి.. మందకృష్ణ మాదిగ ఇప్పటికీ మాదిగలను మోసగించే ప్రయత్నాలు చేయడం దారుణమని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా చేపట్టిన చైతన్య యాత్ర కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పరిశపోగు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మాదిగ వర్గీయుల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నిండాయన్నారు. తన పాలనలో మాదిగలకు 22 వేల ఉద్యోగాలొచ్చాయని చంద్రబాబు పచ్చి అబద్ధమాడుతున్నారని చెప్పారు. అయితే కేవలం 4,200 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని, అందులోనూ ఎస్సీ వర్గీకరణ ఉన్నా..లేకున్నా ఆ ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఎస్సీ వర్గీకరణ అంశం కేవలం కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు పరిధిలో ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ చొరవతో మాదిగవాడల శ్మశానవాటికలకు 50 సెంట్లకు పైగా స్థలాన్ని కేటాయించారన్నారు. అలాగే విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మాదిగ బిడ్డలు సరస్వతీ పుత్రులుగా ఎదుగుతున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కేవలం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమవుతుందన్నారు. అందుకే తాము వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించడమే గాక రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ మాదిగలను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరుడాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మాదిగలంతా సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని తెలిపారు.

రాజీనామాలు వలంటీర్ల వ్యక్తిగతం

వారి రాజీనామాలను ఆమోదించకుండా ఆదేశాలివ్వడం సాధ్యం కాదు

- పోస్టులో ఉన్నంత వరకే వలంటీర్లపై మాకు అధికారం
- రాజీనామా తరువాత ప్రైవేటు వ్యక్తులు అవుతారు
- నచ్చిన విధంగా ఉండే స్వేచ్ఛ వారికి ఉంది
- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలన్న హైకోర్టు
- తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి: రాజీనామాలు వలంటీర్ల వ్యక్తిగత వ్యవహారమని, అందువల్ల వారి రాజీనామాలను ఆమోదించకుండా తాము ఆదేశాలివ్వడం సాధ్యం కాదని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం హైకోర్టుకు నివేదించింది. రాజీనామా చేయడానికి వీల్లేదని నియామక నిబంధనల్లో ఉంటే తప్ప ఎవ్వరినీ రాజీనామా చేయవద్దంటూ ఆదేశాలు ఇవ్వలేమని ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వివరించారు. వలంటీర్ పోస్టులో ఉన్నంత వరకే వారిపై తమకు అధికారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజీనామాల తరువాత వలంటీర్లు ప్రైవేటు వ్యక్తులు అవుతారని, నచ్చిన విధంగా ఉండే స్వేచ్ఛ వారికి ఉందని వివరించారు. పిటిషనర్ అభ్యర్థన చాలా విచిత్రంగా ఉందని, వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వాన్ని తాము ఆదేశించాలని కోరుతున్నారని, ఆ పని తామెలా చేయగలమని ప్రశ్నించారు. ఈ వివరాలన్నింటితో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నెల 22 వరకు 62,571 మంది వలంటీర్లు రాజీనామా చేశారు

ఎన్నికలు పూర్తయ్యేంత వరకు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ బుధవారం మరోసారి విచారణ జరిపారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. గత నెల 18 నుంచి ఈ నెల 22వ తేదీ వరకు 62,571 మంది వలంటీర్లు రాజీనామా చేశారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు 929 మంది వలంటీర్లను తొలగించామన్నారు. వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచుతూ ఉత్తర్వులిచ్చామని, పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకుండా సర్క్యులర్లు జారీ చేశామన్నారు. ఇప్పుడు వారి రాజీనామాలను ఆమోదించకుండా ప్రభుత్వాన్ని తాము ఆదేశించాలని పిటిషనర్ కోరుతున్నారని, ఇదెలా సాధ్యమని అన్నారు.

ఇప్పుడు వలంటీర్లు ఖాళీగా ఉన్నారు

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లకు ఎలాంటి పనులు అప్పగించలేదన్నారు. వారు ఖాళీగా ఉన్నారని, అయినా వారికి గౌరవ వేతనం చెల్లిస్తూనే ఉన్నామన్నారు. దీని వల్ల ఖజానాపై భారం పడుతోందని వివరించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేష్ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని అధికరణ 324 కింద ఎన్నికల సంఘం ఎలాంటి ఆదేశాలైనా ఇవ్వొచ్చన్నారు. వలంటీర్లు రాజీనామా చేసి అధికార పార్టీకి సహకరిస్తామంటే ఎలా అని ప్రశ్నించారు.

టీచర్లను ప్రభుత్వ వ్యతిరేకులుగా చిత్రీకరించడం తగదు

ఈనాడు కథనంపై ధ్వజమెత్తిన ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు: తమ ప్రమేయం లేకుండానే తమ పేర్లతో ఈనాడు అవాస్తవాలు ప్రచురించిందని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు ఓ ప్రకటన విడుదల చేశారు. 'జగన్ మాట.. నీటిమూట' అంటూ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్టు చిత్రీకరిస్తూ ఈ నెల 16న ఈనాడులో కథనం వచ్చిందని తెలిపారు. వాస్తవానికి తాము ఎన్నడూ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను విమర్శించలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఈనాడు తమ ప్రమేయం లేకుండానే ఫొటోలు వాడుకుని పూర్తిగా అవాస్తవాలు రాసిందని పేర్కొన్నారు. వాటిని ఉపాధ్యాయ సంఘాల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అవాస్తవాలతో ప్రచురించిన కథనాన్ని ఈనాడు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. తప్పుడు కథనాన్ని ఖండించిన వారిలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి జి.రామమోహన్ ఉన్నారు.

వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు బాబే

- మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ
- ఆ సమయంలో చంద్రబాబు తీరుపై పలు అనుమానాలు
- టీడీపీ హయాంలోనే బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయం



రాజమహేంద్రవరం సిటీ : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద హత్య కేసులో ప్రధాన నిందితుడు ఆనాటి ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆ నాటి సీఎం చంద్రబాబు వ్యవహరించిన తీరుపై పలు అనుమానాలున్నాయన్నారు. కడపలో ప్రతిష్టాత్మకమైన ఆ కుటుంబాలకు సంబంధించిన సమాచారం అంతా ఎప్పటికప్పుడు ప్రభుత్వం వద్ద ఉంటుందన్నారు. ఇంటిలిజెన్స్, నిఘా వ్యవస్థలు, బలమైన పోలీసు యంత్రాంగం అంతా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు చెప్పే వరకూ హత్య విషయం ప్రభుత్వం తెలుసుకోలేక పోవడం విచారకరమన్నారు. వివాదాలు నెలకొన్న సందర్భంగా ముందస్తుగా వివేకానందరెడ్డికి గన్‌మేన్‌లను ఏర్పాటు చేసి భద్రత కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కారంచేడు, నీరుకొండ, గరగపర్రు, పాత తుంగపాడు తదితర ఘటనలన్నీ టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగినవేనని ధ్వజమెత్తారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడం లేదని, మద్యం, డబ్బు ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ జరగలేదా.. ఆ నాడు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే సీతానగరం నుంచి ఇసుక తరలిపోయిందని చెప్పారు. బెల్టు షాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా విక్రయించింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనేనని ధ్వజమెత్తారు. ఈ నెల 25న తన రాజకీయ జీవిత ప్రణాళిక విడుదల చేస్తానని హర్షకుమార్ ప్రకటించారు.

నయనానందకరం దుర్గామల్లేశ్వరుల నదీ విహారం





కృష్ణా నదిలో తెప్పోత్సవం, తరలి వస్తున్న స్వామి, అమ్మవార్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న చైత్రమాస బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లకు పవిత్ర కృష్ణానదిలో బుధవారం నిర్వహించిన తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. తొలుత మహా మండపం వద్ద శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు పూజలు నిర్వహించగా, ఈవో కె.ఎస్.రామారావు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గామల్లేశ్వర స్వామి వారు దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫంట్‌పై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆశీనులను చేసి పూజలు జరిపారు. అనంతరం పవిత్ర కృష్ణవేణి మాతకు హారతులిచ్చి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించిన ఫంట్‌పై ఆది దంపతులు ముల్లోకాలకు గుర్తుగా మూడు పర్యాయాలు నదీలో విహరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అశ్వవాహనంపై పట్టాభిరాముడి దర్శనం



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీకోదండ రామయ్య బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి వారు అశ్వ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. కోలాటాలు, చిలక నృత్యాలు, చెక్కభజనలు, కేరళ వాయిద్యాల నడుమ వాహన సేవ నిర్వహించారు. తొలుత ఉదయం ఏడు గంటలకు కాళీయమర్దన అలంకారంలో గ్రామోత్సవం, మధ్యాహ్నం సీతాలక్ష్మణసమేతుడైన శ్రీరాముడికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆరు గంటలకు ఊంజల్ సేవ జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓ లారీని ఓవర్‌టేక్ చేయబోయి మరో లారీని ఢీకొన్న కారు

- ఏలూరుకు చెందిన ముగ్గురి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- కావలిలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కావలి: ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న కంటైనర్ లారీని ఓ కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత పడగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలంలో చోటుచేసుకుంది. కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు కథనం మేరకు.. ఏలూరు వైఎస్సార్ నగర్‌కు చెందిన కుమార్ (45), జ్యోతి (38), సిరి అలియాస్ రాజీ (38) వన్‌గ్రామ్ గోల్డ్, ఇమిటేషన్ జ్యూవెలరీ వ్యాపారం చేస్తుంటారు. వస్తువుల కోసం చెన్నైకి కారులో వెళ్లారు. తిరిగి ఏలూరుకు బయలుదేరిన క్రమంలో బుధవారం తెల్లవారుజామున ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో ముందు వెళ్తున్న లారీని కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న కంటైనర్ లారీని వేగంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న కుమార్, జ్యోతి, సిరి అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవర్ జిలానీ, కుమారి అనే మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో వారిని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. కుమారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా కారులో నుంచి మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

అంతర్జాతీయ స్థాయిలో ఆంగ్ల మాధ్యమ బోధన

- విజ్ఞానాభివృద్ధికి టోఫెల్, ఇఫ్లూ, కేంబ్రిడ్జ్ సహకారం
- కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాబోధనలో అంతర్జాతీయ స్థాయి మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమ బోధన ప్రవేశపెడుతున్నట్లు రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. గురువారం గుంటూరులో ప్రభుత్వ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ త్రూ యాక్టివిటీ బేస్ట్ మెథడ్స్, ఓరియంటేషన్ వర్క్‌షాప్ ఆన్ యూజింగ్ స్కిల్ కోర్స్ బుక్ ఇంగ్లిష్ ప్రో-1' అనే అంశంపై అధ్యాపకులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో అత్యున్నత ప్రమాణాల బోధన ద్వారా సమూల మార్పులు తెస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ద్వారా నిష్ణాతులైన అధ్యాపకులచే మూడు, నాలుగు సెమిస్టర్‌లకు సంబంధించిన వర్క్‌బుక్స్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే టోఫెల్, ఇఫ్లూ, కేంబ్రిడ్జ్ వంటి సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. తద్వారా విద్యార్థులు ఆంగ్ల మాధ్యమపై పూర్తిస్థాయి పట్టు సాధిస్తూ సొంతంగా కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకుంటూ సమగ్ర విద్యార్థులుగా ఎదుగుతారన్నారు. కళాశాల విద్య ఓఎస్డీ డాక్టర్ కోగంటి విజయబాబు రాసిన 'ప్రజెంటేషన్ ఆన్ స్టూడెంట్స్ వర్క్ బుక్', ప్రభుత్వ మహిళా కళాశాల ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ కె.పద్మజ రాసిన 'ప్రజెంటేషన్ ఆన్ టీచర్స్ మాన్యువల్' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయా పుస్తకాలను డాక్టర్ మణికుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ ఫరీదా బేగం, డాక్టర్ మోహన్ వల్లి సమీక్షించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ కళాశాల వేదికగా నిర్వహించిన వర్క్‌షాప్‌కు 284 మంది అధ్యాపకులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ తులసి మస్తానమ్మ, ఆర్జేడీ డాక్టర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ఆర్ఎంటి టీకా రామన్

తిరుమల: తిరుమల శ్రీవారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కయ్యానికి కాలుదువ్వుతున్న టీడీపీ

- గుంటూరు జిల్లాలో టీడీపీ నేతల అత్యుత్సాహం
- మంత్రి రజిని ఇంటిపై దాడికి ప్రయత్నం
- పొన్నూరు ఆర్వో కార్యాలయంలోకి దూసుకెళ్లిన ధూళిపాళ్ల అనుచరులు



మంత్రి రజిని నివాసంపై దాడికి ప్రయత్నిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/పట్నంబజారు: టీడీపీ నాయకులు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి అడుగడుగునా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారు. క్షణంక్షణం కయ్యానికి కాలు దువ్వుతున్నారు. ఈ క్రమంలో బుధవారం గుంటూరు శ్యామలానగర్‌లోని మంత్రి విడదల రజిని ఇంటిపై పథకం ప్రకారం దాడికి ప్రయత్నించారు. టీడీపీ ప్రచార రథం డ్రైవర్‌కు పూటుగా మద్యం తాగించి.. మంత్రి రజిని నివాసం వద్దకు పదేపదే ఆ వాహనాన్ని పంపించారు. ఆమె ఇంటి ముందే ప్రచార వాహనాన్ని నిలిపి టీడీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేశారు. దీంతో అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు 'ఉద్దేశపూర్వకంగా వస్తున్నావా.. ఏంటీ..' అని డ్రైవర్‌ను ప్రశ్నించారు. అప్పటికే గొడవ కోసం వేచి ఉన్న టీడీపీ నాయకులు క్షణాల వ్యవధిలో మంత్రి రజిని నివాసం వద్దకు చేరుకుని హడావుడి చేశారు. ఒకానొక దశలో మంత్రి నివాసంపై దాడికి ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై విరుచుకుపడ్డారు. పట్టాభిపురం పోలీసులు వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఫిర్యాదు మేరకు ఎన్నికల అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గతంలో కూడా నూతన సంవత్సరం రోజున చంద్రమౌళినగర్‌లో మంత్రి రజిని కార్యాలయంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. ఆ తర్వాత రజిని ఆధ్వర్యాన విద్యానగర్, అమరావతి రోడ్డులలో ఏర్పాటుచేసిన సిమెంట్ బల్లలను ధ్వంసం చేశారు.

పోలీసులకు నరేంద్ర, శ్రావణ్ బెదిరింపులు

టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నేతలు ఏకంగా పోలీసులపై రెచ్చిపోయారు. పెమ్మసాని ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట పొన్నూరు, తాడికొండ అభ్యర్థులు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్ కూడా ఉన్నారు. నిబంధనల ప్రకారం పెమ్మసానితో కలసి నలుగురు రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లారు. మిగతా వారికి అనుమతిలేదని నగరంపాలెం సీఐ లోకనాథం చెప్పడంతో ధూళిపాళ్ల నరేంద్ర రెచ్చిపోయి 'నువ్వు ఎక్కడి నుంచి వచ్చావ్.. తమాషాలు చేస్తున్నావా.. రెండు నెలలు ఆగు.. నీ సంగతి చూస్తా.. అధికార పార్టీకి కాళ్లు మొక్కుతున్నారా..' అంటూ సీఐని ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. మరోవైపు తెనాలి శ్రావణ్‌కుమార్ కూడా 'క్యాడర్‌కు తగ్గట్లు ప్రవర్తించాలి... నీ స్థాయి ఏంటో చూసుకోవాలి...' అని ఒక ఏఎస్ఐపై విరుచుకుపడ్డారు. దీంతో పోలీసులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కాగా, గుంటూరు పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి నామినేషన్ సందర్భంగా కూడా పోలీసులపై ఓవరాక్షన్ చేశారు. బుధవారం పొన్నూరులో ధూళిపాళ్ల నరేంద్ర నామినేషన్ సందర్భంగా ఆయన అనుచరులు, కార్యకర్తలు పోలీసులను నెట్టివేసి ఆర్వో కార్యాలయంలోకి దూసుకెళ్లారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. టీడీపీ నేతల తీరు ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పోలీసుల్ని సస్పెండ్ చేయిస్తా

- కరుడుగట్టిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు
- పోలీసులపై సీఎం రమేష్ చిందులు



తుమ్మపాల: పోలీసులు కరుడుగట్టిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, వాళ్లందర్నీ సస్పెండ్ చేయిస్తానంటూ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ చిందులు తొక్కారు. బుధవారం నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ వేసేందుకు మూడు వాహనాల్లో వెళ్లేందుకు అనుమతి ఉన్నా, ఒక వాహనాన్ని మాత్రమే అనుమతించారన్నారు. గడచిన ఐదేళ్లలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలపై అధికారులు, పోలీసులు అనేక అక్రమ కేసులు పెట్టారని, వారందరినీ వదిలేది లేదన్నారు. నామినేషన్ సందర్భంగా వచ్చి హోటల్‌లో ఉన్న తమ బంధువుల రూముల్లోకి అర్ధరాత్రి పోలీసులు అక్రమంగా ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించారన్నారు. తమ బంధువుల వద్ద నగదు, వస్తువులు పోలీసులు దొంగలించారన్నారు. పోలీసులను సస్పెండ్ చేసేవరకు వదిలేది లేదన్నారు.

సజ్జలను జైల్లో పెడతాం!

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ చూసుకుని సజ్జల రామకృష్ణారెడ్డి సినీ నటుడు చిరంజీవిపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని రమేష్ అన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత మొదట సజ్జలనే జైల్లో పెడతామంటూ అసభ్య పదజాలంతో దూషించారు. జూన్ తర్వాత వచ్చే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో సీఎంగా చంద్రబాబు ఉంటారని.. ఈనాటి ఘటనల్ని మర్చిపోయి పాలన చేసుకుంటానంటే కుదరదన్నారు. టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపీ అయితే పార్లమెంట్‌లో ఏ భాష మాట్లాడగలరని ఎద్దేవా చేశారు. టీడీపీ నేత అనిత మాట్లాడుతూ.. నామినేషన్ సమయంలో పోలీసుల ఓవరాక్షన్ ఎక్కువైందని, జగన్ జీతాలు సరిగా ఇవ్వకపోయినా సరే పోలీసులు ఆయనకు ఊడిగం చేస్తున్నారన్నారు.

అఫిడవిట్ అంటే ఏంటో తెలుసా పవన్ నీకు?

వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌పై ప్యాకేజీ పవన్‌కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు ధ్వజమెత్తారు. సీఎం జగన్ వద్ద రూ.లక్ష కోట్లు ఉన్నాయని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లక్షల పుస్తకాలు చదివానంటున్న పవన్‌కు ఎన్నికల అఫిడవిట్ అంటే ఏంటో తెలుసా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన ఆస్తులను వివరంగా అధికారికంగా ప్రకటించారని, ఒక్కసారి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోకి వెళ్తే తెలిసిపోతుందని చెప్పారు. సీఎం జగన్ ఆస్తులు ఎంతో తేటతెల్లంగా ఉంటే ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు, చంద్రబాబు మెప్పుకోసం రూ.లక్ష కోట్లు అంటూ పవన్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

కాపు కులాన్ని గంపగుత్తగా బాబుకు తాకట్టు పెడతావా?

2014లో చంద్రబాబును పొగిడి.. 2019లో చంద్రబాబు, లోకేశ్‌లను తిట్టిన మాట నిజం కాదా.. అని పవన్‌ను ప్రశ్నించారు. మళ్లీ నేడు చంద్రబాబును సీఎంను చేయడానికి కాపు కులాన్ని గంపగుత్తగా తాకట్టుపెట్టిన ఘనత నీది కాదా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం నమ్ముకున్న కులాన్ని, జనసేన కోసం శ్రమిస్తున్న జన సైనికుల్ని తాకట్టు పెట్టిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో చిరంజీవిని ఏమీ అనకపోయినా.. చిరంజీవిని అంటే ఊరుకోనంటూ ఆయనను సైతం ఇందులోకి లాగి, బాబు మెప్పుకోసం చిరంజీవిని సైతం రాజకీయంగా వినియోగించుకోవాలని పవన్ చూస్తున్నారని మండిపడ్డారు.

బాబు పాలనలో మహిళలకు కన్నీళ్లే

వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ




సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో మహిళలకు అడుగడుగునా కన్నీళ్లే మిగిలాయని వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ ధ్వజమెత్తారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ పాలనలో మహిళలకు భద్రత పెరిగిందని, ఆదాయం రెండింతలై వారంతా ఆర్థికంగా శక్తిమంతులుగా మారారని చెప్పారు. అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను సీఎం జగన్ కల్పించారని గుర్తు చేశారు. తన మోసపు మాటలతో మహిళలను మరోసారి దగా చేయాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన మోసం వల్ల డ్వాక్రా మహిళలు రోడ్డున పడితే.. డ్వాక్రా రుణాలు మాఫీచేసి సీఎం జగన్ వారికి మేలు చేశారన్నారు. ఇప్పుడు వారంతా తమ కాళ్లపై తాము నిలబడి సాధికారత సాధించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మహిళలకు స్వర్ణయుగం ప్రారంభమైందని, ఆసరా, చేయూత వంటి పథకాలతో మహిళలు అభివృద్ధి చెందుతున్నారని వివరించారు. చంద్రబాబు పాలన ఎంత దుర్మార్గంగా, మోసాలతో ఉంటుందో మహిళలందరికీ తెలుసని.. ఆయన మోసపు మాటల్ని నమ్మే పరిస్థితిలో మహిళలు లేరన్నారు.

బెల్టు షాపులు పెట్టించింది చంద్రబాబే

బెల్ట్ షాపులు పెట్టించి మద్యాన్ని ఊరూరా పారించింది చంద్రబాబు కాదా అని పద్మ ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో గంజాయి లేదా అని నిలదీశారు. విశాఖలో పట్టుబడిన 25 వేల టన్నుల డ్రగ్స్ రవాణా వెనకాల ఎవరు ఉన్నారో అందరికి తెలుసన్నారు. గంజాయి సాగు, అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని చెప్పారు. మహిళల అదృశ్యం గురించి కూడా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్నారు.

వారసత్వ పన్ను.. నచ్చేస్తోంది



- కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు
- తన ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వం వస్తే దేశ సంపదను పునఃపంపిణీ చేస్తామంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీకి మద్దతుగా ఆ పార్టీ నాయకుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్, సోనియా గాంధీ కుటుంబానికి సన్నిహితుడు అయిన శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన ఈ నెల 23న ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికాలో వారసత్వ పన్ను అమల్లో ఉందని, అలాంటి విధానం మన దేశంలోనూ అమల్లోకి తీసుకొస్తే బాగుంటుందని పరోక్షంగా సూచించారు. ''అమెరికాలో వారసత్వ పన్ను చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఉదాహరణకు ఎవరికైనా 100 మిలియన్ల డాలర్ల ఆస్తి ఉండి మరణిస్తే, ఆ ఆస్తిలో కేవలం 45 శాతమే అతడి వారసులకు చెందుతుంది. మిగిలిన 55 శాతం ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇది నిజంగా ఆసక్తికరమైన చట్టం. ఆస్తులు సంపాదిస్తే సమాజంలో ఇతర ప్రజల కోసం సింహభాగం వదులుకోవాలని ఈ చట్టం చెబుతోంది. సంపాదించిన వ్యక్తికే మొత్తం ఆస్తి చెందదు. దాదాపు సగ భాగమే అతడిది అవుతుంది. ఈ చట్టం నాకు నచ్చేస్తోంది'' అని శామ్ పిట్రోడా పేర్కొన్నారు. వాస్తవానికి అమెరికా అంతటా వారసత్వ పన్ను చట్టం అమల్లో లేదు. కొన్ని రాష్ట్రాల్లోనే అమలవుతోంది. తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో శామ్ పిట్రోడా బుధవారం వివరణ ఇచ్చారు. తన ఉద్దేశాన్ని కొందరు తప్పుగా అర్థం చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. 'గోడీ మీడియా' వక్రభాష్యం చెబుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చెబుతున్న అబద్ధాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి తన వ్యాఖ్యలకు వక్రీకరించారని ఆరోపించారు. అమెరికా వారసత్వ పన్ను గురించి ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పానని వివరించారు.

మాకు ఆ ఉద్దేశం లేదు: జైరామ్

తాజా వివాదంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. దేశంలో వారసత్వ పన్ను విధించే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని బుధవారం తేల్చిచెప్పారు. నిజానికి ఇలాంటి పన్నును ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఉన్నట్లు బీజేపీ ప్రభుత్వమే గతంలో వెల్లడించిందని గుర్తుచేశారు. 1985లో ఎస్టేట్ పన్నును అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ రద్దు చేశారని జైరామ్ రమేశ్ తెలిపారు.

చచ్చినా వదలరట!

కాంగ్రెస్ వస్తే వారసత్వ పన్ను • జనం ఆస్తులపై 'పంజా'

మోదీ సంచలన ఆరోపణలు

- ఆస్తుల బదిలీపై పన్ను వేస్తారట
- యువరాజు సలహాదారే చెప్పారు
- బతికున్నా, మరణించినా మోతే
- రిజర్వేషన్లను కాపాడేది మేమే
- ఛత్తీస్, ఎంపీ ర్యాలీల్లో ప్రధాని



అంబికాపూర్/సాగర్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారసత్వ పన్నుతో ప్రజల నడ్డి విరవడం తథ్యమని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన ఆరోపణలు చేశారు. బతికున్నంత కాలం ప్రజలను పన్నులతో పీడించడమే గాక మరణించిన తర్వాత కూడా వదలకుండా లూటీ చేసే కుట్రలకు పదును పెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత సామ్ పిట్రోడా తాజాగా సంపద పంపిణీ గురించి మాట్లాడుతూ అమెరికాలో అమల్లో ఉన్న వారసత్వ పన్ను గురించి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శమన్నారు. ''మరణించిన వారి ఆస్తులపైనా కాంగ్రెస్ పంజా (హస్తం గుర్తునుద్దేశించి) విసరనుంది. వారసత్వంగా పిల్లలకు దక్కకుండా లాగేసుకోనుంది. 'జిందగీ కే సాథ్ భీ... జిందగీ కే బాద్ భీ... (బతికున్నప్పుడు కూడా, చనిపోయాక కూడా)'. ఇదే కాంగ్రెస్ నయా దోపిడీ మంత్రం!'' అని ఎల్ఐసీ పాపులర్ స్లోగన్ అన్వయిస్తూ ప్రధాని దుయ్యబట్టారు. ''సమాజంలో సంపద పునఃపంపిణీ అనే ముసుగులో ప్రజల స్థిర చరాస్తులను జీవితాంతమూ, మరణించిన తర్వాతా అడ్డంగా లూటీ చేయడమే కాంగ్రెస్ విధానం. ఆ క్రమంలో చివరికి వారసత్వ ఆస్తులను కూడా వదలిపెట్టడం లేదు. కాంగ్రెస్ తాలూకు ఈ రహస్య అజెండాను, పిట్రోడా వ్యాఖ్యలు బయటపెట్టాయి. మన సామాజిక, కుటుంబ విలువలకు కాంగ్రెస్ పూర్తిగా దూరమైపోయింది. అందుకే ప్రజల జీవితాంతం పొదుపు చేసి తమ వారసులకు అందజేయాలనుకునే సొమ్మును కూడా చట్టబద్ధంగా లాగేసుకోవాలని కుట్ర చేస్తోంది. ఆ పార్టీ చేస్తున్న ఇలాంటి ప్రమాదకర ఆలోచనలన్నీ ఎన్నికల వేళ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి'' అని బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ ఎన్నికల ర్యాలీలో మోదీ తూర్పారబట్టారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్, హర్దా ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఆయన ఏం మాట్లాడారంటే...

చట్టబద్ధంగా దోచేస్తారు

''మీ (ప్రజల) ఆస్తులను, మీ పిల్లల హక్కులను కాజేయడానికి కాంగ్రెస్ పథకం వేసింది. జనం ఆస్తులను, పిల్లల కోసం జీవితాంతం కష్టపడి పొదుపు చేసుకున్న మొత్తాలను చట్టబద్ధంగా దోచేయజూస్తోంది. మధ్యతరగతి ప్రజలపై, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకొనేవారిపై మరింత పన్ను విధించాలని కాంగ్రెస్ యువరాజు (రాహుల్) సలహాదారు (పిట్రోడా) అంటున్నారు. గతంలో యువరాజు తండ్రికి కూడా ఆయనే సలహాదారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే తల్లిదండ్రుల నుంచి సంతానానికి వారసత్వంగా వచ్చే ఆస్తులపై కచ్చితంగా పన్ను విధిస్తుంది. అప్పుడిక తల్లిదండ్రుల ఆస్తులు పిల్లలకు బదిలీ కావాలంటే పన్ను కట్టాల్సిందే. బతికున్నంత కాలమూ మీనుంచి వీలైనంతగా పన్నులు పిండుతారు. మరణించాక వారసత్వ పన్ను విధిస్తారు!

ఓబీసీలకు కాంగ్రెసే అతి పెద్ద శత్రువు

''మతపరమైన రిజర్వేషన్ల నుంచి వెనక్కి తగ్గే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదు. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తగ్గించి, స్వీయ రాజకీయ లబ్ధి కోసం మరో వర్గానికి వర్తింపజేస్తుంది. ఇందులో సందేహం లేదు. కర్ణాటకలో గతంలో కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగానికి, అంబేడ్కర్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మతాధారంగా రిజర్వేషన్లు అమలు చేశారు. అక్కడ బీజేపీ అధికారంలోకి అవి రద్దయ్యాయి. కొన్ని నెలల క్రితం కర్ణాటకలో మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్ద పాపం చేసింది. ముస్లింల్లోని అన్ని వర్గాలను ఓబీసీ కేటగిరీలో చేర్చి దొడ్డిదారిన రిజర్వేషన్లు ఇచ్చేసింది. దీనివల్ల ఓబీసీ కేటగిరీలోని ఇతర కులాలకు అన్యాయం జరుగుతోంది. కాంగ్రెస్ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన ఆటతో భవిష్యత్తు తరాలు నాశనమవుతాయి. దేశమంతటా కర్ణాటక మోడల్ అమలు చేయడానికి కుట్ర పన్నింది''

రాజ్యాంగమంటే కాంగ్రెస్‌కు లెక్కలేదు

''ఎన్నికల్లో నెగ్గడానికి ఓటు బ్యాంకు రాజకీయాలనే నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ మతాధారితంగా రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తోంది. దేశంలో కాంగ్రెస్ నేతృత్వంలో బలహీన ప్రభుత్వం అధికారంలోకి రావాలని కొన్ని శక్తులు కోరుకుంటున్నాయి. బలమైన ప్రభుత్వముండి దేశం స్వావలంబన సాధిస్తే తమ దుకాణం మూతపడుతుందని ఆ శక్తులు భయపడుతున్నాయి. కాంగ్రెస్‌ది ముమ్మాటికీ ముస్లిం లీగ్ ఆలోచనా ధోరణే. ఆ పార్టీ మేనిఫెస్టో ముస్లింలీగ్ సిద్ధాంతాలకు నకలు. మతాధారంగా రిజర్వేషన్లు ఉండొద్దని రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు అంబేడ్కర్ భావించారు. దళితులకు, గిరిజనులకే రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ లెక్కచేయడం లేదు. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మతాధారంగా రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి, మతం ఆధారంగా ఓ వర్గానికి 15 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గట్టిగా వాదించింది. 2009, 2014 మేనిఫెస్టోల్లో ఇదే అంశాన్ని చేర్చింది''

'ఇండియా' వస్తే ఏడాదికో ప్రధాని

కేంద్రంలో విపక్ష ఇండియా కూటమి ప్రభుత్వం కొలువుతీరితే ప్రతి ఏడాదికో ప్రధాని మారతారని మోదీ ఎద్దేవా చేశారు. నాయకత్వ సమస్యను పరిష్కరించుకోవడానికి ఇండియా కూటమి ఈ ఫార్ములాను అమలు చేస్తుందన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ఏడాదికో ప్రధాని మారితే ప్రపంచం దృష్టిలో మనం నవ్వులపాలవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలన వస్తే ప్రజలకు ఒకటి కంటే ఎక్కువ కార్లు, మోటార్ సైకిళ్లు, ఇళ్లుంటే ప్రభుత్వపరమవుతాయన్నారు.

'ఎక్స్-రే'పై మాట మార్చిన రాహుల్

న్యూఢిల్లీ: కేంద్రంలో తమ ప్రభుత్వం వస్తే ప్రజల స్థిర చరాస్తులపై ఆర్థిక, సంస్థాగత సర్వే(ఎక్స్-రే) నిర్వహిస్తామంటూ ఈ నెల 7న తాను చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారడంతోపాటు తీవ్ర విమర్శలు వస్తుండడంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెనక్కి తగ్గారు. బుధవారం ఢిల్లీలో సామాజిక న్యాయ సదస్సులో మాట్లాడుతూ మాట మార్చేశారు. ఈ సర్వే ప్రజల ఆస్తులను గుర్తించడానికి కాదని పేర్కొన్నారు. ప్రజలకు ఏ మేరకు అన్యాయం జరిగింది అనేది తెలుసుకోవడమే సర్వే ఉద్దేశమని స్పష్టం చేశారు. సర్వే విషయంలో తన ప్రకటనను ప్రధాని నరేంద్ర మోదీ వక్రీకరిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక, సంస్థాగత సర్వే చేసి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని తాను ఏనాడూ చెప్పలేదని పేర్కొన్నారు. సర్వేపై తాను మాట్లాడగానే ప్రధాని మోదీ తీవ్రంగా స్పందిస్తున్నారంటే సంపద పంపిణీలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అన్యాయానికి గురైన వర్గాలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. ఆర్థిక, సంస్థాగత సర్వే చేపట్టడం దేశాన్ని కూల్చేసే కుట్ర ఎలా అవుతుందో చెప్పాలని నిలదీశారు. సర్వే జరిగితేనే అసలు సమస్య ఎక్కడ ఉందో తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. దేశభక్తులం అని చెప్పుకుంటున్న కొందరు ప్రబుద్ధులు సర్వే అనగానే వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశ జనాభాలో 90 శాతం మందికి అన్యాయం జరిగిన మాట నిజమేనని, వారికి న్యాయం జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. దేశంలో ప్రజల మధ్య సంపద పంపిణీ ఏ రీతిలో జరిగిందో నిర్ధారించడానికి తమ ప్రభుత్వ హయాంలో ఎక్స్-రే నిర్వహిస్తామని రాహుల్ గాంధీ చేసిన ప్రకటనపై ప్రధాని మోదీ విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే.



ఎన్నికల విచిత్రం

పశ్చిమబెంగాల్‌లోని కృష్ణనగర్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న టీఎంసీ అభ్యర్థి మహువా మొయిత్రా.. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ చిన్నారిని ఎత్తుకుని ఇలా ముద్దు చేశారు

ఎలక్షన్ బీట్

'రీడ్ ద లెటర్ బిట్వీన్'

ఇదేదో పజిల్‌లా ఉందే అనుకుంటున్నారా? నిజమే.. చిన్నపాటి పజిలే. కాకపోతే పార్టీలు ప్రచారం కోసం ఉపయోగిస్తున్న కీబోర్డు ట్రెండ్. మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ కీబోర్డును మీదున్న అక్షరాలతో ఈ ట్రెండ్‌ను వైరల్ చేస్తున్నాయి బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీలు. అదెలా అంటే..

నేను..
''వికసిత్ భారత్ కోసం ఎవరు ఓటు వేయనున్నారో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే కీబోర్డులోని యూ అండ్ ఓ మధ్య ఉన్న లెటర్‌ను బిగ్గరగా చదవండి'' అని భారతీయ జనతా పార్టీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఆ రెండు లెటర్స్ మధ్యనున్న అక్షరం 'ఐ'. ఆ మెసేజ్ చదివిన ప్రతి ఒక్కరూ 'ఐ' అంటారు. సో... వారంతా తాము బీజేపీకి ఓటు వేస్తున్నట్టు ప్రతిజ్ఞ చేసినట్టేనని బీజేపీ భావిస్తోంది.

మేము..
ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా బీజేపీని టార్గెట్ చేస్తూ ఈ ట్రెండ్‌నే అనుసరిస్తోంది. ''నియంత నరేంద్ర మోదీ నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడేది ఎవరు? కీబోర్డులో క్యూ, ఆర్ మధ్య ఉన్న లెటర్స్‌ను చదవండి'' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇక్కడ క్యూ, ఆర్ మధ్య ఉన్నది డబ్ల్యూ, ఈ.. రెండక్షరాలను కలిపితే 'మేము' అనే అర్థం వస్తుంది. మేమంతా కలిసి బీజేపీని ఓడిస్తామని సందేశాన్నిచ్చేలా ఆప్ వైరల్ చేస్తోంది.

పోలీసులు సైతం..
ఈ రెండు పార్టీలిలా ఉంటే.. సురక్షితమైన డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించేందుకు ఢిల్లీ పోలీసులు కూడా ఈ వైరల్ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. ''డ్రైవింగ్ చేస్తూ మీరు కీ బోర్డును చూస్తే.. క్యూ అండ్ ఆర్ మధ్యలో లెటర్స్ (డబ్ల్యూ, ఈ) చలాన్‌తో మిమ్మల్ని కలుస్తాయి'' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. అంటే మీరు కీబోర్డు చూస్తే వి (మేము) చలాన్ వేస్తామని అర్థమన్నమాట.

- సాక్షి, నేషనల్ డెస్క్

కనీసం నా అంత్యక్రియలకు రండి

- పార్టీ అభ్యర్థికి ఓటేయకున్నా పర్లేదు
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే భావోద్వేగ ప్రసంగం

కలబురిగి: కర్ణాటకలో సొంత జిల్లా కలబురిగిలో పార్టీ అభ్యర్థి కోసం ప్రచారంచేస్తూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే భావోద్వేగానికి లోనయ్యారు. దశాబ్దాల ప్రజాజీవితంలో మీకేమైనా మంచి చేశానని భావిస్తే నా అంతిమసంస్కారానికైనా రావాలని కోరారు. కలబురిగి స్థానంలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఉమేశ్ జాధవ్‌కు పోటీగా కాంగ్రెస్ ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణిని బరిలో నిలిపింది. బుధవారం అఫ్జల్‌పూర్‌లో ఎన్నికల ర్యాలీలో 81 ఏళ్ల ఖర్గే మాట్లాడారు. '' ఈసారి పార్టీ అభ్యర్థికి ఓటేయకపోతే సొంత జిల్లాలో నాకిక స్థానం లేదనే భావిస్తా. నేనిక మీ హృదయాలను గెల్చుకోలేను. ఇన్నేళ్ల నా రాజకీయ జీవితంలో మీకు నేను ఏదైనా మంచి చేశానని భావిస్తే.. మీరు మాకు(కాంగ్రెస్ అభ్యర్థికి) ఓటేసినా వేయకపోయినా కనీసం నా అంత్యక్రియలకు రండి. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తుదిశ్వాస దాకా పోరాడతా. రాజకీయాల కోసమే పుట్టా. ఎన్నికల్లో పోటీచేసినా చేయపోయినా రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చివరి క్షణం పోరాడతా. రాజకీయాల నుంచి నిష్క్రమించను. రాజకీయ పదవుల నుంచి రిటైర్మెంట్ ఉంటుందిగానీ ఆ నాయకుడు నమ్మిన విలువలు, సిద్ధాంతాల నుంచి రిటైర్మెంట్ తీసుకోడు. బీజేపీ, ఆర్ఎస్ సిద్ధాంతాలను తప్పు అని నిరూపించడానికే రాజకీయనేతనయ్యా. వాళ్ల ముందు తలవంచేదే లేదు'' అని అన్నారు.

మా అభ్యర్థికి ఓటేయొద్దు

బాంసవాడా-దుంగాపూర్ స్థానంలో కాంగ్రెస్ వింత ప్రచారం

బాంసవాడా: ఎన్నికల్లో సొంత అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ ప్రచారాన్ని హోరెత్తించడం చూస్తుంటాం. అయితే తమ పార్టీ అభ్యర్థికి పొరపాటున కూడా ఓటేయకండి అని స్వయంగా పార్టీనే ప్రచారం చేసి మరీ చెప్పిన అరుదైన ఘటనకు రాజస్తాన్ వేదికైంది. అక్కడి బాంసవాడా-దుంగాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున అర్వింద్ డామోర్ బరిలో దిగారు. తీరా నామినేషన్ల ఉపసంహరణకు ఒక్కరోజు ముందు భారత్ ఆదివాసీ పార్టీ(బీఏపీ)తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. బీఏపీ అభ్యర్థి రాజ్‌కుమార్ రోత్‌కు మద్దతు పలుకుతున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని సొంత అభ్యర్థి అర్వింద్‌ను కాంగ్రెస్ ఆదేశించింది. అయితే 'నాకు స్థానిక నేతల మద్దతు ఉంది. ప్రజలు నన్నే ఆదరిస్తారు. బీఏపీతో పొత్తుపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి. కాబట్టి నేను పోటీచేయడమే ఉత్తమం' అని అర్వింద్ వాదించారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. దీంతో బీజేపీ అభ్యర్థి మహేంద్రజీత్ సింగ్ మాలవీయ, బీఏపీ అభ్యర్థి రాజ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి అర్వింద్‌లతో త్రిముఖ పోరు అనివార్యమైంది. పొత్తు ఒప్పందంలో భాగంగా రాజ్‌కుమార్‌ను ఎలాగైనా గెలిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై పడింది. దీంతో సొంత అభ్యర్థి అర్వింద్‌కు ఓటేయకండి అంటూ తెగ ప్రచారం చేసింది. దీంతో ఓటర్లలో కాస్తంత గందరగోళం నెలకొంది. దీంతో ఓట్లు చీలి బీజేపీ అభ్యర్థికి బాగా కలిసొస్తుందని అంతా భావిస్తున్నారు. పార్టీ ఆదేశాలను సొంత నేత బేఖాతరుచేయడం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా పరిణమించింది. ఎస్టీ రిజర్వ్‌డ్ సీటు అయిన బాంసవాడా-దుంగాపూర్ స్థానానికి శుక్రవారం పోలింగ్ జరగనుంది.

మావల్ ఎంపీ.. ఎస్ఎస్‌సీ పాస్

శ్రీరంగ్ బర్నే.. మహారాష్ట్రలోని మావల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఐదు సార్లు అవార్డు అందుకున్నారు. ఈసారి తన ఎన్నికల అఫిడవిట్‌లో కొత్త అర్హతను సగర్వంగా ప్రకటించారు. అదేంటంటే.. తన విద్యార్హతలో ఎస్ఎస్‌సీ అని రాయడం. 1997లో రాజకీయాల్లోకి వచ్చిన శ్రీరంగ్ స్థానిక సంస్థల్లో పనిచేసి.. 2014, 2019 ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1980లో ఎస్ఎస్‌సీ ఫెయిలైన శ్రీరంగ్ చదువుకు దూరమయ్యారు. ఆ తరువాత రాజకీయాల్లో ఎన్ని విజయాలు సాధించినా విద్యార్హత కాలమ్ ఖాళీగా వదిలేయడం అతడిని వెంటాడింది. క్రియాశీల రాజకీయాల్లో తీరిక లేని పనులతో ఉన్న శ్రీరంగ్‌కు కోవిడ్ కాలంలోని వరుస లాక్‌డౌన్ల సమయం కలిసొచ్చింది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుని 2022లో ఎస్ఎస్‌సీ పరీక్షకు హాజరయ్యారు. 60 ఏళ్ల శ్రీరంగ్ 58 ఏళ్ల వయసులో పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. ఇప్పుడు సగర్వంగా 'ఎస్ఎస్‌సీ పాస్' అని అఫిడవిట్‌లో పొందుపరిచారు.

ముగిసిన రెండో దశ ప్రచారం

89 స్థానాలకు 26న పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక పోరులో రెండో దశకు ప్రచారం ముగిసింది. రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 89 స్థానాల్లో ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో గెలుపే ధ్యేయంగా సొంత పార్టీ హామీలను కురిపిస్తూ, ప్రత్యర్థి పార్టీపై విమర్శలు గుప్పిస్తూ అన్ని పార్టీలు ప్రచారపర్వాన్ని రక్తికట్టించాయి. ఇప్పటికే తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 102 స్థానాలకు ఈనెల 19న జరిగిన ఓటింగ్‌లో 65.5 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. ఈసారి రెండో దశలో కేరళలో ఉన్న మొత్తం 20 స్థానాలకూ ఒకేదఫాలో పోలింగ్ నిర్వహిస్తున్నారు.

కన్నౌజ్ బరిలో తేజ్ ప్రతాప్ కాదు..అఖిలేశ్!

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మనసు మార్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ లోక్‌సభ నియోజకవర్గంలో ముందు ప్రకటించిన విధంగా తేజ్ ప్రతాప్ యాదవ్‌కు బదులుగా పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పోటీ చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అఖిలేశ్ నామినేషన్ వేస్తారని ఎస్పీ బుధవారం సాయంత్రం 'ఎక్స్'లో తెలిపింది. కార్యకర్తల కోరిక మేరకే కన్నౌజ్ నుంచి పోటీ చేస్తున్నట్లు మీడియాకు అఖిలేశ్ తెలిపారు. కన్నౌజ్ నుంచి తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని సోమవారం ఎస్పీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

జేఈఈ మెయిన్ ఫలితాలు.. 56 మందికి 100% స్కోరు

వీరిలో తెలంగాణకు చెందిన 15 మంది, ఏపీ విద్యార్థులు ఏడుగురు

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 56 మంది అభ్యర్థులు ఏకంగా నూటికి నూరు మార్కులు సాధించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బుధవారం తెలిపింది. వందకు వంద మార్కులు స్కోర్ చేసిన వీరిలో తెలంగాణ విద్యార్థులు అత్యధికంగా 15 మంది ఉండటం విశేషం. ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఏడుగురు చొప్పున, ఢిల్లీ విద్యార్థులు ఆరుగురు ఉన్నారు. జేఈఈ మొదటి ఎడిషన్ పరీక్ష జనవరి-ఫిబ్రవరిలో, రెండో విడత ఏప్రిల్‌లో జరిగింది. ఈ రెండు పరీక్షల్లో ఫలితాలను బట్టి జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దేశంలోని ప్రఖ్యాత 23 ఐఐటీల్లో ప్రవేశాలకు ఈ పరీక్షే ప్రధానం.

కులగణనను ఏ శక్తీ ఆపలేదు

- దేశభక్తులమని చెప్పుకునే వాళ్లకు కులగణన ఎక్స్-రే అంటే భయం
- రూ.16 లక్షల కోట్లు మిత్రులకు పంచారు
- మేం కోట్లాది పేదలను లక్షాధికారులను చేస్తాం
- మోదీ, బీజేపీపై రాహుల్ విమర్శలు

సాక్షి, న్యూఢిల్లీ: కులగణనను ఏ శక్తీ ఆపలేదని ప్రకటిస్తూ ప్రధాని మోదీ, బీజేపీపై రాహుల్ గాంధీ మరోమారు విమర్శల వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. బుధవారం ఢిల్లీలో జరిగిన సామాజిక న్యాయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ''నాకు కులం పట్టింపు లేదు. కానీ న్యాయం విషయానికొచ్చేసరికి దేశంలో అన్యాయమైపోయిన 90 శాతం జనాభాకు న్యాయం దక్కేలా చూడటమే నా జీవిత లక్ష్యం. మా ప్రభుత్వం ఏర్పడగానే మేం చేసే మొట్టమొదటి పని కులగణన జరిపించడమే. మోదీ అస్తవ్యస్తపాలనలో దాపురించిన ఆదాయ అసమానతల గురించే కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోంది. మోదీ అత్యంత మిత్రులైన బడా పారిశ్రామికవేత్తలకు బదిలీచేసిన రూ.16 లక్షల కోట్ల మొత్తంలో కాంగ్రెస్ కొంతైనా ఈ 90 శాతం పేదలకు అందేలా చేస్తుంది. లెక్కలు కట్టాం. ఇదే న్యాయం అని భావించాం. అందుకే ఈ అంశాలను మేనిఫెస్టోలో చేర్చాం'' అని రాహుల్ అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..



రామమందిరం, పార్లమెంట్‌లో మా వ్యక్తులెక్కడ?

'' సమస్య నుంచి కొంతకాలమే దృష్టి మరల్చగలరు. ఓబీసీలు మిమ్మల్ని నిలదీసే సమయం వచ్చింది. రామమందిరం పూర్తయింది అక్కడ మా(దళితులు, గిరిజనులు) వాళ్లు ఒక్కరైనా ఉన్నారా? పార్లమెంట్ నూతన భవనం ప్రారంభించారు. మా వాళ్లు ఒక్కరైనా ఉన్నారా?. ఒక్కరినైనా ఆహ్వానించారా? గిరిజన మహిళా రాష్ట్రపతి ముర్ము, మాజీ రాష్ట్రపతి కోవింద్‌లను ఎందుకు రానివ్వలేదు?''

ఆర్థిక, వ్యవస్థాగత సర్వేలూ కలిపి..

'' మేం అధికారంలోకి వస్తే కులగణనతోపాటే ఆర్థిక సర్వే చేస్తాం. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాలుసహా అన్ని రంగాల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఎంత ఉందనేది తెలిపే ఇన్‌స్టిట్యూషనల్ సర్వేనూ చేస్తాం. కులగణనను ఏ శక్తీ ఆపలేదు. ఎంత గట్టిగా నిలువరిస్తే అంతే బలంగా ప్రతిఘటిస్తాం''

నాన్‌సీరియస్ నేతనా?

''పూర్తిగా రాజకీయాలకు అంకితంకాని నేత అని రాహుల్‌పై బీజేపీ చేసిన విమర్శలకు రాహుల్ ధీటుగా బదులిచ్చారు. '' గ్రామీణ ఉపాధి హామీ పథకం, భూసేకరణ బిల్లు, ఉత్తరప్రదేశ్‌లో భట్టా, పార్సౌల్ గ్రామాల వద్ద భూసేకరణ ఉద్యమం, నియాంగిరీ హిల్స్ వివాదం ఇలా ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషిచేశా. ఉద్యమాలను ముందుండి నడిపించా. ఇవన్నీ మీడియాకు నాన్‌సీరియస్ అంశాలేకదా. సీరియస్ అంశాలుగా అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, విరాట్ కోహ్లీల గురించి మీడియా చూపిస్తుంది. 90 శాతం జనాభా గురించి పట్టించుకునే వ్యక్తిని నాన్‌సీరియస్ నేత అని అంటారా?''

ఓబీసీ, దళితులు, గిరిజనుల ప్రాతినిధ్యమెక్కడ?

'' మీడియారంగంలో ఓబీసీ, దళితులు, గిరిజనుల చేతుల్లో ఉన్న ఒక్క మీడియా సంస్థనైనా చూపించండి. ఒక్కరు కూడా లేరు. మీ ప్రాతినిధ్యం మీడియాలో లేదు. న్యాయవ్యవస్థలోనూ దాదాపు అంతే. 650 మంది హైకోర్టు జడ్జీల్లో 90 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహించేది కేవలం 100 మందే. దేశంలోని 200 అగ్రశ్రేణి సంస్థల్లోనూ దళితులు, గిరిజనులు, ఓబీసీలు లేరు''

దేశాన్ని విడగొడుతున్నానట!

''అన్యాయం జరిగితే ఏ మేరకు అన్యాయం జరిగిందో తెల్సుకుంటాం. ఒక వ్యక్తికి అంతర్గత గాయమైతే ఎక్స్-రే తీయడంలో తప్పులేదుగా. అలాగే కులగణన ఎక్స్-రే అవసరమని నేను అనగానే జాతీయ మీడియా, నరేంద్ర మోదీ ఏకమైపోయి నేనేదో దేశప్రజలను విభజిస్తున్నట్లు విష ప్రచారం మొదలెట్టారు. అన్ని కులాల ప్రాతినిధ్యం ఎలా ఉందో తెలియాలంటే ఎక్స్-రే అవసరమని దేశభక్తులంతా భావిస్తారు. దేశాన్ని సూపర్‌పవర్‌గా మార్చాలనే ఈ దేశభక్తుడు(మోదీ) మాత్రం ఈ ఎక్స్-రే పేరు వింటేనే భయపడుతున్నారు''

కులాలే లేనప్పుడే మీరెలా ఓబీసీ అయ్యారు?

'' గత పదేళ్లు తాను ఓబీసీ వ్యక్తినని మోదీ ఘంటాపథంగా చెప్పారు. తీరా నేను కులగణన ప్రస్తావన తీసుకురాగానే దేశంలో కులాలే లేవని మాట మార్చారు. మరి అలాంటపుడు మీరు ఓబీసీ ఎలా అయ్యారు? మళ్లీ ఆయనే దేశంలో రెండే కులాలున్నాయని సెలవిచ్చారు. పేద, ధనిక కులాలు అని. పేదల జాబితాను పరికిస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలే కనిపిస్తాయి. ఈ 90 శాతం జనాభాకు న్యాయం చేయడమే నా జీవిత లక్ష్యం''

అనుమానం ఉందని ఎన్నికలపై ఆదేశాలివ్వలేం

న్యూఢిల్లీ: ఈవీఎంల పనితీరుపై అనుమానం ఉందనో, వాటిని నియంత్రణలోకి తీసుకుని ఫలితాలను తలకిందులు చేయొచ్చనే ఆరోపణలతోనో ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈవీఎంలో 'మార్పులు' చేసే ఆస్కారం ఉందని, అందుకే బ్యాలెట్ పేపర్ విధానమే ఉత్తమం అని వాదించే వారి ఆలోచనను మార్చలేమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈవీఎంలో నమోదయ్యే ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులతో సరిపోల్చాలంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషన్‌దారులు లేవనెత్తిన ప్రశ్నలపై తమ అనుమానాలను నివృత్తిచేసుకునేందుకు జడ్జీలు మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం అధికారి నితేశ్ వ్యాస్‌ను కోర్టుకు రప్పించి ఐదు ప్రశ్నలు సంధించారు. మైక్రోకంట్రోలర్లను ఎక్కడ బిగిస్తారు? వాటి ప్రోగ్రామ్‌ను మళ్లీ మార్చొచ్చా? అంటూ ప్రశ్నలు అడిగారు. బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్లలో మైక్రోకంట్రోలర్లను బిగిస్తామని, వాటి ప్రోగ్రామ్‌ను సరిచేసేందుకు ఎవరైనా ఓపెన్ చేస్తే పనిచేయకుండా పోతాయని వ్యాస్ వివరణఇచ్చారు. ఈ వివరణతో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విభేదించారు. ఎన్నికల గుర్తులను అప్‌లోడ్ చేసేటపుడు తప్పుడు ప్రోగామ్‌ను అప్‌లోడ్ చేసే ఆస్కారముందని వాదించారు. దీనిపై జడ్జీ దత్తా కల్పించుకుని.. ' మీ ఆలోచనలను మేం మార్చలేం. ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థను నియంత్రించలేం'' అని వ్యాఖ్యానించారు. ఈవీఎంల సోర్స్ కోడ్‌ను బహిర్గతంచేయాలని మరో పిటిషనర్ తరఫు న్యాయవాది సంతోశ్ వాదించగా కుదరదని జడ్జీ తిరస్కరించారు.

ప్రసంగిస్తూనే సొమ్మసిల్లిన గడ్కరీ

యావత్మాల్(మహారాష్ట్ర): మహారాష్ట్రలోని యావత్మాల్ నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రసంగిస్తూనే వేదికపై కుప్పకూలారు. అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయిన ఆయన్ను పార్టీ కార్యకర్తలు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. 'ఎండ వేడిమికి తాళలేక పుసాద్ సభలో అనారోగ్యానికి గురయ్యాను. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాను. వరుడ్‌లో జరిగే ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్నాను. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు'అంటూ కొద్దిసేపటి తర్వాత ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నాగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి గడ్కరీ పోటీ చేస్తున్నారు. మొదటి విడతలో అక్కడ పోలింగ్ పూర్తయింది. రెండో విడతలో భాగంగా ఈనెల 26న యావత్మాల్‌లో పోలింగ్ జరగనుంది.



పడిపోతున్న గడ్కరీని పట్టుకుంటున్న నేతలు



ఆర్వో కార్యాలయం సందర్శన

పెనమలూరు:నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని బుధవారం కేంద్ర ఎన్నికల పరిశీలకుడు ఎన్ఎస్.బంగర్ సందర్శించారు.



ఎయిర్‌పోర్ట్‌లో రక్తదాన శిబిరం

గన్నవరం: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.



	కనిష్ఠం	గరిష్ఠం
నందిగామ	25.9	41.6
జగ్గయ్యపేట	28	40
మచిలీపట్నం	28	36
గుడివాడ	27	40

న్యూస్‌రీల్

పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణ



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణను నియమిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కమిషనర్ టీకే రాణా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అవినీతి నిరోధక శాఖ ఐజీగా పని చేస్తున్న రామకృష్ణను కమిషన్ నియమించింది. వెంటనే విధుల్లో చేరి గురువారం ఉదయం 11 గంటలకు కమిషన్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు టీకే రాణా ఈ నెల 23వ తేదీన రిలీవ్ అయ్యి ఆ బాధ్యతలను డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) కంచె శ్రీనివాసరావుకు అప్పగించారు. కంచె శ్రీనివాసరావు నుంచి రామకృష్ణ సీపీగా బాధ్యతలు తీసుకోనున్నారు.

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు బెజవాడ క్రీడాకారుడు



విజయవాడస్పోర్ట్స్: జాతీయ స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీలకు విజయవాడ క్రీడాకారుడు ఎ.అమల్‌రెడ్డి అర్హత సాధించాడు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని బాస్కెట్ బాల్ కోర్టులో ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) కోచ్ సంతోష్ కుమార్ వద్ద గత కొన్నేళ్లుగా అమల్‌రెడ్డి శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అత్యున్నత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. దీంతో 2023–24 జాతీయ స్కూల్ గేమ్స్‌కు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్టుకు అమల్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు హర్యాణాలోని గురుగ్రామ్‌లో ఈ పోటీలు జరుగుతాయి. ప్రతిష్టాత్మక పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుడు అమల్‌రెడ్డిని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ బుధవారం అభినందించారు.


గుడివాడ విద్యార్థినికి ఘనసత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): పది పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించిన గుడివాడ విద్యార్థిని అల్లంపల్లి భానుప్రసన్నను డీఈవో తాహెరాసుల్తానా ఆమె కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. గుడివాడ ఏకే టీపీఎంజీహెచ్ హైస్కూల్ విద్యార్థిని భానుప్రసన్నను సత్కరించి రూ. 10 వేలు నగదు బహుమతిని అందజేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థిని తండ్రి అల్లంపల్లి రాంబాబు తాపీ పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. పేదరికంలో పుట్టిన భానుప్రసన్న సివిల్స్‌కు అప్పియర్ అయ్యి ఐఏఎస్ సాధించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25 మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా కేసులు ఉన్న ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ సమావేశాలు నిర్వహించి, నిర్మూలనకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మలేరియా సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. దోమల ద్వారా కలిగే వ్యాధుల్లో మలేరియా ప్రమాదకరమైనదని తెలిపారు. నిర్మూలించేందుకు డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వైద్యశాఖ అప్రమత్తత కారణంగా మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయని వెల్లడించారు. వినూత్న రీతిలో యాంటీ లార్వల్ మెజర్స్ చేపడుతున్నట్లు వివరించారు. నీటిలో చెత్త నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడలో డెంగీ, మలేరియా కేసులు తగ్గినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఏఎంఓ సూర్యానాయక్, మెడికల్ ఆఫీసర్స్ మాధురి, సుమ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



విజయవాడ రామలింగేశ్వరనగర్ నుంచి వేలాది అభిమానులతో ప్రదర్శనగా వస్తున్న అవినాష్



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న అవినాష్, చిత్రంలో కేశినేని శ్వేత తదితరులు



అశేష జనవాహినితో నామినేషన్ వేసేందుకు వస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్



సతీమణి శకుంతలాదేవితో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న మంత్రి జోగి రమేష్

ఎన్టీఆర్ జిల్లాలో 58 నామినేషన్లు

- ముమ్మరంగా నామినేషన్ల దాఖలు
- పార్లమెంట్‌కు 11, అసెంబ్లీ స్థానాలకు 47
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు నందిగామలో మొండితోక జగన్‌మోహన్‌రావు
- జగ్గయ్యపేటలో సామినేని ఉదయభాను
- విజయవాడ తూర్పులో దేవినేని అవినాష్ నామినేషన్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఆరో రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రధాన రాజకీయపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ఆర్వోలకు నామినేషన్లు సమర్పించారు. విజయవాడ పార్లమెంట్ స్థానానికి 11 నామినేషన్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 47 నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి మొండితోక జగన్‌మోహన్‌రావు, విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీలు నిర్వహించారు.

- నందిగామ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మొండితోక జగన్‌మోహన్‌రావు రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను మూడు సెట్లు, సామినేని విమల, టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్, స్వతంత్ర అభ్యర్థి జిల్లేపల్లి సుధీర్‌బాబు నామినేషన్ వేశారు.
- తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి 9 నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్‌పార్టీ నుంచి లాం తాంతియా కుమారి, స్వతంత్ర అభ్యర్థులుగా కూరపాటి కృష్ణయ్య, కొర్లపాటి రవీంద్రబాబు, కొలికపోగు వెంకటరావు, మెహర్‌బాబు వాసం, టీడీపీ తరఫున కొలికపూడి శ్రీనివాసరావు, కోట పుల్లమ్మ, బీసీవైపీ నుంచి వెంకటేశ్వరరావు చిలపారపు ,శ్రీకాకుళపు వెంకయ్య నామినేషన్లు వేశారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తరఫున పి.శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నుంచి సుజనాచౌదరి తరఫున కె.వెంకటేశ్వరరావు, అడ్డూరి శ్రీరామ్ నామినేషన్లు వేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థి షేక్ ఖాజావలి, సీపీఐ తరఫున జి. కోటేశ్వరరావు, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి నాగెండ్ల దేవసహాయం, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి పోతిన వెంకట రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా యర్రబోతుల వినోద్‌కుమార్, లోల్ల చంద్రశేఖర్, స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ అభ్యర్థి కోనాకి వెంకటేశ్వరరావు, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి కె.రమణప్రసాద్ నామినేషన్లు వేశారు.
- విజయవాడ సెంట్రల్‌నియోజకవర్గంలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు, బీఎస్పీ అభ్యర్థి ఐ.రాజేంద్రప్రసాద్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ పోపూరి సుబ్రహ్మణ్యం, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థి శ్రీ ఫణిరాజ్, స్వతంత్రులుగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, వి.జయపూర్ణచంద్రరావు, ఆదినారాయణ, చంద్రశేఖర్ పెదపర్తి నామినేషన్లు సమర్పించారు.
- విజయవాడ తూర్పు నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ నాలుగు సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి.నాచారయ్య రెండు సెట్లు, టీడీపీ అభ్యర్థులుగా గద్దె రామోహన్, గద్దె క్రాంతి కుమార్, జై భీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థిగా విజయ్‌శేఖర్ నామినేషన్ వేశారు.
- గన్నవరం నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్ ఒక సెట్, టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావ్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా ఉమామహేశ్వరరావు ఒక సెట్, మోహనవంశీకృష్ణ ఒక సెట్, విజయదుర్గ ఒక సెట్, శివదుర్గావరప్రసాద్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మకు అందజేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా రవీంద్రకుమార్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి శ్రీదేవి ఒక సెట్, తెలుగు రాజ్యాధికార సమితి అభ్యర్థిగా జగదీష్‌రామచంద్రరావు నామినేషన్ వేశారు.
- పెనమలూరు నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా జోగి రమేష్ నాలుగు సెట్లు, ఆయన కుమారుడు జోగి రాజీవ్ రెండు సెట్లు, టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ ఒక సెట్, జై మహాభారత్ అభ్యర్థిగా విజయ్య ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ వేశారు.

విజయవాడ పార్లమెంట్‌కు...

వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్ (నాని), నవతరం పార్టీ అభ్యర్థిగా వై. కృష్ణ కిశోర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వల్లూరు భార్గవ్, టీడీపీ అభ్యర్థులుగా కేశినేని జానకి లక్ష్మి, శివనాథ్ (చిన్ని), బీఎస్పీ అభ్యర్థిగా యం. వెంకటేశ్వరరావు, జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా దాట్ల లూర్దు మేరి, జన రాజ్యం అభ్యర్థిగా డి. కుమారి, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థిగా డి. రవీంద్రబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా వెంకటకనకరావు, పి. వెంకటఅశోక్ నామినేషన్లు దాఖలు చేశారు.



ఆర్‌ఓ రాజుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జోగి రమేష్



ఆర్వో భవానీశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దేవినేని అవినాష్

అవినాష్ ఆస్తులు రూ.61.29 కోట్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ ఆస్తుల విలువ రూ.61,29,53,913 ఉన్నట్లు తన నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య దేవినేని సుధీర పేరుతో రూ.కోటి ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. కాగా తన పేరుతో రుణాలు రూ.9,35,51,586 ఉండగా, తన భార్య సుధీర పేరుపై రూ.22,48,308 ఉన్నట్లు తెలిపారు. కాగా పటమట, మాచవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు ధర్నా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

మొండితోక ఆస్తులు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 14,89,424 ఆదాయం, ఆయన పేర స్థిరాస్తులు రూ. 3.50 లక్షలుండగా చరాస్తులు రూ. 2,32,63,716 కాగా అప్పులు రూ. 1,35,59,208 గా చూపించారు. అదే విధంగా ఆయన సతీమణి డాక్టర్ పి.రమాదేవి 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ. 31,68,236 చూపించగా స్థిరాస్తులు రూ. 2.05 కోట్లు, చరాస్తులు రూ. 89,95,406 కాగా అప్పులు రూ. 89,34,353 గా చూపించారు.

ఉదయభాను ఆస్తులు రూ.15.79 కోట్లు

జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను తన పేర స్థిర, చరాస్తులు మొత్తం రూ.15.79 కోట్లు ఉన్నట్లు నామినేషన్ సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు బుధవారం సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చరాస్తులు రూ.2,29,15,537, స్థిరాస్తులు రూ.13,50,45,340, అప్పులు రూ.23,36,017 ఉన్నట్లు తెలిపారు. అలాగే తన భార్య విమల పేరుతో చరాస్తులు రూ.2,00,62,825, స్థిరాస్తులు రూ.79,27,920 ఉన్నాయన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం
- దుర్గాఘాట్‌లో అవభృత స్నానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకులు, వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. ధ్యానకోట్నోత్సవం నిర్వహించగా, ఈవో రామరావు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, యజ్ఞనారాయణ మూర్తి పాల్గొన్నారు. యాగశాలలో వసంతోత్సవం నిర్వహించగా, ఒకరిపై మరొకరు రంగులు, గులామ్‌లు చల్లుకున్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. దుర్గామల్లేశ్వరస్వామి వార్లు కొలువై ఉన్న పల్లకిని ఆలయ ఈవో రామరావు, ఏఈవో ఎన్. రమేష్‌బాబు మోసుకుంటూ ముందుకు సాగారు. దుర్గాఘాట్‌కు చేరుకున్న అర్చకులు పవిత్ర కృష్ణానదిలో ఉత్సవ మూర్తులకు అవభృత స్నానం జరిపించారు. స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారి, అయ్యవారి ఉత్సవ మూర్తులకు పవిత్ర స్నానాలు చేయించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. మరో వైపున ఇంద్రకీలాద్రిపై మూలబలి, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్. రమాదేవి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణానదిలో దుర్గా మల్లేశ్వర స్వాములకు అవభృత స్నానం



పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో రామరావు దంపతులు

• నయనానందకరంగా తెప్పోత్సవం





దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు కృష్ణానదిలో బుధవారం నిర్వహించిన తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. చైత్రమాస బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

• బెజవాడలో భానుడు భగభగలు...



భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే మండుతున్న ఎండతో పాటు వేడిగాలులు వీస్తున్నాయి. బెజవాడ బందరు రోడ్డులో సైకిల్‌పై పండ్లు విక్రయించే చిరు వ్యాపారులు ఎండ నుంచి రక్షణగా గొడుగులు ధరించిన చిత్రమిది.

– చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులు (జనరల్ అబ్జర్వర్)గా నియమితులైన ఐఏఎస్ అధికారి మంజూ రాజ్‌పాల్ బుధవారం కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించారు. సీ–విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్), కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్ 1950, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ), వాట్సప్, కాల్ సెంటర్, కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్), సీఈవో మెయిల్స్, సీ–విజిల్స్ తదితరాల ద్వారా 1,799 ఫిర్యాదులు రాగా వాటిలో 1,766 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయినట్లు అధికారులు ఆమెకు వివరించారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జీపీఎస్ పరికరాల ద్వారా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నాయి? ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరును పరిశీలించారు. రోజువారీ నివేదికల నిర్వహణ విధానాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎంసీఎంసీ, సోషల్ మీడియా సెల్ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. ఆమె వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎంసీఎంసీ మెంబర్ సెక్రెటరీ యు. సురేంద్రనాథ్, ఎంసీఎంసీ సభ్యులు వెలగా జోషి తదితరులు ఉన్నారు



ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించిన మంజూ రాజ్ పాల్

నేరుగా ఫిర్యాదు చేయండి

తనను నేరుగా కలిసి ఎన్నికల ఫిర్యాదులు, విజ్ఞాపనలు అందించవచ్చని మంజూ రాజ్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకువిజయవాడ మునిసిపల్ గెస్ట్ హౌస్ గ్రౌండ్‌ఫ్లోర్, నందమూరి రోడ్డు, బృందావన్ కాలనీ,లబ్బీపేట చిరునామాలో అందుబాటులో ఉటానని పేర్కొన్నారు. అదే విధంగా ఫోన్ నెంబర్ 8121526777 లోనూ సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

30న దుర్గగుడి హుండీల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, ముడుపులు, మొక్కుబడులను ఈనెల 30వ తేదీ లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రామరావు తెలిపారు. ఆలయ మహామండపం ఆరోఅంతస్తులో 30వతేదీ ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కానుకల లెక్కింపులో ఆలయ సిబ్బందితోపాటు సేవా సిబ్బంది పాల్గొంటారని ఈవో వివరించారు.

ముగిసిన పాలిసెట్ ఉచిత శిక్షణ

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణ ముగింపు నేపథ్యంలో అభ్యర్థులకు పాలిసెట్ నమూనా పరీక్షను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీకే ప్రసాద్ మాట్లాడుతూ మార్చి 28వతేదీ నుంచి అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పాలిసెట్ పరీక్షపై ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. 150మంది విద్యార్థులు ఈ నమూనా పరీక్ష రాశారని తెలిపారు. ఈ నెల 27న జరిగే పాలిసెట్ ప్రవేశపరీక్షలో పాటించాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామని వివరించారు. నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసి అభినందించింది.

ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: మద్యానికి బానిసై అనుమానంతో భార్యను హత్య చేసేందుకు ప్రయత్నించిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కం ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ. శైలజాదేవి బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. చుట్టుగుంటకు చెందిన షేక్ అబ్దుల్లాతో బాధితురాలికి 16ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన అబ్దుల్లా తరుచూ భార్యతో గొడవపడుతూనే ఉండేవాడు. అంతేగాకుండా ఆమెపై అనుమానం పెంచుకుని నిత్యం వేధించేవాడు. ఈక్రమంలో 2022 జూలై 12వ తేదీన భార్యతో గొడవపడి వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె పొట్టలో పొడిచాడు. మరలా ఛాతిపై పొడించేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న కొందరు అడ్డుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన బాధితురాలిని స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. ఈ ఘటనపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి ఆ మరుసటి రోజునే నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. బాధితురాలి తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు అబ్దుల్లాకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఎన్నికల తర్వాత టీడీపీ ఆఫీసుకు తాళం

ఎంపీ అభ్యర్థి కేశినేని



నందిగామలో మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని నాని, పక్కన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే టీడీపీ కార్యాలయానికి తాళాలు పడతాయని విజయవాడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)అన్నారు. జగ్గయ్యపేట, నందిగామ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సామినేని ఉదయభాను, మొండితోక జగన్‌మోహనరావు నామినేషన్ దాఖలు సందర్భంగా ఆయా పట్టణాల్లో బుధవారం నిర్వహించిన ర్యాలీ, బహిరంగసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ అభ్యర్థి కేశినేని నాని మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు, లోకేష్ తెలంగాణకు పారిపోయి టీడీపీని బీజేపీలో విలీనం చేస్తారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయని, పేదల సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే రాష్ట్రానికి మరలా జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు.చంద్రబాబు జిమ్మిక్కులు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చంద్రబాబు అమరావతిలో రూ.17వేల కోట్లు వరకు ఖర్చు చేస్తే, జగన్ రూ.30 వేల కోట్లతో గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లతో రూపరేఖలు మార్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పేదరికం 11నుంచి 4 శాతానికి తగ్గడమే జగనన్న గొప్పపాలనకు నిదర్శనమన్నారు. జగ్గయ్యపేటను అభివృద్ధి పథంలో నడిపించిన సామినేని ఉదయభాను గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాడగల సత్తాగల వ్యక్తి అన్నారు. నందిగామ అభివృద్ధి కోసం ముఖ్యంగా ఎంపీ నిధులు, రాజ్యసభ సభ్యుని నిధులతోపాటు ఏఒక్క అవకాశాన్ని వదలకుండా నిధులు తీసుకువచ్చి తనను నమ్ముకుని ఓట్లేసి గెలిపించిన ప్రజలకు మంచి చేసేందుకు తాపత్రయపడిన వ్యక్తి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వారిద్దరినీ గెలిపించాలని కోరారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఇప్పటివరకు 134 సార్లు బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో డబ్బులు వేశారన్నారు. ఈఎన్నికల్లో ప్రతిఓటరు రెండుసార్లు బటన్ నొక్కి జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో జన సునామీలో టీడీపీ, జనసేన, బీజేపీ కొట్టుకుపోతాయన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే తమకు మంచి జరుగుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారని పేర్కొన్నారు. పేటలో సీనియర్ న్యాయవాది సామినేని వెంకటేశ్వరరావు ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆయోధ్య రామిరెడ్డి, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, నియోజకవర్గ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, ఎన్టీఆర్ జిల్లా మహిళా సంఘ అధ్యక్షురాలు సంపత్ విజిత పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పండ్లతో తయారుచేసిన గజమాల వేస్తున్న అభిమానులు

ఐదేళ్లు హుందాగా నడుచుకున్నా.. జగన్‌మోహనరావు

నందిగామలో నిర్వహించిన బహిరంగసభలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల హయాంలో చాలా హుందాగా నడుచుకున్నానని పేర్కొన్నారు. నందిగామ మాజీ ఎమ్మెల్యేలు పిల్లలమర్రి వెంకటేశ్వరరావు, అడుసుమల్లి సూర్యనారాయణరావు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, దేవినేని వెంకటరమణ మాదిరిగా తాను కూడా నియోజకవర్గ ప్రతిష్టను పెంచేలా పనిచేస్తానని గత ఎన్నికల నామినేషన్ సమయంలో హామీ ఇచ్చానని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం గర్వంగా తలెత్తుకునేలా ఐదేళ్ల పాలన సాగించినట్లు తెలిపారు. గతంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు చేయలేని అభివృద్ధి పనులను సైతం తాను చేసి చూపించానని వివరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందిస్తామని చెప్పారు. ఈ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయఢంకా మోగిస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాయకులు కోవెలమూడి వెంకట నారాయణ, చల్లా బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



చెస్ ఉచిత శిక్షణ హాజరైన చిన్నారులతో వినోద్‌కన్నన్, పి.ఐశ్వర్య, ఎస్‌కే ఖాసీం

విజయవాడస్పోర్ట్స్: విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలని ఇన్‌కం టాక్స్ అదనపు డైరెక్టర్ వినోద్ కన్నన్(ఐఆర్ఎస్) సూచించారు. మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమిలో ఏర్పాటు చేసిన చదరంగం వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేథోశక్తిని పెంచేందుకు చెస్ దోహదపడుతుందన్నారు. విజయవాడలో చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తున్న అకాడమి కార్యదర్శి ఎస్‌కే ఖాసీంను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించేలా చిన్నారులను సిద్ధం చేయాలని సూచించారు. మోడల్ డెయిరీ డైరెక్టర్(ఫైనాన్స్) పి.ఐశ్వర్య మాట్లాడుతూ చదరంగంలో జాతీయస్థాయి క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. గ్లోబల్ చెస్ అకాడమి ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసీం మాట్లాడుతూ 20ఏళ్లుగా చెస్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తూ ఎంతో మంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. రెండు నెలలపాటు నిర్వహించే ఈ క్యాంప్‌లో విద్యార్థులంతా క్రమశిక్షణతో చెస్ ఆటను నేర్చుకోవాలని సూచించారు.

26 నుంచి కేఎల్‌యూ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ పార్థసారథి వర్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం ఈ నెల 26వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. నగరంలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డేశ్వరంలోని యూనివర్సిటీ సి–బ్లాక్ లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థులతోపాటు ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. కేఎల్ ట్రిపుల్‌ఈ ఎంట్రన్స్ పరీక్షలో లక్షమంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఉపకార వేతనాలు పొందుకోవాలనుకునే విద్యార్థులు ఈనెల 26 నుంచి 30వతేదీ వరకు జరుగుతున్న కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.యూనివర్సిటీ కౌన్సెలింగ్ కన్వీనర్ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ కు వచ్చే విద్యార్థులు సంబంధిత డాకుమెంట్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బాలచంద్రరావు మృతదేహం

కోడూరు: ద్విచక్ర వాహనంపై శుభకార్యానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో లారీ కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సమీపంలోని నున్న గ్రామానికి చెందిన లంకె బాలచంద్రరావు(55) ద్విచక్ర వాహనంపై కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చాడు. తిరిగి రాత్రి 9.30 గంటల సమయంలో నున్న బయలుదేరాడు. ఈ తరుణంలో కోడూరు వైపు నుంచి అవనిగడ్డ వెళ్తున్న మినుముల లోడు లారీని వి.కొత్తపాలెం సమీపంలో బాలచంద్రరావు ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో బైక్ అదుపు తప్పి లారీ కిందకు దూసుకువెళ్లింది. ఇది గమనించని లారీ డ్రైవర్ ముందుకు నడపడంతో వాహనం బాలచంద్రరావు శరీరంతో పాటు తలపై నుంచి వెళ్లింది. బాలచంద్రరావు శరీరభాగాలు, తల నుంచి తీవ్రమైన రక్తస్రావం జరిగి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలపై కేసుల నమోదు

గుడివాడరూరల్: గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము నామినేషన్ సందర్భంగా గుడివాడ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించిన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ గౌతమ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మంగళవారం జరిగిన ర్యాలీలో బారికేడ్లు తొలగించి అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తులసీ, మిక్కిలినేని రమేష్ సహా మరో 10 మందిపై సెక్షన్ 188 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పక పాటించి తమకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

మావయ్యల కోసం అల్లుళ్ల ప్రచారం

ప్రచార పర్వం



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల అల్లుళ్లు, కుటుంబసభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు తరఫున వారి అల్లుళ్లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కూతురు సాయిఅశ్వత, కేశినేని అల్లుడు కాజా రఘునాధంతోపాటు కుటుంబసభ్యులు బుధవారం నగరంలోని 26వ డివిజన్‌లోని ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో రాందేవ్‌గుప్తా, వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామ, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగం ఆధారంగానే బిల్లింగ్

జిల్లా కోఆర్డినేటర్ భాస్కరరావు



మచిలీపట్నం టౌన్: జిల్లాలో ఏ విద్యుత్ వినియోగదారునికైనా వారి విద్యుత్ వినియోగం ఆధారంగానే బిల్లు వస్తోందని, ఐదేళ్లుగా విద్యుత్ చార్జీలు పెరగలేదని విద్యుత్‌శాఖ జిల్లా కోఆర్డినేటర్ మన్నెం భాస్కరరావు స్పష్టం చేశారు. స్థానిక పుట్లమ్మ చెరువుల వద్ద ఉన్న తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఓ పత్రికలో(సాక్షి కాదు) విద్యుత్ బిల్లులను పెంచారంటూ ప్రచురించిన కథనాలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఏటా విద్యుత్ వినియోగదారుల సంఖ్య, విద్యుత్ వినియోగం పెరుగుతుండటం సహజమన్నారు. సంస్థాగత లోపాలను సరిచేసుకుని అత్యున్నత ప్రమాణాలతో విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. సంస్థ ఆదాయం పెరిగిందంటే వినియోగదారులపై భారాలు మోపినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ విషయాలపై అవగాహన లేకుండా విద్యుత్ బిల్లులు పెరిగాయంటూ కథనాలు రాయడం సబబుకాదన్నారు. ఆదాయం పెరుగుదలకు కారణాలు పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా అవగాహన లేమితో వార్తలు ప్రచురించమంటే ప్రజల్లో లేనిపోని అపోహలకు తావివ్వడమేనన్నారు. గృహ, వ్యాపార విద్యుత్ వినియోగానికి ఒకే బిల్లు ఇచ్చారంటూ అస్పష్టంగా ఉన్న బిల్లును అచ్చేసి అదే నిజమని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. ప్రతి విద్యుత్ బిల్లులో ఆనెలలో వినియోగించిన యూనిట్లు, సగటు యూనిట్ల వినియోగాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తున్నామన్నారు.వేసవిలో విద్యుత్ వినియోగం సాధారణంగానే పెరుగుతుందని, దీంతో విద్యుత్ బిల్లు సహజంగానే పెరుగుతుందన్నారు. కాని ఈ విషయాలన్నింటినీ వక్రీకరిస్తూ అవాస్తవ కథనాలు రాయడం తగదని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 25 కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో కొడాలి చిన్ని

గుడివాడరూరల్: టీడీపీకి చెందిన 25 కుటుంబాలు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ చేరాయి. స్థానిక కార్మికనగర్‌కు చెందిన టీడీపీ నాయకులు 70మందికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సోదరుడు కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొడాలి చిన్ని మాట్లాడుతూ పేద వర్గాలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందచేసి వారి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. సంక్షేమ పాలనను గమనించే టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, గుడివాడలో ఎమ్మెల్యేగా కొడాలి నాని విజయం సాధించాలన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని చిన్ని భరోసా ఇచ్చారు. పార్టీ విజయానికి కృషిచేయాలని పార్టీలో చేరిన షేక్ గౌస్, షేక్ నాగర్‌మీరావలి, మస్తాన్‌వలి, అజిత్, ఇమామ్ తదితర 70మందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, కొల్లి విజయ్, కార్మికనగర్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో వధువు తల్లి మృతి
- తీవ్రంగా గాయపడిన వధువు



మృతిచెందిన చంద్రలీల

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. నరసాపురం పట్టణానికి చెందిన కైకాల చంద్రలీల(61) తనకుమార్తె అనూష వివాహాన్ని నరసాపురంలో జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి తల్లీ కూతుళ్లు కారులో విజయవాడ నుంచి నరసాపురానికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెందుర్రు వద్ద రోడ్డుపై మృతిచెంది ఉన్న గేదెను గమనించని కారుడ్రైవర్ వేగంగా వెళ్లి ఢీకొట్టారు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో చంద్రలీల అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడిన అనూష, కారుడ్రైవర్ లోకేష్‌ను పోలీసుల సాయంతో 108 వాహనం ద్వారా మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండురోజుల్లో శుభకార్యం జరగాల్సి ఉండగా చంద్రలీల మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కళాశాల భవనంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం



కళాశాల భవనం నుంచి వెలువడుతున్న పొగ



భవనం నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు

- స్టోర్‌రూమ్‌లో అలుముకున్న మంటలు
- ప్రాణభయంతో పరుగులు పెట్టిన విద్యార్థులు

కంకిపాడు: పునాదిపాడులోని శ్రీచైతన్య విద్యాసంస్థల భవన సముదాయంలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సేకరించిన వివరాల ప్రకారం..స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల భవన సముదాయంలోని ఓ భవనంలో స్టోర్ రూమ్ నుంచి మంటలు వ్యాపించాయి. పొగ కమ్ముకోవడాన్ని గమనించిన కళాశాల సిబ్బంది, విద్యార్థులు హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. కళాశాల సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ పొగదెబ్బకు సాధ్యంగాక వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కళాశాల సిబ్బంది ఘటనపై ఎలాంటి ఫిర్యాదు ఇవ్వకపోవడంతో ఆస్తినష్టం ఏ మేరకు జరిగిందీ స్పష్టత లేదు. అగ్ని ప్రమాదం స్టోర్ రూమ్‌లో చోటుచేసుకోవడం, అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వేఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. బాపులపాడు మండలం వేలేరుకు చెందిన పఠాన్ ఇలియాజ్ (24) హనుమాన్ జంక్షన్‌లోని ఓ చికెన్‌షాపులో పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి బైక్‌పై హనుమాన్‌జంక్షన్ నుంచి నూజివీడు వైపునకు వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఇలియాజ్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదుపుతప్పి కారు బోల్తా



అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

నందిగామ: అదుపుతప్పి కారు పల్టీ కొట్టిన ఘటన బుధవారం నందిగామ మండలంలో చోటుచేసుకుంది.సేకరించిన సమాచారం ప్రకారం.. నందిగామ నుంచి అడవిరావులపాడు వైపు వెళ్తున్న కారు, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కందకంలో పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు యువకులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు కూడా కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా


బ్రెస్ట్ క్యాన్సర్‌కు అధునాతన సర్జరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): దీర్ఘకాలిక అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌తో పాటు కార్డియో మయోపతి, మూత్రపిండాల వ్యాధులున్న మహిళలకు అధునాతన పద్ధతిలో మత్తును ఇచ్చి బ్రెస్ట్ క్యాన్సర్‌కు సర్జరీ చేసినట్లు సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు తెలిపారు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో అద్భుతమైన పురోగతిని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ముగ్గురు హైరిస్క్ మహిళా రోగులకు వినూత్నమైన మత్తు పద్ధతిని ఉపయోగించి రొమ్ము క్యాన్సర్‌కు సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఇలా 67 ఏళ్లు, 74 ఏళ్లు, 83 సంవత్సరాల వయస్సుగల మహిళలకు శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆయన వెల్లడించారు. జనరల్ ఎనస్థీషియా ఇస్తే ప్రాణాపాయం ఉన్న మహిళలకు అధునాతన మత్తు విధానం పారా వెర్టెబ్రల్ బ్లాక్, వెన్నెముక నరాల దగ్గర లోకల్ ఎనస్థీషియా అందించడం ద్వారా సోమాటిక్, సింపాథటిక్ నెర్వ్స్ ఆదుకుంటాయని ఆయన తెలిపారు.

స్వర్ణభారత్‌లో 28 నుంచి ఉచిత హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఈ నెల 28 నుంచి మే ఒకటో తేదీ వరకు డాక్టర్ జీవీ చలపతి మెమోరియల్ హోమియోపతిక్ సెల్ఫ్ రిలయన్స్ ఫోరం సౌజన్యంతో నాలుగు రోజుల ఉచిత హోమియోపతి వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు పీవీ సత్యనారాయణరావు ట్రస్ట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తామన్నారు. అలాగే ప్రతి రెండు నెలలకు ఒక నాలుగు రోజులు హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 94912 21119, 94403 25670 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంపీఏ రాత పరీక్షలు ప్రారంభం




కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠంలో ఎంపీఏ (మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్) నాలుగు, రెండో సెమిస్టర్ రాత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన కూచిపూడి నాటక క్రమ వికాసం పేపర్‌కు 17 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాపీఠం ప్రిన్స్‌పాల్, పరీక్షల పర్యవేక్షణా అధికారి డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తెలిపారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వ్యవహరించారు.

పద్యనాటక వైభవాన్ని చాటిన శ్రీనివాస కల్యాణం



విజయవాడకల్చరల్: సుబ్బరాజు కళాపరిషత్ తిరుపతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం ప్రదర్శించిన శ్రీ శ్రీనివాస కల్యాణం పద్య నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బ్రహ్మలోకం నుంచి మహాలక్ష్మి భూలోకానికి రావడం ఆమె వెనుకే మహావిష్ణువు రావడం, మహాలక్ష్మి పద్మావతిగా అవతరించడం, శ్రీ మహావిష్ణువు శ్రీనివాసునిగా అవతరించడం, శ్రీనివాసుని లీలలు, పద్మావతి శ్రీనివాసుల వివాహం అంశంగా నాటకం సాగింది. రచన, సంగీతం దర్శకత్వం కోనేటి సుబ్బరాజు, పద్మావతిగా సురభి హారిక, మహావిష్ణువుగా డాక్టర్ ఆమూరి సుబ్రహ్మణ్యం, భృగు మహర్షిగా కోనేటి సుబ్బరాజు, నారదునిగా కే రాధాకృష్ణతో పాటు ఇతర నటీనటులు పాత్రోచిత న్యాయం చేశారు. సంస్థ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ పద్యనాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. రంగస్థల ప్రముఖులు సంగమేశ్వరరావు, సత్యనారాయణ, రాజేంద్రలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

జక్కంపూడి కాలనీలో పోలీసుల కవాతు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో బుధవారం కేంద్ర అదనపు బలగాలు, విజయవాడ సిటీ పోలీసులు కవాతు నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో సాగిన కవాతులో కొత్తపేట సీఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించే దిశగా, ప్రజలకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చి, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన కవాతు అన్ని ప్రధాన వీధులలో సాగింది.

అట్టహాసంగా అవినాష్ నామినేషన్

ఉప్పెనలా తరలివచ్చిన అభిమానుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. జై జగన్.. అవినాష్ అన్నా జిందాబాద్ నినాదాలు హోరెత్తాయి. అడుగడుగునా మహిళలు ఎదురేగి హారతులిచ్చారు. అభిమానులు గజమాలలతో స్వాగతం పలికారు. బంజారా నృత్యాలు, డప్పులు, డీజేలు, జగనన్న పాటలతో యువకుల్లో ఉత్సాహం మరింత ఉప్పొంగింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు నాయకులతో వైఎస్సార్‌సీపీ విజయవాడతూర్పు అసెంబ్లీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది.

- రామలింగేశ్వరనగర్ నుంచి కృష్ణలంక వరకూ ర్యాలీ
- ర్యాలీలో పదివేల మందికి పైగా పాల్గొన్న వైనం
- అడుగడుగునా గజమాలలతో ఘన స్వాగతాలు
- అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల దాఖలు
- తొలుత కంకిపాడులోని గంగానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు



దేవినేని అవినాష్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ అవినాష్‌ను కలిసి తన సంఘీభావం తెలిపారు. అక్కడి నుంచి కృష్ణవేణి స్కూల్ రోడ్డులో కొద్దిదూరం అవినాష్‌తో కలిసి నడిచారు. ఎంపీ కేశినేని కుమార్తెలు హైమా, శ్వేత, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించిన ర్యాలీలో చివరివరకూ కొనసాగారు. ర్యాలీ మధ్యలో ఇటీవల పార్టీలో చేరిన పోతిన మహేష్ కలిసి అవినాష్‌ను శాలువాతో సత్కరించారు.

ర్యాలీలో జన ప్రభంజనం

రామలింగేశ్వరనగర్ పడవుల రేవు సెంటర్ నుంచి కృష్ణలంక డీసీఎం హోటల్ వరకూ నిర్వహించిన ర్యాలీ జన ప్రభంజనంగా మారింది. వేసవి మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చారు. పలుచోట్ల మహిళలు ఎదురేగి హారతులిచ్చారు. పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా నినాదాలు చేశారు. విజయవాడ తూర్పు..అవినాష్‌తోనే మార్పు అనే నినాదాలు హోరెత్తగా, జై జగనన్న జై అవినాష్ అన్న అంటూ యువత నినాదాలతో హోరెత్తించారు. ఈ ర్యాలీలో పది వేల మందికి పైగా అభిమానులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గజమాలలతో స్వాగతం

ర్యాలీలో అడుగడుగునా గజమాలలతో ఘనస్వాగతాలు పలికారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో స్క్యూబ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన గజమాల ఆకట్టుకుంది. బెల్లం దుర్గ ఆధ్వర్యంలో పడవల రేవు సెంటర్‌లో, కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో రాణీగారితోటలో, కృష్ణలంక ఎం.హోటల్ వద్ద కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. సత్యంగారి హోటల్ వద్ద 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా రెండు గజమాలలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పులిపాటి దుర్గారెడ్డి గజమాల ఏర్పాటు చేశారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు నాలుగు గుర్రాలతో స్వాగతం పలకడం అందరినీ ఆకట్టుకుంది.

సర్వమత ప్రార్థనలు

తొలుత స్వగ్రామం కంకిపాడులోని గంగానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి 12వ డివిజన్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అదే ప్రాంతంలో ముస్లిం మత పెద్దలు దువా చేసి ఆశీర్వాదాలు అందిచారు. పడవుల రేవు సెంటర్‌లో పెద్ద సంఖ్యలో క్రైస్తవ పాస్టర్లు విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. 22వ డివిజన్‌లో పలువురు అర్చకులు కలిసి ఆశీర్వచనాలు అందించారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్

కృష్ణలంకలో ర్యాలీ ముగించుకుని ఎంజీ రోడ్డులోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తూర్పు రిటర్నింగ్ ఆఫీసర్ బీహెచ్ భవానీశంకర్‌కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దేవినేని అవినాష్, కేశినేని నానిలకు గజమాల వేస్తున్న అభిమానులు



ర్యాలీలో దేవినేని అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కేశినేని శ్వేత



దేవినేని అవినాష్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న నృత్య కళాకారులు

మీ కుటుంబ సభ్యుడిగా నన్ను దీవించండి!

నామినేషన్ అనంతరం మీడియాతో దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): "గత నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో ప్రతి గడపకు నాలుగుసార్లు వచ్చాను. నన్ను మీ కుటుంబ సభ్యుడిగా భావించి దీవించండి" అని దేవినేని అవినాష్ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ వేసిన అనంతరం అవినాష్ మీడియాతో మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమం వేలాది మంది మధ్య ఘనంగా జరిగింది. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపారు. పది సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ పీడ విరగడ కానుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నామినేషన్ ర్యాలీ విజయయాత్రలా సాగిందని, నామినేషన్ ద్వారానే నియోజకవర్గంలో తమ సత్తా ఏమిటో చూపించామన్నారు. మహిళల ఆశీర్వాదం, పెద్దల దీవెనలతో విజయయాత్రగా సాగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో రూ.650 కోట్లతో అభివృద్ధి, రూ.900 కోట్లతో సంక్షేమ పథకాలు అందించామన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు, రోడ్లు , డ్రెయిన్లు, కొండ ప్రాంతాల్లో మెట్లు అభివృద్ధి చేశామన్నారు. కృష్ణలంక ప్రజల చిరకాల కోరిక రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసి చూపించామన్నారు. తాను ఈ నాలుగున్నరేళ్లుగా మీకు ప్రతి సమస్యలో అండగా నిలిచానని, తనను కుటుంబ సభ్యుడిలా భావించి దీవించాలని కోరారు. కరోనా కష్టకాలంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించామని, గద్దె రామ్మోహన్ కరోనా కాలంలో ఇంట్లో దాక్కున్నారని విమర్శించారు. తూర్పు ప్రజలకు సేవ చేయడానికి తనకు ఒక్క అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నామినేషన్ ర్యాలీకి వచ్చిన ప్రతి ఒక్కరికీ అవినాష్ ధన్యవాదాలు తెలిపారు.



నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

అభిమానులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వర



అవినాష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు అసెంబ్లీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొరివి చైతన్య(వర) ధన్యవాదాలు తెలిపారు. ర్యాలీకి వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారని, మహిళలు అడుగడుగునా హారతులిచ్చి స్వాగతం పలికారన్నారు.

అవినాష్‌కు చిరు సత్కారం

అశోక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి గుడిలో పూజల అనంతరం ముస్లిం పెద్దలు ప్రార్థనలు చేసి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ శాలువాతో అవినాష్‌కు చిరు సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో దేవినేని అవినాష్ ఎన్నికల ప్రచారం



పదో డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడ తూర్పు): వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. వాసవి నగర్, మారుతి కాలనీ, పీ అండ్ టీ కాలనీ ప్రాంతాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడుతూ 58 నెలల పాలనలో వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. మళ్లీ జగన్ సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటూ వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కరుటూరి హరీష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కృష్ణలంకలో జనప్రభంజనం





కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం ; కార్పొరేటర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఖర్బూజా, పుచ్చకాయలతో గజమాల

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ నామినేషన్ ర్యాలీకి కృష్ణలంక ప్రాంతంలో అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. రాణీగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి స్వాగతం పలికారు. పలువురు మహిళలు హారతులివ్వగా, మరికొందరు వినూత్నంగా స్వాగతం పలికారు.

- 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు.
- 18వ డివిజన్ కార్పొరేటర్ వెంటక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.
- 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు ఆధ్వర్యంలో గజమాలతో పాటు, వినూత్నంగా నాలుగు గుర్రాలతో స్వాగతం పలికారు.
- 21 డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి ఆధ్వర్యంలో ప్రజలు స్వాగతం పలికారు.
- 22వ డివిజన్‌లో తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా ఖర్బూజా, పుచ్చకాయలతో రూపొందించిన గజమాలలు వేసి స్వాగతం పలికారు.

రాణీగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కేశినేని నాని కుమార్తెలు శ్వేత, హైమ, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మల కుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, వియ్యపు అమర్నాథ్, మెరకనపల్లి మాధురి, ఎండీ రెహానా నాహీద్, చింతల సాంబయ్యలతో పాటు, డివిజన్ ఇన్‌చార్జి గల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరకత శివలింగ వాయు ప్రతిష్ట



మరకత శివలింగ వాయు ప్రతిష్టలో గౌతంరెడ్డి, కమిటీ పెద్దలు, భక్తులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై రత్న ధాతు, ధాన్య యంత్ర సహిత శివలింగ ప్రతిష్టను కనులపండువగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే విచ్చేసి స్వామివారికి స్వయంగా అభిషేకాలు చేశారు. సాయంత్రం విశిష్ట అలంకరణ, అర్చనలు జరిగాయి. గౌతంరెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణార్థం తలపెట్టిన మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు కనులపండువగా జరిగాయని అన్నారు. ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేసి, స్వామివారి కృపకు పాత్రులైన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, పి.శ్రీనివాసరావు, సైదులు, లఖంరాజు సునీత పాల్గొన్నారు.

కాపులకు అండగా జగన్ ప్రభుత్వం



ఉమ్మారెడ్డిని సత్కరించిన నరహరశెట్టి శ్రీహరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కాపులకు అండగా ఉందని శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నరహరశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును ఆయన కార్యాలయంలో కలిసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డికి సత్కరించారు. అనంతరం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శ్రీహరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినంత మేలు మరి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు కాపులకు కేటాయించి గౌరవించారని వివరించారు. తనకు పదవి రావటంలో కృషి చేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

306 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: మండలంలోని దాములూరు సమీపంలో గల రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బుధవారం నందిగామ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మినీ వ్యాన్‌పై 306 మద్యం సీసాలను తీసుకువస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నందిగామ సీఐ హనీష్ తెలిపారు. తనిఖీలలో ఎస్ఐ దుర్గామహేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుని రథోత్సవం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి కనుల పండువగా స్వామి వారి రథోత్సవం జరిగింది. కల్యాణ ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ వద్ద నుంచి గ్రామ పుర వీధుల్లో రథోత్సవం సాగింది. గ్రామస్తులు రథోత్సవానికి వారులుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిలకల్లు ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నూతక్కి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది.

చందన అలంకరణలో మారెమ్మ అమ్మవారు

విస్సన్నపేట: మండల పరిధి పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. బుధవారం రెండో రోజున అమ్మవారిని చందన లేపనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రభ బండిపై అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది.

బ్రాహ్మణ సంక్షేమానికి అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం కృషి



ఉపనయన కార్యక్రమంలో వటువులు, నిర్వాహకులు

విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమం కోసం అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆ సేవా సంఘం కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ అన్నారు. సేవా సంఘం ఆధ్వర్యాన సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో బ్రాహ్మణ బాలురకు ఉచిత ఉపనయన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సనాతన వైదిక ధర్మం, వేద సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. నిత్యానుష్ఠానం ద్వారా ధర్మ మార్గం అలవడుతుందని అన్నారు. సంస్థ అధ్యక్షుడు గురునాథశర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో ఉపనయన కార్యక్రమం వైభవంగా జరిగింది. బాచిప్ప నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సేవా సంఘం కన్వీనర్లు యడ్లపాటి శేషసాయి, శిరీష, కోశాధికారి అనుమల రాంబాబు, సభ్యులు భమిడిపాటి గణపతి, కామర్స్ రాజేష్, ఈసీ సభ్యులు విజయలక్ష్మి, మాధవి, మూర్తి, కాశీభట్ల రవికుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు నిత్య అనుష్టానికి అవసరమైన పూజా సామగ్రిని అందజేశారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రచయిత తల్లాప్రగడ మృతికి సాంస్కృతిక సంస్థల సంతాపం



విజయవాడకల్చరల్: కవి, రచయిత, కాలమిస్ట్ తల్లాప్రగడ రవికుమార్ మృతికి నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ రవికుమార్ సుదీర్ఘకాలం ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలు విజయవంతం కావడానికి కృషి చేసినట్లు తెలిపారు. సాహితీవేత్త సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరమాల అనే స్వీయ కథా సంపుటిని వెలువరించారని, సినీ కవి వేటూరి సుందరరామమూర్తి కవితా సంపుటి 'సిరికాకొలను చిన్నది' అచ్చువేశాడని వెల్లడించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో జరిగిన అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ తన సంతాప సందేశంలో రవికుమార్ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు అని అభివర్ణించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, విద్యావేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, డాక్టర్ జయంతి చక్రవర్తి, గోళ్ల నారాయణరావు సంతాపం తెలిపారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప చిన్న వంతెన ప్రాంతంలో మోకా నాగేంద్రరావు కటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతను తాపీ పని చేస్తాడు. ఈ నెల 23న భార్యాభర్తలిద్దరూ ఇంట్లో నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి భార్య కనిపించలేదు. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


సభకు భారీగా హాజరైన జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్


సభకు హాజరైన అశేష జనసందోహానికి ర్యాంప్‌పై వెళుతూ అభివాదం చేస్తున్న సీఎం జగన్

జగన్ మార్కుతో సమాజం 'సిద్ధం'

58 నెలలుగా విప్లవాత్మక మార్పులు తెస్తూ చేస్తున్న యుద్ధమే ఈ "సిద్ధం": అక్కవరం సభలో సీఎం జగన్

సాక్షి, శ్రీకాకుళం: ''ఇంటింటి అభివృద్ధిని కాపాడుకునేందుకు సిక్కోలు సింహాలు ఇవాళ ఇక్కడకు కదలివచ్చాయి. ఈ విప్లవ గడ్డపై ఆ పెత్తందార్ల ముఠాపై ఎగురవేస్తున్న తిరుగుబాటు బావుటా కనిపిస్తోంది. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు అడుగడుగునా జన సముద్రమే. వైఎస్సార్ జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు దారి పొడవునా జన సునామీని చూస్తుంటే 25 ఎంపీలకు 25 ఎంపీలు, 175 అసెంబ్లీ స్థానాలకు 175 అసెంబ్లీ స్థానాలు మొత్తంగా డబుల్ సెంచరీ కొట్టేందుకు మీరంతా సిద్ధమేనా?'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 22 రోజుల పాటు సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం అక్కవరం వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

బలమైన పునాదులతో..

ఇంటింటి భవిష్యత్తు, పథకాల కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలు మరో 18 రోజుల్లో జరగనున్నాయి. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కాదు. ఈ 58 నెలల కాలంలో బలమైన పునాదులతో పేదల కోసం తెచ్చిన పలు సంస్కరణలు, పథకాలు కొనసాగాలా? వద్దా? అనేది నిర్ణయించే ఎన్నికలు. జగన్‌కు ఓటు వేస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయి. చంద్రబాబుకు ఓటేయమంటే పథకాలన్నింటికీ ముగింపే. మళ్లీ మోసపోవటమే. జగన్‌ను ఓడించాలని వాళ్లు.. పేదలను గెలిపించాలని మనం తలపడుతున్న ఈ యుద్ధంలో మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకునేందుకు మీరంతా సిద్ధమేనా? మంచి చేసిన చరిత్రగానీ, పేదల ఆశీస్సులుగానీ లేని ఆ మూడు పార్టీల కూటమి, వారి మోసాలకు చెంప ఛెళ్లుమనేలా సమాధానం చెప్పేందుకు మీరంతా సిద్ధమేనా?

కుటుంబంతో చర్చించండి

సినిమాకు వెళ్లినప్పుడు హీరో ఎందుకు నచ్చుతాడు? విలన్ ఎందుకు నచ్చడో ఒక్కసారి ఆలోచించండి. గుణగణాలు, మంచితనం వల్ల మా హీరో అని అనుకుంటాం. మోసాలు, అబద్ధాలు, కుట్రలు పన్నే క్యారెక్టర్‌ను విలన్ అంటాం. నిజ జీవితంలో, రాజకీయాల్లో హీరో ఎవరు? విలన్ ఎవరు? అనేది ఒక్కసారి ఆలోచన చేయండి. మీరంతా ఇంటికి వెళ్లాక కాసేపు కుటుంబ సభ్యులతో కూర్చుని నింపాదిగా మాట్లాడండి. చిన్నపిల్లల అభిప్రాయాన్ని కూడా తెలుసుకోండి. అవ్వాతాతలు, ఆడపడుచుల అంతరంగాన్ని గమనించండి. ఎవరి పాలనలో మంచి జరిగింది? ఎవరు ఉంటే ఆ మంచి కొనసాగుతుందనే నమ్మకం కలుగుతుందో వారితోనే అడుగులు ముందుకు వేయాలని కోరుతున్నా.



2014లో చంద్రబాబు ముఖ్యమైన మోసాలివీ..

- రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా?
- పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఒక్కరికైనా ఇచ్చాడా?
- అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి అయ్యాయా?
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. చేశాడా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. కట్టాడా? టెక్కలిలో లేదా శ్రీకాకుళంలో ఏమైనా కనిపిస్తోందా?
- ముఖ్యమైన హామీలంటూ ఒక్కటైనా నెరవేర్చాడా?
- పోనీ ప్రత్యేక హోదా తెచ్చాడా అంటే అదీ లేదు.
- ఇప్పుడు సూపర్ సిక్స్, సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజి కార్ అంటూ మళ్లీ మోసాలకు తయారయ్యారు.

మీ గుండె చప్పుడే "సిద్ధం"

పొత్తుల జిత్తులు, జత కట్టిన జండాలకు బదులిస్తూ జగన్ వెనుక ఎన్ని కోట్ల మంది పేదలున్నారో చూపిస్తే అదే.. సిద్ధం! సామాన్యులు, పేదల గుండె చప్పుడే ఈ సిద్ధం. ఇడుపులపాయలో మొదలై ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ బస్సు యాత్ర మన పార్టీ జైత్రయాత్రకు సంకేతం. ఇది మూడు నాలుగు నెలల క్రితం మొదలు పెట్టింది కాదు. ఓ 25 సభలతో వచ్చింది కాదు. మనందరి ప్రభుత్వం 58 నెలలుగా విప్లవాత్మక మార్పులు తెస్తూ చేస్తున్న యుద్ధమే ఈ సిద్ధం.

ఆ చైతన్యం పేరే..

ఇక్కడ నిర్వహిస్తున్న సభ పేరు మాత్రమే కాకుండా మరో ఐదేళ్ల ఈ మార్పులన్నీ కొనసాగాలని ఇంటింటికీ వెళ్లి వారు మరో వంద మందికి వివరించాల్సిన అవసరాన్ని చెప్పే అవసరమే ఈ సిద్ధం! మీకు మంచి జరిగి ఉంటే.. మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవాలని ప్రజలను కోరే ధైర్యమే సిద్ధం! ఎన్నికలు కాగానే మేనిఫెస్టోను చెత్తబుటలో పారేసే చంద్రబాబు సంస్కృతిని సమాధి కట్టి 99 శాతం వాగ్దానాలను నెరవేర్చి ఇంటింటికీ మళ్లీ ఆ మేనిఫెస్టోను పంపి ఎన్నికల వాగ్దానాలపై చేసిన చైతన్యం పేరే సిద్ధం! పేదలు, అక్కచెల్లెమ్మలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా సాధికారత దిశగా చెయ్యి పట్టుకుని నడిపించే ఘటమే ఈ సిద్ధం! ఇంతగా సిద్ధమైన సమాజంతో, మీ జగన్ పార్టీతో యుద్ధానికి బాబు మరో మూడు పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సి వస్తోంది. పరోక్షంగా కూడా పొత్తులు వెతుక్కోవాల్సి వస్తోంది. కుట్రలకు దిగజారాల్సి వస్తోంది. నాలుగు మంచి పనులు చేశానని చెప్పలేని చంద్రబాబు రోజూ నన్ను తిట్టడం, తిట్టించడం, వారి ఛానళ్లు, పత్రికల్లో అదో ఘనకార్యమన్నట్లుగా చూపిస్తున్నారు. ఇది గొప్ప రాజకీయం అవుతుందా?

సీఎం జగన్‌ను కలవడానికి వచ్చిన దివ్యాంగుడు



మన అభ్యర్థులను ఆశీర్వదించండి

ఎంపీ అభ్యర్థి తిలక్, టెక్కలి నుంచి శ్రీను, ఆమదాలవలస నుంచి తమ్మినేని సీతారామ్, పలాస నుంచి డాక్టర్ అప్పలనాయుడు, పాతపట్నం నుంచి శాంతమ్మ, ఇచ్ఛాపురం నుంచి విజయమ్మ, నర్సీపట్నం నుంచి ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం నుంచి ధర్మాన ప్రసాదరావును ఆశీర్వదించి గెలిపించాలని కోరుతున్నా.



ఏనాడైనా ఆత్మవిమర్శ చేసుకున్నారా?

మన ప్రభుత్వం వల్ల పేదల కుటుంబాల్లో, వారి చదువుల్లో, అక్కచెల్లెమ్మల సాధికారతలో, అవ్వాతాతలకు అందిన మనశ్శాంతిలో, రైతన్నలకు అందిన ఆత్మస్థైర్యంలో, సామాజిక వర్గాలకు దక్కిన ఆత్మగౌరవంలో ఎంత మార్పు తీసుకురాగలిగామో టీడీపీ, చంద్రబాబు, ఆయనకు దరువు వేసే ఎల్లో మీడియా ఏనాడైనా కనీసం ఆత్మవిమర్శ చేసుకోవడం చూశారా? ఇలాంటి వారికి పరిపాలన ఇవ్వడం అంటే అర్థమేమిటి? ప్రభుత్వం అనేది ఎవరి కోసం? అందమైన వాగ్దానాలతో అధికారం లాక్కుని ఐదేళ్ల వంచించటానికి, లూటీ చేసి దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం, దాచుకోవడం కోసమే వారికి అధికారం కావాలని అడుగుతున్నారు.

బాబు రోల్డ్ గోల్డ్ దుకాణం..

మీ బిడ్డ కరోనా కష్టంలో కూడా సాకులు వెతుక్కోలేదు. ఏ ఒక్క పథకాన్నీ, బటన్లు నొక్కటాన్ని ఆపలేదు. పేదవారి కష్టం తన కష్టం కంటే ఎక్కువని భావించాడు. మీ జగన్ స్వచ్ఛమైన మనసుతో, మంచి చేశాననే ఆత్మవిశ్వాసం, ఆత్మ సంతృప్తితో మీ ముందు సవినయంగా తలెత్తుకుని నిలబడ్డాడు. 2014 ఎన్నికల్లో కూడా చేయలేని ఏ వాగ్దానాలనూ మేనిఫెస్టోలో మీ బిడ్డ చెప్పలేదు. రాష్ట్ర ప్రజలు, నమ్ముకున్న వారిని ఎన్నటికీ మోసం చేయడు. బాబు మాదిరిగా రోల్డ్ గోల్డ్ దుకాణం తెరవడు. దాన్ని బంగారం అని నమ్మించే యత్నం చేయడు. చంద్రబాబు నిర్వహించే వాగ్దానాల వేలంలో మీ బిడ్డ పాల్గొనడు. 14 ఏళ్ల అధికారంలో ఉండీ ఏ ఒక్క మంచి పని చేయని చంద్రబాబుతో మీ బిడ్డ పోటీ పడడు. మీ జగన్ మార్కు ఇవాళ ప్రతి పేద ఇంట్లోనూ కనిపిస్తుంది. ప్రతి అక్కచెల్లెమ్మ చిరునవ్వులో, అవ్వాతాతల ఆనందంలో, పిల్లల ఆత్మవిశ్వాసంలో కనిపిస్తుంది. మీ జగన్ మార్కు ప్రతి గ్రామంలోనూ కనిపిస్తుంది. జగన్‌కు పేదలపై ఉన్నంత ప్రేమ ఈ దేశ రాజకీయ చరిత్రలో మరే నాయకుడికీ లేదు, ఉండదు. ఇది నిజం. ఇది మాత్రమే నిజం.

నావల్ల కానిది బాబు జేజమ్మ కూడా చేయలేదు..

జగన్ చేయలేని ఏ స్కీమ్‌నూ చంద్రబాబు కాదు కదా.. ఆయన జేజమ్మ కూడా చేయలేదు! మోసాలు, అబద్ధాలతో ఏ స్థాయికైనా దిగజారి పొత్తులు పెట్టుకునే ఆయనతో మీ బిడ్డ పోటీ పడలేడు. నిజాలు, నిజాయితీకి ప్రజలు విలువ ఇస్తారన్న నమ్మకం నాకుంది. బాబు మాదిరిగా నేను మోసపూరిత వాగ్దానాలు చేయను. మోసాన్ని మోసంతోనే జయించాలన్న రాజనీతిని మీ బిడ్డ పాటించడు. మోసాన్ని నిజాయితీతోనే జయించవచ్చని నిరూపించటానికి మీ బిడ్డ సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమేనా?

మోసాలా.. విశ్వసనీయతా?

మీకు ఎలాంటి నాయకుడు కావాలని అందరినీ అడుగుతున్నా. బాబు లాంటి మోసగాడు కావాలా? జగన్ లాంటి నిజాయితీపరుడు కావాలా? మేనిఫెస్టోలో చెప్పేవన్నీ ఎగ్గొట్టే నాయకుడు అబద్ధాలు, వెన్నుపోట్లు నైజంగా కలిగిన నాయకుడు కావాలా? లేక నోటి నుంచి ఒక మాట వస్తే, మేనిఫెస్టోలో చేరిస్తే తు.చ. తప్పకుండా పాటించే జగన్ లాంటి నాయకుడు కావాలా? సొంత బలం లేక పొత్తుల డ్రామాలాడే నాయకుడు కావాలా? లేక చేసిన మంచిని చూపిస్తూ సింహంలా సింగిల్‌గా వచ్చే నాయకుడు కావాలా? మోసాలు చేసే చంద్రబాబు కావాలా? విశ్వసనీయతతో నిలబడే జగన్ కావాలా? తమ నాయకుడి గురించి కాలర్ ఎగరేసి గర్వంగా ఇంటింటికీ చెప్పుకోగలిగిన మీ బిడ్డ కావాలా? చెప్పిన మాటలు గాలికి వదిలేసే బాబు కావాలా?

వ్యత్యాసాన్ని తుడిచి వేస్తూ..

పిల్లలెవరకూ తమ కులం, మతం, ఆర్థిక పరిస్థితుల వల్ల మంచి చదువులు చదువుకోలేకపోయామని బాధపడేందుకు వీల్లేని సమ సమాజాన్ని మీ బిడ్డ నిర్మిస్తున్నాడు. ధనికులు, పేదలకు వేర్వేరు చదువులు అనే వ్యత్యాసాన్ని మీ బిడ్డ తుడిచి వేస్తున్నాడు. ఒక రైతు, ఒక కూలీ, చిరువ్యాపారి, పేద కుటుంబం, నిరుపేద సామాజిక వర్గం.. ఇలా ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వం నా కుటుంబానికి మంచి చేసిందని, ఆ మంచిని కొనసాగిస్తుందనే నమ్మకాన్ని ఇవ్వగలిగే పరిపాలనను 58 నెలలుగా అందిస్తున్నాడు.

వ్యవస్థలు బాగుండాలంటే..

మోసాలు, అబద్ధాలతో పోరాడుతూ రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? సిద్ధమైతే వారి చీకటి యుద్ధాన్ని, ఆ ఎల్లో మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు సెల్‌ఫోన్లలో టార్చిలైట్లను వెలిగించండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదలకు పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలనతో ముందుకు పోవాలన్నా, మన వ్యవస్థలన్నీ బాగుండాలన్నా ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లోనూ గొప్ప మెజార్టీతో గెలిపించాలి.


గోపీనగరం వద్ద సీఎం జగన్‌కు హారతి ఇస్తున్న మహిళలు


సభలో మేమంతా సిద్ధం అంటూ నినదిస్తూ సీఎం జగన్‌కు మద్దతు ప్రకటిస్తున్న ప్రజలు


సభలో ర్యాంప్‌పై వెళుతూ ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అక్కివలస: బస్సుయాత్రకు తరలివచ్చిన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అవ్వాతాతల ఆత్మీయత

సిక్కోలులో జన సంద్రం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఉత్తరాంధ్ర వాత్సల్యం

- 22 రోజులపాటు దిగ్విజయంగా 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర
- ఉదయం 6 గంటల నుంచే జనంతో కిక్కిరిసిన అక్కివలస బస శిబిరం
- వైఎస్ జగన్ సమక్షంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- అక్కవరం సభలో సీఎం జగన్ ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం



మండపం టోల్‌గేట్: సీఎం జగన్‌ను కలిసేందుకు తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

తొలి సూర్యకిరణాలు తాకే అరసవెల్లి సూర్యనారాయణమూర్తి సాక్షిగా జననేతను సిక్కోలు అక్కున చేర్చుకుంది. మంగళవారం విజయనగరం జిల్లాలో పర్యటన అనంతరం శ్రీకాకుళం జిల్లా అక్కివలసలోని రాత్రి బస శిబిరానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలుకరించేందుకు ఉదయం ఆరు గంటల నుంచే పరిసర గ్రామాలకు చెందిన పిల్లలు, పెద్దలు భారీ ఎత్తున తరలివచ్చారు. ప్రియతమ నేతను కళ్లారా చూడాలని, వీలైతే ఓ సెల్ఫీ తీసుకోవాలని ఉత్సాహం చూపారు. బుధవారం ఉదయం తిరిగి ప్రారంభమైన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 22వ రోజు సుమారు 64 కి.మీ. మేర సాగి టెక్కలి నియోజకవర్గం అక్కవరం బహిరంగ సభతో ముగిసింది. రాత్రి బస శిబిరం వద్ద శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం జగన్‌ను కలిశారు. సీఎం వారిని పేరుపేరునా పలకరిస్తూ యోగక్షేమాలు ఆరా తీసి దిశానిర్దేశం చేశారు. అనంతరం వేలాదిగా తరలి వచ్చిన అభిమానులతో అక్కివలస నుంచి ప్రారంభమైన యాత్ర ఆమదాలవలస కొత్తరోడ్డు, మడపాం, నిమ్మాడ, పొడుగుపాడు, కోటబొమ్మాళి జంక్షన్, కన్నెవలస, చమయ్యపేట వరకు సాగింది. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం నేతలతో కలసి అక్కవరం బహిరంగ సభ ప్రాంగణం వద్దకు సీఎం చేరుకున్నారు. 'సిద్ధం సిద్ధం.. సీఎం సీఎం' అంటూ మిన్నంటిన నినాదాలతో సభా ప్రాంగణం సముద్ర హోరును తలపించింది.

సీఎం మాట్లాడుతుండగా ఆకాశం మేఘావృతం

ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రారంభమైన యాత్రకు అక్కచెల్లెమ్మలు హారతులు పట్టారు. జగనన్న తెచ్చిన వలంటీర్లు, సచివాలయాలతో తమ పనులు సులభతరమైపోయాయని, కార్యాలయాలు చుట్టూ తిరిగే దుస్థితి తప్పిందంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పొద్దున్నే ఇంటికి వచ్చి నిద్రలేపి మరీ పింఛన్ ఇస్తున్నారని, ఇంత మేలు చేసిన జగన్ బాబును చూడాలని వచ్చామని తమ ఆనందాన్ని పంచుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత వాతావరణం చల్లబడింది. సీఎం జగన్ అక్కవరం సభలో ప్రసంగిస్తుండగా మేఘాలు కమ్ముకున్నాయి. సభా ప్రాంగణంలో చినుకులు రాలడం, సమీపంలో వర్షం కురవడంతో హర్షాతిరేకాలు మిన్నంటాయి. జగన్ రాకతో తమ ప్రాంతం చల్లబడిందని, ఆయన అడుగుపెట్టిన చోట మంచే జరుగుతుందని చెప్పడానికి ఇదే నిదర్శనమని మహిళలు నినాదాలు చేశారు.

- పుట్టుకతో వినికిడి లోపం కలిగిన తన కుమారుడు త్రిషాన్ రెండు చెవులకు 2022లో ఆరోగ్యశ్రీ ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ ఉచితంగా చేయడంతో చిన్నగా మాట్లాడగలుగుతున్నట్లు శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన చమల్ల శ్రీధర్ సీఎం జగన్ వద్ద ఆనందం వ్యక్తం చేశాడు. అక్కివలస నైట్ స్టే పాయింట్ వద్ద ఆయన సీఎం జగన్‌కు కలిశారు.
- 'మేమంతా సిద్ధం' యాత్ర మడపాం టోల్‌గేట్ వద్దకు చేరుకునేసరికి అభిమానులతో కిక్కిరిసిపోయింది. భారీ క్రేన్‌తో తెచ్చిన నవరత్నాల పథకాల మాలతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడ తనను కలసిన ఓ దివ్యాంగుడికి మూడు చక్రాల మోటార్ సైకిల్ అందజేస్తామని సీఎం జగన్ భరోసా వచ్చారు. వినికిడి లోపంతో బాధపడుతున్న ఓ బాధితురాలికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కుటుంబం అంతా జగనన్న అభిమానులం



మా కుటుంబం మొత్తం జగనన్న అభిమానులం. జగనన్న పాదయాత్ర చేసినప్పుడు నేను చదువుకుంటున్నా. మా జిల్లాకు వచ్చినప్పుడు సెల్ఫీ కూడా తీసుకున్నా. ఇప్పుడు మా పాప రెండో తరగతి చదువుతోంది. జగనన్నను చూడాలని రాత్రి నుంచి మారాం చేయడంతో ఉదయం 7 గంటలకే అక్కివలస తీసుకొచ్చాం. జగనన్న చేపట్టిన విద్య, వైద్య సంస్కరణలు సామాన్యులకు ఎంతో మేలు చేస్తున్నాయి. వాటిని కళ్లారా చూస్తున్నాం.

– పి.సంతోషిమణి, శ్రీకాకుళం

మా తొలి ఓటు జగనన్నకే..



నాన్న అబ్దుల్ సలీమ్ ప్రైవేటు కాలేజీలో పనిచేస్తుండగా అమ్మ నసీమాబేగం గృహిణి. తక్కువ ఆదాయం ఉన్న మాలాంటి కుటుంబాలకు జగనన్న దేవుడు. మా అక్క, నా చదువు పూర్తిగా జగనన్న విద్యా దీవెనతోనే పూర్తయింది. ఇంటి స్థలం ఇచ్చి ఆర్థిక సాయం చేయడంతో సొంతిల్లు కట్టుకున్నాం. మా కుటుంబం ఆనందంగా ఉందంటే అది జగనన్న పుణ్యమే. మా అక్కకు, నాకు తొలిసారి ఓటు వేసే అవకాశం వచ్చింది. తొలి ఓటు ఫ్యానుకే వేస్తాం. జగనన్నను చూశాకే అక్కివలస నుంచి ఇంటికి వెళతా.

– నజీమా, విజయనగరం



మడపాం టోల్‌గేట్: దివ్యాంగుని సమస్యలు తెలుసుకుంటున్న సీఎం జగన్



గోపీనగరం: జగనన్నను చూసి ఉప్పొంగిన అభిమానం...



మడపాం టోల్‌గేట్: తగ్గేదేలే.. అంటూ బస్సుయాత్రలో ఇలా..

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల చేరిక



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహన్‌రావు, ఆయన కుమారుడు పెద్దింటి రామస్వామి నాయుడు

అక్కివలస రాత్రి బస క్యాంపు వద్ద పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పలాస మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, ఆమె కుమార్తె శిరీష, బొబ్బిలి బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావు, ఆయన కుమారుడు పెద్దింటి రామస్వామినాయుడు, పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మాజీ జడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, పార్వతీపురం నియోజకవర్గం టీడీపీ సీనియర్ నేత కొయ్యాన శ్రీవాణి, టీడీపీ ఉపాధ్యక్షుడు మజ్జి రమేష్, రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లి విజయకుమార్, రణస్థలం ఎంపీటీసీ మజ్జి గౌరి, సీనియర్ నేత రామారావు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, ఆమె కుమార్తె శిరీష

స్టార్ క్యాంపెయినర్‌లతో

22 వ రోజు

సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 22వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పలు ఫొటోలను సామాజిక మాధ్యమం(ఎక్స్)లో పోస్టు చేశారు. - సాక్షి, అమరావతి















అభివృద్ధి, సంక్షేమంలో జగన్ విజన్

సీఎం జగన్ పాలనపై సీనియర్ జర్నలిస్ట్ రేణుక పోతినేని పుస్తకం

- 'జగన్ విజన్.. ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఏపీ' శీర్షికతో పుస్తకం
- సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ట్రెండింగ్
- సీఎం జగన్ పాలనను ప్రశంసిస్తున్న ఒకప్పటి చంద్రబాబు అభిమాని
- టీడీపీ దుష్ప్రచారంతో వాస్తవాలు మరుగున పడుతున్నాయని ఆవేదన



రేణుక రాసిన 'జగన్ విజన్.. ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఏపీ' పుస్తకం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన టీడీపీ అభిమానులనూ ఆకట్టుకుంటోంది. గతంలో తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు అభిమాని అయిన సీనియర్ జర్నలిస్ట్ రేణుక పోతినేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దార్శనిక పాలనపై ప్రత్యేకంగా ఓ పుస్తకం రూపొందించారు. 'జగన్ విజన్.. ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఏపీ' శీర్షికతో ఆమె రచించిన ఈ పుస్తకం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ట్రెండ్ అవుతోంది. సీఎం జగన్ నాయకత్వంలో ఏపీలో కనిపిస్తున్న అద్వితీయ మార్పులను ఎలుగెత్తి చాటుతూ, మాజీ సీఎం చంద్రబాబు హయాంలోని అవినీతి కోణాలను ఈ పుస్తకం తూర్పారపట్టింది. ఏపీలో అభివృద్ధి, ఉద్యోగాలు, సామాజిక న్యాయం, పారిశ్రామిక ప్రగతి, వ్యవసాయం, విద్య, ఆక్వా రంగం అభివృద్ధి, వైద్యం, సంక్షేమం, భూ సంస్కరణలు, ఇళ్ల నిర్మాణం, మేనిఫెస్టో విశ్వసనీయత, సీఎం జగన్ స్కీములు, చంద్రబాబు స్కాములను వివరిస్తూ, అప్పటి.. ఇప్పటి అప్పులపై ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా సమగ్ర వివరాలు అందించిన ఈ పుస్తకం అందరినీ ఆకట్టుకుంటోంది. సీఎం జగన్ సమగ్ర పాలనా స్వరూపాన్ని ఆవిష్కరించింది. ఒకప్పుడు చంద్రబాబు అభిమాని అయిన రేణుక పోతినేని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న విప్లవాత్మక అభివృద్ధి, జీవన ప్రమాణాలను పెంచుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఈ పుస్తకాన్ని రూపొందించడమే కాకుండా, సీఎం జగన్ పాలనను సామాజిక మాధ్యమాల్లో ప్రశంసిస్తున్నారు.

చరిత్ర ఎరుగని దుర్మార్గపు దాడి..

ఏపీ అభివృద్ధి, సంక్షేమంపై గత ఐదేళ్లుగా ప్రధాన మీడియాల్లో పదేపదే తప్పుడు ప్రచారం జరుగుతున్నట్టు రేణుక తన పుస్తకంలో అభిప్రాయపడ్డారు. 'నిజం రెండు అడుగులు వేసేలోపు.. అబద్ధం వెయ్యి అడుగులు వేస్తుంది' అనే నినాదాన్ని టీడీపీ, దాని అనుబంధ మీడియా సంస్థలు నమ్ముకున్నాయయి' అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మీడియా మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో ప్రధాన, సోషల్ మీడియాలో ట్రోల్స్ విపరీతంగా పెరిగిపోయాయన్నారు. తెలుగుదేశం పార్టీ, న్యూట్రల్ ముసుగులో ఉన్న రెండు పత్రికలు, ఐదారు మీడియా సంస్థల అసత్య ప్రచార దాడిలో ఎన్నో వాస్తవాలు మరుగున పడిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ తరఫున 1.50 లక్షల వాట్సాప్ గ్రూప్‌లు, 100కు పైగా పెయిడ్ మీమర్స్, వెయ్యికి పైగా ఫేస్‌బుక్ పేజీలను నడిపిస్తూ నిత్యం ప్రజా పాలనపై చరిత్రలో ఎన్నడూ లేనంతగా దుర్మార్గపు దాడికి పాల్పడ్డారని అభిప్రాయపడ్డారు. ఐదేళ్లలో ఏపీ సాధించిన అభివృద్ధి, సంక్షేమం వివరాలు ప్రజలకు గణాంకాలతో సహా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె చెప్పారు. సీఎం జగన్ తీసుకునే నిర్ణయాల వెనుక ఏపీ భవిష్యత్తు ఎంత ఉజ్వలంగా మారుతుందో, ఎంతటి గొప్ప మార్పులు కనిపిస్తాయో ప్రతి ఒక్కరూ అవగతం చేసుకోవడానికే కచ్చితమైన సమాచారంతో 'జగన్ విజన్' పుస్తకాన్ని తీసుకొచ్చినట్టు' తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఆమె చెప్పిన అక్షర సత్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

అ'సామాన్యులు'

మొదటి పేజీ తరువాయి


వారిని లోబరుచుకునేందుకు వీరంతా బరి తెగిస్తున్నారు. కానీ, ఇటుపక్క చూస్తే పేదలకు కొమ్ముకాసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగిల్‌గా సై అంటోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలో ఈ పార్టీ బలగం. ఈ పార్టీ ఎంపిక చేసిన అనేకమంది అభ్యర్థుల ఆర్థిక స్థోమత కూడా అంతంతమాత్రమే. చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులున్న వారేమీ కాదు. కేవలం కోటి రూపాయలు అంతకన్నా తక్కువ ఆస్తి ఉన్న వారూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అలా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేస్తూ రూ.కోటి లోపు ఆస్తి ఉన్న అభ్యర్థులు ఎవరంటే..

- శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎస్‌ఎల్ ఈరలక్కప్ప రాష్ట్రంలోనే అత్యంత నిరుపేద అభ్యర్థి. ఈరలక్కప్పకు సొంత ఇల్లు, కారు కూడా లేదు. ద్విచక్ర వాహనం మాత్రమే ఉంది. ఆయన పేరు మీద వ్యవసాయ భూమి కూడా లేదు. బంగారు ఆభరణాలు లేవు. బ్యాంకు బ్యాలెన్స్ రూ.27,883 మాత్రమే ఉంది. గుడిబండ కెనరా బ్యాంకులో రూ.41, ఇదే మండలంలోని మందలపల్లి ఏడీసీసీ బ్యాంకులో రూ.26,950, ఆగిళి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.11, మడకశిర యూనియన్ బ్యాంకులో రూ.881 బ్యాంకు బ్యాలెన్స్ మాత్రమే ఉంది. అదే విధంగా అప్పు రూ.1,13,050 ఉంది. గుడిబండ కెనరా బ్యాంకులో వ్యక్తిగత రుణం రూ.86,100, మందలపల్లి ఏడీసీసీ బ్యాంకులో రూ.26,950 అప్పు ఉంది. రూ.99,883 విలువ చేసే చరాస్తులు ఈరలక్కప్పపేరు మీద ఉన్నాయి. అలాగే చేతిలో రూ.10 వేలు ఉన్నట్లు అఫిడవిట్‌లో ఈరలక్కప్ప పేర్కొన్నారు.


పలారం గ్రామంలో ఈరలక్కప్ప నివసిస్తున్న ఇల్లు


వీరాంజనేయులు నివశిస్తున్న ఇల్లు

- అనంతపురం జిల్లా శింగనమల ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎం.వీరాంజనేయులు కూడా అత్యంత నిరుపేద. సెంటు స్థలం కానీ, తులం బంగారం కానీ లేదు. నామినేషన్‌లో ఈయన సమర్పించిన అఫిడవిట్‌ను పరిశీలిస్తే రాష్ట్రంలో అత్యంత పేద అభ్యర్థుల్లో ఒకరన్న విషయం స్పష్టమవుతోంది. ఈయన పేరున విలువైన చరాస్తులు రూ.1,06,478 ఉన్నాయి. ఇందులో చేతిలో నగదు రూ.50 వేలు, అనంతపురం ఎస్‌బీఐలో రూ.11,193, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కొత్తూరు బ్రాంచ్)లో రూ.10,002 నగదు నిల్వ ఉంది. అలాగే, 2020లో కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనం ఉంది. దీని విలువ రూ.35 వేలు. ఇక ఆయన భార్య పేరున శింగనమలలోని కెనరా బ్యాంక్‌లో కేవలం రూ.283 నగదు ఉంది.





- రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి మొత్తం ఆస్తి రూ.53,45,321లు. ఈమె చేతిలో ఉన్న నగదు రూ.2,50,000. బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉన్నది రూ.23,72,821లు. ఇన్నోవా కారు రూ.11,22,500, బంగారు ఆభరణాల విలువ రూ.16,00,000, బ్యాంకులో అప్పు రూ.1,76,223లు ఉంది.

- కృష్ణాజిల్లా మైలవరం అసెంబ్లీ అభ్యర్థి సర్నాల తిరుపతి రావు మొత్తం ఆస్తి రూ.4,27,066లు. స్థిర, చరాస్తులు రూ.1,89,642లు. తన పేరుతో మైలవరం సెంట్రల్ బ్యాంకు అకౌంట్‌లో రూ.88, మైలవరం కెనరా బ్యాంకులో రూ.1000, మైలవరం మండల పుల్లూరు ఎస్‌బీఐ అకౌంట్‌లో రూ.9,823లు.. రూ.73,531 విలువ గల 2016 మోడల్ బైకు.. రూ.55,200 విలువ గల 8 గ్రాముల బంగారు ఉంగరం.. చేతిలో క్యాష్ రూపంగా రూ.50వేలు ఉన్నాయి. ఇందులో ఆయన భార్య పేరున మైలవరం యూనియన్ బ్యాంకులో రూ.1,624లు.. రూ.55,200 విలువ గల 8 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు.. రూ.1,65,600 విలువ గల 24 గ్రాముల బంగారు చైను.. చేతిలో క్యాష్ రూపంగా రూ.15వేలు ఉన్నాయి.


మైలవరంలో మేకలకు వ్యాక్సిన్ వేయిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు (ఫైల్)



స్వగ్రామం కిర్లంకోటలో ఇంటి అరుగుపై భోజనం చేస్తున్న విశ్వేశ్వరరాజు

- పాడేరు అసెంబ్లీ అభ్యర్థి ఎం. విశ్వేశ్వరరాజు పేరు మీద రూ.20,39,512లు, భార్య పేరున రూ.16,20,320లు, ఇద్దరు పిల్లల పేరున రూ.7,25,927లు, రూ.7,12,606లు కలిపి మొత్తం రూ.50,98,365ల ఆస్తులున్నాయి. రూ.1,20,000 గోల్డ్‌లోన్ అప్పు ఉంది.

టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు ▸ కళ్లు చెదిరే ఆస్తిపరులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయా పార్టీల అభ్యర్థుల్లో కొందరు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా తమకు ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారు. అలాగే తమపై నమోదైన కేసుల వివరాలను కూడా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

మాధవీరెడ్డి ఆస్తి రూ.325.61 కోట్లు



టీడీపీ కడప అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డి ఆస్తుల విలువ రూ.133.3 కోట్లు కాగా, భర్త శ్రీనివాసులరెడ్డికి రూ.192.61 కోట్లు విలువ చేసే ఆస్తులున్నాయి. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.12.62 లక్షలు ఉండగా, రూ.2.27 కోట్ల పెట్టుబడులున్నాయి. రూ.5.4 కోట్ల విలువ చేసే 6,438 గ్రాముల బంగారు, డైమండ్ ఆభరణాలున్నాయి. రూ.76 కోట్లు విలువ గల నివాస గృహాలు, రూ.12.70 కోట్లు విలువ గల కమర్షియల్ భవనాలు, రూ.2.02 కోట్లు విలువ గల స్థలాలు కలిగి ఉన్నారు. రూ.42.57 కోట్ల విలువైన 47. 33 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు తెలిపారు. మాధవీరెడ్డిపై నాలుగు కేసులు నమోదయ్యాయి.

కిరణ్ ఆస్తి రూ.65.36 కోట్లు



అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తనకు వాహనం కూడా లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన దగ్గర నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎన్‌ఎస్‌ఎస్, పోస్టల్ సేవింగ్ పథకం, ఇతరులకు ఇచ్చిన అప్పులు, బంగారు తదితర ఆభరణాలు, చరాస్తులు అన్నీ కలిపి రూ.3,35,84,334 ఉన్నట్లు వెల్లడించారు. అలాగే ఆయన సతీమణికి వివిధ రూపాల్లో రూ.6,90,14,921 ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం తన స్థిరాస్తులు రూ.62,12,37,500గా కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

బాలశౌరి ఆస్తి రూ.101.25 కోట్లు



జనసేన తరఫున మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వల్లభనేని బాలశౌరి తనకు రూ.101,25,39,817 ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో చరాస్తుల విలువ రూ.37,85,00,723, స్థిరాస్తుల విలువ 63,40,39,094 కాగా ఆయన సతీమణి వల్లభనేని భానుమతి పేరున మొత్తం రూ.32,46,74,747 ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే తనపై రెండు కేసులు నమోదయ్యాయని బాలశౌరి తెలిపారు.

సీఎం రమేష్ ఆస్తి రూ.445.65 కోట్లు



బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తన పేరిట రూ.445.65 కోట్ల ఆస్తులు, రూ.101.63 కోట్ల బ్యాంక్ రుణాలు ఉన్నట్టు వెల్లడించారు. అలాగే తనపై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. తన పేరున రూ.39,39,24,681, భార్య సీఆర్.శ్రీదేవి పేరున రూ.12,53,30,719 విలువైన చరాస్తులు చూపించారు. అలాగే ఆయన పేరిట రూ.252,66,21,246, భార్య పేరిట రూ.193,01,48,350 స్థిరాస్తులున్నట్లు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో డీఆర్‌ఐ అధికారుల విధులకు ఆటకం కలిగించడమే కాకుండా వారిపై దాడి చేసినందుకు సీఎం రమేష్‌పై కేసు నమోదైంది. అలాగే హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోర్జరీ కేసు, నెల్లూరు జిల్లా కావలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా పాదయాత్ర నిర్వహించినందుకు కేసులు నమోదయ్యాయి. కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడమే కాకుండా ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తులపై దాడికి సంబంధించి మరో కేసు, హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భూ వివాదం కేసు, లక్డీకాపూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు అధికారిని దూషించిన కేసు, అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హైదరాబాద్ డెట్ రికవరీ ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించనందుకు కేసులు ఉన్నాయి.

థామస్ ఆస్తి రూ.124 కోట్లు



టీడీపీ గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి థామస్‌పై 2017లో చెన్నై సెండియం పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు, 2018లో ఆరింబాకం పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు, 2018లో తిరుపతి ఈస్టు పోలీస్‌స్టేషన్లో 420 కేసు నమోదయ్యాయి. ఆయనకు, ఆయన భార్యకు కలిపి రూ.124 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయి.

టీజీ భరత్ ఆస్తి రూ.243.57 కోట్లు



కర్నూలు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట రూ.243.57 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఆయన పేరిట రూ.89.50 కోట్లు, ఆయన భార్య టీజీ శిల్పా పేరిట రూ.141 కోట్లు, కుమార్తె శ్రీ ఆర్య పేరిట రూ.10.99 కోట్లు, కుమారుడు టీజీ విభ పేరిట రూ.1.60 కోట్లు, ఉమ్మడి కుటుంబ సభ్యుల ఆస్తి రూ.46.76 లక్షలు ఉన్నాయి. అయితే టీజీ భరత్ సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉంది. వారికి ఎన్ని వాహనాలు ఉన్నాయో తెలపలేదు. అలాగే టీజీ భరత్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట రూ.15,88,83, 622 విలువైన బంగారం ఉన్నట్లు వెల్లడించారు.

నారాయణ ఆస్తి రూ.824.05 కోట్లు



నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొంగూరు నారాయణ, ఆయన భార్య రమాదేవి పేరిట రూ.824.05 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అలాగే ఇద్దరి పేరిట రూ.189.59 కోట్ల అప్పులు ఉన్నట్టు పేర్కొన్నారు. నారాయణ పేరిట బ్యాంకులో నగదు నిల్వ, వివిధ డిపాజిట్లు, వాహనాలు, బంగారు ఆభరణాల తదితరాలు కలిపి రూ.78.66 కోట్లు ఉన్నాయి. ఆయన భార్య రమాదేవి పేరిట రూ.100.87 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. నారాయణ పేరిట మొత్తం రూ.207.50 కోట్లు, భార్య పేరిట రూ.437.02 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే నారాయణ తనపై ఎనిమిది కేసులున్నట్లు తెలిపారు. నారాయణ తమ్ముడి భార్య పెట్టిన వరకట్నం వేధింపుల కేసు, ప్రశ్నపత్రాలు లీక్ చేశారన్న అభియోగాలతో చిత్తూరులో మరో కేసు, నారాయణ విద్యాసంస్థలో విద్యార్థి ఆత్మహత్య కేసు ఇందులో ఉన్నాయి. మిగిలిన ఐదు కేసులు రాజధాని అమరావతి వ్యవహారంలో సీఐడీ నమోదు చేసింది.

వేమిరెడ్డి ఆస్తి రూ.716.31 కోట్లు



టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన కుటుంబ ఆస్తుల విలువను రూ.716.31 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో ఆయన పేరుతో రూ.639.26 కోట్ల చర, స్థిరాస్తులు ఉండగా.. భార్య వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేరుతో రూ.77.05 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే అప్పులు రూ.197.29 కోట్లు ఉన్నట్టు వెల్లడించారు. అలాగే రూ.6.96 కోట్ల విలువైన రూ.19 కార్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే రూ.1.28 కోట్ల ఖరీదైన 1,888.6 గ్రాముల బంగారం, 5.25 క్యారెట్స్ వజ్రాలు, రూ.66.80 లక్షల చేసే రెండు వాచ్‌లు, రూ.5.90 లక్షల వెండి వస్తువులు ఉన్నా యి. వేమిరెడ్డిపై 6 కేసులు కూడా నమోదయ్యాయి.

ప్రశాంత పోలింగ్‌కు టెక్ పోలీసింగ్

- ఏవోబీలో ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సన్నద్ధం
- మావోయిస్టుల కదలికలపై డ్రోన్ల నిఘా
- ఏవోబీ అంతటా శాటిలైట్ మ్యాపింగ్
- జీపీఎస్ ట్రాకింగ్‌ద్వారా భద్రతా దళాల కూంబింగ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల్ని ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమవుతోంది. అందుకోసం మరింత విస్తృతంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సమాయత్తమైంది. ప్రధానంగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికల్ని సక్రమంగా నిర్వహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం దాదాపు లేదు. కానీ మన రాష్ట్ర సరిహద్దులకు అవతల ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టులకు ఇంకా పట్టుండటంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం సదా అప్రమత్తంగా ఉంటోంది. ఇక ప్రతి ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా ఎన్నికల బహిష్కరణకు మావోయిస్టులు పిలుపునిస్తారని పోలీసు శాఖ భావిస్తోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతిచెందారు. దీంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార దాడులకు తెగబడే అవకాశం ఉందని, ఉనికి చాటుకునేందుకైనా ఎక్కడో ఒకచోట పోలింగ్‌ను భగ్నం చేసేందుకు యత్నించవచ్చని అనుమానిస్తున్నారు. దీంతో మన రాష్ట్రంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అందుకే ఏవోబీలోని మారుమూల గ్రామాలు, గూడేల్లో కూడా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలిసారిగా వాడుకోనుంది.

➤ ఏవోబీలో పోలింగ్ నిర్వహణ కోసం డ్రోన టెక్నాలజీని తొలిసారిగా వినియోగించాలని నిర్ణయించింది. జమ్ము-కశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై నిఘా పెట్టేందుకు ఉపయోగిస్తున్న డ్రోన్ టెక్నాలజీని తొలిసారిగా ఈ ఎన్నికల కోసం ఏవోబీలో ప్రవేశపెట్టనుంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పోలీసు నిఘా విధుల కోసం డ్రోన్లను ఉపయోగించనున్నారు. మొత్తం ఏవోబీ అంతా నిఘా పెట్టేందుకు అవసరమైన డ్రోన్లను ఇప్పటికే పోలీసు శాఖ తెప్పించింది. ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. మావోయిస్టులు, అనుమానితుల కదలికలపై ఈ డ్రోన్లతో నిఘా పెట్టనున్నారు.

➤ ఏవోబీ ప్రాంతాన్ని ప్రత్యేకంగా శాటిలైట్ మ్యాపింగ్ చేసేందుకు పోలీసు శాఖ కార్యాచరణ చేపట్టింది. గంజాయి సాగును కూకటివేళ్లతో పెకలించేందుకు నిర్వహించిన 'ఆపరేషన్ పరివర్తన్' కోసం గతంలో పోలీసు శాఖ ఎంపిక చేసిన ప్రాంతాలను శాటిలైట్ మ్యాపింగ్ చేసింది. ఈసారి మొత్తం ఏవోబీ ప్రాంతాన్ని శాటిలైట్ మ్యాపింగ్ చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీలోకి ప్రవేశించేందుకు అవకాశం ఉన్న ప్రధాన మార్గాలు, అడ్డదారులు, దొంకదారులతోసహా మొత్తం ప్రాంతాన్ని శాటిలైట్ మ్యాపింగ్ చేయనున్నారు. తద్వారా మావోయిస్టులు ఏపీలోకి ప్రవేశించేందుకు యత్నిస్తే వెంటనే గుర్తించి పోలీసు బలగాలను అప్రమత్తం చేయవచ్చని పోలీసు శాఖ భావిస్తోంది.

➤ ప్రశాంత పోలింగ్ నిర్వహించేందుకు ఏవోబీ అంతటిని పోలీసు, గ్రేహౌండ్స్ బలగాలు జల్లెడ పట్టనున్నాయి. అందుకోసం ముమ్మరంగా కూంబింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. కూంబింగ్‌లో ఉన్న పోలీసులపై మావోయిస్టులు దొంగదెబ్బ తీయకుండా ఆధునిక జీపీఎస్ టెక్నాలజీని వారికి అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం పోలింగ్ విధుల కోసం ఏవోబీలో మోహరించే భద్రతా బలగాలు కూడా అదే జీపీఎస్ టెక్నాలజీని వినియోగించుకోనున్నాయి.

బీజేపీ పాలనలో శక్తిమంత భారత్

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సాక్షి, అనకాపల్లి/సాక్షి, విశాఖపట్నం: పదేళ్ల బీజేపీ ప్రభుత్వంలో రక్షణ పరంగా భారత్‌దేశం అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదిగిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 2047 నాటికి ప్రపంచంలోనే యుద్ధసామగ్రి తయారీలో మరింత శక్తిమంతం కానున్నట్లు తెలిపారు. రూ.21 వేల కోట్ల విలువైన యుద్ధ సామగ్రిని విదేశాలకు ఎగుమతి చేశామన్నారు. అనకాపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన బీజేపీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. పదేళ్లుగా పీఎం మోదీ నాయకత్వంలో దేశాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నామని తెలిపారు. గత పదేళ్ల ఎన్డీఏ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్థూల ఆదాయంలో వెనకబడడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమన్నారు. ఏపీ అంటే ప్రధాన మోదీకి అమితమైన ప్రేమ అని పేర్కొన్నారు.

విశాఖ చాలా అవకాశాలున్న నగరం

అభివృద్ధిలో విశాఖ చాలా అవకాశాలున్న నగరమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. విశాఖలో కూటమి నేతలు బుధవారం ఏర్పాటు చేసిన మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, విశాఖను డ్రగ్స్‌కు క్యాపిటల్‌గా మార్చేసిందని, భూకబ్జాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రజలపై వివిధ రకాల పన్నుల భారం మోపిందన్నారు. ఏపీఅభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు.

ఫ్యాక్ట్‌చెక్

1. బడుగులను ఏవగించుకునే బాబు రామోజీకి గొప్పోడు!
➤ దళిత గిరిజనులకు ధోకా ఇచ్చింది బాబే

2. 'అంధుడి' సర్టిఫికెట్ అందుకోవాల్సిందే
➤ ఇసుకపై నివేదికలంటూ రామోజీ కట్టుకథలు

3. మీ కథనమే బోగస్
➤ ప్రతి స్కీమ్‌లోనూ బాబు కంటే మెరుగైన సాయం

4. 'క్రమం' తప్పి బాబు 'కక్ష'
➤ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై మాట తప్పింది మీబాబు కాదా?

5. మీ బుర్రలో 'సైతాన్' తిష్ట
➤ అందుకే 'పాపపు' రాతలతో నిజాలకు 'శిలువే'స్తున్న రామోజీ

ఫ్యాక్ట్ చెక్ వార్తల కోసం క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయండి

మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు?

- ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఎందుకు ఆదేశించరాదో చెప్పండి
- నాటి ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్‌పై హైకోర్టు మండిపాటు
- తదుపరి విచారణ 1కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఉన్న ఐఏఎస్ అధికారి ఎస్.గుల్జార్‌పై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. న్యాయస్థానాలపై ఎలాంటి గౌరవం లేని గుల్జార్ ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగేందుకు అనర్హుడని తేల్చిచెప్పింది. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆయన ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని తేల్చింది. ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగే అర్హత లేనందున, ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఎందుకు ఆదేశించరాదో వివరణ ఇవ్వాలని గుల్జార్‌ను ఆదేశించింది. అలాగే కోర్టు ధిక్కారం కింద ఎందుకు ప్రాసిక్యూట్ చేయరాదో కూడా ఆయన చెప్పాలంది. ఈ మేరకు ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీటికి రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. గుల్జార్‌పై సుమోటోగా కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీకి సూచించింది. బసవ శ్రీనివాస్ అనే వ్యక్తికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరిస్తూ గుల్జార్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు రద్దు చేసింది. కారుణ్య నియామకం కోసం శ్రీనివాస్ పెట్టుకున్న దరఖాస్తుపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 1కి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు.

కారుణ్య నియామక దరఖాస్తు తిరస్కరణ..

బి.సరస్వతిదేవి వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తూ మరణించారు. దీంతో ఆమె చిన్న కుమారుడు బసవ శ్రీనివాస్ కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తును తిరస్కరిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బసవ శ్రీనివాస్ 2021లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి కారుణ్య నియామకం కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలని శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆ దరఖాస్తుపై నాలుగు వారాల్లో తగిన నిర్ణయం వెలువరించాలని అధికారులకు సూచించారు. అయితే అధికారులు ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో శ్రీనివాస్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ ధిక్కార పిటిషన్ విచారణలో ఉండగానే అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్ కారుణ్య నియామకం కోసం శ్రీనివాస్ పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించారు. దీంతో బసవ శ్రీనివాస్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ విచారణ జరిపారు.

ఆ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ శేషసాయి ధర్మాసనం

వాటిని సీజే అనుమతితో మరో ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశం

సాక్షి, అమరావతి: సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు గురించి మాట్లాడవద్దంటూ కడప జిల్లా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ టీడీపీ నేత బీటెక్ రవి, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత దాఖలు చేసిన వ్యాజ్యాల విచారణ నుంచి న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్‌ల ధర్మాసనం తప్పుకొంది. ఈ వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి (సీజే) పాలనాపరమైన అనుమతితో మరో ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వివేకానందరెడ్డి హత్యకేసు ద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రోద్బలంతో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, ఇతర టీడీపీ నేతలు చేస్తున్న అడ్డగోలు ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వివేకా హత్యకేసు విషయంలో తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేయకుండా చంద్రబాబు, లోకేశ్, షర్మిల, సునీత, పవన్‌కళ్యాణ్, బీటెక్ రవిలతో పాటు ఆ పార్టీల క్యాడర్‌ను ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ జిల్లా కోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై విచారించిన జిల్లా కోర్టు.. వివేకా హత్యకేసు సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉందని, అందువల్ల ఆ కేసు గురించి ఎవరూ మాట్లాడవద్దని చంద్రబాబు, షర్మిల, సునీత తదితరులను ఆదేశిస్తూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. వివేకా హత్య గురించి దుష్ప్రచారాన్ని ఆపాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ నర్రెడ్డి సునీత, టీడీపీ నేత బీటెక్ రవి హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. కోర్టు కార్యకలాపాలు మొదలు కాగానే ధర్మాసనం.. ఈ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు తెలిపింది. ఆ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఈ సమయంలో బీటెక్ రవి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. తమ వ్యాజ్యాలు రేపు (గురువారం) విచారణకు వచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యాలు మరో ధర్మాసనం ముందుకు వచ్చేందుకు వీటిని ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచి, ఆయన అనుమతితో రేపు విచారణకు వచ్చేలా చూడాలని ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది.

సంక్షేమ విరోధులు.. ఈ దుష్ట నేతలు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



గంగాధర నెల్లూరు (చిత్తూరు జిల్లా): సీఎం జగనన్న కులం, మతం, పార్టీ, ప్రాంతం బేధం లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తుంటే.. పేదలకు అవి అందకుండా కోర్టులకు వెళ్లి అడ్డుతగులుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ దుష్ట నేతలందరినీ ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ధ్వజమెత్తారు. ఎస్సీ ఎస్టీ కాలనీల్లో సంతోషంగా ఉన్న ప్రజల మధ్య చంద్రబాబు అండ్‌కో నేతలు వర్గ విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. జీడీ నెల్లూరులోని ఆంబోదరపల్లి గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి థామస్ మందు, డబ్బు ఎరగా వేసి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గొడవలు సృష్టిస్తున్నారని, టీడీపీ శ్రేణులు మందు తాగి నానా గొడవలు సృష్టిస్తూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రచార వాహనాలను అడ్డుకుంటూ ఘర్షణలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతమయితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. టీడీపీ కమ్మ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది హరిజనవాడకు దారిలేకుండా ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు.

ఏపీ కాంగ్రెస్ అభ్యర్థుల మరో జాబితా

3 లోక్‌సభ, 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల మరో జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. నరసాపురం, రాజంపేట, చిత్తూరు (ఎస్సీ) లోక్‌సభ స్థానాలకు, 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో సుంకర పద్మశ్రీని పక్కనబెట్టి ఆమె స్థానంలో పొనుగుపాటి నాంచారయ్యకు అవకాశం ఇచ్చింది. మరో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చింది. ఈ మేరకు బుధవారం రాత్రి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు.

వైఎస్‌ను దూషించినవారికే జగన్ పదవులు ఇచ్చారు

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

రేపల్లె రూరల్/పామర్రు/పెడన: అసెంబ్లీ సాక్షిగా వైఎస్సార్‌ను, ఆయన కుటుంబ సభ్యులను ద్వేషించి, దూషించిన వారికే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవులు కట్టబెట్టారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. 'ఏపీ న్యాయయాత్ర'లో భాగంగా రేపల్లె బస్టాండ్ సెంటరులో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌ను దూషించటంతోపాటు వైఎస్ జగన్‌ను ఉరితీయాలని బహిరంగంగా మాట్లాడిన బొత్స సత్యనారాయణను తన తండ్రి సమానుడని జగన్ ప్రస్తావించటం ఏమిటని షర్మిల ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ హక్కులను కాలరాసిన బీజేపీకి ఒకవైపు చంద్రబాబు, మరోవైపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గులాంగిరి చేస్తున్నారని ఎద్దేవాచేశారు. కాగా, షర్మిల బహిరంగ సభకు జనం రాకపోవడంతో ఆమె ఎనిమిది నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. కృష్ణా జిల్లా పామర్రు, పెడనలో జరిగిన సభల్లో షర్మిల మాట్లాడుతుండగానే ప్రజలు వెళ్లిపోవడం కనిపించింది.

స్కూల్లో మ్యాథ్స్ అవర్... సైన్స్ అవర్ అంటుంటాం.
చట్టసభలో జీరో అవర్ అనే మాట వింటుంటాం.
స్టోరీ అవర్... ఈ గంట ఎక్కడ నుంచి వచ్చింది?
నీలిమ పెనుమర్తి ఆలోచన నుంచి వచ్చింది.
రోజుకో గంట కథలు వినమని చెప్తున్నారీమె.
యూకేలో ఆచరణలో పెట్టి... ఇండియాకి తెచ్చారు.
విశ్వవ్యాప్తం చేయడానికి కంకణం కట్టుకున్నారు.
ఆడియో బుక్స్‌తో స్వచ్ఛమైన భాష నేర్పిస్తున్నారు.

కథలకో గంట 1/24

నీలిమ చెప్పే కథ చదవండి!


నీలిమ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నీలిమ ఉన్నత విద్య కోసం యూకేకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పిల్లల పెంపకంలో కథలు కూడా ఒక భాగం అయి తీరాలని నమ్ముతారామె. మనదేశంలో స్కూల్ కరికులమ్‌లో పిల్లలకు కథలు లేకపోవడం విచారకరం అంటారామె. కథ ప్రాధాన్యం తెలిసిన అభివృద్ధి చెందిన దేశాలు పిల్లల రోజువారీ క్రమంలో ఓ గంట కథల కోసం కేటాయిస్తున్నాయని, మన దగ్గర అది లోపించడంతో ఎంత పెద్ద చదువులు చదివినప్పటికీ ఒక విషయాన్ని చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన నైపుణ్యం కొరవడుతోందన్నారు నీలిమ. భాష ఏదైనా ఆ భాషలో పదాలను స్పష్టంగా ఉచ్చరించడం అలవాటు చేయాలంటే ఇంట్లో తల్లిదండ్రులు అంత స్వచ్ఛంగా మాట్లాడే నేపథ్యం ఉండాలి. ఆ వెసులుబాటు లేని పిల్లలకు తన ప్రయత్నం మంచి భాషను, చక్కటి భావ వ్యక్తీకరణను నేర్పిస్తుందన్నారు నీలిమ. ఏడేళ్ల కిందట 'స్టోరీ అవర్' ఆలోచనకు బీజం పడిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నా రామె.

ఓ గంట నిడివిలోనే కథ

''నాకు లండన్ ఇంపీరియల్ కాలేజీలో కెమిస్ట్రీలో ఎంఎస్ చేయడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. మా వారు కూడా స్కాలర్‌షిప్ మీద లండన్‌లోనే వచ్చారు. అలా 30 ఏళ్ల కిందట యూకేకి వెళ్లడం, చదువు, ఉద్యోగం, ఇద్దరు పిల్లలతో అక్కడే సెటిలయ్యాం. రెండవసారి గర్భిణిగా ఉన్నప్పుడు పీహెచ్‌డీలో విరామం తీసుకున్నాను. ఆ విరామం నా ఆలోచనలను కథల మీదకు మళ్లించింది. పెద్ద బాబుకి కథలు చెప్పడం మొదలుపెట్టాను. అమరచిత్ర కథ చదవడం అలవాటు చేశాను. అదే చిన్నబాబుకి కూడా అలవడింది. మా అబ్బాయిలిద్దరూ గ్రీక్ పౌరాణిక గ్రంథాలను కూడా చదివారు. వాళ్లిద్దరి మాటల్లో ఆ పాత్రల గురించిన చర్చ వస్తుండేది. అప్పుడు మన రామాయణాన్ని పరిచయం చేశాను. అదే సమయంలో మా పెద్ద బ్బాయి స్కూల్ వాళ్లిచ్చిన ప్రాజెక్ట్ కోసం ఒక స్టోరీ బోర్డ్ చేయాల్సి వచ్చినప్పుడు రామాయణం ఇతివృత్తంగా చేశాడు. ఆ తర్వాత పిల్లలకు సెలవుల్లో రామాయణం మీద వాళ్ల వెర్షన్ రాయమని చెప్పాను. ఆ టాస్క్‌లో మరో చాలెంజ్... కథనం గంటకు మించరాదు. తమకు తోచినట్లు ఎడిట్ చేసుకుంటూ సీతారామలక్ష్మణులు యుద్ధం తర్వాత విజేతలై అయోధ్యకు రావడం దీపావళి వేడుక చేసుకోవడంతో ముగింపు ఇవ్వాలన్నమాట. ఆ సాధన ఆడియో బుక్ ఆలోచనకు రూపమిచ్చింది.



సమయం లేని తల్లిదండ్రుల కోసం...

ఇప్పుడు ఉద్యోగాలు దాదాపుగా అందరి జీవితాలనూ సంక్షిప్తంగా మార్చేస్తున్నాయి. ఇలాంటప్పుడు పిల్లలకు కథ చెప్పాలని ఉన్నప్పటికీ కొంతమందికి అందు కోసం ఓ గంట సమయం కేటాయించలేని పరిస్థితి ఉంటోంది. వాళ్లకు ఉపయోగపడేటట్లు కథలకు ఆడియో బుక్ రూపమిచ్చాను. దానిని ఇంగ్లిష్, హిందీ, తెలుగులో తెచ్చాను. మా పిల్లలు శ్రేయాస్, ఆయుర్ ఇద్దరూ హిస్టరీ చదివారు. అక్కడ హిస్టరీ అంటే రష్యన్ విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, ప్రపంచ యుద్ధాలు ప్రధానంగా ఉంటాయి. మా పిల్లలు అలాగే యూకేలో ఉన్న భారతీయమూలాలున్న పిల్లలకు మన చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశంతో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ఫ్రమ్ ద మొఘల్స్ టు ద మహాత్మా' పేరుతో మరో ఆడియో బుక్ చేశాను. ఆ స్టోరీ ఈస్ట్ ఇండియా కంపెనీ మనదేశంలో అడుగు పెట్టడం నుంచి మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సముపార్జన వరకు సాగింది. అలాగే మన సామెతలను పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'తాతమ్మ కథలు'. మా అమ్మ, నాన్న, అత్త, మామగారితో ఒక్కో సామెతకు ఒక్కో కథ రాయించి వాటిని ఐదు నిమిషాలకు మించకుండా ఎడిట్ చేసి రికార్డ్ చేశాను. మొత్తం పన్నెండు కథలు, గంట ఆడియో. ఈ కథలకు నాకు మాల్గుడి డేస్ స్ఫూర్తి. యూకేలోని తెలుగు కుటుంబాల పిల్లలు ఈ కథలను వినడం మొదలు పెట్టిన తర్వాత తొలి రోజుకి పన్నెండవ రోజుకీ వారి ఉచ్చారణ మారిపోయింది. కథకు అంతటి శక్తి ఉంటుందనే నా నమ్మకం నిజమేనని నిరూపితమైంది. తోలుబొమ్మలతో చేసిన ప్రయోగానికి చాలా ఖర్చయింది. కానీ అది కూడా సంతృప్తినిచ్చింది. ఆరు పాత్రలతో కథను అల్లుకుంటూ రాసుకున్నాం. ఆడియో బుక్ అనువాదాలకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ (ఉప్పల్) విద్యార్థులు, బేగంపేటలోని దేవనార్ (అంధ విద్యార్థుల పాఠశాల) స్కూల్ విద్యార్థులు గళమిచ్చారు.

– నీలిమ పెనుమర్తి, స్టోరీ అవర్ రూపకర్త


ఆడియో బుక్‌కి గళం ఇస్తున్న దేవనార్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య, అనిల్, రంజిత్ (ఫైల్ ఫొటో)

పిల్లలే పాట రాశారు!

మాల్గుడి డేస్ వీడియోలకు సిగ్నేచర్ ట్యూన్ ఉన్నట్లే మా ఆడియో బుక్స్‌కి కూడా ట్యూన్ ఉండాలని పాట కోసం ప్రయత్నించాను. పిల్లలకు ఇస్తే ఎలా రాస్తారో చూద్దామని యూకేలో శచి అనే అమ్మాయికిచ్చాను. తాను రామాయణం కథను ఒక్క వాక్యంలో 'వారధి నిర్మాణం సీత మీద రాముడికి ఉన్న ప్రేమకు ప్రతిబింబం' అనే భావంతో రాసింది. అలాగే భారతీయ మూలాలు ఏ మాత్రం లేని 'ఎవీ సిమన్స్' అనే అమ్మాయి 'లైట్ ద ల్యాంప్స్' పేరుతో సీతారాములు విజేతలుగా అయోధ్యకు వచ్చి దీపావళి వేడుక చేసుకోవడాన్ని రాసింది. మంథర విషపూరిత వచనాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో వివరించింది.

క్రియేటివ్‌గా సైన్స్ పాఠాలు

బాల్యంలో మేము బాలానందం వినేవాళ్లం. సరళంగా సాగే కథనాలు పిల్లల్ని అలరించేవి. నా ఆడియోబుక్స్ కూడా సులువుగా ఉంటాయి. ఇవన్నీ 'స్టోరీ అవర్ డాట్ కో డాట్ యూకే' వెబ్‌సైట్‌లో ఉచితంగా ఉన్నాయి. భాష శుద్ధంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే శుద్ధంగా ఉంటాయని నా అభిప్రాయం. మంచి భాష మాట్లాడితే వ్యక్తి గౌరవం పెరుగుతుంది. ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సరే... మంచి భాష ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. మంచి ఉచ్చారణ వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది. అందుకే సైన్స్ సబ్జెక్ట్‌ని కూడా ఈ క్రియేటివ్ మీడియం ద్వారా వివరించాలనేది నా ఆకాంక్ష'' అని తన ప్రయత్నం వెనుక ఉన్న పరమార్థాన్ని వివరించారు నీలిమ పెనుమర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

వందేళ్ల చరిత్ర ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
ఎప్పుడూ ఒక మహిళను వైస్ చాన్సలర్‌గా చూడలేదు.
కాని మొదటిసారి ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వి.సి.గా నియమించారు.
దీంతో నైమా ఖాతూన్ చరిత్ర సృష్టించారు.
ఆమె మైనారిటీ వర్గ మహిళలకు గొప్ప స్ఫూర్తి కాగలదంటూ
శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నైమా ఖాతూన్ పరిచయం.

న్యూస్‌మేకర్


ప్రొఫెసర్ నైమా ఖాతూన్

వందేళ్లకు ఆమె వచ్చింది

నైమా ఖాతూన్‌కు ముస్లిం మహిళల చదువు గురించి చాలా పట్టింపు ఉంది.

'ఉత్తరాదిలో నేను ప్రిన్సిపాల్‌గా పని చేసిన అలీగఢ్ విమెన్స్ కాలేజ్ చాలా ముందంజలో ఉంది. అక్కడ మూడు వేల మంది ముస్లిం ఆడపిల్లలు చదువుకుంటున్నారు. కాని ఇదొక్కటే సరిపోదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ముస్లిం బాలికల విద్య చాలా వెనుకబడి ఉంది. దక్షిణాదిలో ముస్లిం సమూహాలు విద్యా రంగంలో ముస్లిం బాలబాలికలను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాదిలో ఆ పని జరగడం లేదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని జయించాలంటే విద్యార్జనకు మించిన వేరే మార్గమేదీ లేదు' అంటుందామె.

విద్యారంగంలో బాలికల విద్య కోసమే కాదు ఉన్నతవిద్యలో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే నైమా ఖాతూన్‌ను భారత ప్రభుత్వం గుర్తించి రెండు రోజుల క్రితం అత్యంత ప్రతిష్టాత్మకమైన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌ను చేసింది. దాదాపు 100 ఏళ్లకు మించిన ఘన చరిత్ర ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి ఇలా ఒక మహిళ వి.సి. పదవిలో కూచోవడం ఇదే మొదటిసారి.

గమనించాల్సిన విషయం ఏమంటే ఇన్నాళ్లు పురుషులు మాత్రమే వి.సి.లుగా ఉన్న జె.ఎన్.యుకు శాంతిశ్రీ పండిట్ మొదటి మహిళా వి.సి. కావడం, అలాగే జామియా మిలియా ఇస్లామియాకు నజ్మా అక్తర్ తొలి వి.సి. కావడం (ఆమె పదవీకాలం ముగిసింది) పాతమూసలను బద్దలు చేయడమే. ఆ వరుసలో ఇప్పుడు నైమా ఖాతూన్ చేరారు.

రాజకీయ ప్రాతినిధ్యం

భారతదేశంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని నైమా ఖాతూన్ అంటారు. ముఖ్యంగా అణగారిన వర్గాల స్త్రీలు పార్లమెంట్ వరకూ చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఉన్నాయని, రాజకీయ అధికారం లేకుండా కీలకమైన విధానమార్పు తేలేమని అభిప్రాయపడతారు. 'ఆర్థిక శక్తిని, రాజకీయ శక్తిని పొందడటంలో అణగారిన వర్గాల స్త్రీలు నిస్సహాయంగా ఉన్నారు' అంటారామె.

సైకాలజీ ప్రొఫెసర్

ఒడిశాకు చెందిన నైమా ఖాతూన్ ఉన్నత విద్య అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలోనే జరిగింది. అక్కడే ఆమె బి.ఎ. సైకాలజీ చదివింది. ఆ తర్వాత పి.హెచ్‌డి. వరకూ అక్కడే కొనసాగి 1988లో అదే యూనివర్సిటీలో లెక్చరర్‌గా తన ప్రయాణం మొదలెట్టింది. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది సైకాలజీ డిపార్ట్‌మెంట్ చైర్‌పర్సన్ అయ్యింది. పొలిటికల్ సైకాలజీ అధ్యయనంలో భాగంగా 'హిందూ ముస్లిం యువతపై రాజకీయ భావోద్వేగాల ప్రభావం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్‌డి. కీలకమైనది. అలీగఢ్ విమెన్స్ కాలేజ్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉండగా ఆమెను వి.సి.గా పని చేసే అవకాశం వరించింది. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది కనుక ఇ.సి. అనుమతి తీసుకొని ఆమె నియామకం చేసింది ప్రభుత్వం. నైమా ఖాతూన్ తరచూ అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తన పరిశోధనా పత్రాలను సమర్పిస్తుంటారు.

బ్యూటిప్



- చేతులు, పాదాలపై నల్లటి మచ్చలుంటే వాడేసిన నిమ్మతొక్కతో రుద్దితే పోతాయి.
- సమ్మర్‌లో బయటకు వెళ్ళేటప్పుడు పాదాలకు సాక్స్ వేసుకుంటే పగుళ్ళు రాకుండా ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్‌తో ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి.
- పదిహేను రోజులకు ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి.
- స్నానం పూర్తయిన తర్వాత పమిస్ స్టోన్‌తో పాదాలను మెల్లగా రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి పాదాలు నునుపుగా ఉంటాయి.

కొత్త దారి

బాధ పడి ఆ బాధను కాలగమనంలో మరచిపోయేవారు కొందరు.

బాధ పడి ఆ బాధలో నుంచి కొత్త అడుగు వేసేవారు కొందరు.

కలైయారసి రెండో కోవకు చెందిన మహిళ.

నేతకార్మికుల బంగారు కాలాన్ని కళ్లతో చూసిన కలైయారసి అవే కళ్లతో వారి కష్టాలను చూసింది. ఆ బాధలో నుంచి 'రాటై' స్టార్టప్‌కు స్వీకారం చుట్టింది.

సంప్రదాయ నేతకళకు డిఐవై(డూ ఇట్ యువర్‌సెల్ఫ్) కిట్స్ ద్వారా కొత్త వెలుగు తెస్తోంది తమిళనాడుకు చెందిన కలైయారసి రామచంద్రన్. పిల్లలు, పెద్దలు ఉపయోగించేలా ఈ కిట్‌ను డిజైన్ చేశారు. సంప్రదాయ కళకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్న కలైయారసి గురించి....


కలైయారసి

నేతకళ నేస్తం

సాఫ్ట్‌వేర్ టు వీవింగ్

కొన్ని సంవత్సరాల క్రితం...

'చదువుకోవాలని ఉంది' అని తన మనసులోని మాటను భర్తకు చెప్పింది కలైయారసి. పెళ్లికి ముందు పై చదువులు చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడలుగా నిలిచాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కలైయారసి మనసులో మాట విన్న భర్త 'తప్పకుండా' అని ప్రోత్సహించాడు. అలా కలైయారసి ఎంసీఏ పూర్తి చేసింది. ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా పని చేసింది.

ఈరోడ్(తమిళనాడు) జిల్లాలోని సాలంగపాలయం గ్రామానికి చెందిన కలైయారసి నేతకార్మికుల కుటుంబం నుంచి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసినా నేతకళపై ఆమెకు ఉన్న ప్రత్యేకాభిమానం మాత్రం దూరం కాలేదు. సెలవుల్లో సొంత ఊరుకు వచ్చిన కలైయారసి అక్కడ నేతకార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. ఊళ్లో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కు పడిపోయింది.

కష్టాలలో ఉన్న నేతకార్మికులకు ఆసరాగా నిలవడానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది కలైయారసి. నేతకళ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొని 'రాటై హ్యాండ్లూమ్' పేరుతో స్వగ్రామంలో ఎకో–ఫ్రెండ్లీ హ్యాండ్లూమ్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత కోణంలో ఆలోచించి ఆర్గానిక్ క్లాత్ వీవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

'నేతపని ద్వారా ఉపాధి పొంది సంతోషంగా ఉన్న కార్మికుల ఆర్థికపరిస్థితి ఆ తరువాత దిగజారిపోయింది.

చాలామంది ఉపాధి వెదుక్కుంటూ పట్టణాల బాట పట్టారు. డబుల్ షిఫ్టులలో పనిచేసేవాళ్లు. కొందరు వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లిదండ్రులు ఊళ్లో లేకపోవడంతో పిల్లల చదువు గాడి తప్పింది. తమిళనాడులో ఎన్నో గ్రామాలకు వెళ్లి నేతకార్మికులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నాను. ఈ పరిస్థితి నాకు బాధాకరంగా అనిపించింది' అంటున్న కలైయారసి తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి నేతకళను స్వయంగా నేర్చుకుంది. సహజరంగులతో పాటు అరటి పీచు, జనపనార, ఇతర పదార్థాలతో తయారుచేసిన సేంద్రియ నూలును 'రాటై' ఉపయోగిస్తోంది. ప్రస్తుతం 28 కుటుంబాల వరకు 'రాటై హ్యాండ్లూమ్' కోసం పనిచేస్తున్నాయి.

సంప్రదాయ చేనేత వస్త్రాలకు ఊతం ఇచ్చేందుకు పోర్టబుల్ డిఐవై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనకు శ్రీకారం చుట్టింది కలైయారసి.

ఎక్కడికంటే అక్కడికి చేతితో తీసుకెళ్లగలిగే ఈ మగ్గాలకు యూజర్ మాన్యువల్, క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా యూట్యూబ్ వీడియోల సహాయంతో పరికరాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు. తమిళనాడులోని ఎన్నో స్కూల్స్‌లో పిల్లల దగ్గర పోర్టబుల్ లూమ్స్ కనిపిస్తున్నాయి. స్కూల్స్‌లో వీవింగ్ క్లబ్స్ ఏర్పాటు కావడం మరో విశేషం. మూడు ఆప్షన్‌లలో, మూడు స్థాయిల్లో అందుబాటులో ఉన్న వీటిని పెద్దలు, పిల్లలు ఉపయోగించవచ్చు.

'రాటై' స్టార్టప్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. టాన్‌సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇనోవేషన్ మిషన్) ద్వారా పది లక్షల గ్రాంట్ వచ్చింది.

'నేతకార్మికులకు ఉపాధి కల్పించడమే కాదు ఈ తరానికి ఆ కళపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా చేయాలనేది నా లక్ష్యం' అంటుంది కలైయారసి.

పిల్లల కోసం వర్క్‌షాప్



'రాటై' ద్వారా నేత కార్మికులకు అండగా నిలిస్తూనే మరోవైపు నేతకళపై పిల్లలకు అవగాహన, ఆసక్తి కలిగించడానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది కలైయారసి. పెద్దలకు 'నేతపనిని స్ట్రెస్‌–బస్టింగ్ ఎక్సర్‌సైజ్‌గా పరిచయం చేస్తోంది. 'వీలైనన్ని ఎక్కువ స్కూల్స్‌కు వెళ్లి పిల్లలకు నేతకళ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక ఆర్ట్‌గా మన విద్యావిధానంలో నేతకళ భాగం కావాలని ఆశిస్తున్నాను' అంటుంది కలైయారసి.

ఈ భూగోళం మీద ప్లాస్టిక్ తొడుగు ఉంది. అది నీటిలో నానదు. మట్టిలో కలవదు.
నిప్పులో కాల్చితే విషంగా మారుతుంది. అలాంటి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. లేదా రీసైకిల్ చేయాలి.
అందుకే అసోంలోని ఆ స్కూల్ 2016లో వృథా ప్లాస్టిక్కే స్కూల్ ఫీజ్‌గా ప్రారంభమైంది.
ఏడేళ్లు గడిచినా దిగ్విజయంగా నడిచి పర్యావరణ హితమైన స్కూల్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

● వినూత్నం

ఆ స్కూల్ ప్లాస్టిక్‌పై గెలిచింది

ఫీజుకు బదులు ప్లాస్టిక్ వేస్ట్‌ను ఎవరైనా తీసుకుంటారా? ఆ స్కూల్‌లో తీసుకుంటారు. ఎంత వేస్ట్ తెస్తే అంత మెచ్చుకుంటారు కూడా. పర్మితా శర్మ, మజిన్ ముక్తార్ అనే పర్యావరణ ప్రేమికుల, బాలల హితుల వినూత్న ఆలోచన ఇది. అసోంలోని పమోహీలో 'అక్షర్' పేరుతో వీరిద్దరూ ఒక పాఠశాల స్థాపించారు 2016లో. దీనిని భిన్నంగా నడపాలని నిశ్చయించుకున్నారు. చదువు, స్కిల్స్, పర్యావరణ స్పృహ సిలబస్‌గా ఉండాలనుకున్నారు. అందుకే ఫీజు కట్టాలంటే నోట్లు తేవద్దు వేస్ట్ ప్లాస్టిక్ తెండి అని చెప్పసాగారు. వీలైనన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకెళ్తే ఫీజు కట్టినట్లు రసీదు ఇస్తారు. మరో విషయం ఏమిటంటే ఇక్కడ విద్యార్థులను వారి వయసును బట్టి కాకుండా అవగాహన స్థాయిని బట్టి తరగతుల్లో వేస్తారు. ఎనిమిదేళ్లు వచ్చిన వారు 3వ క్లాస్‌లో ఉండాలని రూల్ లేదు. నాలుగులో ఉండొచ్చు లేదా రెండులోనూ ఉండొచ్చు.


స్కూల్ ఫీజుగా ప్లాస్టిక్‌ను ఇస్తున్న విద్యార్థులు


ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలని

మనుషులు బాగా చలి పుడితే దేనితోనైనా చలిమంట వేసుకోవడానికి వెనుకాడరు. అసోంలో చలి ఎక్కువ. కాని కట్టెలు ఖర్చు. అందుకే చలిమంటల కోసం ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను తెచ్చి మంటల్లో వేయసాగారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం పర్యావరణానికి తీవ్రమైన హాని. దీనిపై అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం రాలేదు. దానికి తోడు ప్లాస్టిక్ తగులపెట్టడం వల్ల వెలువడే విష వాయువులు పీల్చి పిల్లలు జబ్బు పడసాగారు. దీంతో సామాజిక కార్యకర్త అయిన పర్మితా శర్మకు ఓ ఆలోచన తట్టింది. తన మిత్రుడు, అమెరికాలో బాలల విద్యారంగంలో పని చేస్తున్న నిపుణులు మజిన్‌తో తన ఆలోచనను పంచుకుంది. అసోం భౌగోళిక పరిస్థితుల గురించి, అక్కడ నెలకొన్న సవాళ్ల గురించి మజిన్‌కు వివరించింది. అలా వారిద్దరి ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చిందే 'అక్షర్' విద్యాలయం.

ఎవరు చేరుతారు?

స్కూలంటే డబ్బు తీసుకుని చదువు చెప్పాలి. ప్లాస్టిక్ తెండి స్కూల్‌లో చేరండి అంటే ఎవరు చేరతారు. పైగా సంప్రదాయ విద్యకు, వృత్తి విద్యకు మధ్య వారధిగా ప్రారంభించిన ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం మొదట్లో సవాలుగానే మారింది. ఇక అక్కడి పేద పిల్లలు దగ్గర్లోనే ఉన్న రాళ్ల క్వారీలలో పనిచేస్తారు. వారిని బడికి పంపిస్తే ఆదాయం కోల్పోతామని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపేందుకు ససేమిరా అన్నారు. దీంతో తల్లిదండ్రుల అవసరాలకు తగిన విధంగా స్కూల్ సమయాన్ని, బోధనను 'అక్షర్' లో రూపకల్పన చేశారు.

ప్లాస్టిక్ ఇటుకలు

'అక్షర్'లో నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన మెషినరీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తారు. పాత ప్లాస్టిక్‌తో ఇటుకలు తయారు చేస్తారు. వీటిని నిర్మాణాల్లో వాడొచ్చు. పిల్లలు స్కూల్ అయ్యాక ఈ ఇటుకల తయారీ నేర్చుకుంటున్నారు. అలాగే పూలకుండీలు, బౌల్స్ వంటివి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రెండున్నర వేల ప్లాస్టిక్ బాటిళ్లు, ఏడు లక్షల ప్లాస్టిక్ కవర్లు ఇక్కడ రీసైకిల్ అయ్యాయి. అసోంను ప్లాస్టిక్ పీడ నుంచి విముక్తం చేయాలంటే తమ స్కూల్ మోడల్‌ని ఫాలో కావాలని పర్మిత, మజిన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి 5 స్కూళ్లు ఈ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అంటే ఫీజుగా ప్లాస్టిక్‌ను తీసుకుంటున్నాయి. మరో వంద స్కూళ్లు ఇలా చేస్తే బాగుంటుందని పర్మిత, మజిన్ భావిస్తున్నారు. అసోంలో మాత్రమే కాదు దేశమంతా ఈ మోడల్‌ను ఉపయోగిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను కచ్చితంగా తరిమికొట్టడం వీలవుతుంది.



టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ ప్రచారకర్తగా బోల్ట్

దుబాయ్: అథ్లెటిక్స్ దిగ్గజం, ఆల్‌టైమ్ గ్రేట్ ఉసేన్ బోల్ట్ ఇప్పుడు కొత్తగా క్రికెట్‌కు ప్రచారం కల్పించేందుకు సిద్ధమయ్యాడు. జమైకాకు చెందిన బోల్ట్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) త్వరలో జరిగే టి20 ప్రపంచకప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. జూన్ 1 నుంచి జరిగే ఈ టోర్నీ వెస్టిండీస్, అమెరికాలలో జరగనున్న నేపథ్యంలో విండీస్ జట్టులో భాగమైన జమైకా దేశ ప్లేయర్ బోల్ట్‌ను ఎంచుకుంది. కొన్నేళ్ల క్రితమే ఆటకు వీడ్కోలు పలికిన ఫాస్టెస్ట్ స్ప్రింటర్ బోల్ట్ పేరిటే ప్రస్తుతం 100 మీటర్లు, 200 మీటర్లు ప్రపంచ రికార్డులు నమోదై ఉన్నాయి. 'ఈ కొత్త పాత్ర పట్ల చాలా సంతోషంగా ఉంది. అంబాసిడర్ హోదాలో ప్రపంచకప్ కోసం చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. క్రికెట్‌ను ఎంతో ప్రేమించే కరిబియన్ దేశం నుంచి వచ్చిన నా మదిలో క్రికెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వరల్డ్ కప్ అమెరికాలో జరగడం క్రికెట్ మార్కెట్‌ను మరింత విస్తరించేలా చేస్తుంది. అయితే టోర్నీలో మాత్రం నేను వెస్టిండీస్ జట్టుకు మద్దతు పలుకుతా' అని బోల్ట్ వెల్లడించాడు. జూన్ 1 నుంచి 29 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పోటీపడనున్నాయి.

ప్రచండ పంత్...

- ఢిల్లీ క్యాపిటల్స్‌కు కీలక విజయం
- రాణించిన అక్షర్ పటేల్, కుల్దీప్
- 4 పరుగులతో ఓడిన గుజరాత్
- సుదర్శన్, మిల్లర్ మెరుపులు వృథా

ఐపీఎల్‌లో మరో మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 225 పరుగుల లక్ష్యాన్ని కూడా గుజరాత్ టైటాన్స్ ఛేదించేలా కనిపించింది. అయితే చివరకు క్యాపిటల్స్‌దే పైచేయి కాగా... టోర్నీలో మ్యాచ్ మ్యాచ్‌కూ పదునెక్కుతున్న బ్యాటింగ్‌తో రిషభ్ పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడటం ఈ పోరులో హైలైట్‌గా నిలిచింది.



పంత్

న్యూఢిల్లీ: చివరి వరకు ఉత్కంఠగా సాగిన సమరంలో ఎట్టకేలకు ఢిల్లీ క్యాపిటల్స్ విజయాన్ని అందుకొని ఊపిరి పీల్చుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిషభ్ పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (43 బంతుల్లో 66; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 68 బంతుల్లో 113 పరుగులు జోడించడం విశేషం. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసి ఓడిపోయింది. సాయి సుదర్శన్ (39 బంతుల్లో 65; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (23 బంతుల్లో 55; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

జేక్ ఫ్రేజర్ (14 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరోసారి దూకుడైన ఆటతో ఢిల్లీకి శుభారంభం అందించాడు. అయితే 9 పరుగుల వ్యవధిలో ఫ్రేజర్‌తో పాటు పృథ్వీ షా (11), షై హోప్ (5) వెనుదిరిగారు. మూడో స్థానానికి ప్రమోట్ అయిన అక్షర్ దూకుడైన షాట్లతో ఆకట్టుకోగా, ఆ తర్వాత పంత్ తన జోరు ప్రదర్శించాడు. 37 బంతుల్లో అక్షర్ అర్ధసెంచరీ పూర్తయింది. నూర్ అహ్మద్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన అక్షర్ తర్వాతి బంతిని అదే తరహాలో ఆడే ప్రయత్నంలో వెనుదిరగడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం మోహిత్ శర్మ బౌలింగ్‌లో సిక్స్‌తో 34 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. సాయికిశోర్ వేసిన 19వ ఓవర్లో స్టబ్స్ వరుసగా 4, 6, 4, 6 బాదడంతో చెలరేగడంతో మొత్తం 22 పరుగులు వచ్చాయి.

సుదర్శన్ అర్ధసెంచరీ...

భారీ ఛేదనలో ఆరంభంలోనే గుజరాత్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (6) వెనుదిరిగినా... సాహా, సాయి సుదర్శన్ కలిసి దూకుడుగా ఆడారు. వీరిద్దరు 49 బంతుల్లోనే 82 పరుగులు జత చేశారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని కుల్దీప్ యాదవ్ విడదీసిన తర్వాత టైటాన్స్ తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మిల్లర్ కొన్ని మెరుపు షాట్లు ఆడటంతో పరిస్థితి ఆసక్తికరంగా మారింది. నోర్జే ఓవర్లో అతను 3 సిక్స్‌లు, 1 ఫోర్‌తో 24 పరుగులు రాబట్టాడు. అయితే అతను వెనుదిరిగాక గుజరాత్ గెలుపు ఆశలు సన్నగిల్లాయి. చివరి ఓవర్లో గుజరాత్ విజయానికి 19 పరుగులు అవసరంకాగా... ముకేశ్ వేసిన ఈ ఓవర్లో రషీద్ ఖాన్ 16 పరుగులే సాధించడంతో టైటాన్స్ ఓటమి ఖరారైంది.


అక్షర్ పటేల్


మిల్లర్

ఒకే ఓవర్లో 31 పరుగులు

ఢిల్లీ ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లు ముగిసేసరికే దూకుడు పెంచిన పంత్ చివరి ఓవర్లో మరింత చెలరేగిపోయాడు. మోహిత్ శర్మ వేసిన ఈ ఓవర్లో తొలి బంతికి 2 పరుగులు రాగా, తర్వాతి బంతి వైడ్ అయింది. అయితే ఆ తర్వాత పంత్ వరుసగా 6, 4, 6, 6, 6తో తన సత్తా చూపాడు. దాంతో ఈ ఓవర్లో ఏకంగా 31 పరుగులు వచ్చాయి. ఈ దెబ్బకు మోహిత్ శర్మ ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (4 ఓవర్లలో 73) ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. గతంలో బాసిల్ థంపి (70) పేరిట ఉన్న రికార్డును సవరించాడు. మోహిత్ 7 సిక్స్‌లు ఇవ్వగా అన్నీ పంత్ కొట్టినవే!

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X బెంగళూరు
వేదిక: హైదరాబాద్

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
ఢిల్లీ	9	4	5	8	-0.386
గుజరాత్	9	4	5	8	-0.974
ముంబై	8	3	5	6	-0.227
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) నూర్ (బి) సందీప్ 11; జేక్ ఫ్రేజర్ (సి) నూర్ (బి) సందీప్ 23; అక్షర్ (సి) సాయికిశోర్ (బి) నూర్ 66; హోప్ (సి) రషీద్ (బి) సందీప్ 5; పంత్ (నాటౌట్) 88; స్టబ్స్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 224. వికెట్ల పతనం:** 1-35, 2-36, 3-44, 4-157. **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-33-0, సందీప్ వారియర్ 3-0-15-3, రషీద్ ఖాన్ 4-0-35-0, నూర్ అహ్మద్ 3-0-36-1, మోహిత్ శర్మ 4-0-73-0, షారుఖ్ ఖాన్ 1-0-8-0, సాయికిశోర్ 1-0-22-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) అక్షర్ (బి) కుల్దీప్ 39; గిల్ (సి) అక్షర్ (బి) నోర్జే 6; సుదర్శన్ (సి) అక్షర్ (బి) సలామ్ 65; అజ్మతుల్లా (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 1; మిల్లర్ (సి) సలామ్ (బి) ముకేశ్ 55; షారుఖ్ (సి) పంత్ (బి) సలామ్ 8; తెవాటియా (సి) పంత్ (బి) కుల్దీప్ 4; రషీద్ (నాటౌట్) 21; సాయికిశోర్ (బి) సలామ్ 13; మోహిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 220. వికెట్ల పతనం:** 1-13, 2-95, 3-98, 4-121, 5-139, 6-152, 7-181, 8-206. **బౌలింగ్:** ఖలీల్ 2-0-26-0, నోర్జే 3-0-48-1, సలామ్ 4-0-44-3, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 3-0-28-1, కుల్దీప్ 4-0-29-2.

రెండు స్వర్ణాలపై భారత్ గురి

కాంపౌండ్ టీమ్ విభాగాల్లో ఫైనల్‌కు భారత మహిళల, పురుషుల జట్లు


జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి



ప్రథమేశ్, అభిషేక్ వర్మ, ప్రియాంశు

షాంఘై (చైనా): ఆర్చరీ సీజన్ తొలి ప్రపంచకప్ టోర్నమెంట్ కాంపౌండ్ విభాగంలో భారత క్రీడాకారుల గురి అదిరింది. మహిళల, పురుషుల టీమ్ విభాగాల్లో భారత జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లి రెండు స్వర్ణ పతకాల రేసులో నిలిచాయి. బుధవారం జరిగిన టీమ్ విభాగాల నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత జట్లు నిలకడగా రాణించాయి. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్లో 235-230 పాయింట్ల తేడాతో టర్కీ జట్టును ఓడించింది. అనంతరం సెమీఫైనల్లో సురేఖ బృందం 235-230 పాయింట్ల తేడాతోనే ఎస్టోనియా జట్టుపై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో ఇటలీతో భారత మహిళల జట్టు తలపడుతుంది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన సురేఖ జట్టుకు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది. మరోవైపు అభిషేక్ వర్మ, ప్రథమేశ్, ప్రియాంశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు తొలి రౌండ్‌లో 233-227తో ఫిలిప్పీన్స్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 237-234తో డెన్మార్క్ జట్టుపై, సెమీఫైనల్లో 235-233తో టాప్ సీడ్ దక్షిణ కొరియా జట్టుపై విజయం సాధించి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో నెదర్లాండ్స్‌తో టీమిండియా పోటీపడుతుంది.

మూడో స్థానంలో ధీరజ్

పురుషుల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ధీరజ్ బొమ్మదేవర 693 పాయింట్లతో మూడో స్థానాన్ని పొందాడు. 684 పాయింట్లతో తరుణ్‌దీప్ రాయ్ ఏడో స్థానంలో, 672 పాయింట్లతో ప్రవీణ్ జాధవ్ 25వ స్థానంలో నిలిచారు. మహిళల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారిణులు అంకిత (664 పాయింట్లు), భజన్ కౌర్ (657 పాయింట్లు), దీపిక కుమారి (656 పాయింట్లు) వరుసగా 15వ, 29వ, 30వ స్థానాల్లో నిలిచారు.



దీపాంశుకు స్వర్ణం



దుబాయ్: ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు ఒక స్వర్ణం, మూడు రజతాలతో కలిపి మొత్తం నాలుగు పతకాలు లభించాయి. పురుషుల జావెలిన్ త్రోలో దీపాంశు శర్మ పసిడి పతకం సాధించాడు. దీపాంశు జావెలిన్‌ను 70.29 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన రోహన్ యాదవ్ 70.03 మీటర్లతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు. పురుషుల 1500 మీటర్ల విభాగంలో ప్రియాంశు రజత పతకం నెగ్గాడు. ప్రియాంశు 3 నిమిషాల 50.85 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల డిస్కస్ త్రోలో రితిక్ (53.01 మీటర్లు) రజత పతకం గెలిచాడు.

సినిమా

ముంబైలో కుబేర


నాగార్జున


ధనుష్

ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల బ్యాంకాక్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ ముంబైలో ప్రారంభం అయింది. దాదాపు రెండు వారాల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట శేఖర్ కమ్ముల. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న 'కుబేర' సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ప్రీతి ఈజ్ బ్యాక్


ప్రీతీ జింటా

ఆరేళ్ల తర్వాత సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు బాలీవుడ్ నటి ప్రీతీ జింటా. సన్నీడియోల్ హీరోగా రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'లాహోర్ 1947'. హీరో ఆమిర్‌ఖాన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దులోని లొకేషన్స్‌లో ఈ సినిమా నైట్ షూట్ జరుగుతోందని సమాచారం. తాజాగా ఈ సినిమాలో తాను ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, చిత్రీకరణలో పాల్గొన్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు ప్రీతీ జింటా. ఈ సంగతి ఇలా ఉంచితే... 2018లో రిలీజైన హిందీ చిత్రం 'భయ్యాజీ సూపర్‌హిట్' మూవీలో సన్నీడియోల్, ప్రీతీ జింటా జోడీగా నటించారు. ఆ సినిమా తర్వాత మరో మూవీలో నటించలేదు ప్రీతీజింటా. మళ్లీ ఇప్పుడు 'లాహోర్ 1947'కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారామె. ఇక ప్రీతీ జింటా తిరిగి సినిమాలు చేస్తుండటంతో ఆమె అభిమానులు 'ప్రీతి ఈజ్ బ్యాక్', 'ప్రీతి రిటర్న్స్' అంటూ పోస్ట్‌లు షేర్ చేస్తున్నారు.

పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పుష్ప-2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కొత్త అప్‌డేట్ వచ్చింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ నుంచి 'పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్...' అంటూ సాగే టైటిల్ సాంగ్ తొలి లిరికల్ వీడియో ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. పూర్తి పాటని మే 1న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప: ది రైజ్' (2021) పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికిగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు అల్లు అర్జున్. ఈ మూవీకి సీక్వెల్‌గా రూపొందుతోన్న 'పుష్ప-2 ది రూల్'పై ఇటు ఇండస్ట్రీ, అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ నెల 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సునీల్, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సీఈఓ: చెర్రీ.

కూతురి కోసం ఓ తల్లి పోరాటం



- వరలక్ష్మీ శరత్‌కుమార్

''**భ**ర్త నుంచి విడిపోయిన ఓ సాధారణ ఒంటరి మహిళ తన కుమార్తెను పెంచుతుంటుంది. ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? కూతుర్ని కాపాడుకోవడం కోసం తల్లి ఏం చేసింది? అనేది 'శబరి' మూవీ కథ'' అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో అనిల్ కాట్జ్ దర్శకత్వం వహించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ మూవీ తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ హైదరాబాద్‌లో మాట్లాడుతూ–''సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శబరి' రూపొందింది. స్క్రీన్ ప్లే, డిఫరెంట్ యాక్షన్, నేచురల్ ఫైట్ సీక్వెన్సులు ఉంటాయి. ఇందులో టిపికల్ రెగ్యులర్ నెగిటివ్ షేడ్ రోల్ కాకుండా కొత్త పాత్ర చేశా. ఈ మూవీ తప్పకుండా ప్రేక్షకులకు కొత్త థ్రిల్ ఇస్తుంది. 'శబరి' దర్శక-నిర్మాతలు కొత్తవారే కావచ్చు.. కానీ, ఈ సినిమాని అద్భుతంగా తీశారు. ఇక హిట్, ఫ్లాపులు ఎవరి చేతుల్లోనూ లేవు. నా సినిమా చూసి థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు నా నటన బాలేదని అనుకోకూడదు.. అది దృష్టిలో పెట్టుకుని నటిస్తాను. నేనెప్పుడూ ఇమేజ్‌ని పట్టించుకోను. నాకు నచ్చిన పాత్రలు చేస్తాను. నికోలయ్‌తో నా పెళ్లి ఈ ఏడాదే ఉంటుంది'' అన్నారు.

బేబీజాన్ పూర్తి


వరుణ్ ధావన్

వరుణ్ ధావన్ హీరోగా నటించిన హిందీ చిత్రం 'బేబీ జాన్'. తమిళ దర్శకుడు కాలీస్ తెరకెక్కించిన ఈ మూవీలో కీర్తి సురేష్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటించారు. కాగా ఓ సాంగ్ షూట్‌తో 'బేబీజాన్' సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు బాలీవుడ్ సమాచారం. అలాగే బుధవారం (ఏప్రిల్ 24) వరుణ్ ధావన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'బేబీ జాన్' నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అట్లీ సమర్పణలో మురాద్ ఖేతనీ, ప్రియా అట్లీ, జ్యోతిదేశ్ పాండే నిర్మించిన ఈ చిత్రం మే 31న థియేటర్స్‌లో విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాల వల్ల ఈ సినిమా కాస్త ఆలస్యంగా రిలీజ్ కానుందని బాలీవుడ్ టాక్.

ది ఢిల్లీ ఫైల్స్


అభిషేక్ అగర్వాల్

'ది కశ్మీర్ ఫైల్స్'(2022) సినిమాతో బాలీవుడ్‌లోకి ప్రవేశించారు తెలుగు నిర్మాత అభిషేక్ అగర్వాల్. వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై రూపొందిన ఈ మూవీ హిట్‌గా నిలిచింది. తాజాగా వివేక్ రంజన్ అగ్నిహోత్రి డైరెక్షన్‌లోనే 'ది ఢిల్లీ ఫైల్స్' సినిమా చేయనున్నట్లు అభిషేక్ అగర్వాల్ చెప్పారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్- ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్స్‌పై అభిషేక్ అగర్వాల్, అర్చన అగర్వాల్, వివేక్ రంజన్ అగ్నిహోత్రి, పల్లవి జోషి నిర్మించనున్నారు. ''షెడ్యూల్ ప్రకారం 'ది ఢిల్లీ ఫైల్స్' షూటింగ్ ఈ ఏడాది ప్రారంభం అవుతుంది.. వచ్చే ఏడాది విడుదలవుతుంది. ఇందులో బిగ్ స్టార్లు లేరు.. బిగ్ కంటెంట్ మాత్రమే ఉంది'' అని వివేక్ అగ్నిహోత్రి అన్నారు.

ఓ ఆత్మ ప్రేమకథ

ఆశిష్ హీరోగా, 'బేబీ' మూవీ ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన లవ్ అండ్ హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ఇది. ఈ మూవీని తొలుత ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ చేసింది చిత్ర యూనిట్. మే 25న సినిమాని రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఓ ఆత్మ ప్రేమకథ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుందని యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: పీసీ శ్రీరాం.


ఆశిష్, వైష్ణవీ చైతన్య

కన్నడలో ఎంట్రీ


ఐశ్వర్యా రాజేష్

తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్. టాలీవుడ్‌లో 'కౌసల్య కృష్ణమూర్తి, మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్, టక్ జగదీష్, రిపబ్లిక్' వంటి సినిమాలు చేశారామె. తమిళంలో వరుస చిత్రాలతో దూసుకెళుతున్న ఐశ్వర్యా రాజేష్ తాజాగా కన్నడ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. శివ రాజ్‌కుమార్, డాలి ధనుంజయ హీరోలుగా రోహిత్ పడకి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఉత్తరాఖండ'. ఈ మూవీలో ధనుంజయకు జోడీగా దుర్గి అనే పాత్రలో కనిపించనున్నారు ఐశ్వర్యా రాజేష్. కన్నడలో ఆమెకు ఇదే తొలి సినిమా. కేఆర్‌జీ స్టూడియోస్ సమర్పణలో కార్తీక్, యోగి జి రాజ్ ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ బీజాపూర్ ప్రాంతాల్లో జరుగుతోంది.

భయం ...భయం!


రస్సెల్ క్రోవ్

'గ్లాడియేటర్' ఫేమ్, ఆస్కార్ అవార్డు గ్రహీత రస్సెల్ క్రోవ్ నటించిన తాజా చిత్రం 'ది ఎక్సార్సిజమ్'. జే. జాన్ మిల్లర్ దర్శకత్వం వహించిన సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ మూవీ ఇది. ఆంథోనీ మిల్లర్ అనే ఓ యాక్టర్ పాత్రలో నటించారు రస్సెల్ క్రోవ్. కెవిన్ విలియమ్ సన్, బెన్‌ఫాస్ట్, బిల్‌బ్లాక్ ఈ సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, జూన్ 7న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఓ హారర్ ఫిల్మ్‌కు సైన్ చేసిన తర్వాత ఆంథోనీ మిల్లర్ జీవితంలో ఊహించని ఘటనలు జరుగుతాయి. షూటింగ్‌లోనూ కొన్ని భయానక సంఘటనలు చోటుచేసుకుంటాయట. అతని గత జీవితానికి, ఈ సినిమాకు ఉన్న సంబంధం ఏంటి? అనే అంశాలతో ఈ చిత్ర కథ ఉంటుందని హాలీవుడ్ టాక్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 114	నిఫ్టీ ▲ 34
73,853	22,402

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,750	▲	54
డోజోన్స్	38,517	▲	13
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,040	▼	4
డాక్స్	18,089	▼	49
పాంఫై	3,045	▲	23
నికాయ్	38,460	▲	908

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,826 ▲	228
బంగారం (99.5 స్వచ్ఛత)	71,538 ▲	227
వెండి (కిలో)	80,687 ▲	680

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.17	84.19
£	బ్రిటన్ పౌండ్		102.67	105.22
€	యూరో		87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)		47.00	62.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.57	54.49
S$	సింగపూర్ డాలర్		59.20	63.40
SAR	సౌదీ రియాల్		21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.84	23.61
¥	చైనా యువాన్		10.39	12.39

కోటక్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ షాక్..

- ఆన్‌లైన్‌లో కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశం
- కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయొద్దని ఆంక్షలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ షాకిచ్చింది. ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశించింది. అలాగే కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయి. బ్యాంకు ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో 'తీవ్రమైన లోపాలు' బయటపడటం ఇందుకు కారణమని ఆర్‌బీఐ పేర్కొంది. అయితే, క్రెడిట్ కార్డు కస్టమర్లు సహా ప్రస్తుతమున్న ఖాతాదారులందరికీ బ్యాంకు యథాప్రకారం సేవలు అందించడాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. మే 4న కోటక్ మహీంద్రా బ్యాంకు ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

బ్యాంకు ఎక్స్‌టర్నల్ ఆడిట్‌ను నిర్వహించి, అందులో బయటపడే సమస్యలను, తాము గుర్తించిన లోపాలను పరిష్కరిస్తే ఆంక్షలను సమీక్షిస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.



పదే పదే సాంకేతిక అంతరాయాలు తలెత్తుతున్న కారణంగా 2020 డిసెంబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై కూడా ఆర్‌బీఐ దాదాపు ఇదే తరహా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

ఐటీ సంబంధ తనిఖీలో కీలకాంశాలు

2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంబంధ తనిఖీల్లో తీవ్ర ఆందోళనకరమైన అంశాలను గుర్తించినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. 'ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, యూజర్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, వెండార్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెక్యూరిటీ వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు, నిబంధనలను పాటించకపోవడం మొదలైన వాటిని గుర్తించాం' అని వివరించింది. వాటిని సమగ్రంగా, సకాలంలో పరిష్కరించడంలో బ్యాంకు నిరంతరం వైఫల్యం చెందుతున్న కారణంగా తాజా చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది.

పటిష్టమైన ఐటీ మౌలిక సదుపాయాలు, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లేకపోవడం వల్ల కోర్ బ్యాంకింగ్ సిస్టం (సీబీఎస్), ఆన్‌లైన్ .. డిజిటల్ బ్యాంకింగ్ మాధ్యమాలు గత రెండేళ్లుగా తరచూ మొరాయిస్తూ, కస్టమర్లను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయని వివరించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15న కూడా ఇదే తరహా ఘటన చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకుకు సంబంధించిన నిర్దిష్ట వ్యాపార విభాగాలపై ఆంక్షలు విధించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

స్పీడ్ తగ్గిన హెచ్‌యూఎల్

- లాభం రూ. 2,561 కోట్లు
- రూ. 24 తుది డివిడెండ్

న్యూఢిల్లీ: నాలుగో త్రైమాసికంలో హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) నికర లాభం స్వల్పంగా తగ్గి (1.53%) రూ. 2,561 కోట్లుగా నమోదైంది. తాజా సమీక్షాకాలంలో ఆదాయం రూ. 15,375 కోట్ల నుంచి స్వల్ప వృద్ధితో రూ. 15,441 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 11,962 కోట్ల నుంచి రూ. 12,100 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ. 61,092 కోట్ల నుంచి రూ. 62,707 కోట్లకు చేరింది. లాభం రూ. 10,143 కోట్లుగా నమోదైంది. బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు.. రూ.1 ముఖ విలువ చేసే షేరు ఒక్కింటికి రూ. 24 చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని ప్రతిపాదించింది. తాత్కాలిక డివిడెండ్ రూ. 18 కూడా కలిపితే పూర్తి సంవత్సరానికి మొత్తం మీద ఒక్కో షేరుకి రూ. 42 డివిడెండ్ ఇచ్చినట్లవుతుందని సంస్థ తెలిపింది.

బుధవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 2,259.15 వద్ద క్లోజయ్యింది.

యాక్సిస్ లాభం రూ. 7,129 కోట్లు

- క్యూ4లో ఆదాయం రూ. 35,990 కోట్లు
- రూ. 1 డివిడెండు



ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 7,129 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2022-23 క్యూ4లో బ్యాంకు రూ. 5,728 కోట్ల నికర నష్టం నమోదు చేసింది. ఇక తాజాగా ఆదాయం రూ. 28,758 కోట్ల నుంచి రూ. 35,990 కోట్లకు ఎగిసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 11 శాతం పెరిగి రూ. 13,089 కోట్లుగా నమోదైంది. మరోవైపు, 2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు నికర లాభం 160 శాతం పెరిగి రూ. 24,861 కోట్లకు చేరింది. వ్యాపార పరిమాణం 12% వృద్ధి చెంది రూ. 14,77,209 కోట్లకు ఎగిసింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ. 2 ముఖ విలువ గల షేరుపై రూ. 1 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని బ్యాంకు బోర్డు నిర్ణయించింది. సిటీ బ్యాంకు వ్యాపార కార్యకలాపాలను అనుసంధానం చేసే ప్రక్రియ వచ్చే ఆరు నెలల్లో పూర్తి కావచ్చని బ్యాంకు సీఈవో అమితాబ్ చౌదరి తెలిపారు. భారత్‌లో సిటీబ్యాంక్ కన్జూమర్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

మరిన్ని విశేషాలు..

- స్థూల మొండి బాకీలు 2.02% నుంచి 1.43 శాతానికి తగ్గాయి.
- పూర్తి ఆర్థిక సంవత్సరంలో 475, నాలుగో క్వార్టర్లో 125 శాఖలను తెరవడంతో దేశీయంగా మొత్తం బ్రాంచీల నెట్‌వర్క్ 5,377కి చేరింది.
- మార్చి క్వార్టర్‌లో 12.4 లక్షల క్రెడిట్ కార్డులను కొత్తగా జారీ చేయడం ద్వారా గత తొమ్మిది క్వార్టర్లలో దేశీయంగా అత్యధిక సంఖ్యలో క్రెడిట్ కార్డులను జారీ చేసిన బ్యాంకుల్లో ఒకటిగా బ్యాంక్ నిల్చింది.

బుధవారం బ్యాంకు షేరు బీఎస్‌ఈలో 0.69% పెరిగి రూ. 1,063.70 వద్ద క్లోజయ్యింది.

ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లాభం రూ.1,101 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 1.2 శాతం క్షీణించి రూ.1,101 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 2.32 శాతం ఎగసి రూ.8,893 కోట్లను తాకింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 4 శాతం అధికమై రూ.4,584 కోట్లు సాధించింది. టర్నోవర్ 7 శాతం దూసుకెళ్లి రూ.35,517 కోట్లకు చేరింది. ఆర్డర్ బుక్ 15.7 శాతం పెరిగి 5.6 బిలియన్ డాలర్లుగా ఉందని కంపెనీ తెలిపింది.

హైరింగ్ ప్రణాళికల్లో క్రిటికల్‌రివర్



సీఈవో అంజి మారం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా దేశీయంగా నియామకాలు చేపట్టే యోచనలో ఉంది. కంపెనీకి అంతర్జాతీయంగా 1,000 మంది సిబ్బంది ఉండగా వీరిలో దేశీయంగా సగం మంది ఉన్నారు. దీన్ని మరో 30-40% మేర పెంచుకునే అవకాశం ఉందని సంస్థ సీఈవో అంజి మారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్!



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్ పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ప్రతిపాదించింది. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉన్నారు. ఎస్‌బీఐ కొత్త ఎండీ నియామకం కోసం 16 మందిని ఇంటర్వ్యూ చేశారు. కాగా ఇండియన్ బ్యాంక్ నూతన ఎండీగా ఆశీష్ పాండే పేరును బ్యూరో ప్రతిపాదించింది.

మోసపూరిత ప్రకటనలతో జాగ్రత్త: ఎల్‌ఐసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తమ సంస్థ పేరుతో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న మోసపూరిత ప్రకటనల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) హెచ్చరించింది. 'కంపెనీ సమ్మతి లేకుండా మా సీనియర్ అధికారి, మాజీ అధికారుల ఫొటోలు, లోగో, బ్రాండ్ పేరును దుర్వినియోగం చేయడం ద్వారా నిర్దిష్ట వ్యక్తులు/సంస్థలు వివిధ సామాజిక మాధ్యమాల్లో మోసపూరిత ప్రకటనల్లో అనధికార పద్ధతిలో నిమగ్నమై ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. పాలసీదారులు, ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలి. అటువంటి మోసపూరిత ప్రకటనల యూఆర్ఎల్ లింక్‌లను ఎల్ఐసీ అధికారిక సోషల్ మీడియా ఖాతాలలో నివేదించండి' అని ఎల్‌ఐసీ కోరింది.

నాలుగో రోజూ లాభాలే

రాణించిన మెటల్, ఫైనాన్స్ షేర్లు ● 22,400 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: ఫైనాన్స్, మెటల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 114 పాయింట్లు పెరిగి 73,853 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 22,402 వద్ద నిలిచింది. దేశీయ వ్యాపార కార్యకలాపాలు ఏప్రిల్‌లో 14 ఏళ్ల గరిష్టానికి చేరుకోవడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఇన్వెస్టర్లు కార్పొరేట్ క్యూ4 ఫలితాలపై దృష్టి సారిస్తూ ట్రేడింగ్‌లో కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. ఒక దశలో సెన్సెక్స్ 383 పాయింట్లు పెరిగి 74,121 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు ఎగసి 22,476 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.92 శాతం చొప్పున పెరిగాయి. అయితే ట్రేడింగ్ చివర్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ, టెలికం, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి.



- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ 'నిఫ్టీ నెక్స్ట్ 50' సూచీలో కొత్తగా ప్రవేశపెట్టిన డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌కు సానుకూల స్పందన లభించింది. దేశవ్యాప్తంగా 375 మందికి పైగా సభ్యులు ఇండెక్స్ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో పాల్గొన్నారు. తొలిరోజు ఫ్యూచర్స్‌లో 1,233 కాంట్రాక్టులు ట్రేడయ్యాయి.
- నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,364 పాయింట్లు(2%) ర్యాలీతో బీఎస్‌ఈలో 8.48 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.401 లక్షల కోట్లకు చేరింది.
- అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు పెరగడంతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. సెయిల్ 7%, ఎన్ఎండీసీ 6%, హిండాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4%, టాటా స్టీల్, జిందాల్ స్టీల్ 3% పెరిగాయి. నాల్కో, వెల్‌స్పాన్ కార్ప్, హిందుస్థాన్ కాపర్, వేదాంత, హిందూస్థాన్ జింక్ షేర్లు 2% లాభపడ్డాయి.

మోదీ పనితీరు అద్భుతం



జేపీ మోర్గాన్ సీఈవో ప్రశంసలు

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతమైన పనితీరు ప్రదర్శిస్తున్నారంటూ జేపీ మోర్గాన్ సీఈవో జేమీ డిమోన్ ప్రశంసించారు. ఎకనామిక్ క్లబ్ ఆఫ్ న్యూయార్క్ సంస్థ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ సంస్కరణలను డిమోన్ కొనియాడారు. ''సమ్మిళిత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి భారత్‌లో ప్రధాని మోదీ 40 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారు. అక్కడ పలు రాష్ట్రాల్లోని పన్ను వ్యవస్థల సంక్లిష్టతలను ఛేదించి సంస్కరించారు. సానుకూల మార్పు దిశగా కఠిన నిర్ణయాలు తీసుకున్నారు'' అంటూ మోదీని పొగిడారు.

భవిత

సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్-2024 విద్యార్థులకు మాక్‌టెస్టులు.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండి.

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్ — మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్‌టీ, తిరువనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ), జూలై 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియోనిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్/టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ లేదా కనీసం 75శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ స్కోరు సాధించి ఉండాలి లేదా సంబంధిత విభాగంలో ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్-జేఆర్ఎఫ్/లెక్చరర్‌షిప్, ఎన్‌బీహెచ్‌ఎం/జెస్ట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 07.05.2024 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.05.2024
» **ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష తేది:** 29.05.2024.
» **పరీక్ష ఫలితాల వెల్లడి:** 05.06.2024.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 19.06.2024 నుంచి 21.06.2024 వరకు
» **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** 01.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.iist.ac.in

ఐఐఎం అహ్మదాబాద్‌లో ఆన్‌లైన్ ఎంబీఏ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్(ఐఐఎం).. 2024-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల ఆన్‌లైన్ ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఐఐఎంఏ అడ్మిషన్ టెస్ట్(ఐటీఏ),క్యాట్,జీమ్యాట్ /జీఆర్ఈ స్కోరు, షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024.
» **ఐఏటీ అడ్మిట్ కార్డ్ వెలువడే తేది:**14.05.2024
» **ఐఏటీ పరీక్ష:** 19.05.2024, 26.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.iima.ac.in

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ ప్రవేశాలు

కుండ్లి(హర్యానా)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్).. 2024-25 అడ్మిషన్ సెషన్‌కు సంబంధించి ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్): 100 సీట్లు: విభాగాలు:** ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్,ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్.
» **మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ):** 60 సీట్లు.
» **అర్హత:** ఎంబీఏకు బ్యాచిలర్ డిగ్రీ, ఎంటెక్‌కు బీఈ/బీటెక్,బీఎస్సీ,ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://niftem.ac.in

ఐఎంయూ, చెన్నైలో యూజీ-పీజీ ప్రవేశాలు

చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ (ఐఎంయూ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, యూజీ, డీఎన్ఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ సెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **విభాగాలు:** మెరైన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్, నాటికల్ సైన్స్, అప్లైడ్ న్యూట్రికల్ సైన్స్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, డ్రెడ్జింగ్ హార్బర్ ఇంజనీరింగ్, మెరైన్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హతతో పాటు గేట్/సీయూఈటీ/పీజీ సెట్/క్యాట్/మ్యాట్/సీమ్యాట్ స్కోరు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.05.2024
» **ఐఎంయూ సెట్ పరీక్ష తేది:** 08.06.2024.
» **వెబ్‌సైట్:** https://www.imu.edu.in

అవుతారా.. న్యూట్రిషనిస్ట్!

» బీఎస్సీ ఫుడ్, న్యూట్రిషన్ కోర్సుతో అవకాశాలు
» బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాలకు మార్గం
» ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్
» వీటిని పూర్తి చేసుకుంటే కార్పొరేట్ కొలువులు

బైపీసీ ఉత్తీర్ణులకు సంప్రదాయ బీఎస్సీ బీజెడ్‌సీతోపాటు పలు వినూత్న కాంబినేషన్లతో కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిని పూర్తి చేసుకుంటే.. జాబ్ మార్కెట్ అవకాశాలు విస్తృతం అవుతాయి. అలాంటి కోవకు చెందిన కోర్సు.. బీఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్! ఇటీవల కాలంలో ప్రజల్లో ఆరోగ్య శ్రద్ధ పెరగడంతో ఫుడ్, న్యూట్రిషన్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన ఆహార అలవాట్లు లేక ఎంతోమంది రోగాల బారిన పడుతున్నారు. అలాంటి వారికి తీసుకోవాల్సిన ఆహారం, పోషక పదార్థాల గురించి మార్గనిర్దేశం చేసే నిపుణులే.. న్యూట్రిషన్ స్పెషలిస్టులు.

డిగ్రీ, పీజీ కోర్సులు

ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌కు సంబంధించి ప్రస్తుతం డిగ్రీ, పీజీ స్థాయిలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో న్యూట్రిషన్, బయాలజీ, కెమిస్ట్రీ కాంబినేషన్‌తో..అదే విధంగా ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ కాంబినేషన్లతో కోర్సులు అందిస్తున్నారు. దీంతోపాటు హోంసైన్స్ విభాగంలో గుర్తింపు పొందిన హైదరాబాద్(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ)లోని కాలేజ్ ఆఫ్ హోంసైన్స్‌లోనూ బీఎస్సీలో ఫుడ్, న్యూట్రిషన్, డైటిటిక్స్ అంశాలను బోధిస్తారు. ఇదే కాలేజ్‌లో పీజీ స్థాయిలో న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ స్పెషలైజేషన్‌తో కోర్సు అందుబాటులో ఉంది. జాతీయ స్థాయిలో పలు సెంట్రల్ యూనివర్సిటీల్లోనూ బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులను అందిస్తున్నారు. సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్ఐఎన్‌లో ఎమ్మెస్సీ

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్).. ఎమ్మెస్సీ అప్లయిడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సులను అందిస్తోంది. వీటికి ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీలో అప్లయిడ్ న్యూట్రిషన్, హోం సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, నర్సింగ్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ తదితర స్పెషలైజేషన్లు పూర్తి చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ కల్పిస్తారు. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. జూన్ 23న ఎంట్రన్స్ టెస్ట్ ఉంటుంది. దరఖాస్తులకు చివరి తేదీ 2024, మే 20. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://icmrnin.aptonline.in/ICMRNIN/Views/Application/Home

సెంట్రల్ వర్సిటీల్లో పీజీ

ప్రముఖ యూనివర్సిటీల్లో పీజీ స్థాయిలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. బీహెచ్‌యూ-వారణాసి, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, ఇగ్నోతోపాటు పలు ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీల్లో లైఫ్ సైన్సెస్ విభాగాల పరిధిలో ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్‌తో పీజీ కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి సీయూఈటీ-పీజీ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.

పీహెచ్‌డీ కూడా

ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది. యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా, యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీలో చేరొచ్చు. ఇందుకోసం యూజీసీ-నెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రా యూనివర్సిటీలో, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసే వీలుంది. తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో చేరే అవకాశముంది.

కోర్సులో బోధించేవి

ఫుడ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సుల్లో భాగంగా న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ, శానిటైజేషన్, హైజీన్, డైట్ థెరపీ, పబ్లిక్ హెల్త్, కమ్యూనిటీ న్యూట్రిషన్ వంటి అంశాలను బోధిస్తారు. కరిక్యులంలో భాగంగా ఫీల్డ్ స్టడీ కూడా చేయాల్సి ఉంటుంది. దీంతో అకడమిక్ స్థాయిలోనే విద్యార్థులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన వస్తుంది. ఫలితంగా కోర్సు పూర్తయ్యే నాటికి నైపుణ్యాలు సొంతం చేసుకుని జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపొందే అవకాశం ఉంటుంది.

ఉపాధి వేదికలు

ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హాస్పిటల్స్, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. రోగులకు.. ఆహార నియమాలను వివరించడానికి కార్పొరేట్ హాస్పిటల్స్ ప్రత్యేకంగా డైటీషియన్స్‌ను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఈ విభాగంలో డిగ్రీ, పీజీ చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నాయి. అదే విధంగా స్పోర్ట్స్ క్లబ్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఐసీడీఎస్ విభాగాల్లోనూ న్యూట్రిషన్, డైటిషియన్ నిపుణుల అవసరం నెలకొంది.

కార్పొరేట్ సంస్థలు

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు కార్పొరేట్ కంపెనీల్లోనూ ఉపాధి లభిస్తోంది. ముఖ్యంగా ఆహార పదార్థాల తయారీ సంస్థలు..ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆయా ఆహార పదార్థాల తయారీలో పొందుపర్చాల్సిన పోషకాల శాతం, వాటి నిల్వకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు వీరిని నియమించుకుంటున్నాయి. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో న్యూట్రిషిన్ నిపుణులకు ప్రాధాన్యం పెరుగుతోంది. నెస్లె, బ్రిటానియా, క్వాలిటీ, హాట్సన్, డాబర్, క్యాడ్‌బరీ, ఐటీసీ వంటి సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి.

జాబ్ ప్రొఫైల్స్ ఇవే

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్‌లో బ్యాచిలర్, పీజీ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి విభిన్న జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ముఖ్యంగా వీరు న్యూట్రిషనిస్ట్, డైటిషియన్, ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. వీరికి ప్రారంభంలో రూ.రెండు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు వార్షిక అందుతోంది.

న్యూట్రిషనిస్ట్

హెల్త్‌కేర్ రంగంలో, ముఖ్యంగా హాస్పిటల్స్‌లో న్యూట్రిషనిస్ట్ ఉద్యోగాలు లభిస్తాయి. రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి.. వారు పాటించాల్సిన ఆహార నియమాలపై సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆహార నియామాలను సూచించాల్సి ఉంటుంది.

డైటిషియన్

వ్యక్తులు ఆరోగ్యవంతంగా జీవించడానికి అవసరమైన ఆహారపు అలవాట్లను డైటిషియన్‌లు సూచిస్తారు. పోషకాహారం అంటే ఏమిటి.. ఆయా వ్యక్తుల అవసరాలకు తగ్గట్టు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నిబంధనలు తదితరాలను వీరు వివరిస్తారు.

ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడం, అదే విధంగా వీటికి సంబంధించి పరిశోధనలు చేయడం వంటి విధులు ఉంటాయి. ఆహార పదార్థాలను కెమికల్‌గా, బయలాజికల్‌గా పరీక్షించి.. నాణ్యమైన ఉత్పత్తిని రూపొందించేలా సూచనలు చేయాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలు ఆహార పదార్థాల తయారీ సంస్థల్లో లభిస్తాయి.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్/ఎగ్జిక్యూటివ్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, వాటిలో లోటుపాట్లను గుర్తించడం.. నాణ్యమైన ఆహారం తయారీకి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రెండు రంగాల్లోనూ ఈ కొలువులు లభిస్తున్నాయి.

హెల్త్ ఎడ్యుకేటర్

ప్రభుత్వ విభాగంలో లభించే ఉద్యోగాల్లో ముఖ్యమైనది.. హెల్త్ ఎడ్యుకేటర్. ఆయా ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ,అందుకోసం పాటించాల్సిన ఆహార నియమాలను సూచించడం వంటి విధులు వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్ విభాగంలో ఈ కొలువులు లభిస్తాయి.

రేపు సంస్కృత విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

హాజరుకానున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

తిరుపతి సిటీ: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్‌ఎస్‌యూ) 3వ స్నాతకోత్సవం ఈనెల 26న నిర్వహించనున్నట్లు వీసీ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం వర్సిటీలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్యాపీఠం జాతీయ సంస్కృత వర్సిటీగా గుర్తింపు పొందిన తర్వాత జరుగుతున్న మూడో స్నాతకోత్సవానికి భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ హాజరు కానున్నారని వెల్లడించారు. ప్రతిభ చూపిన 67మందికి బంగారు పతకాలు, 47మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా 8మంది విద్యార్థులకు, మిగిలిన వారికి వర్సిటీ కులపతి గోపాలస్వామి చేతుల మీదుగా బంగారు పతకాలు, 580 మందికి డిగ్రీ అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. నూతన విద్యా విధానం పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సాంబశివమూర్తి, పీఆర్‌ఓ డాక్టర్ కే కుమార్ పాల్గొన్నారు.

ఏపీలో ప్రచారానికి మోదీ రాక

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 3, 4 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ప్రధాని ఎన్నికల ప్రచారం ఏయే నియోజకవర్గాల్లో చేపట్టేది ఇంకా అధికారికంగా ఖరారు లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నారు.

కోడ్‌ని ఉల్లంఘించిన విపక్ష నేతలపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు యత్నిస్తోంది
- వేల కోట్లు డంప్ చేసినట్లు సమాచారం ఉంది
- ఎన్ఆర్ఐ కోమటి జయరాం ఓటర్లను అవమానించారు
- ఆయన్ని వెంటనే అరెస్టు చేయాలి
- చంద్రబాబు కోడ్ ఉల్లంఘించి సీఎంపై వ్యాఖ్యలు చేస్తున్నారు
- పవన్ జాతీయ జెండాను అవమానించారు
- ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నేతృత్వంలో ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన టీడీపీ, బీజేపీ, జనసేన నేతలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈమేరకు శాసన మండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నాయకులు రావెల కిషోర్‌బాబు, మలసాని మనోహర్‌రెడ్డి, అంకంరెడ్డి నారాయణమూర్తి, కొమ్మసాని శ్రీనివాసరెడ్డి, విల్సన్‌బాబు, పానుగంటి చైతన్య, నవీన్‌కుమార్ బుధవారం సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఆధారాలు సమర్పించారు. అనంతరం లేళ్ల అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం యూఎస్ కోఆర్డినేటర్ కోమటి జయరాం ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా ప్రణాళిక రూపొందించారని, ఇది ఎంసీసీకి వ్యతిరేకమైనందున చర్యలు తీసుకోవాలని, టీడీపీ ఎన్ఆర్ఐ వింగ్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ చేయాలని కోరారు. చంద్రబాబు అండ్ కోను ప్రజలు నమ్మడం లేదని, అందుకే ఎన్ఆర్ఐలను రంగంలోకి దింపారని చెప్పారు. కోమటి జయరాంలాంటి వాళ్లు ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా రూ.కోట్లు వెదజల్లుతున్నారని అన్నారు. రూ.వేల కోట్లు డంప్ చేశారని తమకు సమాచారం ఉందన్నారు. కోమటి జయరాం ఓటర్లను వెధవలు అంటూ అవమానించారని తెలిపారు. జయరాంను వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని, ఆయన పాస్‌పోర్ట్ సీజ్ చేయాలని, ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. ప్రజాస్వామ్యంపై నిత్యం లెక్చర్లు ఇచ్చే నిమ్మగడ్డ రమేష్ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వివిధ పత్రికల్లో టీడీపీ ఇచ్చిన ప్రకటనలపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నిరాధారమైన అంశాలతో కూడిన వీడియో ప్రకటనను టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఏబీఎన్ ఛానల్లో ప్రసారం చేస్తున్నాయన్నారు. మహిళల అదృశ్యాలు అంటూ చంద్రబాబు, పవన్ విషప్రచారం చేస్తున్నారని చెప్పారు. 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమయ్యారని పవన్ చెప్పడం పెద్ద అబద్ధమన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై ఈ నెల 23న అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనకు చెందిన మద్రైపు సురేష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అదే రోజు జనసేన అధ్యక్షుడు పవన్ ఉప్పాడ సభలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, పిఠాపురంలో నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పవన్ జాతీయ పతాకాన్ని అవమానించే రీతిలో వ్యవహరించారని, ఆయనపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ జెండా పట్టుకుని పవన్ ఎన్నికల ర్యాలీలో పాల్గొనటం ఏమిటని ప్రశ్నించారు. ఇదేనా ఆయన దేశభక్తి అని అన్నారు. పవన్ చదివిన రెండు లక్షల పుస్తకాల్లో జాతీయ జెండాను ఎలా గౌరవించాలో లేదా అని దెప్పిపొడిచారు.

30 వరకు ఇంటర్ రీ కౌంటింగ్ ఫీజు గడువు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ 2024 విద్యా సంవత్సరంలో పాసైన మొదటి, రెండో సంవత్సరం రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ గడువును పొడిగించినట్టు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ వీవీ సుబ్బారావు బుధవారం తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరేవారు ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ బీఈడీ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో గురువారం నుంచి బీఈడీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అభ్యాసన సహాయ సేవా విభాగం డైరెక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నిర్ణీత రుసుము చెల్లించి గురువారం నుంచి 30వ తేదీలోగా వెబ్ ఆప్షన్లు నమోదు, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. www.braouonline.in వెబ్‌సైట్ ద్వారా బీఈడీ వెబ్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు ఆప్షనల్ సబ్జెక్టుల ప్రకారం వర్సిటీ అందించే పది ప్రోగ్రామ్ సెంటర్లలో ఎక్కడ చేరదలచుకున్నారో ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రవేశాలు పొందిన అభ్యర్థుల జాబితాను మే 8వ తేదీన ప్రకటిస్తామన్నారు.

సీపెట్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)'లోని డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ సెంటర్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ బుధవారం తెలిపారు. టెన్త్ విద్యార్హతతో మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)తోపాటు బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సులకు ప్రవేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు https://cipet24.onlineregistrationform.org/CIPET/ ద్వారా మే 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 9న సీపెట్ అడ్మిషన్ టెస్ట్ ఉంటుందన్నారు. సందేహాల నివృత్తికి 78935 86494 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విశాఖలో మరో రాడిసన్

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడులకు స్వర్గధామంగా మారిన విశాఖపట్నం వైపు అంతర్జాతీయ సంస్థలు అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే ఫైవ్‌స్టార్ హోటల్‌తో విశాఖలో దూసుకుపోతున్న రాడిసన్ గ్రూప్.. మరో స్టార్ హోటల్ నిర్మించేందుకు సన్నద్ధమవుతోంది. పెద గంట్యాడ సమీపంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. వైద్య ఉపకరణాల తయారీ, ఎగుమతుల్లో ప్రపంచంలో కీలకంగా మారిన మెడ్‌టెక్ జోన్‌లో వందలాది సంస్థలు ఏర్పాటయ్యాయి. ప్రతి రెండు మూడు నెలలకోసారి జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ స్టార్ హోటల్ అవసరమని భావించిన రాడిసన్ గ్రూప్.. స్టాండర్డ్, ఎగ్జిక్యూటివ్ కేటగిరీల్లో 120 గదులతో స్టార్ హోటల్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

'సాక్షి' ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ విద్యార్థులకు మాక్‌టెస్టులు

ఏప్రిల్ 27,28 తేదీల్లో నిర్వహణ

సాక్షి ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం.. ఇంజినీరింగ్, లేదా మెడిసిన్. అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజినీరింగ్/మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్, తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్స్‌కల్పించే ఎంసెట్‌కు లక్షల మంది సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మాక్ టెస్టులు నిర్వహించనుంది. ఈ పరీక్షలను సాక్షి మీడియా, ఐసీఎఫ్ఏఐ వర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తుంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, ప్రిపరేషన్‌ను మెరుగుపరచుకోవచ్చు.

పరీక్షలు ఎప్పుడంటే..?

రిజిస్టర్ చేసుకున్న ఫోన్ నంబర్‌కు హాల్ టికెట్ నంబర్ వస్తుంది. ఏప్రిల్ 27న నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఇంజినీరింగ్ పరీక్షలుంటాయి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా పరీక్ష రాసుకోవచ్చు. పరీక్ష సమయం 3:00 గంటలు. ఈ పరీక్షలను హాల్ టికెట్ నంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్‌ను చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.inలో నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు టెక్నాలజీ పార్ట్‌నర్‌గా మై ర్యాంక్ వ్యవహరిస్తుంది. టెస్ట్‌కి సంబంధించిన కీని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు: 95055 14424, 96660 13544, 96665 72244.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024
గురువారం
ఏప్రిల్, 25

జైత్రయాత్ర



గుసగుస

'పీకే'దేం లేక!



ము రికి గుంటలో పొర్లాడే వారితో కలిస్తే.. కంపు తప్ప.. ఇంపు మచ్చుకైనా కానరాదు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు తీరు దానికి భిన్నమేం కాదు. బాబుతో అంటకాగిన ప్రతి ఒక్కరూ వెర్రి వెంగళప్పలవక తప్పదు. దేశ వ్యాప్తంగా రాజకీయ వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ (పీకే)కి కూడా అదే గతి పట్టిందట. ఏ ముహూర్తాన టీడీపీతో ఆయన టీం జట్టు కట్టిందో.. అప్పటి నుంచే పీకే బతుకు బస్టాండయిందట. టీడీపీతో పనిచేస్తున్నట్లు బయటికి చెప్పుకోకపోయినా.. తీసుకున్న రూ.వెయ్యి కోట్ల ఫీజు కోసం అడపా దడపా జోస్యం చెప్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇపుడు మరింత ముందుకెళ్లి టీడీపీ అసంతృప్త నేతల్ని బుజ్జగించే బాధ్యతల్ని నెత్తికెత్తుకున్నారట.

అజ్ఞానవాసి



పి ల్లి కళ్లు మూసుకుని పాలు తాగినంత మాత్రాన లోకానికి చీకటా..? జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీరు ఎన్నికల అఫిడవిట్‌తో తేటతెల్లమైంది. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంపై నానా యాగీ చేసిన ఆయన అప్పుడెప్పుడో భూమి పుట్టక ముందే పదో తరగతి.. సారీ.. ఎస్ఎస్ఎల్‌సీ ఇంగ్లిష్ మీడియంలో చదివేశారు! ఆయన పిల్లలూ ఇంగ్లిష్ మీడియమే. పిఠాపురంలో పవన్ నామినేషన్ తర్వాత సోషల్ మీడియాలో ఆయన చదివిన డిగ్రీలపై గట్టిగానే ట్రోల్ అవుతోంది. 1953లోనే ఎస్ఎస్ఎల్‌సీ రద్దయి, ఆ స్థానంలో ఎస్ఎస్‌సీ వచ్చింది. ఇంత గొప్ప చదువులు చదివిన తమ అభిమాన హీరో, ఎదుటివారి చదువులపై అంత ధైర్యంగా ఎలా మాట్లాడగలుగుతున్నారబ్బా.. అని తెగ హా..శ్చర్యపోతున్నారు.

బొర్రా.. బేరం



ప ల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో జనసేన అసంతృప్త నేత బొర్రా వెంకటప్పారావు గట్టిగానే గిట్టుబాటు చేసుకుంటున్నారట. పొత్తులో భాగంగా ఈ సీటు టీడీపీ ఖాతాలోకి వెళ్లింది. ఆగ్రహించిన బొర్రా స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించి, నామినేషన్ వేశారు. దీంతో ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలకు ఒంటేలొచ్చినంత పనయిందట. ఇప్పటికే ఓటమి భయంతో వణుకుతున్న వీరు బొర్రాను బుజ్జగించే పనిలో పడ్డారు. రూ.4 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చారట. బొర్రా మాత్రం రూ.8 కోట్లు ఇస్తే తప్ప వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారట. మధ్యే మార్గంగా 6 కోట్లకు బేరం కుదిరేలా ఉందని గుసగుసలు.

పార్టీలే వేరు

ఏ పీలో పొత్తు రాజకీయాలు చాలా విచిత్రంగా మారాయి. గత ఎన్నికల్లో పోటీచేసిన రెండు స్థానాల్లోనూ నెత్తిన కండువా వేసుకున్న పవన్‌కల్యాణ్ పరిస్థితి సరే..సరి..! కేంద్రంలో రెండోసారి అధికారాన్ని వెలగబెడుతున్న బీజేపీ కూడా చంద్రబాబు కుట్రలకు బలైపోయింది. తమకు కేటాయించిన సీట్లలో కూడా టీడీపీ నేతలనే బరిలో దింపడంతో జనసేన, బీజేపీ క్షేత్రస్థాయి నాయకుల్లో తీవ్ర అయోమయం నెలకొందట. ఇన్నాళ్లూ ఎవరిని కాదని సీటు కోసం తన్నులాడామో.. వారినే తమ పార్టీ తరఫున అభ్యర్థులుగా నిలపాల్సిన దౌర్భాగ్యమేంటని ప్రశ్నిస్తున్నారట. టికెట్ ఆశావహులు సెటిల్‌మెంట్లకు లొంగి, సిగ్గువీడి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసినా, తాము మాత్రం మద్దతిచ్చేది లేదని బాహాటంగానే చెప్తున్నారట.

జన ప్రభంజనం మధ్య జైత్ర యాత్రలా సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

22 రోజుల్లో 23 జిల్లాలు..
86 నియోజకవర్గాలు 2,188 కి.మీలు
9 భారీ రోడ్ షోలు
6 ప్రత్యేక సమావేశాలు
16 బహిరంగ సభలు

- మండుటెండైనా, అర్ధరాత్రయినా పిల్లలు, పెద్దలు ఆత్మీయ స్వాగతం
- మంచి చేసిన మిమ్మల్ని మళ్లీ సీఎంగా చేసుకుంటామని భరోసా
- విజయవాడలో టీడీపీ మూక హత్యాయత్నం.. వెరవక యాత్ర కొనసాగింపు
- టీడీపీ నేతల దాష్టీకంపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం..
- జాగ్రత్తగా ఉండండి అన్నా.. అంటూ బాసటగా నిలిచిన ప్రజలు
- యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేసిందంటోన్న పరిశీలకులు
- పోటీ ఏకపక్షమే.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనంటూ విశ్లేషణలు
- తీవ్ర నిరాశ, నిస్పృహల్లో బాబు, పవన్



వార్ వన్ సైడే



నిన్ను చూడటానికే వచ్చానన్నా..

బాపట్ల జిల్లా సంతమాగలూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఏప్రిల్ 10న మధ్యాహ్నం 1.30 గంటలకు 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలో సీఎం జగన్‌ను చూసేందుకు వేల్పూరు పంచాయతీ పరిధిలోని రామిరెడ్డిపాలెంకు చెందిన వెంకాయమ్మ పరుగెత్తుకొస్తోంది. మధ్యలో చెప్పులు తెగిపోయినా లెక్క చేయకుండా తారు రోడ్డుపై ఉత్త కాళ్లతోనే పరుగులు తీస్తున్న ఆమెను చూసిన సీఎం జగన్.. బస్సు ఆపించారు. ఆమెను దగ్గరికి పిలిచారు. 'ఏం తల్లీ బాగున్నావా? ఏమైనా సమస్య ఉందా..' అంటూ ఆత్మీయంగా పలకరించారు. 'జగనన్నా.. నీ పాలనలో నాకు ఎలాంటి సమస్య లేదు. నిన్ను దగ్గరి నుంచి చూద్దామని, పలకరిద్దామనే వచ్చా' అని చెబుతూ మురిసిపోయింది.

కృ ష్ణా జిల్లా నందివాడ మండలం పుట్టగుంటకు ఒక కిలోమీటరు దూరంలో ఏప్రిల్ 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మండుతున్న ఎండలో సీఎం జగన్‌ను చూసేందుకు పొలాల వెంట 20–25 మంది మహిళలు పరుగులు పెడుతూ వస్తున్నారు. ఇది గమనించిన సీఎం జగన్ బస్సు నుంచి కిందకు దిగారు. మహిళలంతా సీఎం జగన్ చుట్టూ చేరారు. 'విజయవాడలో మీపై రాయితో దాడి చేశారని తెలిసి తల్లడిల్లిపోయాం. మంచి చేసిన మిమ్మల్ని ప్రజలంతా గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారనే అక్కసుతో టీడీపీ వాళ్లు మీపై దాడి చేయించారు.. జాగ్రత్తగా ఉండు జగనన్నా.. మీరు బాగుంటేనే మేం బాగుంటాం' అంటూ తోడబుట్టిన అన్నగా భావిస్తూ పరామర్శించారు.

కా కినాడ జిల్లా సామర్లకోట ముఖ ద్వారం వద్ద ఏప్రిల్ 19న మధ్యాహ్నం ఒంటి గంటకు మండే ఎండలో వేలాది మంది మహిళలు రోడ్డుపై నిలబడ్డారు. సీఎం జగన్ బస్సు అక్కడకు రాగానే మహిళలు హర్షధ్వానాలు చేశారు. బస్సు దిగిన సీఎం జగన్.. వారితో ముచ్చటించారు. 'జగనన్నా.. మీరు మాకు మంచి చేశారు. మేం మళ్లీ మిమ్మల్ని గెలిపించుకుని సీఎంగా చేసుకుంటాం' అంటూ భరోసా ఇచ్చారు. గుమ్మడి కాయలతో దిష్టి తీసి.. హారతులు ఇచ్చి దీవించారు.

వై ఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో ఆత్మీయత, అనుబంధాలకు అద్దం పట్టే ఇలాంటి దృశ్యాలు అడుగడుగునా కన్పించాయి. ఇలాంటి దృశ్యాలు రాజకీయాల్లో అత్యంత అరుదుగా కన్పిస్తుంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మాటపై నిలబడి.. నిబద్ధత, నిజాయితీతో పని చేసే నాయకుడిని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారనడానికి సీఎం జగన్ బస్సు యాత్రే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. బస్సు యాత్ర సాగినంత దూరం.. మండుటెండైనా అర్ధరాత్రయినా లెక్క చేయకుండా స్కూలు పిల్లల నుంచి అవ్వాతాతల వరకు మానవ హారంగా ఏర్పడి సీఎం జగన్‌కు నీరాజనాలు పలకడం దేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచిపోతుందని చెబుతున్నారు. 'ఫలానా పనులు చేస్తాం.. మాకు ఓటేయండి' అని రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు అడగడం సాధారణమని, కానీ.. 'జగనన్నా.. మీరు మంచి చేశారు.. మిమ్మల్ని మళ్లీ గెలిపించి సీఎంగా చేసుకుంటాం' అని ప్రజలు అడుగడుగునా భరోసా ఇస్తుండటం చరిత్రలో తామెన్నడూ చూడలేదని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

-మరిన్ని వివరాలు III లో



నాడు-నేడుకు దేశం ఫిదా

వెల్లువెత్తుతున్న ప్రశంసలు | **వీడియోలు పోస్టు చేస్తున్న ఉత్తరాది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు**

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ విద్యా వ్యవస్థలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ఆ అంశం యావత్ దేశాన్ని ఆకర్షిస్తోంది. నాడు–నేడు ద్వారా బడుగు, బలహీన వర్గాల పిల్లలకు పెద్దపీట వేయడాన్ని ఉత్తరాది రాష్ట్రాలు కొనియాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల పరిస్థితులు, ప్రస్తుతం సీఎం జగన్ హయాంలో పాఠశాలల స్థితిగతులపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కళ్లకు కట్టినట్లు వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. నాడు–నేడు షార్ట్ వీడియోలు ట్రెండీగా మారాయి. ఏపీలోని నాడు–నేడుపై దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో సందేశాలు వెల్లువెత్తుతున్నాయి.

- **రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు విద్యాసంస్థలను పట్టించుకోలేదు.**
- **విద్య, మధ్యాహ్న భోజన విషయంలో సైతం సర్కారీ బడులపై బాబు చిన్నచూపు చూశారు.**
- **2014–19 మధ్య దాదాపు 1,785 పాఠశాలలను మూసివేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుంది.**
- 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సీట్లతో గెలిచి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 58 నెలల్లో దాదాపు రూ.73 వేల కోట్లతో 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశారు.
- 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ల ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు. ఏ ఒక్క పిల్లవాడు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో..సీఎం జగన్ అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

సోషల్ మీడియాలో పలువురి కామెంట్లు ఇలా..
- ఇది కేవలం విజనరీ సీఎం జగన్ వల్లే సాధ్యం
- నాకు ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ అంటే ఇష్టం.. మంచి విద్య, అద్భుతమైన ఆట స్థలాలు
- అవును ఫిజికల్ ఎడ్యుకేషన్ కూడా విద్యార్థులకు అవసరమే
- దేశంలో ప్రతి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఏపీ సీఎం జగన్ కింగ్




ట్రెండింగ్‌లో కావ్య వీడియో

సీఎం జగన్ విద్యా వ్యవస్థలో నాడు–నేడు ద్వారా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను గుర్తిస్తూ ఢిల్లీకి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ 'కావ్య' ఓ వీడియోను రూపొందించారు.
- విద్యా వ్యవస్థలో దేశంలోనే ఏపీ సరికొత్త అడుగులు వేసిందని, గతంలో ఉన్న అధ్వాన పరిస్థితిని సమూలంగా మార్చివేసిందంటూ ప్రశంసలు కురిపించారు.
- అత్యాధునిక ఫర్నిచర్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేశారని.. ఆ రోజుల్లో మనకు ఇటువంటి సౌకర్యాలు లేవే అంటూ.. సీఎం జగన్ చేసిన మంచి పనిని మెచ్చుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, ఐబీ సిలబస్‌ను పరిచయం చేయడం అభినందనీయమని, ఈ ఐదేళ్ల కాలంలో ఏపీలో నిరక్షరాస్యత తగ్గిందని, బడుగు, బలహీన వర్గాల వారికి చదువుపై ఆసక్తి పెరిగిందంటూ వీడియో చేశారు.
- ఆ వీడియోను యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేయడంతో పదిలక్షలకు పైగా నెటిజన్లు వీడియో చూసి, వేల సంఖ్యలో షేర్ చేస్తూ 'సూపర్ ఏపీ స్కూల్స్' అంటూ కితాబు ఇస్తున్నారు.
- మరికొంత మంది నాడు–నేడుపై షార్ట్ వీడియోస్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. ఉత్తరాది జనం ఫిదా అవుతున్నారు.
- యూపీ, హరియాణా, రాజస్థాన్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా విద్య ఉంటే బాగుంటుందంటూ కామెంట్ల రూపంలో వారి అభిప్రాయాల్ని పంచుకుంటున్నారు.
- దేశవ్యాప్తంగా ఉన్న నెటిజన్లు ఈ వీడియోపై స్పందిస్తూ ఇదే తరహా నాణ్యమైన విద్య దేశం మొత్తం తీసుకురావాలని, సీఎం జగన్‌ను కొనియాడుతూ లైకులు, కామెంట్లు, షేర్ చేస్తున్నారు.

దశాబ్దాల రాజకీయ వారసత్వాన్ని ఆయన అక్రమాలకు అనువుగా మార్చుకున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందినకాడికి దోచుకున్నారు. అధికారులను బెదిరించి... రికార్డులు తారుమారు చేసి... అనుచరులతో కలసి భూదందా నడిపారు. సహజసిద్ధంగా లభ్యమయ్యే గ్రానైట్‌ను అక్రమంగా తవ్వేసి అధికారుల కళ్లుగప్పి ఎగుమతి చేసుకున్నారు. తమ మాట విననివారినీ.. ఎదురు తిరిగిన వారిని మట్టుబెట్టడం.. లేకుంటే వారిని సామాజిక బహిష్కరణ చేసి బెదిరించడం అలవాటుగా చేసుకున్నారు. ఓ ప్రతిపక్షం రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన ఈయన ఓ విడత అమాత్యపదవి వెలగబెట్టి ఏకంగా పెద్ద ఎత్తున కుంభకోణానికి పాల్పడ్డారు.

అచ్చోసిన క్రిమినల్

-వివరాలు III లో





చేనేతకు సంక్షేమ అద్దకం

మగ్గానికి మహర్దశ తెచ్చిన జగన్
నేతన్న సంక్షేమానికి రూ.3,706 కోట్లు
కరోనా కష్టకాలంలోనూ అండ, మగ్గాల ఆధునికీకరణ
క్లస్టర్ ట్రైనింగ్‌తో సబ్సిడీపై పరికరాలు

సాక్షి, అమరావతి

ప డుగు–పేకల్లా కష్టాలు అల్లుకున్న చేనేత బతుకులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఆదరణ కోల్పోయిన చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దారు. నేతన్న నేస్తంతోపాటు క్లస్టర్లు, నూలు రాయితీ, రుణాలు, పెన్షన్లు వంటి అనేక రకాల సాయమందించి మగ్గానికి మహర్దశ తెచ్చారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు చేనేత రంగానికి ఇచ్చిన 25 హామీల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయకపోగా కమిటీలు, అధ్యయనాలు అంటూ కాలయాపన చేశారు. బాబు ఐదేళ్ల హయాంలో రూ.442 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, వైఎస్ జగన్ ప్రభుత్వం నవరత్నాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.3,706 కోట్లుపైగా ఖర్చు చేసింది,

నేతన్న నేస్తం సాయం రూ.969.77 కోట్లు

2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని తు.చ. తప్పకుండా అమలు చేశారు. సొంత మగ్గం కలిగిన ప్రతి కార్మికునికీ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేలు చొప్పున రూ.1.20 లక్షలు అందించారు. దీనికి తోడు కరోనా కష్టకాలంలో 82 వేల చేనేత కుటుంబాలకు రూ.వెయ్యి చొప్పున జమ చేయడంతోపాటు బియ్యం, కందిపప్పు, నూనె వంటి నిత్యావసర సరుకులు అందించారు. కరోనా రెండేళ్లు సహా

-మిగతా III లో

బాబు దగా, జగన్ అండ

బాబు హయాంలో
- ఆప్కోకు రూ.103 కోట్ల బకాయిలు పెట్టారు. ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదు
- సహకార సంఘాల్లో పనిచేసే కార్మికుల కూలీ నుంచి 8 శాతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 8 శాతం చొప్పున మొత్తం 24 శాతం జమ చేసి ఏడాదికి ఒకసారి అందించే త్రిఫ్ట్ ఫండ్‌ను గత ఎన్నికలకు ఏడాదిన్నర ముందు నిలిపేశారు.
- 2014 ఎన్నికల మేనిఫెస్టోలో 25 హామీలు గుప్పించి ఏ ఒక్కటీ నెరవేర్చలేదు,
- చేనేత రుణాలు మాఫీపై అధ్యయనానికి కమిటీ వేస్తూ చేతులు దులుపుకొన్నారు.

జగన్ హయాంలో
- పాత బకాయిలు కలిపి మొత్తం రూ.468.84కోట్లను చెల్లించారు.
- నేతన్న నేస్తం, నేతన్న పెన్షన్ అమలు చేశారు. సంక్షేమానికి మొత్తం రూ.3,706 కోట్లు ఖర్చు చేయడం ఒక రికార్డు. వీటితో పాటు రుణ పరపతి, ముడి సరుకులకు పెట్టుబడి, నైపుణ్య శిక్షణ, తయారీ–విక్రయాలకు క్లస్టర్ల ఏర్పాటు. మేలైన మార్కెటింగ్‌కు ఈ–కామర్స్ దిగ్గజాలతో ఒప్పందాలు.
- చేనేతకు కీలకమైన నూలు పోగుల కొనుగోలుకు జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌డీసీ) ఏర్పాటు.
- 416 ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలకు (పీహెచ్‌డబ్ల్యూసీఎస్) రూ.250.01కోట్ల సాయం.
- వ్యక్తిగతంగాను, స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) వారికి నాలుగేళ్లలో రూ.122.50 కోట్ల విలువైన నూలు అందజేత.



కేరళలో కూటముల కొట్లాట

ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ హోరాహోరీ

కొన్ని స్థానాల్లో బీజేపీ టఫ్ ఫైట్

రాజకీయ కథాకళి

కేరళ రాజకీయాల్లో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములదే హవా. బీజేపీకి కేడర్ ఉన్నా ప్రజాదరణ అంతంతే. దక్షిణాదిలో బీజేపీ ఇంతవరకు ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలవని ఏకైక రాష్ట్రం కేరళే. అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఇక్కడ 13 శాతం ఓట్లు సాధించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 11.3 శాతానికే పరిమితమైంది. ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేయడమే లక్ష్యంగా కాషాయదళం కష్టపడుతోంది. క్రిస్టియన్, ముస్లిం ఓటర్లకూ చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఫలితంగా పలు స్థానాల్లో పోటీ ఇప్పటికే త్రిముఖంగా మారింది. ఇక జాతీయ స్థాయిలో ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు కేరళలో మాత్రం పరస్పరం తలపడుతున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకూ శుక్రవారం రెండో విడతలో ఒకేసారి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో హోరాహోరీ పోరు జరుగుతున్న స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

త్రిసూర్



సునీల్ కుమార్ | సురేశ్ గోపి | కె.మురళీధరన్

రాజకీయ నేతగా మారిన ప్రముఖ నటు డు సురేశ్ గోపి ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా నిలి చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయన ఇక్కణ్నుంచే పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి టీఎన్ ప్రతాపన్ విజయం సాధించారు. అయితే అప్పట్లో ఎన్నికల ప్రచారం మొదలయ్యాక ఆలస్యంగా గోపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈసారి కాంగ్రెస్ నుంచి వడకర ఎంపీ కె.మురళీధరన్ పోటీ చేస్తున్నారు. ఆయన మాజీ సీఎం కె.కరుణాకరన్ కుమారుడు. నాలుగు పర్యా యా లు ఎంపీగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మురళీధరన్‌కు విన్నింగ్ మాస్టర్‌గా పేరుంది. సీపీఐ నుంచి మాజీ మంత్రి వి.ఎస్.సునీల్ కుమార్ పోటీలో ఉన్నారు. 35 శాతమున్న క్రిస్టియన్ ఓటర్లు నిర్ణాయకం కానున్నారు. 16 శాతమున్న ముస్లిం ఓట్లూ కీలకమే. ప్రధాని మోదీ ఇప్పటికే త్రిసూర్‌లో రోడ్డు షో జరిపారు. కరువన్నూర్ కో ఆపరేటివ్ బ్యాంక్ స్కాం అధికార ఎల్‌డీఎఫ్‌కు ఇక్కడ ప్రతికూలంగా మారనుందని అంచనా.

వయనాడ్



కె.సురేంద్రన్

ఇది 2009 లోక్‌సభ ఎన్నికల ముందు ఏర్పాటైన నియోజకవర్గం. అప్పటినుంచి ఇక్కడ కాంగ్రెస్ హవాయే నడుస్తోంది. 2009, 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున ఎం.ఐ.షానవాజ్ గెలిచారు. 2019లో అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతీ ఇరానీ నుంచి గట్టి పోటీ ఖాయమని తేలడంతో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగా వయనాడ్ నుంచీ బరిలో దిగారు. అమేథీలో ఓడినా ఇక్కడ ఆయన ఏకంగా 4.31 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఎన్డీఏ అభ్యర్థి, బీడీజే (ఎస్) నేత తుషార్ వెల్లప్పళ్లికి 78,000 ఓట్లు పోలయ్యాయి. ఈసారి మాత్రం రాహుల్‌కు ఇక్కడ వార్ వన్ సైడ్ అన్నట్టుగా లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్, సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా ఆయనకు గట్టి పోటీ ఇస్తున్నారు. దాంతో ఇక్కడ ముక్కోణపు పోరు నెలకొంది. అన్నీ రాజా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య. ఇక సురేంద్రన్ ఉత్తర కేరళలో గట్టి పట్టున్న నాయకుడు. 2019 ఎన్నికల్లో పతనంతిట్టలో పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు 64.9 శాతం ఓటర్లు రాగా, సీపీఎంకు కేవలం 25.24 శాతం ఓట్లే లభించాయి. ఎన్నికల ముందే ఇక్కడ కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. కాంగ్రెస్ డీసీసీ జనరల్ సెక్రటరీ పీఎం సుధాకరన్ రాజీనామా చేసి బీజేపీలో చేరారు. పార్టీ ముమ్మర ప్రచారంతో హోరెత్తిస్తోంది. ప్రధాని మోదీ కూడా ఇక్కడ రోడ్ షోలు నిర్వహించారు. అమేథీ మాదిరిగానే వయనాడ్ నుంచి కూడా రాహుల్ పారిపోవడం ఖాయమంటూ ఎద్దేవా చేశారు.



రాహుల్ గాంధీ



అన్నీ రాజా

పథనంతిట్ట



థామస్ ఇజాక్ | ఆంటో ఆంటోనీ | అనిల్ ఆంటోనీ

ఇక్కడ కూడా త్రిముఖ పోటీ వాతావరణమే నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం ఏకే ఆంటోనీ కుమారుడైన అనిల్ ఆంటోనీని బీజేపీ బరిలో నిలిపింది. సిట్టింగ్ ఎంపీ ఆంటో ఆంటోనీకి కాంగ్రెస్ మరోసారి అవకాశమిచ్చింది. సీపీఎం తరఫున మాజీ మంత్రి థామస్ ఇజాక్ పోటీలో ఉన్నారు. తన కుమారుడు ఓడాలని కోరుకుంటున్నానని, ఆంటో ఆంటోనీదే విజయమని ఏకే ఆంటోనీ ప్రకటించడం విశేషం! శబరిమల ఆలయం ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. ప్రధాన అభ్యర్థులు ముగ్గురూ కేథలిక్స్ క్రైస్తవులే కావడం విశేషం! 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆంటో ఆంటోనీ 37.11 శాతం ఓట్లతో సీపీఎం అభ్యర్థి వీణా జార్జ్‌పై 44 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి కె.సురేంద్రన్ 29 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. అయితే 2009 ఎన్నికల్లో బీజేపీకి 7 శాతం ఓట్లు రాగా 2014లో 16 శాతానికి, 2019లో 29 శాతానికి పెరిగాయి.

పాలక్కాడ్



శ్రీకందన్ | విజయ రాఘవన్ | సి.కృష్ణకుమార్

బీజేపీ ఆశలు, ఆకాంక్షలకు పాలక్కాడ్ నియోజకవర్గం కీలకం కానుంది. కేరళలో బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం ఉన్న ఏకైక మున్సిపాలిటీ ఇది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వీకే శ్రీకందన్ ఇక్కడ గెలిచారు. ఈసారి కూడా పార్టీ తరఫున ఆయనే బరిలో ఉన్నారు. సీపీఎం అభ్యర్థి విజయ రాఘవన్‌కు గట్టి పోటీనిస్తున్నారు. ఇక బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.కృష్ణకుమార్ వరుసగా రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో కృష్ణ కుమార్ 21.44 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. అయితే గత మూడు సార్వత్రిక ఎన్నికల నుంచి ఇక్కడ బీజేపీ ఓటు శాతం పెరుగుతూ వస్తోంది.

అట్టింగల్



అదూర్ ప్రకాశ్ | వి.జోయ్ | వి.మురళీధరన్

ఇక్కడ కూడా ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎంపీ అదూర్ ప్రకాశ్‌ను కాంగ్రెస్ మరోసారి పోటీలో నిలిపింది. బీజేపీ తరఫున కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్ పోటీ చేస్తున్నారు. సీపీఎం నుంచి వి.జోయ్ బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో అదూర్ 2,80,995 ఓట్లతో (38.34 శాతం) గెలిచారు. సీపీఎం అభ్యర్థి అనిరుద్ధ్ సంపత్‌కు 34.5 శాతం, బీజేపీ అభ్యర్థి శోభా సురేంద్రన్‌కు 24.97 శాతం ఓట్లు లభించాయి. అట్టింగల్‌లో కూడా బీజేపీ ఓటు బ్యాంక్ క్రమంగా పెరుగుతూ వస్తోంది.

- కేరళలో తిరువనంతపురం లోక్‌సభ స్థానంలో కూడా హోరాహోరీ పోరు సాగుతోంది. కాంగ్రెస్ నుంచి హాట్రిక్ వీరుడు శశిథరూర్ పోటీలో ఉండగా కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బీజేపీ బరిలో దింపింది. ఎల్‌డీఎఫ్ సంకీర్ణం తరఫున పి.రవీంద్రన్ (సీపీఐ) తలపడుతున్నారు.

కాసర్‌గోడ్



ఎం.వి.బాలకృష్ణన్ | ఎంఎల్ అశ్విని | రాజ్‌మోహన్

సిట్టింగ్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నితాన్ మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి సతీశ్ చంద్రన్‌పై ఆయన 1.4 లక్షల మెజారిటీతో గెలిచారు. బీజేపీ ఈ విడత ఎంఎల్ అశ్వినికి అవకాశమిచ్చింది. గెలుపుపై ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నా పోటీ ప్రధానంగా కాంగ్రెస్, సీపీఎం మధ్యే ఉండనుంది. కొద్ది రోజులుగా సీపీఎం అభ్యర్థి ఎం.వి.బాలకృష్ణన్ పట్ల స్పష్టమైన మొగ్గు కన్పిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. బీజేపీకి ప్రజా మద్దతు పెరుగుతోందని, మోదీ సర్కారుకు ఈసారి రాష్ట్ర ప్రజలు ఓటేస్తారని అశ్విని అంటున్నారు.


రెండో విడతలో... నారీ శక్తి 8 శాతమే!

- కోటీశ్వరుల్లో 'టాప్' లేపిన కర్నాటక
- ఆరుగురికి చిల్లిగవ్వ కూడా లేదట!

లోక్‌సభ ఎన్నికల రెండో విడత పోలింగ్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. 26న దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 88 స్థానాల్లో పోలింగ్ జరగనుంది (మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో బీఎస్పీ అభ్యర్థి అశోక్ భలావి మరణంతో అక్కడ పోలింగ్ వాయిదా పడింది). రెండో దశలో 1,210 మంది పోటీలో ఉన్నారు. వీరి ఎన్నికల అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించగా పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి...

- రెండో విడత బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మహిళలు కేవలం 8 శాతమే ఉన్నారు!
- పట్టభద్రులు, ఆపై చదువులు చదివిన వారు 43 శాతం.
- 21 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 167 మంది తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ జాబితాలో కాంగ్రెస్ (35), తర్వాత బీజేపీ (31), సీపీఎం (14) టాప్‌లో ఉన్నాయి.
- 390 మంది కోటీశ్వరులున్నారు. వీరిలో 105 మంది ఇండిపెండెంట్లు. తర్వాతి స్థానాల్లో బీజేపీ (64), కాంగ్రెస్ (62), బీఎస్పీ (24) నిలిచాయి. ఇద్దరికి 500 కోట్ల పైగా ఆస్తి ఉంది!
- టాప్–10 సంపన్న అభ్యర్థుల్లో కర్నాటక టాప్‌లో ఉంది. మండ్య కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణే గౌడ రూ.623 కోట్లతో 'టాప్' లేపారు. బెంగళూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్ రూ.593 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. హేమమాలినికి రూ.279 కోట్ల ఆస్తులున్నాయి. మధ్యప్రదేశ్‌లో హోషంగాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శర్మ (రూ.233 కోట్లు), మండ్యలో జేడీ(ఎస్) చీఫ్ కుమారస్వామి (రూ.217 కోట్లు), యూపీలో అమ్రోహా బీజేపీ అభ్యర్థి కన్వర్ సింగ్ తన్వర్ (రూ.215 కోట్లు) టాప్–10లో నిలిచారు.
- రెండో విడత అభ్యర్థుల సగటు ఆస్తుల విలువ రూ.5.2 కోట్లు. ఆరుగురు తమకు చిల్లిగవ్వ కూడా లేదని ప్రకటించడం విశేషం!
- అభ్యర్థుల్లో ఎక్కువ మంది 40–50 ఏళ్ల మధ్య వారే. సగటు వయసు 49 ఏళ్లు. 70–80 ఏళ్ల మధ్య వయస్కులు 49 మంది ఉండగా ఇద్దరు 80 ఏళ్ల పైబడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



వాజ్‌పేయి మేజిక్

మూడోసారి ఐదేళ్ల పాలన

ఎన్డీఏ సంకీర్ణం సూపర్‌హిట్

ప్రాంతీయ పార్టీల దన్ను లేనిదే సంపూర్ణ ఆధిక్యం అసాధ్యమని గుర్తించిన బీజేపీ 13వ లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. 20కి పైగా పార్టీలను నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) గూటి కిందకు తెచ్చి మెజారిటీ సాధించింది. సొంత బలం పెరగకున్నా భాగస్వాముల సాయంతో మళ్లీ అధికారంలోకి వచ్చి దేశాన్ని ఐదేళ్లూ విజయవంతంగా పాలించింది. కాంగ్రెస్ మాత్రం అంతర్గత సంక్షోభంతో బాగా దెబ్బ తిన్నది..

- సాక్షి, నేషనల్ డెస్క్

1998 ఎన్నికల తర్వాత బీజేపీ ఏర్పాటు చేసిన నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) జాతీయ రాజకీయాల్లో పార్టీ గ్రాఫ్ బలపడేందుకు దోహదపడింది. దీనికి వాజ్‌పేయి తొలి చైర్మన్ కాగా జార్జ్ ఫెర్నాండెజ్ కన్వీనర్. బీజేపీతో పాటు జేడీ (యూ), శివసేన, టీడీపీ, జేడీ(ఎస్) కూటమిలో ముఖ్య పార్టీలుగా ఉన్నాయి. 1999 లోక్‌సభ ఎన్నికలు సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 3 దాకా ఐదు దశల్లో జరిగాయి. కార్గిల్ యుద్ధం, పోఖ్రాన్ అణు పరీక్షలు బీజేపీకి బాగా కలిసొచ్చాయి. వాజ్‌పేయి చరిష్మా కూడా తోడై ఎన్డీఏకు 298 స్థానాలు దక్కాయి. 1984 తర్వాత ఏ పార్టీకైనా, సంకీర్ణానికైనా లోక్‌సభలో మెజారిటీ దక్కడం అదే తొలిసారి. బీజేపీకి 182 సీట్లొస్తే కాంగ్రెస్ 114తో పరిమితమైంది. సీపీఎం 33, టీడీపీ 29, సమాజ్‌వాదీ 26, జేడీయూ 21 సీట్లు గెలుచుకున్నాయి. సీపీఐకి కేవలం నాలుగు సీట్లే రావడంతో జాతీయ పార్టీ హోదా కోల్పోయింది! ఫలితాల అనంతరం డీఎంకే వంటి మరిన్ని పార్టీలు చేరడంతో ఎన్డీఏ కూటమి మరింత బలపడింది. అక్టోబర్ 13న ప్రధానిగా వాజ్‌పేయి మూడోసారి ప్రమాణం చేశారు. మొత్తమ్మీద 1996 నుంచి 1999 మధ్య మూడేళ్లలో లోక్‌సభకు ఏకంగా మూడుసార్లు ఎన్నికలు జరగడం విశేషం!

13వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	182
కాంగ్రెస్	114
సీపీఎం	33
టీడీపీ	29
సమాజ్‌వాదీ	26
జేడీ(యూ)	21
శివసేన	15
బీఎస్పీ	14
ఇతరులు	109

కాంగ్రెస్‌లో సంక్షోభం

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ బాధ్యతలు స్వీకరించిన ఏడాదికే పార్టీలో ముసలం మొదలైంది. జన్మతః విదేశీయురాలైన సోనియాను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించేందుకు సీనియర్ నేతలు శరద్ పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్ తీవ్రంగా వ్యతిరేకించారు. కలత చెందిన సోనియా రాజీనామా చేశారు. కాంగ్రెస్ ఆమెకు మద్దతుగా నిలిచింది. కార్యకర్తలు నిరసనలు, నిరాహార దీక్షలతో హోరెత్తించారు. చివరికి 1999 మే 20న పవార్, సంగ్మా, అన్వర్‌పై కాంగ్రెస్ బహిష్కరణ వేటు వేసింది. దాంతో సోనియా రాజీనామాను వెనక్కు తీసుకుని పార్టీ సారథిగా కొనసాగారు. ఈ పరిణామం ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. బీజేపీ 'స్వదేశీ వాజ్‌పేయి – విదేశీ సోనియా' నినాదాన్ని ఎత్తుకుంది. సోనియా అధ్యక్షతన కాంగ్రెస్‌కు అవే తొలి ఎన్నికలు.

పవార్ సొంత పార్టీ

సోనియాగాంధీ విదేశీయతను ప్రశ్నించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన శరద్‌పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్ జూన్ 10న నేషనలిస్ట్ కాంగ్రెస్ పేరిట సొంత పార్టీ పెట్టుకున్నారు. తొలి ఎన్నికల్లోనే 2.27 శాతం ఓట్లతో 8 స్థానాలను కైవసం చేసుకున్నారు.

గుజరాత్ అల్లర్లు

నరేంద్ర మోదీ పాలనలోని గుజరాత్‌లో 2002 ఫిబ్రవరిలో చెలరేగిన మత ఘర్షణలతో వాజ్‌పేయి సర్కారు బాగా అప్రతిష్ట పాలైంది. సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు అల్లరి మూకలు నిప్పంటించడంతో అయోధ్య నుంచి తిరిగొస్తున్న 59 మంది హిందూ భక్తులు మరణించారు. తర్వాత నెల పాటు చెలరేగిన హింసలో వెయ్యి మందికి పైనే చనిపోయారు. ఈ హింసాకాండను వాజ్‌పేయి ఖండించినా దాన్ని అరికట్టలేదన్న అపవాదు మూటగట్టుకున్నారు.

విశేషాలు...


- ప్రధానిగా వాజ్‌పేయి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. స్వర్ణ చతుర్భుజి పేరిట హైవేలను విస్తరించారు. ప్రధాని గ్రామీణ్ సడక్ యోజనతో రూరల్ రోడ్లకు అక్షరాలా మహర్దశ పట్టింది.
- టెలికం సేవల విస్తరణకు కీలక అడుగులు పడ్డాయి. లైసెన్స్ ఫీజుల స్థానంలో ఆదాయ పంపిణీ విధానం ప్రవేశపెట్టారు. 2000 సెప్టెంబర్ 15న బీఎస్ఎన్ఎల్‌ను ఏర్పాటు చేశారు.
- ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ విభాగం ఏర్పాటైంది. బాల్కో, హిందుస్థాన్ జింక్, ఐపీసీఎల్, వీఎస్ఎన్ఎల్ వంటి అగ్రగామి కంపెనీలను ప్రైవేటీకరించారు.
- పెట్రోలియం ధరలపై నియంత్రణ ఎత్తేయడానికి వాజ్‌పేయి సర్కారే బీజం వేసింది.

ఫ్యామిలీ ప్యాకేజీ

దేవెగౌడ కుటుంబం నుంచి లోక్‌సభ బరిలో ముగ్గురు

గత ఎన్నికల్లోనూ అంతే

మొత్తం తొమ్మిది మంది రాజకీయాల్లో



కర్నాటక జనాలకు జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ 'కుటుంబ కథాచిత్రమ్' చూపిస్తున్నారు! ఆ కుటుంబం నుంచి ఈసారి కూడా ముగ్గురు లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండటం విశేషం. తమ వొక్కళిక సామాజికవర్గ ప్రాబల్యం అధికంగా ఉన్న పాత మైసూరు ప్రాంతంలో వారు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దాంతో ప్రత్యర్థులు జేడీ(ఎస్)ను 'ప్రైవేట్ లిమిటెడ్ పార్టీ ఆఫ్ ఫ్యామిలీ' అంటూ జోరుగా ఎద్దేవా చేస్తున్నారు. ఇటీవలి కాలం దాకా ఇవే విమర్శలు చేసిన బీజేపీ ఈసారి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకోవడం విశేషం!

- సాక్షి, నేషనల్ డెస్క్



- కుమారస్వామి
- ప్రజ్వల్ రేవణ్ణ
- సి.ఎన్.మంజునాథ్

కర్నాటకలో 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీతో పొత్తులో భాగంగా జేడీ(ఎస్)కు మూడు దక్కాయి. వాటిలో జేడీ(ఎస్) కంచుకోట అయిన మండ్య నుంచి దేవేగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి, హసన్ నుంచి మనవడు ప్రజ్వల్ రేవణ్ణ పోటీ చేస్తున్నారు. దేవెగౌడ అల్లుడు సి.ఎన్.మంజునాథ్ బీజేపీ టికెట్‌పై బెంగళూరు రూరల్ నుంచి బరిలో ఉండటం విశేషం! చన్నపట్న అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కుమారస్వామికి ఇవి ఆరో లోక్‌సభ ఎన్నికలు.

వరుసగా రెండోసారి...

ఇలా దేవెగౌడ కుటుంబంనుంచి ముగ్గురు లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండటం ఇది వరుసగా రెండోసారి. దక్షిణ కర్నాటకగా భావించే పాత మైసూర్ ప్రాంతంలో జేడీ(ఎస్)కు బాగా పట్టుంది. ఇక్కడ దేవెగౌడకు చెందిన వొక్కళిగ సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువ. 2019లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా జేడీ (ఎస్)కు 9 సీట్లు దక్కాయి. తుముకూరు నుంచి దేవెగౌడ, హసన్ నుంచి ప్రజ్వల్, మండ్య నుంచి కుమారస్వామి కొడుకు నిఖిల్ పోటీ చేశారు. ప్రజ్వల్ ఒక్కరే గెలిచారు.

ఏ ఎన్నికల్లో చూసినా...

దేవెగౌడకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారుల్లో రేవణ్ణ, కుమారస్వామి రాజకీయాల్లో ఉన్నారు. రేవణ్ణ హోలెనర్సిపుర ఎమ్మెల్యే. ఆయన భార్య భవాని జిల్లా పరిషత్ సభ్యురాలిగా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇప్పించుకునేందుకు రేవణ్ణ విఫల యత్నం చేశారు. వారి ఇద్దరు కుమారుల్లో ప్రజ్వల్ హాసన్ ఎంపీ కాగా సూరజ్ ఎమ్మెల్సీ. రెండుసార్లు సీఎంగా చేసిన కుమారస్వామి తన కొడుకు నిఖిల్‌ను రాజకీయాల్లో నిలబెట్టేందుకు 2019 నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నారు. జేడీ(ఎస్) యువజన విభాగం నేతగా ఉన్న నిఖిల్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రామనగర నుంచి పోటీ చేసినా ఓటమి పాలే అయ్యారు. ఈసారి మండ్యలో కుమారస్వామి గెలిస్తే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చన్నపట్న అసెంబ్లీ స్థానం ఖాళీ అవుతుంది. అక్కడి నుంచి ఉప ఎన్నికలో నిఖిల్ పోటీ చేస్తారని ఊహాగానాలు మొదలయ్యాయి. కుమారస్వామి భార్య అనిత రామనగర ఎమ్మెల్యేగా చేశారు. దేవెగౌడ మరో కుమారుడు రమేశ్ భార్య సౌమ్య కూడా గత ఎన్నికల్లో పోటీకి విఫలయత్నం చేశారు. ఆమె తండ్రి డీసీ తమ్మన్న మద్దూరు జేడీ(ఎస్) ఎమ్మెల్యే. ఇదంతా పార్టీ ప్రయోజనాల కోసమేనని కుమారస్వామి సమర్థించుకుంటున్నారు!

ఇదిగో నవరత్నాల వెలుగులు



'బండ'బారిన బతుకుల్లో మెరుపులు

వేంకటేశ్వర్లు కుటుంబానికి కలిగిన లబ్ధి రూపాయల్లో	
జగనన్న చేదోడు-2	50,000
అమ్మ ఒడి-2	80,000
విద్యాదీవెన	37,000
వసతి దీవెన	20,000
వైఎస్సార్ ఆసరా-2	1,12,000
రైతు భరోసా	6,000
వైఎస్సార్ పింఛను కానుక-2	1,43,000
మొత్తం	4,48,000

కావరపు వెంకటేశ్వర్లుది గుంటూరు జిల్లా తెనాలి స్వస్థలం. బుర్రిపాలెంరోడ్డులో ఓ పక్కగా ఇస్త్రీ బండినే అతడి జీవనాధారం. ఆ పక్క వీధిలోని పూరిల్లే వారి పొదరిల్లు. అత్త, భార్య, ఇద్దరు కుమార్తెలు. ఏనాడో భర్త వదిలేసిన మరదలు, ఆమె కుమార్తె.. అంతా కలిసి ఆ ఇంట్లోనే ఉంటారు. వేంకటేశ్వర్లు పగలంతా ఇస్త్రీ చేసి నాలుగు డబ్బులు సంపాదిస్తే, నాలుగిళ్లలో బట్టలుతికి మరదలు ఆర్జించే మరికొన్ని డబ్బులే ఆ కుటుంబానికి ఆధారం. ఇద్దరి రెక్కల కష్టంతో ఏడుగురి కడుపు నింపాలి. ఎదుగుతున్న పిల్లల చదువులకు, ఏదైనా అనారోగ్యం చేస్తే వైద్యానికి ఎవరో ఒకరిని ప్రాధేయపడటం, రెండేసి, మూడేసి రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఏళ్లు గడుస్తున్నా



సొంతింటి ముందు కుటుంబంతో వెంకటేశ్వర్లు

ఎదుగూ బొదుగూ లేని జీవితం... గత ప్రభుత్వం ఎలాంటి సాయం చేసిన పాపాన పోలేదు. దీంతో వారి జీవనం దుర్భరంగా మారింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ కుటుంబానికి దశ తిరిగింది.

2019 నుంచి సంతోషాల వెంబడి..

నవరత్నాలతో జీవన విధానమే మారిపోయింది. 2024 వచ్చేసరికి పూరిల్లు కాస్తా రేకుల షెడ్డైంది. 67 ఏళ్ల వెంకటేశ్వర్లుకు ఈ ప్రభుత్వం వచ్చాక వృద్ధాప్య పింఛను వస్తోంది. భార్య నాంచారమ్మకు వైఎస్సార్ ఆసరా కింద ఏడాదికి రూ.14 వేల చొప్పున నాలుగు విడతలుగా రూ.56 వేలు ప్రభుత్వం జమచేసింది. డ్వాక్రా సభ్యురాలిగా రూ.2 లక్షల రుణం మంజూరు చేసింది. వసతిదీవెన పథకంతో పెద్దకుమార్తె సాయిగాయత్రి నర్సింగ్ కోర్సు చదువుతోంది. రెండో కుమార్తె దాక్షాయణి ఇంటర్‌లో ఉన్నపుడు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి.ఇప్పుడు విద్యాదీవెనతో బీసీఏ చదువుతూనే కంపెనీ ఉద్యోగాలకు ఎంపికైంది. భర్త వదిలేసిన నాంచారమ్మ చెల్లెలు నాగలక్ష్మి ఆంటీకే చేరింది. ఆమెకు ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. వైఎస్సార్ ఆసరా కింద ఏటా రూ.14 వేల వంతున నాలుగు విడతలుగా రూ.56 వేలు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇంటిస్థలం ఇచ్చింది. –తెనాలి

కొనుగోలు శక్తి పెరుగుతోంది



పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వం నేరుగా డబ్బులు ఇవ్వడం వల్ల వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మార్కెట్ ఎకానమీ బాగుంటుంది. సంక్షేమ పథకాల కింద వెంకటేశ్వర్లు కుటుంబానికి దాదాపు రూ.5 లక్షల వరకు సమకూరాయి. సమాజంలో నిజమైన మార్పు అంటే ఇదే. ఇలాంటి కొన్ని వేల కుటుంబాలు బాగుపడితే సమాజం ఆర్థికంగా పురోగమించినట్టే.

– అయోధ్య శ్రీనివాసరావు,
ఎకనామిక్స్ లెక్చరర్,
ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి, తెనాలి

అచ్చోసిన క్రిమినల్

తప్పుడు రికార్డులతో లెక్కలేనన్ని భూదందాలు

అధికారం అడ్డం పెట్టుకుని అధికారులపై రుబాబు

గ్రానైట్ అక్రమ తరలింపుతో అడ్డగోలుగా ప్రజాధనం లూటీ

అమాత్య పదవి వెలగబెట్టి ఈఎస్ఐ కుంభకోణంలో సూత్రధారిగా మారిన నేత

నకిలీ కొటేషన్లు, నకిలీ రశీదులతో రూ. 150 కోట్లు కొల్లగొట్టిన వైనం

ఎదురు తిరిగితే అంతం చేయడమే ఆయనకు తెలిసిన న్యాయం

తమకు అనుకూలం కాకుంటే సామాజిక, గ్రామ బహిష్కరణ

ఇదీ శ్రీకాకుళం జిల్లాలో ఓ 'దేశం' నాయకుడి దౌర్జన్య కాండ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలోని ఓ తెలుగుదేశం నాయకుడి అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. రాజకీయంగా ఆయనకున్న పరపతిని భూదందాలకు, అక్రమంగా గ్రానైట్ తరలింపునకు వాడుకుంటున్నారు. అడ్డుకునే అధికారులపై విరుచుకుపడుతున్నారు. ఆయన సోదరుడు కోటబొమ్మాళి మండలం నిమ్మాడ సమీపంలో పెద్దబమ్మిడి గ్రామంలో 3.15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడౌన్ నిర్మించారు. సాగునీటి కాలువ మూసేసి గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ నిర్మించారు. సాగునీటి కాలువను సైతం మూసేశారు. ఆ కాలువపై ఆధారపడిన 40 ఎకరాలకు సాగునీరు నిలిచిపోయింది. ఆక్రమించుకున్న భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులు కూడా మాయం చేశారు. అధికారంలో ఉండగా కబ్జా చేసిన భూములను తమకు తెలిసిన వ్యక్తుల పేరు మీదకు మార్చేసి మాల్ ప్రాక్టీసుకు పాల్పడ్డారు. అధికారుల స్టాంపు, డిజిటల్ సిగ్నేచర్‌ను తమ గుప్పెట్లో పెట్టుకుని అక్రమాలను కొనసాగించారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. తన అనుచరులను బినామీలుగా మార్చుకుని వారి పేరున అనేక పట్టాలు సృష్టించుకున్నారు.టీడీపీ హయాంలో కోటబొమ్మాళి మండల కేంద్రంలో పెద్ద చెరువు అభివృద్ధి పేరుతో సుమారు 12 ఎకరాలను కబ్జా చేశారు. గరీబుల గెడ్డ పరీవాహక భాగంలో సుమారు 7 ఎకరాలు తన అనుచరుడి పేరున కబ్జాచేశారు. ఇవి కొన్ని ఆక్రమణలు మాత్రమే. ఇవి గాకుండా తన అనుచరులు చేసిన భూదందాలకు వెన్నుదన్నుగా నిలిచారు.



గ్రానైట్ అక్రమాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

ఆ నాయకుడి కుటుంబ సభ్యులు గ్రానైట్‌ను అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. దీనిపై మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి పక్కా ఆధారాలతో కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 379, 420, 477–ఎ, 406, 120బి, 34ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఆ నాయకుడి కుమారుడి పేరున 2018 ఏప్రిల్ 23వ తేదీ నుంచి 2038 ఏప్రిల్ 22వ తేదీ వరకు దాదాపు 20 ఏళ్ల మినరల్ డీలర్ లైసెన్సు తీసుకున్నారు. రఫ్ గ్రానైట్ బ్లాక్‌ల కటింగ్, పాలిషింగ్ తదితర కార్యక్రమాలను వీరి ఇండస్ట్రీ చేపడుతుంది. క్వారీల నుంచి గ్రానైట్ బ్లాక్‌లను అధికారికంగా అనుమతి తీసుకుని తమ ఇండస్ట్రీకి రవాణా చేసుకోవాల్సి ఉంది. కానీ వీరి ఇండస్ట్రీలో అందుకు భిన్నంగా వ్యవహారాలు నడుస్తున్నాయని అధికారుల తనిఖీల్లో తేలింది. 172.87క్యూబిక్ మీటర్ల బరువైన 23 బ్లాక్‌లను అక్రమంగా తరలించినట్టుగా తేల్చారు. దీనివిలువ అపరాధ రుసుంతో కలిపి రూ.6 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఇదంతా ప్రభుత్వానికి రావల్సిన ఆదాయం. ఇప్పటివరకూ వీరి ద్వారా రూ.11,43,29,120 మేర అక్రమాలు జరిగాయి. మరో రూ.3,18,72,960 మేర జీఎస్టీ చెల్లించకుండా ఎగ్గొట్టారు. అధికారం లేకపోయినా అధికారులు కళ్లుగప్పి అక్రమ రవాణాకు పాల్పడ్డారంటే ఈ నాయకుడి ఫ్యామిలీ ఎంత బరితెగించిందో అర్థం చేసుకోవచ్చు.

ఆయన నేర చరిత్ర చాంతాడంత

ఆయన మాట కాదన్నవారు ఎవరైనా అదృశ్యమైపోతారు. కారణం మాత్రం ఇప్పటికీ చిదంబర రహస్యం. తొలుత బెదిరింపులు.. ఆ తర్వాత దౌర్జన్యాలు.. అప్పటికీ లొంగకపోతే సామాజిక, గ్రామ బహిష్కరణలు.. ఇంకా వినకపోతే దాడులు చేయడం ఇక్కడ పరిపాటి.

టీడీపీ అధికారంలో ఉండగా మంత్రి హోదాలో ఈయన చేసిన ఈఎస్ఐ స్కామ్ జిల్లాకే మాయని మచ్చగా మారింది. అడ్డొచ్చిన అధికారులను బెదిరించడం, అవసరమైతే బదిలీ చేయడం, తనకు కావల్సిన వారిని తెప్పించుకుని అక్రమాలకు పాల్పడటం టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం సాగిపోయింది. అంతటితో ఆయన లీలలు ఆగలేదు. కార్మికుల కోసం కొనుగోలు చేసిన మందుల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. దాదాపు రూ.150 కోట్లకు పైగా జరిగిన స్కామ్‌లో సూత్రధారిగా నిలిచారు. మందు బిల్లులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో

ఈఎస్ఐ స్కామ్‌లోనూ కీలకంగా మారి...

సొమ్ము నొక్కేశారు. బినామీలను తెరపైకి తెచ్చి నామినేటెడ్ పద్ధతిలో వందల కోట్ల రూపాయల విలువైన మందులు, పరికరాలను యథేచ్ఛగా కొనుగోలు చేసి నచ్చినట్టుగా బిల్లులు చేసేసుకున్నారు. ఈ బండారం కాస్తా విజిలెన్స్ అధికారుల విచారణలో బయటపడింది. వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్లు, పనులు నామినేషన్‌పై అప్పగించాలని మంత్రి హోదాలో ఆ నాయకుడు ఇచ్చిన సిఫారసు లేఖతో మొత్తం గుట్టు రట్టు అయింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు తర్వాత అనేక అక్రమాలకు పాల్పడ్డారు. వీటన్నింటిపైనా పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు ఆయన్ని అరెస్టు చేశారు.

నమోదైన కేసుల వివరాలు

అవినీతి నిరోధక శాఖ క్రైమ్ నంబర్ 04/ఆర్‌సీఓ– సీఐయూ– ఏసీబీ/2020 యు/ఎస్ 13(1), (సీ), (డీ), ఆర్/డబ్ల్యూ 13(2) ఏసీబీ పీసీ సవరణల చట్టం–2018, ఏసీబీలోని ఐపీసీ సెక్షన్ల ప్రకారం సెక్షన్ 408, సెక్షన్ 420, 120–బీ కింద అధికారులు కేసు నమోదు చేశారు.

2008 ఆగస్టు 11న కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద మూడో విడత పింఛన్ల పంపిణీని అడ్డుకున్నందుకు ఎఫ్ఐఆర్ నంబర్ 150/2008 ప్రకారం 354, 323, 506(1) అండ్ (2) రెడ్ విత్ 34 సెక్షన్ల ప్రకారం మహిళను అవమానపరిచేలా ప్రవర్తించి, గాయపర్చి, బెదిరించినందుకు తదితర కారణాలతో కేసులు నమోదయ్యాయి.

2014 సార్వత్రిక ఎన్నికల్లో సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం గ్రామానికి ప్రచారానికి వెళ్లిన ఆయన్ను అడ్డుకున్న మహిళలపై దారుణంగా విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై నౌపడ పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేయగా, 341, 506, 323 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ తరువాత వారిని బెదిరించి రాజీ యత్నాలు చేశారు.

2021 ఫిబ్రవరిలో నిమ్మాడలో కింజరాపు అప్పన్న అనే వ్యక్తి సర్పంచి స్థానానికి నామినేషన్ వేసేందుకు వెళ్లగా ఆ నాయకుడి అనుచరులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 44/2021 ప్రకారం 147, 148, 307, 324, 506, 341, 384, 188 రెడ్ విత్ 149 ఐపీసీ, సెక్షన్ 123 ఆఫ్ ది పీపుల్ రిప్రజెంట్ చట్టం, సెక్షన్ 212 ఆఫ్ ద ఏపీ పంచాయతీ రాజ్ చట్టం 1995 కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. ఆ సమయంలో 14 రోజులు రిమాండ్‌లో ఉన్నారు. ఇవిగాకుండా మరెన్నో కేసులు ఆయనపై నమోదై ఉన్నాయి.

చేనేతకు సంక్షేమ అద్దకం

▶ మొదటి పేజీ తరువాయి

ఐదేళ్లుగా కేటాయించిన ఈ మొత్తం అక్షరాలా రూ.969.77 కోట్లు. ఈ నిధులతో డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో తమ మగ్గాలను ఆధునికీకరించుకున్నారు. 2018–19లో నెలవారీ ఆదాయం సగటున రూ.4,680 ఉంటే ఈ పథకం అమలుతో మూడు రెట్లు పెరిగింది. మరోవైపు అర్హులైన 94,224 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.3 వేలు చొప్పున పెన్షన్ అందిస్తున్నారు.

ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఊతం

చేనేత ఉత్పత్తులకు ఊతమిచ్చేలా ఆప్కోకు రూ.468.84 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో కలిపి) చెల్లించింది. ఆప్కో, రాష్ట్ర చేనేత జౌళి శాఖల ద్వారా ఆర్గానిక్ వస్త్రాల తయారీ, కొత్త కొత్త డిజైన్ల రూపకల్పన తదితరాల్లో శిక్షణ ఇప్పించింది. 46కి పైగా ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. శిక్షణ అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సబ్సిడి అందించి మగ్గాలు, షెడ్లులు, ఇతర సామగ్రిని సమకూర్చింది. అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, లూమ్‌ఫోక్స్, పేటీఎం, గోకూప్ వంటి ఈ–కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. ఆప్కో షోరూమ్‌లు విస్తరించింది. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోను ఏపీ చేనేత వస్త్రాల విక్రయాలకు చర్యలు చేపట్టింది.

ఉప్పాడకు వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

చేనేత రంగానికి ఆర్థిక ఊతంతోపాటు అవార్డులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. జమ్దానీ పట్టు నేత కళను కొనసాగిస్తున్న ఉప్పాడ హ్యాండ్లూమ్స్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ(కాకినాడ)కు వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించడంతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒక జిల్లా–ఒక ఉత్పత్తి(ఓడీఓపీ)లో రాష్ట్రానికి చెందిన చేనేత రంగం హవా కొనసాగింది. దేశంలో మొత్తం మీద 64 ఉత్పత్తులు దరఖాస్తులు చేస్తే.. వాటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి చేసిన 14 ఉత్పత్తుల్లో 8 చేనేతవే కావడం విశేషం.

జీఎస్టీపై పచ్చ మీడియా గందరగోళం

చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించే జీఎస్టీపై టీడీపీ పచ్చ మీడియా ఇటీవల అర్థంలేని విమర్శలు చేసి గందరగోళం సృష్టిస్తోంది. వాస్తవానికి చేతి వృత్తులు, గ్రామాల్లో కుటీర పరిశ్రమలపై పన్ను వేయకూడదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 43 చెబుతోంది. అయినప్పటికీ నేతకు ఉపయోగించే చిలప నూలుపై కేంద్ర ప్రభుత్వం 5 శాతం, తయారైన వస్త్రంపై 12 శాతం చొప్పున జీఎస్టీ వసూలు చేస్తోంది. తయారైన వస్త్రానికి వసూలు చేస్తున్న జీఎస్టీని 18 శాతానికి పెంచాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను చేనేత సహకార సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో దాన్ని విరమించుకుంది. మొత్తం జీఎస్టీనే ఎత్తివేయాలని చేనేత సహకార సంఘాలు కోరుతున్నాయి.



నేతన్న నేస్తం పథకం కింద లబ్ధిదారులకు నగదు విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

నేతన్న నేస్తం మా జీవితంలో వెలుగులు నింపింది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఇప్పటి వరకు రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందింది. ఆ డబ్బుతో చేనేత మగ్గాలను ఆధునికీకరించుకొని రెట్టింపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాం.

– శంకర, చేనేత కార్మికుడు,
కేశవనగర్, ధర్మవరం

జగన్‌కు రుణపడి ఉంటాం..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం అంతా రుణపడి ఉంటుంది. ఆరోగ్యశ్రీలో రూ.మూడు లక్షలు సాయం అందించడంతో ఆపరేషన్ చేయించుకున్నాను. ప్రతి నెల పెన్షన్ వస్తోంది. నా భార్యకు చేయూత పథకం కింద రూ.18,750 నాలుగు సార్లు వచ్చాయి. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.15 వేలు చొప్పున మూడుసార్లు వచ్చాయి.

–చింతలపూడి రాంబాబు, చేనేత కార్మికుడు,
వాకతిప్ప, కాకినాడ జిల్లా

మగ్గాన్ని ఆధునికీకరించుకుని ఆదాయం పొందుతున్నా

నేతన్న నేస్తంతో రూ.1.20 లక్షలు ఆర్థిక సాయంతో రావడంతో మగ్గాన్ని ఆధునికీకరించుకున్నాను. ముడిసరుకులు కొనుగోలు చేసుకుని అదనపు ఆదాయం పొందుతున్నాను. నేతన్న నేస్తంతోపాటు ఆసరా ద్వారా రూ.84 వేలు, అమ్మ ఒడి రూ.54 వేలు, సున్నా వడ్డీ రూ.7 వేలు ఆర్థిక సాయం అందడంతోపాటు పిల్లల్ని బాగా చదివించుకుని సమాజంలో గౌరవంగా బతుకుతున్నాను.

–పిచ్చుక గంగాధరరావు,
పెడన, కృష్ణా జిల్లా

మగ్గాన్ని విరిచేసింది చంద్రబాబు

రాష్ట్రంలో మగ్గాన్ని విరిచేసింది చంద్రబాబు. చేనేత రంగాన్ని ఆదుకుంటానంటూ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఏకంగా 25 హామీలు గుప్పించిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా దగా చేశారు. చేనేత రుణాల మాఫీపై అధ్యయనానికి ఒక కమిటీ వేస్తూ జీవో ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. రుణమాఫీ చేయకపోవడంతో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇల్లు, మగ్గానికి రూ.లక్షన్నర చొప్పున సాయమందిస్తానని మోసం చేశారు. చేనేత కార్మికులకు రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక నిధి, బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.వెయ్యి కోట్లు కేటాయింపు, ఉచిత విద్యుత్ వంటి హామీలను చంద్రబాబు మరిచారు.

– బండారు ఆనందప్రసాద్, అధ్యక్షుడు,
ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్.

మీకు తెలుసా?



శాసనసభకు మూడు తరాలవారు

ఏపీ అసెంబ్లీకి మన రాష్ట్రంలోని రెండు కుటుంబాలకు చెందిన తాత, తండ్రి మనవడు ఎన్నికై సరికొత్త రికార్డు సృష్టించారు. అందులో ఒకటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పర్వత గుర్రాజు కుటుంబానిది కాగా, ఉమ్మడి విశాఖ జిల్లాకి చెందిన ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కుటుంబం రెండోది. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి 1955లో పర్వత గుర్రాజు ఎమ్మెల్యేగా ఎన్నికవగా, 1994లో ఆయన కుమారుడు పర్వత సుబ్బారావు, 1999లో గుర్రాజు కోడలు పర్వత బాపనమ్మ, 2009లో గుర్రాజు మనవడు పర్వత సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. పెందుర్తి నియోజకవర్గం నుంచి 1978లో గుడివాడ అప్పన్న ఎమ్మెల్యేగా గెలవగా, 1989లో ఆయన కుమారుడు గుడివాడ గురునాథరావు గెలిచారు. 2019 ఎన్నికల్లో గుడివాడ అప్పన్న మనవడు, గురునాథరావు కుమారుడైన ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అడాల్ఫ్ హిట్లర్‌ను అరెస్టు చేసిన జాన్ ఎఫ్ కెన్నెడీ!

మేఘాలయలో 57–రంగాస్కోన అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అడాల్ఫ్ హిట్లర్ మార్క్ అనే అభ్యర్థి గతంలో పోటీ చేశారు. ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన కేసులో ఆయన్ని స్థానిక పోలీస్ సూపరింటెండెంట్ అరెస్ట్ చేశారు. ఆ ఎస్పీ పేరు జాన్ ఎఫ్ కెన్నెడీ. ఆ మర్నాడు పత్రికల్లో అడాల్ఫ్ హిట్లర్‌ను అరెస్ట్ చేసిన జాన్ ఎఫ్ కెన్నెడీ శీర్షికన వార్త ప్రచురితమయింది. ఈ ఎన్నికల్లో హిట్లర్ ఆ స్థానం నుంచి విజయం సాధించడం కొసమెరుపు.

అప్పట్లో ఓటరుపై పెట్టిన ఖర్చు 4.8 అణాలు

1951–52 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరుపై పెట్టిన ఖర్చు 4.8 అణాలు(నేటి 30 పైసలు). ఆ తర్వాతి ఎన్నికల్లో ఈ ఖర్చు 2.4 అణాల(నేటి 15 పైసలు)కు తగ్గింది. మొదటి, రెండో సార్వత్రిక ఎన్నికల మధ్య అంటే 1952–53 నుంచి 1956–57 వరకు ఎన్నికల జాబితాల తయారీ, సవరణల కోసం వెచ్చించిన మొత్తం సుమారు రూ. 5,99,55,719. ఖర్చులను నమోదు చేసే విధానం రూపొందించి, అమల్లోకి తెచ్చింది అప్పుడే. 1956–57 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం ఖర్చు రూ. 5,90,21,786.



పర్యావరణ ప్రియంగా మేఘాలయ ఎన్నికలు

2019 ఎన్నికల సందర్భంగా మేఘాలయ ఎన్నికల యంత్రాంగం ఓ కొత్త ఆదర్శానికి తెరతీసింది. ఎన్నికల క్రతువులో పచ్చదనం పరిమళించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన వారంతా పోలింగ్ సరంజామాలో పర్యావరణానికి హాని కలిగించని వాటినే వినియోగించేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఓటర్లను ఆకట్టుకునే రీతిలో వెదురుతో తయారు చేసిన చెత్తబుట్టలు, విత్తనాలతో కూడిన కాగితం కలాలు, హరిత సంచులు ఇందులో భాగమయ్యాయి. ఈ కొత్త తరహా కలాలను పోలింగ్ అధికారులు వినియోగించడం ద్వారా వారిలో మొక్కలు నాటాలనే హరిత భావనకు ఎన్నికల యంత్రాంగం మొగ్గ తొడిగింది.

బాలినేనికి మద్దతుగా దిల్‌రాజు వీడియో



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఒంగోలు నుంచి పోటీచేస్తున్న బాలినేని శ్రీనివాస్‌రెడ్డికి సినీ నిర్మాత దిల్‌రాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో బాలినేని ఒంగోలు నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారని, ఆయన ప్రాతినిధ్యం వహించిన శాఖ ద్వారా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. అదే విధంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో కూడా మంత్రిగా తన శాఖను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఇప్పుడు మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా 6వ సారి ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన బాలినేనిని మరోసారి గెలిపించాలని ఓటర్లను ప్రార్థిస్తున్నానన్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

వార్ వన్ సైడే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 22 రోజుల పాటు సాగిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో సీఎం జగన్‌ను చూసేందుకు అద్యంతం జనం ప్రభంజనంలా తరలివచ్చారు. సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న సీఎం జగన్ వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి బస్సు యాత్రను ఆరంభించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి సమీపంలో అక్కవరం బహిరంగ సభతో పాదయాత్రను ముగించారు. 23 జిల్లాల్లో 86 నియోజకవర్గాల్లో 2,188 కి.మీల దూరం బస్సు యాత్ర సాగింది. యాత్రలో 16 భారీ బహిరంగ సభల్లో సీఎం జగన్ పాల్గొని ప్రసంగించారు. వివిధ వర్గాల ప్రజలతో ఆరు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర తొమ్మిది ప్రాంతాల్లో భారీ రోడ్ షోలు నిర్వహించారు. బస్సు యాత్ర ప్రారంభమైన ఇడుపులపాయ నుంచి ఈనెల 13న విజయవాడలో జరిగిన రోడ్ షో వరకూ యాత్ర సాగినంత దూరం కెరటాల్లా జనం పోటెత్తారు. విజయవాడలో లక్షలాది మంది ప్రజలు రోడ్ షోలో సీఎం జగన్‌కు నీరాజనం పలుకుతుండడం చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. సీఎం జగన్‌ను లక్ష్యంగా చేసుకుని పదునైన రాయితో గురి పెట్టి కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

సీఎం జగన్ బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసిందని, ఎన్నికల్లో పోటీ ఏకపక్షమేనని.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని తేల్చి రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. బస్సు యాత్ర జైత్ర యాత్రలా సాగడంతో టీడీపీ–జనసేన–బీజేపీ నేతల్లో ప్రకంపనలు రేపుతోంది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరడం.. వేలాది మంది క్రియాశీలక కార్యకర్తలు వారి బాటనే అనుసరించడంతో ఆ పార్టీ నేతల్లో నైతిక స్థైర్యం దెబ్బతింది. ఘోర పరాభవం తప్పదనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ, జనసేన అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్.. తీవ్ర నిరాశ, నిస్పృహలతో సీఎం జగన్‌పై దూషణలకు దిగుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

విజయవాడ నుంచి సునామీలా పోటెత్తిన జనం

విజయవాడలో తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత.. వైద్యుల సలహా మేరకు ఈనెల 14న విశ్రాంతి తీసుకున్న సీఎం జగన్ ఈ నెల 15 నుంచి యాత్రను కొనసాగించారు. సీఎం జగన్‌పై టీడీపీ నేతలు హత్యాయత్నానికి తెగబడటంపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఈనెల 15 నుంచి సీఎం జగన్ బస్సు యాత్రకు సునామీలా జనం పోటెత్తి సంఘీభావం తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గోదావరి జిల్లాల్లో దారి పొడవునా జనం బారులు తీరి సీఎం జగన్‌కు మద్దతు తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన రోడ్ షోకు లక్షలాది మంది ప్రజలు కదలిరావడం కూటమి వెన్నులో వణుకు పుట్టించింది. ఇక విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్ షోకు లక్షలాది మంది జనం పోటెత్తడంతో కూటమి వణికిపోయింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ బస్సు యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు.

ఘోర పరాజయం భయంతో వణికిపోతున్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు(రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలకు లక్షలాది మంది పోటెత్తడంతో గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్ర.. తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచిపోయాయి. టీడీపీ–జనసేన జత కలిశాక తాడేపల్లి గూడెంలో నిర్వహించిన జెండా సభ, బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక చిలకలూరిపేటకు ప్రధానిని రప్పించి నిర్వహించిన సభకు జనం మొహం చాటేయడంతో కూటమి ఆందోళన చెందింది. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం జగన్ నిర్వహించిన బస్సు యాత్రకు.. రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా, ఉత్తరాంధ్ర.. ప్రాంతం ఏదైనా జనం నీరాజనాలు పలికారు. బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన 16 సభలకు లక్షలాది మంది ప్రజలు పోటెత్తారు. ఉమ్మడి రాష్ట్ర.. తెలుగు రాష్ట్రాల చరిత్రలో విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలలో సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోలు అతి పెద్ద మానవ హారంగా నిలిచిపోతాయని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంయుక్తంగా నిర్వహించిన సభలకు.. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో కలిసి వారిద్దరూ నిర్వహించిన సభలకు జనం రాకపోవడంతో ఘోర పరాజయం తప్పదనే నిర్ణయానికి ఆ నేతలు వచ్చేశారు. తీవ్రమైన నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. సీఎం జగన్‌పై దూషణలకు దిగుతూ, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడాలని ఆ పార్టీల కార్యకర్తలను రెచ్చగొడుతుండటమే అందుకు తార్కాణం.

బూటకపు హామీలతో టీడీపీ మోసం



ఒక్క జగన్‌ని ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి వస్తున్నాయంటేనే.. వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోంది. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న తాపత్రయంతో ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పిస్తున్నారు. పొత్తు పార్టీల మేనిఫెస్టోను ప్రజలెవరూ నమ్మవద్దు. పొత్తులతో ఏర్పాటయ్యే ప్రభుత్వాలు ఎప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచించలేవు. సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని అసత్యాలు ప్రచారం చేసిన టీడీపీ, ఇపుడు అంతకు మూడింతల హామీలు గుప్పిస్తోంది. వీరొస్తే శ్రీలంక కాస్తా.. సింగపూర్‌ైపోతుందా? జనం నమ్మకం జగన్‌మోహన్‌రెడ్డి.

-నాయుడుగారి రాజశేఖర్, శ్రీముఖలింగం, శ్రీకాకుళం జిల్లా

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

అంబేడ్కర్ కలగన్న విద్యావ్యవస్థ



సీఎం జగన్ పాలనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న అత్యుత్తమ విద్యా వ్యవస్థ ప్రత్యక్షంగా అమలవుతోంది. ప్రైవేట్/కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ఫలితాలను చూస్తున్నాం. ఉత్తమ విద్య భవిష్యత్తరాలను మారుస్తుందని ఆంధ్రప్రదేశ్‌లో రుజువయింది. జగన్ పాలనలో అభివృద్ధి ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ప్రతి అవసరానికీ పట్టణాలపై ఆధారపడాల్సిన అగత్యాన్ని తొలగించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపిస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధికి నోచుకుంటుంది.

- తమ్ములూరి విక్టర్ వీరయ్య, మార్టూరు, బాపట్ల



ప్రారంభానికి సిద్ధమైన రామయ్యపట్నంపోర్టు

తీరంలో లంగరు... భవిష్యత్తు బంగరు

ఐదేళ్ల జగన్ పాలనలో 4 పోర్టులకు పునాది...

- ప్రారంభానికి సిద్ధంగా రామాయపట్నం పోర్టు...
- మిగిలినవీ శరవేగంగా నిర్మాణం...
- 10 ఫిషింగ్ హార్బర్లు... 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు
- వీటన్నిటికీ రూ.25,000 కోట్ల వ్యయం...
- పోర్టుల పక్కనే పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్ పార్కులు
- 555 మత్స్యకార గ్రామాల్లో 6.3 లక్షల మంది జాలరులకు లబ్ధి
- రూ.9000 కోట్ల మేర పెరగనున్న జీడీపీ

సాగరమంటేనే జలనిధి...అపార మత్స్య సంపదకు పెన్నిధి... సాగర తీరాన వెలసిన రాజధానులు ఆయా రాష్ట్రాలకు ఆర్థిక సుసంపన్నతను సమకూర్చాయి..మత్స్యకారుల జీవనప్రమాణాలను పెంచాయి...వారి జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాయి..పరిశ్రమల స్థాపనకు పునాదులు వేశాయి... ఆయా రాష్ట్రాల ఆర్థిక రూపురేఖలను మార్చేశాయి....ఈ ఆలోచనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విశాఖపట్నాన్ని పాలనారాజధానిగా చేయాలన్న గొప్ప సంకల్పానికి ప్రేరేపించింది...ఇప్పటిదాకా మనం గొప్పగా చెప్పడానికి విశాఖపట్నంలోని పోర్టు ఒక్కటే రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ రంగంలో కనిపిస్తోంది... దేశంలోనే సుదీర్ఘ తీరమున్న రెండో రాష్ట్రంగా గుర్తింపు పొందీ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకు చాలా అవకాశమున్నా ...పాలించడం చేతకాని పద్నాలుగేళ్ల చంద్రబాబు పాలన వల్ల వాటి ఏర్పాటు సాధ్యం కాలేదు...సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఆలోచించడం వల్లే ఈ రోజు నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు రాష్ట్రానికి అపార సంపదనివ్వబోతున్నాయి...మత్స్యకారుల ఆర్థిక స్తోమతను పెంచబోతున్నాయి...మరెన్నో పరిశ్రమల స్థాపనకు ఈ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు వేదికలు కాబోతున్నాయి... రాష్ట్ర పురోగమనానికి ఇలాంటి ఆలోచన ఉన్న నేతలు ఉంటేనే నలుచెరగులా ప్రగతి లంగరు వేస్తుంది... సీఎం జగన్ రూపంలో రాష్ట్రానికి బంగరు భవిష్యత్తు అద్దుకుంటోంది.

- చంద్రశేఖర్ మైలవరపు, సాక్షి, అమరావతి

దేశాన్ని సుసంపన్నం చేయడంలో జలధి ప్రాధాన్యం ఎనలేనిదని చైనా, సింగపూర్ వంటి దేశాలు ఏనాడో గుర్తించాయి. ఈ సత్యాన్ని గుర్తించే ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలను పరుగులు పెట్టించడంలో పోర్టులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అత్యంత రద్దీ ఉండే ఓడరేవుగా సింగపూర్ అగ్రస్థానంలో ఉండగా , టాప్ 15 పోర్టుల్లో 8కి పైగా పోర్టులు ఒక్క చైనాలోనే ఉన్నాయి. మన దేశంలో చెన్నై, కోల్‌కతా, ముంబైలు మెట్రోపాలిటన్ నగరాలుగా మారడంలో పోర్టులు కీలకపాత్ర పోషించాయనడంలో సందేహం లేదు. దేశంలోనే రెండో అత్యంత పొడవైన 974 కి.మీ సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా కొత్త మహానగరాలుగా సృష్టించుకునే అవకాశమున్నప్పటికీ, ఆ దిశగా 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏరోజూ పట్టించుకోలేదు. అసలు ఆ ఆలోచనే ఆయనకు లేదు. 2019లో ఎన్నికల ముందు ఎటువంటి అనుమతులు లేకుండా కేవలం ప్రచారం కోసం టెంకాయలు కొట్టి చేతులు దులిపేసుకున్నాడాయన. దీనికి భిన్నంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ సముద్ర తీరాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను చేపట్టింది.

ప్రతి 50 కి.మీ.కు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బరు...


ప్రతీ 50 కి.మీ.కు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బరు (మినీ పోర్టు)లు, ఫిష్‌ల్యాండ్ సెంటర్లను జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి నాలుగు పోర్టులతో పాటు పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టి రికార్డు సృష్టించింది. వీటికోసం సుమారు రూ.25,000 కోట్ల వ్యయం చేస్తుండటం అద్భుతం. రూ.3,736.14 కోట్ల వ్యయంతో రామాయపట్నం, రూ.5,155.73 కోట్లతో మచిలీపట్నం, రూ.4,361.91 కోట్లతో మూలపేట పోర్టులను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా, పీపీపీ విధానంలో కాకినాడ సెజ్‌లో గేట్వే పోర్టును రూ.2,123.43 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కేంద్ర కస్టమ్స్ శాఖ నుంచి అనుమతులు రాగానే తొలి నౌకను తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. మచిలీపట్నం, మూలపేట పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో విశాఖ, గంగవరం, కాకినాడ యాంకరేజ్, కాకినాడ, రవ్వ క్యాప్టివ్ పోర్టు, కృష్ణపట్నం పోర్టులు ఉండగా, 2025 నాటికి రాష్ట్రంలో పోర్టుల సంఖ్యను 10కి పెంచాలని జగన్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

వాణిజ్య ఎగుమతుల్లో 5వ స్థానంలో రాష్ట్రం...

వాణిజ్య ఎగుమతులను పెంచడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను మెరుగు పరిచే విధంగా జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను అందిస్తున్నాయి. 2019లో దేశ వాణిజ్య ఎగుమతుల్లో తొమ్మిదో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఈ ఐదేళ్లలో తీసుకున్న చర్యలతో ఐదో స్థానానికి చేరింది. 2019లో కేవలం రూ.90,000 కోట్లుగా ఉన్న వాణిజ్య ఎగుమతుల విలువ 2023–24 నాటికి రూ.1.60 లక్షల కోట్లకు పెరిగింది

పది ఫిషింగ్ హార్బర్లు...

రాష్ట్రంలోని మత్స్యకారుల సుదీర్ఘ కల సాకారమవుతోంది. ఇంతకాలం వలస కూలీలుగా పొరుగు రాష్ట్రాలకు వెళ్లే మత్స్యకారులు ఇప్పుడు అధునాతన మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు చేసుకుని చేపలు పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 555 మత్స్యకార గ్రామాల్లో 6.3 లక్షల మత్స్యకారులకు ప్రయోజనం కల్పించే విధంగా పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ప్రతిపక్ష నాయకుడిగా జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తున్న సందర్భంలో రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు లేవన్న విషయాన్ని మత్స్యకారులు ఆయన దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో ఉపాధి కోసం గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందంటూ మత్స్యకారులు వాపోయారు. తాను ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రంలోని వీరికి స్థానికంగానే ఉపాధి కల్పించే విధంగా ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రూ.3,66.07 కోట్లతో రెండు దశల్లో పది ఫిషింగ్ హార్బర్లను, రూ.126.91 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.


మూలపేట పోర్టు


శరవేగంగా జరుగుతున్న మచిలీపట్నం పోర్టుపనులు

పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కులు...

పోర్టులను ఆధారంగా చేసుకుని చుట్టుపక్కలా పారిశ్రామిక ప్రగతిని విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. కేవలం పోర్టులను నిర్మించడమే కాకుండా పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాల్సిందిగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల వద్ద భారీ పారిశ్రామిక పార్కుల నిర్మాణానికి సంబంధించి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని వేశారు. ఈ క్రమంలో తొలుత అందుబాటులోకి వస్తున్న పోర్టుకు సమీపంలో సుమారు 8,000 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కుతో పాటు తెట్టు వద్ద కార్గో ఎయిర్ పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. తొలి దశలో 4,850 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు అభివృద్ధి చేయనుండగా, దీనికోసం గుడ్లూరు మండలం చేవూరులో 1312.58 ఎకరాలు, రావూరులో 951.77 ఎకరాల భూ సేకరణకు సంబంధించి నెల్లూరు జిల్లా కలెక్టర్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు.

ఫిషింగ్ హార్బర్	ప్రాజెక్ట్ వ్యయం	మత్స్యకారులకు లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్ దశలో ఉంది		
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
ఓడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.64 కోట్లు	60,858	10,521

రామాయపట్నం సమీపానే ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు....

రామాయపట్నం పోర్టు సమీపంలో ఇండోసోల్ రూ.25,000 కోట్లతో ఏర్పాటు చేస్తున్న భారీ సోలార్ ఉపకరణాల తయారీ యూనిట్ తొలి దశ పనులను పూర్తి చేసుకుని ఈ మధ్యే ఉత్పత్తిని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎగుమతుల్లో 10 శాతం వాటాను చేజిక్కించుకోవాలని సీఎం జగన్ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. 2030 నాటికి 10 శాతం మార్కెట్ వాటాతో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలవాలన్న లక్ష్యానికి అనుగుణంగా పలు కీలక చర్యలు తీసుకుంటోంది.

ఫిషింగ్ హార్బర్ల వద్ద ప్రాసెసింగ్ యూనిట్లు...

ఫిషింగ్ హార్బర్ల సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రగతి ఫలితంగా ప్రస్తుతం 150 మిలియన్ టన్నులుగా ఉన్న రాష్ట్ర ఎగుమతుల సామర్థ్యం 300 మిలియన్ టన్నులకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పోర్టుల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి లభించనుండటంతో పాటు వ్యాట్, జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం సమకూరనుంది.

సురక్షితంగా బోట్లు ఒడ్డుకు...




ఫిషింగ్ హార్బరు లేకపోవడం వల్ల బోట్లను ఒడ్డుకు చేర్చడం చాలా కష్టమయ్యేది. అమావాస్య, పౌర్ణమి సమయంలో సముద్రంలో ఆటుపోట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఆ సమయంలో ఈ ఇబ్బంది మరింత అధికంగా ఉండేది. కొన్ని సందర్భాల్లో బోట్లు తీరానికి తగలడం వల్ల పగిలిపోయేవి. ఇప్పుడు మచిలీపట్నంలో అత్యాధునిక వసతులతో హార్బర్ నిర్మిస్తుండటంతో బోట్లను సురక్షితంగా నిలబెట్టుకోవచ్చు.

-పైకం ఆంజనేయులు, ఫైబర్ బోట్ల యజమానుల సంఘం, మచిలీపట్నం

నిన్నటిదాకా కూలీలం... ఇకపై యజమానులవుతాం.

రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో నెల్లూరు, ప్రకాశం జిల్లా తీరప్రాంత మత్స్యకారులు ఇన్నాళ్లూ చెన్నై, మంగళూరు ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా పనిచేసుకునేవాళ్లం. ఇప్పుడు ఇక్కడే ఫిషింగ్ హార్బర్లు వస్తుండటంతో అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు చేసుకుని యజమానులుగా మారే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది. ఫిషింగ్ హార్బరు, దీనికి అనుబంధంగా వచ్చే పరిశ్రమల వల్ల ఒక్క జువ్వలదిన్నెలోనే 15,000 మందికి పైగా ఉపాధి లభించనుంది. తుపాన్లు వచ్చినా తట్టుకునే విధంగా జువ్వలదిన్నె హార్బర్‌ను నిర్మిస్తున్నారు.



- కొండూరు అనిల్ బాబు, చైర్మన్, ఏపీ ఫిషరీస్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ (ఆఫ్కాఫ్)


జువ్వలదిన్నె హార్బర్ పూర్తి...

తొలి దశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జువ్వలదిన్నె హార్బరు పనులు పూర్తయ్యేనాటికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నేరుగా వెళ్లి ప్రారంభించాలన్న ఉద్దేశంతో ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదాపడింది. మిగిలిన మూడు హార్బర్ల పనులు 70 శాతం పూర్తయ్యాయి. వీటిని ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి తేనున్నారు. రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, బియ్యపుతిప్ప, ఓడరేవు, కొత్తపట్నం , మంచినీళ్లపేట ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.


జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

మత్స్యసంపద దిగుమతికి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు...

అదనంగా మత్స్యకారులు తమ బోట్లను తీరంలో నిలిపి, తమ మత్స్య సంపదను దిగుమతి చేసుకునేలా చింతపల్లి, భీమిలి, రాజయ్యపేట, దొండవాక, ఉప్పలంక, రాయదరువుల వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ హార్బర్లు అందుబాటులోకి వస్తే అదనంగా 4.5 లక్షల టన్నుల మత్స్య సంపద వస్తుందని, వీటి ద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ. 9,000 కోట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హార్బర్ల ద్వారా రాష్ట్రంలోని 60,000 మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. సుమారు 12,000 భారీ బోట్లు సురక్షితంగా తీరంలో నిలిపే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఎగుమతులను ప్రోత్సహించే విధంగా తీరప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ సైతం ప్రశంసించింది. 2022 సంవత్సరానికి నీతి ఆయోగ్ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో మన రాష్ట్రం 8వ స్థానంలో నిలిచింది.


కాకినాడ గేట్ వే పోర్టు



మినీపోర్టు స్థాయిలో నిర్మాణం



ఇప్పటి వరకు బోట్లు నిలపడానికే సరైన సదుపాయాల్లేక ఐదారుచోట్ల ఆపేలా నానా అవస్థలు పడుతుండేవాళ్లం. పాదయాత్ర సమయంలో మా పరిస్థితిని వైఎస్ జగన్ దృష్టికి తీసుకొస్తే మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామన్నారు. ఇప్పుడు ఏకంగా రూ.361 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద హార్బరును మినీపోర్టు స్థాయిలో నిర్మిస్తున్నారు. బోట్లు నిలపడం నుంచి రిపేర్లు, డీజిల్, వేలంపాటలు, అమ్మకాలు...ఇలా అన్నీ ఒకేచోట ఉండేలా నిర్మిస్తుండటంతో వ్యయం తగ్గి లాభాలు పెరుగుతాయి. దీని ద్వారా తొండంగి, కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాలకు చెందిన 50,000 మత్స్యకార ప్రజలకు ప్రయోజనం లభిస్తుంది. ఈ స్థాయిలో హార్బర్ నిర్మాణ పనులు ఇంత వేగంగా జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. మేమంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

-ఎస్. మణికంఠబాబు, సర్పంచ్, అమినాబాద్, ఉప్పాడ

రామాయపట్నం

ప్రాజెక్టు వ్యయం
రూ.3,736.14 కోట్లు

తొలి దశలో పోర్టు సామర్థ్యం
34.04 ఎంఎంటీపీఏ

పూర్తిస్థాయి సామర్థ్యం
138.54 టన్నులు

తొలి దశలో బెర్తులు నాలుగు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్)

తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం
80,00 డీడబ్ల్యూటీ

పనులు ప్రారంభించిన తేదీ జూన్ 24, 2022
కార్యకలాపాల ప్రారంభం జనవరి, 2024

మచిలీపట్నం

ప్రాజెక్టు వ్యయం
రూ.5,156 కోట్లు

తొలి దశలో పోర్టు సామర్థ్యం
35 ఎంఎంటీపీఏ

పూర్తిస్థాయి సామర్థ్యం
116 టన్నులు

తొలి దశలో బెర్తులు నాలుగు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్)

తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం
80,00 డీడబ్ల్యూటీ

పనులు ప్రారంభించిన తేదీ ఏప్రిల్ 21, 2023
కార్యకలాపాల ప్రారంభం అక్టోబర్, 2025

మూలపేట

ప్రాజెక్టు వ్యయం :
రూ.4,361.91 కోట్లు

తొలి దశలో పోర్టు సామర్థ్యం
23.50 ఎంఎంటీపీఏ

పూర్తిస్థాయి సామర్థ్యం:
83.30 టన్నులు

తొలి దశలో బెర్తులు: నాలుగు రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్)

తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం
1,20,000 డీడబ్ల్యూటీ

పనులు ప్రారంభించిన తేదీ ఏప్రిల్ 18, 2023
కార్యకలాపాల ప్రారంభం అక్టోబర్, 2025

కాకినాడ గేట్ వే

ప్రాజెక్టు వ్యయం :
రూ.2,123.43 కోట్లు

తొలి దశలో పోర్టు సామర్థ్యం
16 ఎంఎంటీపీఏ

తొలి దశలో బెర్తులు: నాలుగు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి క్రాఫ్ట్ బెర్త్)

తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం
1,20,000 డీడబ్ల్యూటీ

పనులు ప్రారంభించిన తేదీ నవంబర్ 20, 2021
కార్యకలాపాల ప్రారంభం నవంబర్, 2024

